
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 21

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వనజీవి కన్నుమూత

వన ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య (85) శనివారం గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూశారు.

వివరాలు 2లో ▸



ఐడీ వెంట ఎప్పుడూ ఉండాలి

భారతీయుల్లో గ్రీన్‌కార్డు, హెచ్‌1బీ వీసాదారులు ప్రతి రోజూ..తమ ఐడీ కార్డును వెంట ఉంచుకోవాలని అమెరికా తెగేసి చెప్పింది.

వివరాలు 6లో ▸

చంద్రబాబు మరో

మహా ప్యాలెస్

అత్యంత భారీఎత్తున రూ.వందల కోట్లతో ప్యాలెస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీకారం

రాజధాని అమరావతి నడిబొడ్డున 5.16 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మాణం



- మంత్రి లోకేశ్ భార్య బ్రాహ్మణి పేరుతో రూ.18.75 కోట్లకు భూమి కొనుగోలు
- అమరావతిలో గజం రూ.60 వేలన్న చంద్రబాబు మాటల ప్రకారమే చూస్తే రూ.150 కోట్లు
- నిర్మాణానికి ఇంకెన్ని రూ.వందల కోట్ల వ్యయం అవుతుందో?
- చంద్రబాబుకు ఇప్పటికే హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన జూబ్లీహిల్స్‌లో రూ.వందల కోట్ల విలువైన రాజభవనం
- పక్కనున్న భవనాలు, స్థలాలను సైతం కొనేసి కనీవినీ ఎరుగని స్థాయిలో విలాసవంతంగా నిర్మాణం
- హైదరాబాద్ నడిబొడ్డున కొండాపూర్ దగ్గర్లో రూ.వందల కోట్ల విలువైన ఐదు ఎకరాల్లో భారీ ఫాంహౌస్
- నిజాం నవాబును తలపించేలా, దేశంలోనే ఎవరికీ లేని రీతిలో హైదరాబాద్‌లో అత్యంత సంపన్న ప్రాంతంలో ప్యాలెస్, ఫాంహౌస్ కూడా..

- వివరాలు 2లో

ఈవీఎంలను సులువుగా

హ్యాక్ చేయొచ్చు

అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ వెల్లడి

దేశాధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో కేబినెట్ సమావేశంలో స్పష్టీకరణ



- 2లో

మండిన ఎండలు

- అమరావతిలో 43.66 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 20కి పైగా ప్రాంతాల్లో 43 డిగ్రీలు
- 200కి పైగా ప్రాంతాల్లో 40కి పైగా ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరైన జనం

- వివరాలు IIలో

యూపీఐ సేవల్లో తీవ్ర అంతరాయం



- శనివారం మధ్యాహ్నం సమస్య తీవ్రం
- పరిష్కార చర్యలు తీసుకుంటున్నామన్న ఎన్‌పీసీఐ

- వివరాలు 6లో

ఎలక్ట్రానిక్స్‌పై సుంకాల్లేవ్

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా ప్రకటన
- జాబితాలో స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, చిప్‌లు
- చాలావరకు అమెరికా బయట తయారయ్యేవే

- వివరాలు 6లో

పుట్టి ముంచి.. బొంకిందే బొంకి..
పోలవరానికి చంద్ర శాపం

వైఎస్ జగన్ హయాంలో రెండు దశల్లో 41.15, 45.72 మీటర్ల ఎత్తున నీరు నిల్వ చేసేలా కసరత్తు

- ఆ మేరకు అంగీకరిస్తూ 2023 జూన్ 5న కేంద్ర ఆర్థిక మంత్రి నోట్
- చంద్రబాబు వచ్చాక 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటి నిల్వకు అంగీకారం
- ఆ మేరకు ప్రాజెక్టు పూర్తి చేసేలా 2024 ఆగస్టు 28న సవరించిన అంచనాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- తద్వారా రూ.12,157.53 కోట్లకు మించి ఒక్క పైసా దక్కదని స్పష్టీకరణ
- కేంద్ర జల్ శక్తి శాఖ 2024–25 వార్షిక నివేదికలో మరోసారి ఈ విషయం బట్టబయలు
- కూటమి ప్రభుత్వ ద్రోహాన్ని కప్పిపుచ్చడానికి టీడీపీ–ఎల్లో మీడియా కట్టుకథలు

Thereafter, a Committee was constituted by Government of India in January, 2022 under the Finance Secretary & Secretary (Expenditure), and apart from other issues, the funding aspect of PIP was also included in its terms of reference. Based on the discussions in the Committee, it was decided to take up the project in phases, with the Phase-I to be focused upon at this stage

కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పోలవరం ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించిందని.. మొదట తొలి దశలో నీటిని నిల్వ చేయడంపై దృష్టి సారించాలని నిర్దేశించిందని కేంద్ర కేబినెట్‌కు 2024, ఫిబ్రవరి 29న ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు

In Phase-II, the reservoir shall be filled up to full reservoir level (FRL) of EL+45.72 m and balance land acquisition/R&R along with corresponding remaining project components construction shall be carried out. Phase-1 of the PIP is targeted for completion by March-2026,

పూర్తి నీటి మట్టం 45.72 మీటర్ల ఎత్తు వరకూ నీటిని నిల్వ చేసేలా భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనులు చేస్తూనే.. తొలి దశ పనులను 2026, మార్చిలోగా పూర్తి చేయాలని కేంద్ర కేబినెట్‌కు నివేదిక ఇచ్చిన పీఐబీ

The Central Cabinet approved the revised cost for completion of the Polvaram irrigation Project with water storage up to EL + 41.15 M at a cost of 30,436.95 Crores with balance central grant for the project limited to Rs 12,157.53 Crores in the meetingheldon 28.08.2024.

పీఐబీ 2024, ఫిబ్రవరి 29న ఇచ్చిన నివేదికకు భిన్నంగా 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.30,436.95 కోట్లతో సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను 2024, ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ ఆమోదించిందని, మిగిలిన పనులకు రూ.12,157.53 కోట్లకు మించి ఇచ్చేది లేదని స్పష్టం చేసిందని 2024-25 వార్షిక నివేదికలో కేంద్ర జల్ శక్తి శాఖ వెల్లడి.

సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టులో 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.30,436.95 కోట్లతో ప్రతిపాదించిన సవరించిన అంచనాలను 2024 ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ ఆమోదించింది. మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.12,157.53 కోట్లకు మించి ఒక్క పైసా కూడా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. దీన్ని ఆ భేటీలో పాల్గొన్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు (టీడీపీ) కూడా ఆమోదించారు. చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటిదాకా కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. దీన్ని బట్టి చూస్తే.. 45.72 మీటర్ల ఎత్తుతో 194.6 టీఎంసీలను నిల్వ చేసేలా నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు సర్కార్ 41.15 మీటర్ల ఎత్తు వరకే (115.44 టీఎంసీలు) నీటి నిల్వను పరిమితం చేసి.. ఆ ప్రాజెక్టును బ్యారేజ్‌గా మార్చేసిందన్నది స్పష్టమవుతోంది. పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాలో 13.08 లక్షల ఎకరాలు, గోదావరి డెల్టాలో 10.13 లక్షల ఎకరాల స్థిరీకరణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కింద 8 లక్షల ఎకరాలకు సాగునీటి మాట దేవుడెరుగు.. కనీసం ఆ ప్రాజెక్టు ఆయకట్టు 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడమనేదే సాధ్యం కాదు. కేవలం 1.98 లక్షల ఎకరాలకు మాత్రమే వరద సమయంలో ఒక పంటకు నీళ్లందించడానికి అవకాశం ఉంటుంది.

బాబు మోసం మరోమారు బట్టబయలు

పోలవరం ప్రాజెక్టుకు చంద్రబాబు చేసిన తీరని ద్రోహం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర జల్ శక్తి శాఖ విడుదల చేసిన వార్షిక నివేదికలో మరోసారి బయటపడింది. జీవనాడి పోలవరాన్ని జీవచ్ఛవంలా మార్చేసిన చంద్రబాబు సర్కార్ పాపాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేందుకు సీఎం చంద్రబాబు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మొదలు.. ఈనాడుతో కూడిన ఎల్లో మీడియా వరకు బొంకిందే బొంకుతూ తప్పును ఒప్పుగా చిత్రీకరించే తెంపరితనాన్ని కొనసాగిస్తుండటం దారుణం. ఈ క్రమంలోనే కేంద్ర జల్ శక్తి శాఖ 2024–25 వార్షిక నివేదికను 'ఈనాడు' వక్రీకరిస్తూ 'జంకు లేని బొంకు ఇది' శీర్షికన ఓ కట్టుకథను అచ్చేసింది. ఇందుకు సంబంధించి అసలు నిజాలు ఇవీ..

రూ.15,667.90 కోట్లతో ప్రాజెక్టు పూర్తవుతుందా?

విభజన చట్టం ప్రకారం కేంద్రమే కట్టాల్సిన పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కక్కుర్తితో ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి నాటి సీఎం చంద్రబాబు చేతుల్లోకి తీసుకున్నారు. 2013–14 ధరల ప్రకారం 2014 ఏప్రిల్ 1 నాటికి మిగిలిపోయిన నీటి పారుదల విభాగం వ్యయం ఇస్తే చాలు.. ప్రాజెక్టును పూర్తి చేస్తానని అంగీకరించారు. ఆ మేరకే నిధులు ఇచ్చేలా 2017 మార్చి 15న కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. దాని ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు కేవలం రూ.15,667.90 కోట్లే ఇస్తామని అప్పట్లో కేంద్రం తేల్చి చెప్పింది. నిజానికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికి రూ.33,168.24 కోట్లు అవసరం. అలాంటిది కేవలం రూ.15,667.90 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేస్తానని ఎలా అంగీకరించారని ప్రశ్నిస్తే అటు చంద్రబాబుగానీ ఇటు ఎల్లో మీడియాగానీ నోరు మెదపరు.

సుదీర్ఘ కసరత్తు.. అయినా 41.15 మీటర్లే

దాంతో కేంద్ర కేబినెట్ తీర్మానాన్ని సవరిస్తూ తాజా ధరల మేరకు పోలవరానికి నిధులు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపేందుకు కేంద్ర జల్ శక్తి శాఖ సుదీర్ఘ కసరత్తు చేసింది. ఈ క్రమంలోనే 2024 ఫిబ్రవరి 29న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ) సమావేశమై.. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేందుకు మిగిలిన పనుల పూర్తికి రూ.12,157.53 కోట్లు, ఆ తర్వాత రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేయడానికి అవసరమైన వ్యయాన్ని మంజూరు చేయాలని ప్రతిపాదిస్తూ కేంద్ర కేబినెట్‌కు నివేదిక పంపింది. అప్పటికే ఎన్డీఏలో చేరిన చంద్రబాబు.. ఆ ప్రతిపాదనను ఆమోదిస్తే వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ పెద్దల చెవిలో ఊదడంతో దాన్ని అప్పట్లో పక్కన పెట్టేశారు. 2024 ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలే వచ్చాయి. కానీ.. 2024 ఫిబ్రవరి 29న పీఐబీ పంపిన నివేదికను 2024 ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ యథాతథంగా ఆమోదించ లేదు. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలను మాత్రమే ఆమోదించడం గమనార్హం. 2014–19 మధ్య కమీషన్ల కక్కుర్తితో సీఎం చంద్రబాబు పోలవరాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడితే 2019–24 మధ్య ఆ సంక్షోభం నుంచి నాటి సీఎం వైఎస్ జగన్ గట్టెక్కించారు. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు పోలవరాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి జీవచ్ఛవంగా మార్చేశారు. పోలవరానికి సీఎం చంద్రబాబు చేసిన ద్రోహంపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి రైతులు, సాగు నీటి రంగ నిపుణులు, మేధావుల నుంచి మద్దతు లభిస్తుండటంతో టీడీపీ, ఎల్లో మీడియా కట్టుకథలు అల్లుతూ నిజాన్ని అబద్ధంగా చిత్రీకరించేందుకు పదే పదే బొంకుతున్నాయి.

తాజా ధరల మేరకు నిధులివ్వాలని కోరిన జగన్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లను కలిసిన ప్రతి సందర్భంలోనూ చంద్రబాబు నిర్వాకాలను ఎత్తిచూపుతూ.. తాజా ధరల మేరకు నిధులు ఇచ్చి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని నాటి సీఎం వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ తాజా ధరల మేరకు పోలవరానికి నిధులు ఇవ్వాలని ఆదేశించారు. ఆ మేరకు ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) 2022 జనవరిలో.. పోలవరం ప్రాజెక్టుకు నిధుల అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పోలవరాన్ని దశల వారీగా పూర్తి చేయాలని నిర్ణయించింది. కమిటీ మొదటి దశలో 41.15 మీటర్లు, రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తు వరకూ నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ మేరకు తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకూ.. రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తు వరకూ నీటిని నిల్వ చేసేందుకు అవసరమయ్యే వ్యయంపై 2023 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. వాటి ఆధారంగా తొలి దశ పూర్తికి రూ.10,911 కోట్లు, డయాఫ్రం వాల్ పునరుద్ధరణకు రూ.2 వేల కోట్లు వెరసి రూ.12,911 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తూ 2023 జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నోట్ జారీ చేశారు. ఆ నిధులు ఇవ్వాలంటే 2017 మార్చి 15న కేంద్ర కేబినెట్ ఆమోదించిన తీర్మానాన్ని సవరించడానికి ప్రతిపాదన పంపాలని కేంద్ర జల్ శక్తి శాఖను ఆదేశించారు.

మండిన ఎండలు

అమరావతిలో 43.66 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగ్గా.. దక్షిణ కోస్తా జిల్లాల్లో మరింతగా ఠారెత్తించాయి. పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, ఏలూరు తదితర జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంది. పల్నాడు జిల్లా అమరావతిలో అత్యధికంగా 43.66 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. వినుకొండలో 43.47, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో 43.2, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లెలో 43.13, ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం కాకాని, బాపట్ల జిల్లా బల్లికురువ మండలం వాళ్లపల్లిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 20కి పైగా ప్రాంతాల్లో 43 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 200కి పైగా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి సముద్రం నుంచి వేడిగాలులు వీయడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే దక్షిణ కోస్తా జిల్లాల్లో 3 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి

ఎండ వేడితోపాటు వడగాడ్పులు కూడా వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. శుక్రవారం వరకూ ఓ మోస్తరు ఎండలతో బాగానే ఉన్న వాతావరణం వేడెక్కడంతో జనం ఇబ్బందులు పడ్డారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎండ తీవ్రత అంతగా లేకపోయినా క్రమేపీ అక్కడ కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.


మరో రెండు రోజులు వానలు

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం బలహీనపడింది. అదేవిధంగా.. పశ్చిమ రాజస్థాన్ నుంచి తూర్పు రాజస్థాన్, కోస్తాంధ్ర వరకూ విస్తరించిన ఉపరితల ద్రోణి కూడా బలహీనపడింది. అయినప్పటికీ నైరుతి గాలుల ప్రభావంతో మరో రెండు రోజులపాటు రాష్ట్రంపై వర్ష ప్రభావం కొనసాగుతుందని ఏపీ వాతావరణ కేంద్రం పేర్కొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల, అనంతపురం జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని, కోస్తా, రాయలసీమలో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

రాజధాని గ్రాఫిక్స్‌కు రూ.88 లక్షలు

3డీ విధానంలో అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌పై గ్రాఫిక్స్

సాక్షి, అమరావతి: ఏ దేశానికీ లేని రీతిలో అత్యంత అద్భుతమైన రాజధానిని మన రాష్ట్రంలో నిర్మిస్తానంటూ 2014–19 మధ్య ఎప్పటికప్పుడు గ్రాఫిక్స్‌తో మాయాజాలం చేస్తూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిన సీఎం చంద్రబాబు... ఇప్పుడు మరో అడుగు ముందుకేశారు. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీకే రాజధాని అమరావతిపై గ్రాఫిక్స్ షో చూపించేందుకు సిద్ధమయ్యారు. ఆ గ్రాఫిక్స్ తయారీకి రూ.88.50 లక్షలతో సీఆర్‌డీఏ శనివారం ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాజధాని నిర్మాణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్ల రుణాన్ని కేంద్రం ఇప్పిస్తోంది. వాటికి తోడు హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణాన్ని సమీకరించిన సీఆర్‌డీఏ... మరో రూ.21 వేల కోట్లు రుణాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తోంది. రాజధాని పనుల ప్రారంభానికి ప్రధానిని రప్పించాలని సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని ముందు అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)పై 3డీ విధానంలో గ్రాఫిక్స్‌తో రూపొందించిన చిత్రాన్ని ప్రదర్శించాలని సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రాఫిక్స్ షోను రూపొందించే పనులకు సీఆర్‌డీఏ ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ టెండర్‌లో బిడ్ల దాఖలుకు 5 రోజుల గడువే ఇచ్చింది. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 16వ తేదీలోపు బిడ్లు దాఖలు చేయాలని నిర్దేశించింది. అదే రోజున బిడ్లను తెరిచి అర్హత ఉన్న వారికి పనులను అప్పగించనుంది.


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 21

SUNDAY Special


ఆదివారం 13-4-2025



షేర్ చేసుకుందాం.. కేర్ తీసుకుందాం!

మెనోపాజ్ గురించి ఎంత మాట్లాడితే అంత అర్థమవుతుంది. అర్థమైతేనే దాని మేనేజ్‌మెంట్ తెలుస్తుంది! అందుకే మెనోపాజ్ ఎక్స్‌పీరియన్స్‌ను షేర్ చేసుకోవడానికి ముందుకువచ్చారు టాలీవుడ్ ప్రముఖ నటి ప్రగతి...

- ఫ్యామిలీలో...



సిక్సర్ల అభి'షేక్'

యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో... సన్‌రైజర్స్ హైదరాబాద్ తిరిగి గెలుపుబాట పట్టింది. శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో ఆరెంజ్ ఆర్మీ 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారీగా ఆస్తులు స్వాధీనం చేసుకున్న ఈడీ

నేషనల్ హెరాల్డ్ కేసులో తాము జప్తుచేసిన రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులున్న చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్వాధీన నోటీసులు అతికించింది.

వివరాలు 6లో ▸



అకాలీదళ్ చీఫ్‌గా సుఖ్‌బీర్ మళ్లీ ఎన్నిక

మతపరమైన దుష్ప్రవర్తన కారణంగా రాజీనామా చేసిన 5 నెలల తర్వాత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శిరోమణి అకాలీదళ్ (ఎస్ఐడీ) చీఫ్‌గా తిరిగి ఎన్నికయ్యారు.

వివరాలు 6లో ▸



"బిల్లుల విషయంలో 201 ఆర్టికల్ కింద రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతమేమీ కాదు. వాటిని కోర్టులు సమీక్షించవచ్చు.

- జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఎం.మహదేవన్ బెంచ్

రాష్ట్రపతికీ గడువుంది..

బిల్లులపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి.. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీం చరిత్రాత్మక తీర్పు

గవర్నర్ల నుంచి ఆమోదం నిమిత్తం రాష్ట్రపతి వద్దకు వచ్చే బిల్లుల విషయమై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. వాటిపై రాష్ట్రపతి 3 నెలల లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. తమిళనాడు గవర్నర్‌కు సంబంధించిన కేసుపై ఇటీవల వెలువరించిన తీర్పులో సుప్రీంకోర్టు ఈ మేరకు వెల్లడించింది. రాష్ట్రపతికి సుప్రీం ఇలా గడువు నిర్దేశించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. 'ఏదైనా బిల్లుపై రాష్ట్రపతి నిర్ణయం 3 నెలలకు మించి ఆలస్యమయ్యే పక్షంలో అందుకు తగిన కారణాలను విధిగా నమోదు చేసి సంబంధిత రాష్ట్రానికి తెలియపరచాలి. రాష్ట్రాలు కూడా వాటికి సరైన వివరణలు, సమాధానాలివ్వడం ద్వారా ఈ విషయంలో పూర్తిగా సహకరించాలి' అని ధర్మాసనం పేర్కొంది. -6లో

సుప్రీం తీర్పు సబబే: న్యాయ నిపుణులు -10లో

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా



- ఫలితాలను 'ఎక్స్'లో విడుదల చేసిన మంత్రి లోకేశ్
- 10,17,102 మంది హాజరవ్వగా 9,09,325 మంది పాస్
- మొదటి ఏడాది 70 శాతం.. రెండో ఏడాది 83 శాతం మంది ఉత్తీర్ణత
- బాలికల ఉత్తీర్ణత మొదటి ఏడాది 75 శాతం.. రెండో ఏడాది 86 శాతం
- బాలుర ఉత్తీర్ణత ఫస్ట్ ఇయర్ 66 శాతం, రెండో ఏడాది 80 శాతం
- మే 12 నుంచి 20 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

14 లో

ఓ 'ఆట' ఆడాల్సిందే !!

- పిల్లలను ఇంట్లో ఉంచొద్దు.. గ్రౌండ్‌కు పంపుదాం
- ఆరోగ్యం కోసం ఏదో ఒక 'ఆట'.. మారుతున్న తల్లిదండ్రుల ధోరణి
- సెల్‌ఫోన్ వ్యసనానికి దూరం చేసే ప్రయత్నం
- క్రీడలతోనూ జీవితంలో నిలదొక్కుకోవచ్చనే ఆలోచన
- కరోనా తరువాత శారీరక శ్రమ వైపు మొగ్గు
- ఆటలతో నాయకత్వ లక్షణాలు పొందే వీలు

10 లో





హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు ఇంద్రభవనం



ఉండవల్లిలో కృష్ణానది కరకట్ట వెంట చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ భవనం



హైదరాబాద్‌లో అత్యంత సంపన్నులు నివాసం ఉండే హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతంలో చంద్రబాబు ఫాం హౌస్‌లోని ముందు భాగం

చంద్రబాబు మరో మహా ప్యాలెస్

అత్యంత భారీ ఎత్తున రూ.వందల కోట్లతో ప్యాలెస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీకారం

రాజధాని అమరావతి నడిబొడ్డున 5.16 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మాణం

మంత్రి లోకేశ్ భార్య బ్రాహ్మణి పేరుతో రూ.18.75 కోట్లకు భూమి కొనుగోలు

జూబ్లీహిల్స్ ప్యాలెస్ 2014–19 మధ్య అధికారంలో ఉండగా నిర్మాణం

ఇప్పుడు అమరావతిలోనూ.. అధికారంలో ఉండగానే రాజభవన నిర్మాణం

ఈ స్థాయిలో అత్యంత ఖరీదైన నిర్మాణాలు, ఆస్తులు ఉన్నప్పటికీ గుడిసె వాసిని అనే తరహాలో చంద్రబాబు జీద అరుపులు

ప్రజలను నమ్మించేందుకు ఎప్పటికప్పుడు చంద్రబాబు కొత్త ట్రిక్కులు

మరోవైపు 2015 నుంచి లింగమనేని ఎస్టేట్ అక్రమ బంగ్లాలో చంద్రబాబు విలాస జీవితం

వైఎస్ జగన్ తాడేపల్లిలో రెండు ఎకరాల్లో పార్టీ కార్యాలయంతో పాటు ఇంటిని నిర్మించుకుంటే 'తాడేపల్లి ప్యాలెస్' అంటూ తీవ్ర దుష్ప్రచారం



రాజధాని ప్రాంతంలో చంద్రబాబు ఇల్లు నిర్మించుకోనున్న స్థలం

సాక్షి, అమరావతి: సువిశాల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో కళ్లు జిగేల్మనేలా రూ.వందల కోట్ల విలువైన అత్యంత విలాసవంతమైన రాజభవనం..! నిజాం నవాబు తరహాలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున కొండాపూర్‌లో హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఊహకు అందని రీతిలో ఐదెకరాలలో ఓ భారీ ఫాంహౌస్..! వీటికి తోడు అమరావతిలో రూ.వందల కోట్లతో.. మరో ఐదు ఎకరాల్లో ఇంకో రాజభవనాన్ని నిర్మించుకుంటున్నారు సీఎం చంద్రబాబు..! అత్యాధునిక హంగులు.. కనీవిని ఎరుగని అధునాతన రీతిలో.. రాజధాని అమరావతి నడిబొడ్డున.. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం సమీపంలో చేపట్టే ఈ ప్యాలెస్ నిర్మాణ పనులను తనకు అత్యంత సన్నిహితుడికి చెందిన సంస్థకు అప్పగించారు. దీనికి ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు భూమి పూజ చేశారు.

కాగా, దీనికోసం వెలగపూడిలో సర్వే నంబర్ 111, 112, 113, 122, 150, 152, 239లలోని 5.16 ఎకరాలను (25 వేల చదరపు గజాలు) చంద్రబాబు తనయుడు మంత్రి నారా లోకేశ్ భార్య నారా బ్రాహ్మణి పేరుతో రూ.18.75 కోట్లకు కొనుగోలు చేయడం గమనార్హం. అంటే గజం రూ.7,500 చొప్పున ఖరీదు చేశారు. కాగా, చంద్రబాబు అమరావతి ప్రాంతంలో చదరపు గజం రూ.60 వేలు పలుకుతోందని చెబుతుంటారు. ఈ ప్రకారం చూస్తే నాలుగు వైపులా రోడ్డు ఉన్న వెలగపూడిలోని స్థలం విలువ సుమారు రూ.150 కోట్ల వరకు ఉంటుంది. మరి రాజభవనం నిర్మాణానికి ఇంకెన్ని రూ.వందల కోట్లు వ్యయం చేస్తారోనని రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారు.

బాబుకు ఉన్నవి అన్నీ ప్యాలెస్‌లే..

చంద్రబాబుకు ఇప్పటికే హైదరాబాద్‌లో అత్యంత సంపన్నులు ఉండే జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలో రూ.వందల కోట్లతో నిర్మించిన భారీ ప్యాలెస్ ఉంది. దీనిని పక్కనున్న భవనాలు, స్థలాలు కొనేసి సువిశాల విస్తీర్ణంలో నిర్మించడం గమనార్హం. 2014–19 మధ్య అధికారంలో ఉండగా దీని నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందు గృహ ప్రవేశం చేశారు. అంతకు ముందే జూబ్లీహిల్స్‌లో చంద్రబాబుకు సువిశాల విస్తీర్ణంలో ప్యాలెస్ ఉండేది. దానిని కూల్చివేసి.. అధునాతన సాంకేతికత, అత్యాధునిక హంగులతో రాజభవనం నిర్మించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి అత్యంత ఖరీదైన ఉపకరణాలను దిగుమతి చేసుకుని నిర్మాణంలో వినియోగించారు.

కొత్త రాజభవనం.. నిర్మాణానికి ఇంకెన్ని కోట్లో..?

చంద్రబాబు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఆరేళ్ల కిందట నిర్మించుకున్న రాజ భవనానికే రూ.వందల కోట్లు వ్యయం అయినట్లు చెబుతుంటారు. ఇప్పుడు అమరావతిలో తలపెట్టిన రాజభవనం మరింకెన్ని కోట్లు ఉంటుందోనని అంటున్నారు. భూమి కొనుగోలుకే రూ.18 కోట్లకు పైగా వ్యయం చేసిన నేపథ్యాన్ని గుర్తు చేస్తున్నారు. పైగా వెలగపూడిలో ఏకంగా 5.16 ఎకరాల్లో నిర్మాణం చేపట్టనుండడాన్ని ప్రస్తావిస్తున్నారు.

అప్పుడు ఇప్పుడు అధికారంలో ఉండగానే..

చంద్రబాబు జూబ్లీహిల్స్ రాజభవనం నిర్మాణాన్ని 2019కి ముందు ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే చేపట్టి పూర్తి చేశారు. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రిగా ఉండగానే వెలగపూడిలో మరింత భారీఎత్తున రాజభవనం నిర్మాణం చేపట్టడం గమనార్హం.

అద్దాల మేడల్లో ఉంటూ అవతలి వారిపై దుష్ప్రచారం

తాను 5.16 ఎకరాల్లో రాజభవనం కట్టుకుంటూ పేదవాడిననే బిల్డప్‌లు

పార్టీ కార్యాలయం లేకుండానే భారీ విస్తీర్ణంలో నిర్మాణానికి ప్రయత్నం

వైఎస్ జగన్ 2 ఎకరాల్లో పార్టీ కార్యాలయం, ఇల్లు నిర్మించుకుంటే నిందలు

తాడేపల్లి ప్యాలెస్ అంటూ తీవ్ర స్థాయిలో చంద్రబాబు దుష్ప్రచారం

విశాల విస్తీర్ణంలో జూబ్లీహిల్స్‌లో, మదీనాగూడలో రాజభవనాలు కలిగి.. ప్రస్తుతం అక్రమంగా కట్టిన విలాసవంతమైన భారీ బంగ్లాలో ఉంటూ.. కొత్తగా మరో భారీ రాజభవనం నిర్మాణానికి పూనుకున్న చంద్రబాబు తాను నిరుపేదను.. గుడిసె వాసిని అనే తరహాలో బీద అరుపులు అరుస్తుంటారు. అవతలివారిపై అకారణంగా నిందలు వేస్తుంటారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఇల్లు, పార్టీ కార్యాలయం నిర్మించుకున్నారు. వాటిని చూపుతూ తాడేపల్లి ప్యాలెస్ అంటూ తరచూ చంద్రబాబు, ఎల్లో మీడియా, పచ్చ దండు దుష్ప్రచారం చేస్తుంటారు. తాను ఉంటున్న ఇంద్రభవనాలు మాత్రం పూరి గుడిసెలు అన్నట్లు ప్రజలను నమ్మించడానికి చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రచారాలు తెరపైకి తెస్తుంటారు.

మదీనాగూడలో నిజాం నవాబును తలదన్నేలా..

హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రాంతం హైటెక్ సిటీకి దగ్గరగా ఉంటుంది. చాలా ఖరీదైనదిగా పేరుగాంచింది. అక్కడికి సమీపంలోని మదీనాగూడలో చంద్రబాబుకు ఐదు ఎకరాల ఫాంహౌస్ ఉంది. దీని విలువ రూ.వందల కోట్లలోనే ఉంటుంది. నిజాం నవాబును తలపించే రీతిలో వైభోగం అన్న మాట. మరోవైపు హైదరాబాద్‌లో సంపన్న ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో రాజభవనం లాంటి నివాసం. బహుశా దేశంలో సంపన్నులు ఉండే ప్రాంతంలో రాజభవనం, ఫాంహౌస్ చంద్రబాబుకు ఒక్కరికే ఉందని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

పదేళ్లుగా అక్రమ ప్యాలెస్‌లో విలాసం

చంద్రబాబు.. పదేళ్లుగా ఉండవల్లి సమీపాన కృష్ణా నది కరకట్ట లోపల లింగమనేని రమేష్ అక్రమంగా నిర్మించిన విలాసవంతమైన బంగ్లాలో నివసిస్తున్నారు. రమేష్ అత్యాధునిక హంగులతో ఈ భారీ బంగ్లాని నిర్మించారు. కాగా, 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయారు. ఆడియో టేపుల సాక్షిగా ఆయన బండారం బయటపడింది. అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ చర్యలు తీసుకుంటుందోనన్న భయంతో హైదరాబాద్‌ను ఉన్నపళంగా వదిలి వచ్చేశారు. లింగమనేని అక్రమ బంగ్లాను నివాసంగా ఎంచుకున్నారు. అప్పటినుంచి.. అంటే పదేళ్లుగా అందులోనే ఉంటున్నారు.

పార్టీ వారికీ ప్రవేశం లేదు..

చంద్రబాబు తాజాగా వెలగపూడిలో తలపెట్టిన రాజభవన నిర్మాణం భూమి పూజకు టీడీపీ నేతలను సైతం ఆహ్వానించకపోవడడం గమనార్హం. ఇక జూబ్లీహిల్స్‌లోని రాజభవనం గృహ ప్రవేశ కార్యక్రమానికి పార్టీ నేతలను ఎవరినీ ఆహ్వానించలేదని టీడీపీ సీనియర్ నేతలు చెబుతుంటారు. అందులోకి ఇప్పటికీ తమ పార్టీ నేతలకు ప్రవేశం లేదని అంటుంటారు.

క్లుప్తంగా...

సేవా తత్వానికి ప్రతిరూపం శ్రీఆంజనేయస్వామి

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: శ్రీరామ భక్తుడైన ఆంజనేయుడు.. ధైర్యం, భక్తి, విశ్వాసం, సేవా తత్వానికి ప్రతిరూపమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. రాష్ట్ర ప్రజలందరిపై ఆంజనేయుడి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు అంటూ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

టీటీడీ చైర్మన్ ట్వీట్‌ను స్వాగతిస్తున్నా: భూమన

తిరుపతి మంగళం: టీటీడీ ఎస్వీ గోశాలలో గడచిన మూడు నెలల్లో 100కు పైగా గోమాతలు ప్రాణాలు కోల్పోయాయనే తన ఆరోపణను బలపరిచేలా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ట్వీట్ చేయడాన్ని స్వాగతిస్తున్నానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం తాను టీటీడీ గోశాలలో గోమాతలు చనిపోతున్నాయనే వాస్తవాన్ని బయటపెడితే.. ఇదంతా అబద్ధమని టీటీడీ ఖండించిందని, అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని టీటీడీ అధికారులు చెప్పారని గుర్తు చేశారు. సమయం గడిచే కొద్దీ నిజాలు బయటపడుతుండటంతో చివరకు బీఆర్ నాయుడు అనివార్యంగా నిజాన్ని అంగీకరించారన్నారు.

రూ. 3.6 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

కొత్తగూడెంటౌన్: ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు లారీలో భారీగా తరలిస్తున్న గంజాయిని తెలంగాణలోని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.కరుణాకర్ కథనం ప్రకారం.. కొత్తగూడెం శేషగిరినగర్ వద్ద శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో వచ్చిన లారీని పరిశీలించగా, క్యాబిన్, ట్రక్ మధ్య ప్రత్యేక చాంబర్‌లో 727 కిలోల గంజాయి ప్యాకెట్లలో ఉన్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసీపాక అటవీ ప్రాంతం వద్ద లారీలో గంజాయిని లోడ్ చేసుకుని యూపీ వెళ్తున్నామని చెప్పారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.3.63 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

- వచ్చేనెల 12 నుంచి 20 వరకు పరీక్షలు
- విద్యార్థులు తేరుకోకుండానే సప్లిమెంటరీ



సాక్షి, అమరావతి: అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చేనెల 12 నుంచి 20 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటలకు మొదటి ఏడాదికి, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. ప్రాక్టికల్స్ మే 28 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు.

ఇదీ షెడ్యూల్...

12-5-2025	సెకండ్ లాంగ్వేజ్
13-5-2025	ఇంగ్లిష్
14-5-2025	మ్యాథ్స్-ఏ, బోటనీ, సివిక్స్
15-5-2025	మ్యాథ్స్-బీ, జువాలజీ, హిస్టరీ
16-5-2025	ఫిజిక్స్, ఎకనామిక్స్
17-5-2025	కెమిస్ట్రీ, కామర్స్, ఫైనార్ట్స్, మ్యూజిక్
19-5-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్
20-5-2025	మోడర్న్ లాంగ్వేజ్, జియోగ్రఫీ

చదువుకునే సమయం ఏది?

ఈ ఏడాది పరీక్షలు ముగిసిన 10 రోజుల్లోనే విద్యా సంవత్సరం ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్న ఇంటర్ బోర్డు.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో అదే పంథాను అనుసరిస్తోంది. విద్యార్థులు పూర్తిగా తేరుకోకుండానే సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. సాధారణంగా ఈ పరీక్షలు మే చివరి వారంలో ప్రారంభమై జూన్ మొదటి వారంలో పూర్తి కావాల్సి ఉండగా, ఈసారి మే రెండో వారానికి మార్చారు. దీంతో విద్యార్థులు చదువుకునేందుకు సరైన సమయం లేకపోవడం గమనార్హం.

22 వరకు రీకౌంటింగ్ ఫీజు చెల్లింపు

ఇంటర్ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు బోర్డు అవకాశం కల్పించింది. అభ్యర్థులు నేటి నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు. జవాబు పత్రాల రీ వెరిఫికేషన్‌కు రూ.1,300, రీ కౌంటింగ్‌కు రూ.260 ఫీజుగా పేర్కొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజులు

సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 15 నుంచి 22 వరకు ఫీజు చెల్లించవచ్చని బోర్డు తెలిపింది. పేపర్ల సంఖ్యతో నిమిత్తం లేకుండా మొదటి లేదా రెండో ఏడాదికి రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సుకు రూ.165, బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ రెండేళ్లకు కలిపి థియరీ పరీక్షలకు రూ.1,200, ఒకేషనల్ రెండేళ్ల ప్రాక్టికల్స్‌కు రూ.550, రెండేళ్ల బ్రిడ్జి కోర్సుకు రూ.330 చెల్లించాలి.

ఇంప్రూవ్‌మెంట్‌కు...

ఇంప్రూవ్‌మెంట్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.600 ఫీజుతో పాటు ప్రతి పేపర్‌కు అదనంగా రూ.160 చెల్లించాలి. మార్కుల పెంపునకు (బెటర్‌మెంట్) రెండేళ్లకు కలిపి ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350, సైన్స్ విద్యార్థులు రూ.1,600 చెల్లించాల్సి ఉంటుంది.


ఈవీఎంలను సులువుగా హ్యాక్ చేయొచ్చు


- అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ వెల్లడి
- ఈవీఎం భద్రతా లోపాలకు సంబంధించి ఆధారాల సమర్పణ
- బ్యాలెట్ ఆధారిత ఎన్నికల వల్లే ప్రజల్లో పెరగనున్న నమ్మకం
- ఎలాన్ మస్క్ కూడా ఇదే హెచ్చరిక
- దేశ వ్యాప్తంగా ఈవీఎంలపై చర్చ

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ వ్యవస్థను సులువుగా హ్యాక్ చేయొచ్చని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ పేర్కొన్నారు. అందువల్ల దేశ (అమెరికా) వ్యాప్తంగా అన్ని ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్‌లకు మారాలని పిలుపునిచ్చారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన క్యాబినెట్ సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతా లోపాలకు సంబంధించి పలు ఆధారాలను సమావేశం ముందుంచారు. 2020 ఎన్నికల సమయంలో మాజీ సైబర్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్ క్రెబ్స్ చర్యలపై దర్యాప్తు చేయాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ (డీవోజే)ని ఆదేశిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ వ్యవస్థ చాలా కాలంగా హ్యాకర్లకు అందుబాటులో ఉంది. తద్వారా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో ఎన్నో ఉదాహరణలు మన ముందున్నాయి. ఈ విధానంలో ఫలితాలను తారుమారు చేయడానికి, దుర్వినియోగం చేసేందుకు అవకాశం ఉందని చెప్పేందుకు మా వద్ద పలు ఆధారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పేపర్ బ్యాలెట్‌లను తీసుకురావాలనే మీ (ట్రంప్) ఆదేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడే ఓటర్లు ఎన్నికల సమగ్రతపై నమ్మకం కలిగి ఉంటారు' అని గబ్బార్డ్ స్పష్టం చేసినట్లు ప్రముఖ జర్నలిస్ట్ స్మిత ప్రకాశ్ తెలిపారు. కాగా, గబ్బార్డ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. యునైటెడ్ స్టేట్స్‌లో ఎన్నికల భద్రతపై ఈ వ్యాఖ్యలు భారీ చర్చకు దారితీశాయి. ఇదిలా ఉండగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి ఇటీవల టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ కూడా హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఆధార పడటం సరి కాదని చెప్పారు. అవి హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలి. 'సాంకేతికత, ఏఐ ద్వారా హ్యాక్ అవ్వడానికి ఉన్న అవకాశం చిన్నదైనా, అది ఎంతో పెద్ద సమస్యకు దారితీస్తుంది' అని మస్క్ తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్ (మునుపటి ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. కాగా, తులసి గబ్బార్డ్ వ్యాఖ్యలపై మన దేశంలో కూడా చర్చ జరుగుతోంది. గత ఏడాది ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఈవీఎంలపై పలు అనుమానాలు వ్యక్తం అయిన సంగతి తెలిసిందే.

వనజీవి కన్నుమూత

- గుండెపోటుతో నిద్రలోనే రామయ్య తుదిశ్వాస
- కోటిన్నర మొక్కలకు పైగా నాటిన కృషీవలుడు
- ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల నివాళి
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు


వనజీవి రామయ్య భౌతికకాయం


2017లో నాటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి పద్మశ్రీ అవార్డు స్వీకరిస్తున్న వనజీవి రామయ్య

ఖమ్మం రూరల్/ ఖమ్మం మయూరి సెంటర్: వన ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి (వనజీవి) రామయ్య (88) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో నిద్రలోనే తుదిశ్వాస విడిచారు. రామయ్య తెలంగాణలోని ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో కుటుంబంతో కలిసి జీవిస్తున్నారు. రోజూ తెల్లవారుజామున 4 గంటలకే నిద్ర లేచి తన దినచర్య ప్రారంభించే ఆయన ఉదయం 6 గంటలైనా మేల్కొనకపోవడంతో భార్య జానకమ్మ తట్టి లేపే ప్రయత్నం చేశారు. చలనం లేకపోవడంతో కుటుంబసభ్యుల సాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్యతో పాటు కుమారుడు కనకయ్య, కుమార్తె సైదమ్మ ఉన్నారు. మరో ఇద్దరు కొడుకులు సైదులు, సత్యనారాయణ గతంలోనే చనిపోయారు. రామయ్య అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10–30 గంటలకు పల్లెగూడెం స్మశానవాటికలో అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు.

తుది శ్వాస వరకు మొక్కలు నాటుతూ..

ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు 1937 జూలై 1న రామయ్య జన్మించారు. ఆ తర్వాత వారు రెడ్డిపల్లికి వచ్చి స్థిరపడ్డారు. 5వ తరగతి వరకు చదువుకున్న రామయ్యకు చిన్నతనం నుంచే మొక్కల పెంపకంపై మక్కువ ఉండేది. ఉపాధ్యాయుడు జి.మల్లేశం మొక్కల పెంపకంతో కలిగే లాభాలపై బోధించిన పాఠం మనసులో నాటుకుపోయింది. అప్పటినుంచి మొక్కల ప్రేమికుడిగా మారి తుదిశ్వాస వరకు మొక్కలు నాటుతూనే ఉన్నారు. వృత్తి రీత్యా కుండలు చేస్తూ, ప్రవృత్తిగా మొక్కలు పెంచేవారు. ఇంట్లో సగభాగంలో మొక్కల పెంపకాన్ని చేపట్టిన ఆయన.. పిల్లలతో సమానంగా వాటిని చూసుకునేవారు. రోడ్లు, గుట్టల వెంట తిరుగుతూ వివిధ రకాల మొక్కల విత్తనాలను సేకరించి వాటిని వివిధ ప్రదేశాల్లో నాటడం నిత్య కార్యక్రమంగా మార్చుకున్నారు. ఇలా ఇప్పటి వరకు కోటిన్నరకు పైగా మొక్కలను నాటారు.


పాఠ్యపుస్తకాల్లో జీవిత విశేషాలు

మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో రామయ్య జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చి బోధిస్తుండటం ఆయన దక్కిన గౌరవంగా చెప్పవచ్చు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆరో తరగతి సాంఘిక శాస్త్రంలో వనజీవి విశేషాలతో పాఠం పొందుపరిచింది.

పలు అవార్డులు.. పద్మశ్రీ

మొక్కల పెంపకంలో చేసిన కృషికి గాను వనజీవి రామయ్య 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు అందుకున్నారు. 2005లో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ అవార్డు ప్రదానం చేసింది. యూనివర్సల్ గ్లోబల్ పీస్ అంతర్జాతీయ సంస్థ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 2017లో కేంద్రం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. రామయ్య మృతికి ప్రధాని మోదీ, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.


సుస్థిరత కోసం గళం వినిపించారు



దరిపల్లి రామయ్య సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా గుర్తుండిపోతారు. లక్షలాది చెట్లు నాటడమే కాకుండా వాటి రక్షణకు ఆయన తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతిపై గాఢమైన ప్రేమను, భవిష్యత్ తరాలపై బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

– ఎక్స్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

రామయ్య సేవలు స్ఫూర్తిదాయకం



ప్రకృతి ప్రేమికుడు, సామాజిక కార్యకర్త వనజీవి రామయ్య మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిది. కోటి మొక్కలకు పైగా నాటి పుడమి తల్లికి ఆయన అందించిన సేవలు రేపటి తరానికి స్ఫూర్తిదాయకం. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ నివాళులు.

– మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


కొమ్ము లక్ష్మన్న

కోడుమూరు రూరల్: రుణాల ఊబి కౌలు రైతు ఉసురు తీసింది. ఈ ఘటన కర్నూలు జిల్లా కోడుమూరు మండలం రేమట గ్రామంలో చోటు చేసుకుంది. కొమ్ము లక్ష్మన్న(39) పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే గత రెండేళ్లుగా నష్టాలే రావడంతో అప్పుల రూపంలో తెచ్చిన రూ.6 లక్షలను ఎలా తీర్చాలో పాలుపోలేదు. ఈనెల 10న గూడూరు వెళుతున్నానంటూ భార్యకు చెప్పి మార్గమధ్యంలో పురుగులమందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు లక్ష్మన్నను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 11 రాత్రి ప్రాణంవిడిచాడు. మృతునికి భార్య మహేశ్వరితో పాటు, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు గూడూరు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

పీపీపీ విధానంలో కొత్త వైద్యకళాశాలలు

డీఎంఈ డాక్టర్ నరసింహులు



కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీఎస్ఎల్వీ నరసింహులు తెలిపారు. ఇందుకు సంబంధించి విధివిధానాలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన ఆరో రాష్ట్రస్థాయి ఫోరెన్సిక్ వైద్యుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌ను సందర్శించారు. అనంతరం ఆసుపత్రి విభాగాధిపతులతో పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నా ఎవరూ రావడం లేదన్నారు. దీనికి త్వరలోనే పరిష్కార మార్గం కనుగొంటామన్నారు.

జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు నష్టం లేదు

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తిరుపతి కల్చరల్: జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు నష్టం అనే వాదనలో పసలేదని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. తిరుపతిలో శనివారం 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, జమిలి ఎన్నికలతో సమయం, వనరులు ఆదా అవుతాయని, పరిపాలన, అభివృద్ధిపై దృష్టి పెట్టేందుకు వీలుంటుందని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన, అభివృద్ధిపై నూటికి నూరు శాతం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తిరుమలలో భద్రతా వైఫల్యం

మహాద్వారం వరకూ డిస్పోజబుల్ పాదరక్షలతో వచ్చిన భక్తులు


మహాద్వారం వద్ద పాదరక్షలతో భక్తులు

తిరుమల: శ్రీవారి దర్శనానికి వచ్చిన ముగ్గురు భక్తులు డిస్పోజబుల్ పాదరక్షలు ధరించి ఆలయ మహాద్వారం వరకు చేరుకోవడం టీటీడీ భద్రతా విభాగం వైఫల్యాన్ని మరోమారు తేటతెల్లం చేసింది. మహారాష్ట్రకు చెందిన అభిషేక్, ముకేష్ కుటుంబసభ్యులతో కలిసి శ్రీవాణి టికెట్‌పై శ్రీవారి దర్శనం కోసం వైకుంఠం క్యూకాంప్లెక్స్–1 మీదుగా స్వామి వారి ఆలయం వద్దకు చేరుకున్నారు. మహాద్వారం వద్ద టీటీడీ భద్రతా సిబ్బంది ముగ్గురు డిస్పోజబుల్ పాదరక్షణలను ధరించి వచ్చినట్లు గుర్తించి వాటిని తొలగింపజేశారు. దర్శనానికి వెళ్లే భక్తులుగానీ, మాడవీధుల్లోకి గానీ పాదరక్షలను టీటీడీ అనుమతించదు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భద్రతా సిబ్బంది వీరు డిస్పోజబుల్ పాదరక్షలను ధరించినట్లు గుర్తించి తొలగించాల్సి ఉన్నా, సరిగా తనిఖీ చేయకపోవడంతో వారు పాదరక్షలతోనే మహాద్వారం వరకు చేరుకున్నారు. దీనిపై టీటీడీ భద్రతాధికారులు విచారణ చేయిస్తున్నారు.

ఏడుగురి సస్పెన్షన్..

తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో విఫలమైన సిబ్బందిని టీటీడీ సస్పెండ్ చేసింది. టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు ఫుట్‌పాత్ హాల్, డౌన్ స్కానింగ్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తోన్న టీటీడీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను ఏడుగురిని సస్పెండ్ చేసింది. తమ విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత ఎస్పీఎఫ్ సిబ్బంది ఆరుగురిని సస్పెండ్ చేయాలని ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌కు టీటీడీ అధికారులు ప్రతిపాదన పంపారు.

రెవెన్యూ అకాడమీ ఏర్పాటు చేయాలి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు డిమాండ్

కాకినాడ సిటీ: రెవెన్యూ వ్యవస్థలో మార్పులు, నూతన సాంకేతికతపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఇక్కడ మాట్లాడుతూ నూతన చట్టాలకనుగుణంగా ఉద్యోగుల్లో అవగాహన కలిగించేలా అకాడమీని ఏర్పాటు చేసి ఆర్నెల్లకోసారి వీఆర్ఓ, ఆర్ఐ, డిప్యూటీ కలెక్టర్లకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రొటోకాల్‌కు నిధులు విడుదల చేయడం లేదన్నారు. తహసీల్దార్లు కోర్టు కేసులకు హాజరైనప్పుడు ఐదుగురిపై ప్రతివాద కేసు నమోదు చేస్తారని, అలాంటప్పుడు వారి కోసం రూ.50 వేల ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వం ఆ సొమ్మును కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 15 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులుండగా వారిలో 2 వేల మందిని మాత్రమే క్రమబద్ధీకరించారని, మిగిలినవారికి భరోసా కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని బొప్పరాజు డిమాండ్ చేశారు.

విద్యార్థుల జీవితాలతో సర్కార్ చెలగాటం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల్లో తీవ్ర నిర్లక్ష్యం
- ఫీజుల కోసం విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి
- వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం



సాక్షి, అమరావతి: పేద విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి, ట్విట్టర్ కింగ్ నారా లోకేశ్ రాజకీయ కక్ష సాధింపుల్లోనే తలమునకలు అయ్యారనీ, విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఒకవైపు రాష్ట్రంలో విద్యాప్రమాణాలు పూర్తిగా క్షీణిస్తుంటే.. మరోవైపు విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.700 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. కూటమి ప్రభుత్వం దాదాపు రూ.2,800 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు రూ.1,100 కోట్లు బకాయి పెట్టిందని చెప్పారు.

చదువులు వదిలి విద్యార్థులు కూలికి వెళ్లే దుస్థితి

ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో ఫీజుల కోసం కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నాయని నాగార్జున పేర్కొన్నారు. పరీక్షల సమయంలో హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థుల్ని వేధిస్తున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువుల్ని మధ్యలోనే ఆపేసి కూలి పనులకు వెళ్లే దుర్భరమైన పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలపై ఇటీవల వైఎస్సార్‌సీపీ 'ఫీజు పోరు' నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దీంతో బకాయిలను విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిందే తప్ప.. ఎంత మేరకు బకాయిలు విడుదల చేశారు, ఇంకా ఎంత చెల్లించాల్సి ఉంది, ఎప్పుడు చెల్లిస్తారో చెప్పడం లేదని అన్నారు. 11 లక్షల మంది విద్యార్థులకు బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణం విడుదల చేయాలని కోరారు. వైఎస్ జగన్ హయాంలో ప్రారంభించిన సంస్కరణలను రూపుమాపాలన్న దుష్ట ఆలోచనకు కూటమి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టాలని, విద్యా శాఖ మంత్రి రాజకీయ కుతంత్రాలతో కాలం వెళ్లదీయకుండా విద్యాప్రమాణాలను పెంచడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పేరిట ఆకర్షణీయమైన హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడం ఇష్టంలేక గల్లాపెట్టె ఖాళీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. 2019లో ఖజానాను ఖాళీ చేసి చంద్రబాబు దిగిపోతే.. ఆ తరువాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్ జగన్ విద్యార్థుల విషయంలో అత్యంత జాగ్రత్తలతో నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రమాదంలోనే పాస్టర్ మృతి

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడి
- మూడుచోట్ల రోడ్డు ప్రమాదాలు
- ఆరుచోట్ల యూపీఐ పేమెంట్లు


మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్

సాక్షి, రాజమహేంద్రవరం: హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందారని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపి, కిందపడటం వల్లే ఆయన ప్రాణాలు కోల్పోయారన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఎస్పీ నరసింహ కిశోర్‌తో కలసి శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'గత నెల 24న ప్రవీణ్ పగడాల ప్రయాణించిన మార్గంలో 400కు పైగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించాం. 42 సీసీ టీవీ ఫుటేజీలు సేకరించాం. కుటుంబ సభ్యులు సహా వివిధ వర్గాలకు చెందిన మొత్తం 92 మందిని విచారించాం. యూపీఐ పేమెంట్లు, పోస్టుమార్టం నివేదిక, రెండు నెలల కాల్ డేటా ఆధారంగా ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలోనే మరణించినట్టు నిర్ధారణకు వచ్చాం. ఆయన హైదరాబాద్‌లోని సవేరా లిక్కర్ మార్ట్, కోదాడ శ్రీ ఆదిత్య వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేశారు. మద్యం షాపులు, పెట్రోల్ బంకుల్లో 6 చోట్ల యూపీఐ పేమెంట్లు చేశారు. చిల్లకల్లు వద్ద ఉన్న వెంకటసాయి ఫుడ్ ప్లాజా ఎదురుగా హైవేపై ఒకసారి, కీసర టోల్‌గేటుకు 500 మీటర్ల ముందు ఒకసారి, రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద మరోసారి బైక్‌పై నుంచి పడిపోయారు. దీంతో బైక్ హెడ్‌లైట్ పగిలిపోయింది. ఆయనకు చిన్నపాటి గాయాలయ్యాయి. విజయవాడలోని రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద పార్కులో సుమారు రెండు గంటలు విశ్రాంతి తీసుకుని, తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరారు. మద్యం తాగి డ్రైవ్ చేయవద్దని వారించినా వినకుండా ముందుకు వెళ్లారు. ఏలూరు వద్ద మరోసారి మద్యం కొనుగోలు చేశారు. కొవ్వూరు టోల్‌గేట్ దాటిన 11 నిమిషాలకు రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు వద్ద నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా అదుపు తప్పి జాతీయ రహదారి–16 పక్కనే ఉన్న రెయిన్ డ్రెయిన్‌లో బైక్‌తో సహా ప్రమాదవశాత్తూ పడిపోయారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలో ప్రవీణ్ మద్యం తాగినట్టు తేలింది' అని ఐజీ వివరించారు.

యువికా–2025కి తెలుగు రాష్ట్రాల నుంచి 22 మంది ఎంపిక

ఏపీ నుంచి 10మంది.. తెలంగాణ నుంచి 12 మంది విద్యార్థులు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతరిక్ష విజ్ఞానం గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ఏటా నిర్వహిస్తోన్న యువికా–2025కి తెలుగు రాష్ట్రాల నుంచి 22 మంది ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 350 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 10, తెలంగాణ నుంచి 12 మంది విద్యార్థులున్నారు. ఎంపికైన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మే 18న శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌కు వచ్చి రిపోర్ట్ చేయాలి. వీరికి మే 19 నుంచి 30వరకు శ్రీహరికోటలో సాంకేతికపరమైన అంశాలపై వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీహరికోట రాకెట్ కేంద్రం, స్పేస్ మ్యూజియం సందర్శన కల్పిస్తామని ఇస్రో తెలిపింది.

ఎంపికైన విద్యార్థులు వీళ్లే..

ఆంధ్రప్రదేశ్: ఎం ప్రదీప్తి, సోమశేఖర్, సాన్వి అనిల్, సిరి చందన్ రెడ్డి, పీవీ. నాగార్జున, బి. బాబు రెడ్డి, వి. పద్మశ్రీ, ఎస్ పవన్ దుర్గ, కె. తేజశ్రీ, కె. లావణ్య

తెలంగాణ: కె.అశ్విని, జి.కౌషిక్, పి.సిరివెన్నెల, టి.సాయి వర్షిత, కె.జేసుదాసు, ఎం హర్షవర్ధన్, యు ఉదయ్, బి. శ్రీకర్‌రెడ్డి, పి.సాత్విక, యు.అఫ్షీన్, జి. అభిరామ్, బి. సుశాంత్

- తిరుపతి జిల్లా గూడూరులో అక్రమ మైనింగ్‌ను పరిశీలించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులతో బయలుదేరిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో శనివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



> ఆయన ఆది యందు దేవునియొద్ద ఉండెను.
> సమస్తమును ఆయన మూలముగా కలిగెను,
> కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి పూర్తి (24గంటలు), **నక్షత్రం:** చిత్త రా.7.40 వరకు తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.1.55 నుండి 3.41 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.20 వరకు, **అమృత ఘడియలు:** ప.12.36 నుండి 2.22 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

గ్రేట్ ఆంధ్రా మ్యాజిక్ షో!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



పీసీ సర్కార్ ఇంద్రజాలం గొప్పదా... ఏపీ సర్కార్ ఇంద్ర జాలం గొప్పదా? పీసీ సర్కార్ మ్యాజిక్ ట్రిక్స్ ఈ దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తేవని విన్నాము. ఏపీ సర్కార్ ట్రిక్స్ మాత్రం ప్రజలను షాక్ మీద షాక్‌కు గురిచేస్తున్నాయి. అది... స్టేజ్ షో. అంతా మ్యాజిక్ అనే సంగతి ముందుగానే తెలుసు! కానీ, ఇది... జనజీవితంతో ఆటాడుకోవడం! మోసపోతున్నా మని ముందుగా ప్రజలకు తెలియదు. క్రమంగా అనుభవంలోకి వస్తుంది. ఎన్నికలకు ముందు ఇంటింటికీ ఓ వైకుంఠాన్ని వాగ్దానం చేసిన మ్యానిఫెస్టో కూడా మ్యాజిక్ షోలో భాగమని అప్పుడు అర్థం కాలేదు. మెజీషియన్ దాన్ని తన టోపీలో పడే శారు. ఇప్పుడా టోపీలోంచి కుందేళ్లు, కుక్కపిల్లలు వగైరాలే వస్తున్నాయి. మ్యానిఫెస్టో మాయమైంది.

ఇంద్రజాల విద్యలతో జనాన్ని ఆహ్లాదపరచాలని, హామీల సంగతిని మరిపింపజేయాలని చంద్రబాబు సర్కార్ ప్రయాస పడుతున్నది. అందులో భాగంగా ఆయన నాలుగు రోజులకో కొత్త ట్రిక్కును నేర్చుకొస్తున్నారు. వేదికల మీద వాటిని ప్రదర్శి స్తున్నారు. కీలకమైన మూడు అంశాల్లో వాస్తవాలకు గంతలు కట్టడానికి, ప్రజలను భ్రమల్లో ముంచెత్తడానికి శతవిధాలైన విన్యాసాలను ఆయన ప్రదర్శిస్తున్నారు. ఇందులో మొదటి అంశం – అభివృద్ధి అనే పదానికి తననే నిర్వచనంగా చెప్పు కోవడం, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా తనను తాను ప్రమోట్ చేసుకోవడం! కానీ, వాస్తవ పరిస్థితి? ఈ పది మాసాల కాలంలోనే అప్పుల్లో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రికార్డులను బద్దలు కొట్టింది. ప్రజల కొనుగోలుశక్తి దారుణంగా పడి పోయింది. పన్నుల వసూళ్లు మందగించాయి. స్థిరాస్తుల రిజి స్ట్రేషన్లు తిరోగమన పథంలోకి వెళ్లాయి. రైతు కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయి. ప్రభుత్వ నిర్వాకం కారణంగానే ధాన్యం రైతుల దగ్గర్నుంచి ఆక్వా రైతుల వరకు అందరూ దయనీయ స్థితిలోకి జారిపోతున్నారు. విద్యుత్ బిల్లుల భారంతో వేలాది ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలు మూతపడ్డాయి. ఇరవై వేలమంది ఉపాధి కోల్పోయారు.

బాబు సర్కార్ మ్యాజిక్ చేయదలచుకున్న రెండో అంశం – సంక్షేమ రంగం. సంక్షేమం అంటేనే తెలుగుదేశం పార్టీ గుర్తు కొస్తుందని బహిరంగ సభల్లో చంద్రబాబు చెప్పుకొస్తున్నారు. ఎన్నికలకు ముందు కూటమి తరఫున ఆయన చేసిన వాగ్దానాల సంగతిని కాసేపు మరిచిపోదాం. అంతకుముందు జగన్ ప్రభుత్వం అమలుచేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలను చాప చుట్టేసి అటకెక్కించారు. 'అమ్మ ఒడి' ఆగిపోయింది. మహిళలకు 'చేయూత' అందడం లేదు. 'వైఎస్సార్ బీమా' కనుమరుగైంది. 'మత్స్యకార భరోసా' మాయమైంది. 'కల్యాణమస్తు' కనిపిం చడం లేదు. ఆటో డ్రైవర్లకు 'చేదోడు' లేదు. చిల్లర వర్తకులకు తోడుగా నిలిచిన రుణ సదుపాయం నిలిచిపోయింది. ఇవి కొన్ని మాత్రమే! చెప్పుకుంటూ పోతే సంక్షేమం కథ చాలా పెద్దది.

ఇక మూడో ఇంద్రజాల ఇతివృత్తం – తనను తాను గొప్ప ప్రజాస్వామికవాదిగా ప్రచారం చేసుకోవడం. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ హింసా రాజకీయాలు చేయలేదు. కక్షలూ కార్పణ్యాలకు పూనుకోలేదు. వ్యక్తిత్వ హననాలకు పాల్పడలేదని బాబు చాలా సందర్భాల్లో చెప్పుకుంటున్నారు. అనుబంధ మీడియా ఇంకో నాలుగడుగులు ముందుకెళ్లి ఆయన్ను ప్రమోట్ చేస్తున్నది. ఈ ప్రమోషన్‌కూ, వాస్తవ పరిస్థితికీ మధ్యన 180 డిగ్రీల దూరం ఉన్నదని పది నెలల కాలంలో జరిగిన అనేక ఘటనలు రుజువు చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరావడంతోనే ప్రత్యర్థుల వేట మొదలుపెట్టింది. వ్యతిరే కంగా పనిచేసిన వాళ్లను బహిరంగంగా నరికి చంపుతున్న భయానక దృశ్యాలను చూడవలసి వచ్చింది. పల్నాడు వంటి ప్రాంతాల్లో వేలాదిమంది ప్రజలు దాడులకు భయపడి ప్రవాస జీవితాలు గడపవలసి వచ్చింది. సోషల్ మీడియాలో విమర్శలు చేసేవారి మీద దారుణమైన సెక్షన్లతో కేసులు పెట్టారు. 50 పైచిలుకు మందిని అరెస్టు చేశారు. వందలాది మందిపై కేసులు నమోదయ్యాయి. బీఎన్ఎస్ 111 సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తు న్నారని పోలీసులను పలుమార్లు ఉన్నత న్యాయస్థానం మంద లించవలసి వచ్చింది. 'రెడ్‌బుక్' గైడ్‌లైన్స్ ప్రకారం పనిచేయా లని పోలీసులను వారి ఉన్నతాధికారులే ఒత్తిడి చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఎరుగని పరిణామాలివి.

తనకు లేని ఘనతల్ని ఆపాదిస్తూ యెల్లో మీడియా తగిలిం చిన భుజకీర్తులను కాపాడుకోవడానికి చంద్రబాబు ఇప్పుడు మ్యాజిక్ షోలను ఆశ్రయించక తప్పడం లేదు. అమరావతి ప్రాంతంలో కొన్ని కృత్రిమ మెరుపుల్ని మెరిపించి, 'అదిగో అభి వృద్ధి' అని చెప్పుకోవాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. అమరావతి పేరుతో 30 వేల కోట్ల అప్పులు ఇప్పటికే తీసు కొచ్చారు. రైల్వే స్టేషన్ ఎక్కడొస్తుందో ప్రకటించారు. బస్టాండ్ స్థలాన్ని గుర్తించడం జరిగింది. అద్భుతమైన స్టేడియం వస్తుం దని ప్రచారం చేశారు. ఆకాశ హర్మ్యాల గురించి మాట్లాడుకుం టున్నారు. ఐటీ పరిశ్రమను వేలు పట్టుకొని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన తాను, అదే చందంగా 'క్వాంటమ్ వ్యాలీ'ని అమ రావతికి పిలుచుకొస్తానని కూడా చంద్రబాబు పదేపదే ప్రక టిస్తున్నారు. 'క్వాంటమ్ వ్యాలీ' ఏర్పాటుకు అవసరమయ్యే భౌతిక, మేధాపరమైన పరిస్థితులు అమరావతిలోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోనే లేవనేది నిపుణుల అభిప్రాయం. సమీప భవి ష్యత్తులో అటువంటి ఎకో సిస్టమ్ ఏర్పడే అవకాశాలు కూడా లేవని వారు చెబుతున్నారు.

అయినా సరే, అమరావతి టైర్లలో గాలి నింపడానికి ఆయన ఇటువంటి అసంగతమైన సంగతులు ఇంకా ఎన్నయినా చెప్ప వచ్చు. అయినప్పటికీ అక్కడ రియల్ ఎస్టేట్ రంగంలో కదలిక కనిపించడం లేదు. అక్కడ ప్లాట్లు కొనేందుకు జనం ఎగబడడం లేదు. చివరికి మొన్న అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలో ఐదెకరాల పైచిలుకు విస్తీర్ణం (25 వేల చదరపు గజాలు)లో ఉన్న ప్లాట్‌లో స్వగృహ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. వెలగ పూడి గ్రామానికి చెందిన కంచర్ల కుటుంబం వారు తమ 29 ఎకరాల 51 సెంట్ల వ్యవసాయ భూమిని ల్యాండ్ పూలింగ్‌కు అప్పగించగా వారికి 25 వేల చదరపు గజాల ప్లాటు కోర్ క్యాపి టల్ ఏరియాలో లభించింది. 18 కోట్ల 75 లక్షల రూపాయలు వెచ్చించి ఈ భూమిని నారా బ్రాహ్మణి పేరుతో ఉన్న ట్రస్టు ద్వారా కొనుగోలు చేశారు. అంటే గజానికి 7,500 పడిందన్న మాట. కోర్ క్యాపిటల్ ప్రాంతంలో మరీ ఇంత తక్కువ రేటేమిటో?

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న సీనియర్ మోస్ట్ రాజకీయవేత్త మిగిలిన సొమ్మును బ్లాక్‌లో చెల్లించి ఉంటారని అనుకోలేము కదా! అమరావతిలోని చాలా ప్రాంతాల్లో రిజిస్ట్రే షన్ విలువ గజానికి ఐదు వేలు మాత్రమే ఉందట! చిన్న చిన్న పట్టణాల్లో కూడా ఇంత తక్కువ విలువ ఎక్కడా లేదు. ప్రపంచం లోని ఐదు పెద్ద నగరాల్లో ఒకటిగా నిలబెట్టాలని తలపోస్తున్న అమరావతిలో ఈ విలువేమిటో అర్థం కాదు. ప్రస్తుతం అమ రావతి పట్నం 'బ్లాక్' ఈజ్ బ్యూటీ అని కలవరిస్తున్నది. పిలు స్తున్నది. కానీ ఆ బ్యూటీ మాత్రం అమరావతిని ఇంకా కరుణిం చడం లేదు. ఎప్పుడు కరుణిస్తుందో, రియల్ ఎస్టేట్ ఎప్పుడు పుంజుకుంటుందో, ఆకాశహర్మ్యాలకు పునాదులు ఎప్పుడు పడతాయో! అప్పటికీ తన మీద అభివృద్ధి ప్రదాత అనే స్టాంపు వేయించుకోవడానికి చంద్రబాబు ప్రభుత్వం చేయగలిగినంత మ్యాజిక్‌ను చేస్తూనే ఉన్నది.

అభివృద్ధి ముద్ర కోసం అమరావతి ముసుగును వేసు కున్నట్టే... సంక్షేమం సర్టిఫికెట్ కోసం ఆయన 'పీ–ఫోర్' అనే దౌర్భాగ్య సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. పేదరిక నిర్మూలనకు కృషి చేయవలసిన ప్రభుత్వ బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేల మీద పుట్టిన ప్రతి జీవి ఈ దేశ సంపదలో హక్కుదారేనన్నది సహజ న్యాయం. ఆ సహజ న్యాయం రాజ్యాంగ హక్కుగా పౌరులందరికీ భరోసా నిచ్చింది. కానీ, దేశ సంపదను ప్రైవేటీకరించడంలో ఉత్సాహాన్ని ప్రదర్శించే చంద్రబాబు పేద ప్రజలను కూడా ప్రైవేటీకరించడానికి పూనుకున్నారు. తమ హక్కుల సాధన కోసం, తమ న్యాయమైన వాటా కోసం పిడికిళ్లు బిగించ వలసిన ప్రజలను మభ్యపెట్టి, తక్షణావసరాల కోసం సంప న్నుల ముందు సాగిలపడేట్టు ప్రోత్సహిస్తున్నారు. తన సంక్షేమ బాధ్యతల నుంచి తప్పుకొని తన అనుచరులకు సంపద సృష్టించే పథకాల గురించి ఆయన ఆలోచిస్తున్నారు. 'పీ–ఫోర్' మంత్రంతో పేదరికం పోదు. ఈ మ్యాజిక్ ఎక్కువ కాలం చెల్లదు.

అనగనగా ఒక చిత్తకార్తె చతుష్పాద జీవి లాంటి వెధవొకడు టీడీపీకి అనుబంధ సోషల్ మీడియాలో కిరాయి సైనికుడు. వైసీపీ అగ్రనేత మీద సొల్లు వాగాడు. ఈ రకమైన వాగుడు,

చంద్రబాబు మూడో ఇంద్రజాల ఇతివృత్తం – తనను తాను గొప్ప ప్రజాస్వామికవాదిగా ప్రచారం చేసుకోవడం. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ హింసా రాజకీయాలు చేయలేదు. కక్షలూ కార్పణ్యాలకు పూనుకోలేదు. వ్యక్తిత్వ హననాలకు పాల్పడలేదని బాబు చాలా సందర్భాల్లో చెప్పుకుంటున్నారు. అనుబంధ మీడియా ఇంకో నాలుగడుగులు ముందుకెళ్లి ఆయన్ను ప్రమోట్ చేస్తున్నది. ఈ ప్రమోషన్‌కూ, వాస్తవ పరిస్థితికీ మధ్యన 180 డిగ్రీల దూరం ఉన్నదని పది నెలల కాలంలో జరిగిన అనేక ఘటనలు రుజువు చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరావడంతోనే ప్రత్యర్థుల వేట మొదలుపెట్టింది. వ్యతిరేకంగా పనిచేసిన వాళ్లను బహిరంగంగా నరికి చంపుతున్న భయానక దృశ్యాలను చూడవలసి వచ్చింది. పల్నాడు వంటి ప్రాంతాల్లో వేలాదిమంది ప్రజలు దాడులకు భయపడి ప్రవాస జీవితాలు గడపవలసి వచ్చింది. సోషల్ మీడియాలో విమర్శలు చేసేవారి మీద దారుణమైన సెక్షన్లతో కేసులు పెట్టారు. 50 పైచిలుకు మందిని అరెస్టు చేశారు. వందలాది మందిపై కేసులు నమోదయ్యాయి. బీఎన్ఎస్ 111 సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తున్నారని పోలీసులను పలు మార్లు ఉన్నత న్యాయస్థానం మందలించవలసి వచ్చింది. 'రెడ్‌బుక్' గైడ్‌లైన్స్ ప్రకారం పనిచేయాలని పోలీసులను వారి ఉన్నతాధికారులే ఒత్తిడి చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఎరుగని పరిణామాలివి.

అటువంటి పోస్టింగులు అతడికి చిరకాలంగా అలవాటే! కానీ, మొన్నటి ఘటన జరిగిన వెంటనే ముఖ్య మంత్రి ఖండించారు. అతడిని పార్టీ నుంచి తప్పిస్తున్నట్టు ప్రక టించారు. అరెస్ట్ చేశారు. స్వాగతించవలసిన విషయమే! కానీ, ఈ వ్యవహారంలో చిత్తశుద్ధి ఉండాలనేది సహజమైన ఆకాంక్ష. ఈ ఖండన వెలువడిన వెంటనే సిద్ధంగా ఉన్నట్టుగా యెల్లో మీడియా స్పందించింది. చంద్రబాబును ప్రశంసలతో ముంచె త్తింది. ఇమేజ్ మేకోవర్ ఎక్సర్‌సైజని అర్థమవుతూనే ఉన్నది. అదే బాధాకరం. రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన జరుగుతున్నదని ఈ పది నెలల పాలనపై ఆరోపణలు వస్తున్నాయి. చిత్తశుద్ధి వుంటే దీన్ని సరిదిద్దుకోవాలి. కానీ హైకోర్టు హెచ్చరిస్తున్నా ఈ పాలనలో మార్పు రావడం లేదు. టీడీపీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఐటీడీపీలో వందలాదిమంది సైకోల్లాంటి కిరాయి సైనికులు పనిచేస్తున్నారు. వారి జుగుప్సాకరమైన రాతలతో, వాగుడుతో ఎంతోమంది కలతచెందిన ఘటనలున్నాయి. ఎన్ని కలకు ముందు గుంటూరు జిల్లాలో గీతాంజలి అనే గృహిణి ఈ వేట కుక్కల దాడి తట్టుకోలేక, ఆత్మహత్య చేసుకున్నది. అప్పుడే ఖండించి ఉంటే, చర్యలు తీసుకొని ఉంటే పరి స్థితులు ఇలా దిగజారి ఉండేవా? విజయవాడలో జగన్ మామ గురించి ఆప్యాయంగా మాట్లాడిన ఓ పసిబిడ్డ మీద అవాకులు చవాకులు పేలినప్పుడైనా ఈ ఖండన రావాల్సింది. ఇటు వంటి అను భవాలు కోకొల్లలు. ఎప్పుడూ స్పందించలేదు. పైపెచ్చు ప్రోత్సహించారని మొన్నటి సొల్లు వెధవే ఒక వెబ్ చానల్‌లో చెప్పుకొచ్చాడు. ఈ కారణాల రీత్యా, దిగజారి పోతున్న ప్రతిష్ఠను కాపాడుకోవడానికే ఇలా స్పందించారని భావించవలసి వస్తున్నది. మ్యాజిక్ షోలెప్పుడూ మ్యానిఫెస్టో అమలుకు ప్రత్యామ్నాయం కాబోవు. అలా భావిస్తే భంగపాటు తప్పదు!

vardhelli1959@gmail.com

రాయని డైరీ

మహువా మొయిత్రా (ఎంపీ)

మాధవ్ శింగరాజు

పురుషుడితో గొడవ పడిన స్త్రీ పూర్తిగా అతడిని పట్టించుకోవటం మానేస్తుంది. స్త్రీతో గొడవ పడిన పురుషుడు మరింతగా ఆమెను పట్టించు కోవటం మొదలు పెడతాడు! నిజానికది పట్టించుకోవటం కాదు. ఆమె తనని పట్టించు కోక పోవటాన్ని పట్టించుకోవటం!

కానీ ఎంపీలు కూడా ఇలా స్త్రీ, పురుషులుగా గొడవ పడాల్సిందేనా? ఏ నాగరికతా, ఏ పదవీ బాధ్యతా... స్త్రీని స్త్రీగా, పురుషుడిని పురుషుడిగా కాక, పరిణతి చెందిన ఒక మనిషిగా ఉంచలేవా?

కల్యాణ్ బెనర్జీ, నేను లోక్‌సభ ఎంపీలం. కానీ మా మధ్య ఘర్షణను ఇద్దరు ఎంపీల మధ్య ఘర్షణలా అతడు ఉండనివ్వటం లేదు!

లోక్‌సభలో అతడు పార్టీ చీఫ్ విప్. సభలో తృణమూల్ ఎంపీలు ఎవరు మాట్లాడాలన్నది అతడిదే నిర్ణయం. ఎవరు మాట్లాడకూడదన్నదీ అతడి నిర్ణయమే. లోక్‌సభలో మొత్తం 28 మంది తృణమూల్ ఎంపీలం ఉన్నాం. అందర్నీ మాట్లాడనిచ్చేవారు కల్యాణ్ బెనర్జీ. నా దగ్గరికి వచ్చేసరికి 'నో' చెప్పేవారు!

"నేను మాట్లాడతాను" –"నో"
"నాకు అవకాశం ఇవ్వండి" – "నో"
"రెండే రెండు నిమిషాలు..." –"నో"
"నన్ను చెప్పనివ్వండి ప్లీజ్.." – "నో"



కల్యాణ్ బెనర్జీ నాకన్నా 18 ఏళ్లు పెద్దవారు. 16 ఏళ్లుగా ఎంపీగా ఉంటున్నవారు. నిన్న మొన్న, ఆరేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చిన నాతో ఈయనకు ఏంటి ప్రాబ్లం?!

"ఎందుకు మీరు నన్ను మాట్లాడనీయటం లేదు మిస్టర్ బెనర్జీ?" అని లాస్ట్ సెషన్‌లో మళ్లీ అడిగాను. కళ్లింత చేశారు!

"ఫస్ట్ మీరు మీ చీఫ్ విప్‌తో మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి. ఆ తర్వాత మీకు సభలో మాట్లాడే అవకాశం వస్తుంది. మిస్టర్ బెనర్జీ ఏంటి... మిస్టర్ బెనర్జీ? మన ఛైర్‌పర్సన్‌ని కూడా ఇలాగే 'మిస్ బెనర్జీ' అనేసేలా ఉన్నారు?" అన్నారు!

మధ్యలోకి దీదీని ఎందుకు తెచ్చినట్లు!

ఏప్రిల్ 4న తృణమూల్ ఎంపీలం అందరం ఎలక్షన్ కమిషన్ ఆఫీస్‌కి వెళ్లాం. డూప్లికేట్ ఓటర్ ఐడీ నంబర్లు తొలగించాలని డిమాండ్ లెటర్ తయారు చేసి, అందులో అందరి సంతకాలూ తీసుకున్నారు కల్యాణ్ బెనర్జీ... ఒక్క నా సంతకం తప్ప!

"ఏమిటిది మిస్టర్ బెనర్జీ! ఎందుకిలా చేస్తున్నారు?" అని అడిగాను.

ఆ మాటకు అక్కడ సమాధానం చెప్ప కుండా తృణమూల్ ఎంపీల వాట్సాప్ గ్రూప్‌లో నాపై పోస్టులు పెట్టారు. "ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని అహంకారం... ఆ ఇంటర్నేషనల్ లేడీకి..." అని నా పేరెత్తకుండా అన్నారు! నవ్వొచ్చింది నాకు.

సమాధానం లేనప్పుడు... 'పెద్ద మగాళ్లం' అనుకునే మగాళ్లు కూడా ఇలాగే చిన్నపిల్లల్లా మాట్లాడతారు!

గ్రూప్‌లోంచి బయటికి వచ్చేశాను.

వెంటనే నన్ను వెతుక్కుంటూ వచ్చారు సాగరికా ఘోష్! సాగరిక రాజ్యసభ ఎంపీ.

"ఏప్రిల్ 4న జరిగిన దానికి దీదీ చాలా కోపంగా ఉన్నారు మొయిత్రా. కల్యాణ్ బెనర్జీతో తగాదా మానేయమంటున్నారు. సోమవారం లోపే ఇదంతా ముగిసిపోవాలని దీదీ కోరుకుంటున్నారు..." అన్నారు సాగరిక.

ఆ విషయాన్ని దీదీనే నేరుగా నాతో ఎందుకు చెప్పలేకపోయారు!

"అంబేద్కర్‌ని ఓన్ చేసుకోటానికి రేపు ఏప్రిల్ 14న బీజేపీకి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదని దీదీ అంటున్నారు మొయిత్రా. మహిళలకు రాజకీయాల్లో గౌరవం దక్కాలని అంబేద్కర్ ఆకాంక్షిస్తే, తృణమూల్ పార్టీలో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్న మాటను రానీయకూడదని మీకు చెప్పమన్నారు... " అన్నారు సాగరిక.

"అంటే, కల్యాణ్ బెనర్జీకి నన్ను అపాలజీ చెప్పమని అంటున్నారా?" అని అడిగాను.

"లేదు. మిమ్మల్ని వెంటనే ఎంపీల వాట్సాప్ గ్రూప్‌లోకి తిరిగి వచ్చేయమంటున్నారు..." అన్నారు సాగరిక!!

రెండూ ఒకటే కదా! కాదా?!

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

మంచిగంధం లాంటి జాతీయవాది

జాతీయ సంప్రదాయం పట్ల, తెలుగు భాష పట్ల, పేద ప్రజల పట్ల పుష్కలమైన ప్రేమానురాగాలున్న వారు; సోషలిస్టుగా నిరాడంబర జీవితాన్ని గడిపి, రాజకీయ నాయకులు ఎలా ఉండాలో అలా జీవించి చూపించినవారు మోదుగుల పాపిరెడ్డి. ఆదర్శ జీవితం గడిపిన ఆయన ఏప్రిల్ 6, శ్రీరామ నవమి రోజున తుదిశ్వాస విడిచారు.

ఆయన సోషలిస్టు పార్టీకి తన జీవితాన్ని అంకితం చేశారు. పాపిరెడ్డి స్వగ్రామం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని పెదపరిమి. తుళ్లూరులోనే నివాసం ఉండే రావెల సోమయ్య ప్రభావం పాపిరెడ్డిపై ఉంది. విద్యార్థి దశ నుంచి ఇద్దరు స్నేహి తులు. దానికి తోడు సోషలిస్టు భావజాలం మరింత సాన్నిహిత్యం ఏర్పరిచింది.

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సోషలిస్టు అయిన రామ్ మనోహర్ లోహియా (1910–1967) గుంటూరుకు 1955లో వచ్చి నపుడు పాపిరెడ్డి ఆయనను కలిశారు. లోహియా ప్రసంగాలతో ప్రభావితులై, తర్వాత కాలంలో ఆయనకు ఎంతో సన్నిహితు లయ్యారు. సోషలిస్టు ఉద్యమ నేతలైన మధు లిమాయే, రాజ్ నారాయణ్, మధు దండావతే, జార్జ్ ఫెర్నాండెజ్ లాంటి వారితో కలిసి జాతీయ స్థాయిలో పనిచేశారు. 2002లో పూణెలో మధు దండావతే ఏర్పాటు చేసిన సోషలిస్టు ఫ్రంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర కన్వీనర్‌గా వ్యవహ రించారు. పెదపరిమిలో తన ఇంటికి ఆయన పెట్టుకున్న పేరు 'లోహియా లోగిలి'.



మోదుగుల పాపిరెడ్డి

అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి చీకటి పాలనకు తెర తీశారు. పాపిరెడ్డికి ప్రమాదం అర్థమై అజ్ఞాత వాసంలోకి వెళ్లిపోయారు. అయితే ఈ అజ్ఞాత వాసం ఐదు నెలలే సాగింది. 1975 నవంబర్ 14న అరెస్టయి 1977 జనవరి వరకు రాజమండ్రి, సికింద్రాబాదుల్లో జైలు శిక్ష అనుభవించారు. ఎమర్జెన్సీ జైలు శిక్షలో పాపిరెడ్డితో పాటు ఉత్తర ప్రదేశ్ మాజీ గవర్నర్ బి.సత్యనారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు జూపూడి యజ్ఞనారాయణ, భీమిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు. మన దేశ రక్షణమంత్రిగా చేసిన జార్జ్ ఫెర్నాండెజ్‌తో కలిసి గుజరాత్‌లోని కాండ్ల రేవులో చేసిన సత్యాగ్రహంలో పాల్గొని పాపిరెడ్డి అరెస్ట్ అయ్యారు. జాతీయ స్థాయిలో అనేకమంది గొప్ప నాయకులతో ఇంతటి సన్నిహిత పరిచయాలు ఉన్నా వాటితో రాజకీయ మెట్లు ఎక్కి పదవులు సంపాదించాలనే ఆలోచన ఏమాత్రం లేని నిస్వార్థ జీవి ఆయన. ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త స్నేహలతా రెడ్డి ఎమర్జెన్సీ అకృత్యాలకు బలై పోయినప్పుడు ఆమెను స్మరిస్తూ మహిళా సాధికారితపై ప్రత్యేక సంచిక తేవటంలో పాపిరెడ్డి కృషి మరువలేనిది.

ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షునిగా పౌర హక్కులకోసం నిరం తరం పని చేశారు. చేనేత కార్మికుల ఆకలి చావుల పట్ల ఎంతో బాధపడి, వారి సమస్యలు తక్షణం పరిష్కరించాలని 1989లో గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముందు నిరాహార దీక్షకు పూనుకుని మరోసారి అరెస్టు అయ్యారు. మాజీ ప్రధాని వి.పి.సింగ్‌ను ఆహ్వానించి భట్టిప్రోలు బహిరంగ సభలో చేనేత కార్మికుల సమస్యలపై బహిరంగ సభ జరిపించారు. 2019లో యార్ల గడ్డ లక్ష్మీ ప్రసాద్ ఛైర్మన్‌గా ఏర్పాటైన అధికార భాషా సంఘంలో పాపిరెడ్డి సభ్యులుగా ఉండి ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో పర్య టనలు జరిపారు.

తన స్వగ్రామంలోని ఆర్.సి.ఎం. హైస్కూల్ కమిటీ కన్వీనర్‌గా విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. తాడికొండ సత్యసాయిబాబా కళాశాల పాలకవర్గ సభ్యులుగా వ్యవహరించారు. వీరి రెండవ కుమారుడు మోదుగుల వేణు గోపాల రెడ్డి నరసారావుపేట పార్లమెంటు సభ్యులుగా ప్రజా వాణిని లోక్ సభలో వినిపించి తండ్రి వారసత్వాన్ని, ఆయన ఆశయాలను పాటిస్తూ పేద ప్రజల సమస్యల కోసం కృషి చేశారు. అల్లుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. జీవితాంతం ప్రజాసమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తూ సోషలిస్టు జీవితాన్ని గడిపిన ఆయన ధన్యజీవి. ఆయన స్ఫూర్తి నేటి యువతకు దీప్తి!

– కాగితాల రాజశేఖర్, విశ్రాంత ప్రభుత్వోద్యోగి

(రేపు గుంటూరులో మోదుగుల పాపిరెడ్డి సంస్మరణ సభ)

దైవపుత్రుని విజయోత్సవం

విశ్వవ్యాప్తంగా విస్తరించిన క్రైస్తవ సమాజం ఈస్టర్ ఆదివారానికి ముందుగా వచ్చే ఆదివారాన్ని 'పామ్ సండే' లేదా 'మట్టల ఆదివారం'గా జరుపుకొంటారు. ఏసు మరణానికి ముందు యెరూషలేమును విజయోత్సాహంతో దర్శించే ఆదివారమే మట్టల ఆదివారం. ఆనాటికి సాధారణ ప్రజావాహనమైన గాడిదపై ఏసు ఆసీనుడై వచ్చేటప్పుడు అశేష జనసమూహం 'హోసన్నా... హోసన్నా' అని జయజయ ధ్వానాలు చేశారు. హోసన్నా అనే హీబ్రూ భాషా పదానికి జయము, రక్షించు, కాపాడు అనే అర్థాలున్నాయి. యెరూష లేము దారిపొడవునా వస్త్రాలు పరచి, ఖర్జూరపు మట్టలతో వీధులు అలంకరించి ఏసుకు స్వాగతం పలుకుతారు. ఈ ఆచారం ఆనాటి రాజులకు, యాజకులకు గౌరవసూచకంగా చేసే వేడుకల్లో ఒక భాగం. దీనికి మూలం క్రీస్తుపూర్వం 1010 సంవత్సరాల క్రితం దావీదు మహారాజు రాసిన 118వ కీర్తన 25వ వచనంలోనూ, క్రీస్తుపూర్వం 520 ప్రాంతంలో జకర్యా ప్రవక్త రాసిన గ్రంథం 9:9లో స్పష్టంగా ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర దక్షిణ భారతదేశమంతా ఈత మట్టలు, కొబ్బరి ఆకుల పూలతో అలంకరణ చేసి హోసన్నా అని పాటలు పాడుతూ ఏసునాథుని స్మరిస్తారు.



మట్టల ఆదివారం తర్వాత వచ్చే సోమవారం ఏసు యెరూషలేము దేవాలయం దర్శిస్తాడు. అక్కడ ఆల యంలో దుర్వ్యాపారాలు, అనైతిక కార్యాలు జరిపే వారిని, 'నా తండ్రి ఇంటిని అపవిత్రం చేస్తున్నారు' అని గద్దించి తరిమి వేస్తాడు. ఆపై దేవాలయాన్ని శుద్ధీకరిస్తాడు. ఆ ఘటన పురస్కరించుకుని సోమవారాన్ని 'శుద్ధీకరణ సోమవారం'గా పిలుస్తారు.

ఏసు చేసిన పనికి వ్యాపారులు, యాజకులు, పరిశయులు, హేరోదుతో కలిసి ఏసును సంహరించాలని మూకుమ్మడిగా కుట్ర చేస్తారు. అందువల్ల మంగళవారాన్ని 'అవిశ్వాస దినం'గా, కుట్రచేసిన మంగళవారంగా పిలుస్తారు. బుధవారం నాడు ఏసు శిష్యుల్లో ఒకడయిన ఇస్కరియోతు యూదా అనేవాడికి డబ్బు ఆశచూపి గురువు అయిన ఏసును బంధించి హత మార్చాలని ప్రయత్నిస్తారు. అందువల్ల బుధవారాన్ని 'యూదా ద్రోహదినం'గా పేర్కొంటారు. తర్వాత వచ్చే గురు వారాన్ని 'మాండే థర్స్‌డే' లేదా 'నియమ గురువారం'అం టారు. ఈ గురువారం రాత్రి ఏసు తన శిష్యులందరితో కలిసి చివరి విందు చేస్తాడు. దీన్నే 'లాస్ట్ సప్పర్' అంటారు. ఈ ఘటనకు గుర్తుగా ప్రతి క్రైస్తవ సమావేశంలో ఏసు శరీరానికి గుర్తుగా రొట్టెను, రక్తానికి గుర్తుగా ద్రాక్షరసం స్వీకరిస్తారు. దీన్ని ఏసు నియమించిన 'కొత్త నిబంధన ఆచారం' అని కూడా అంటారు.

అనంతరం ఏసు సిలువపై మరణించిన రోజును 'గుడ్ ఫ్రైడే' లేదా 'శుభ శుక్రవారం' అని అంటారు. అనంతరం వచ్చే శని వారాన్ని 'లాజరస్ సాటర్ డే' అంటారు. బేతనియకు చెందిన లాజరస్ అనే వ్యక్తిని, చనిపోయిన నాలుగు రోజుల తర్వాత ఏసు ప్రార్థించి పునర్జీవం కలిగించిన సంద ర్భాన్ని పురస్కరించుకున్న ఘటన ఆధారంగా లాజరస్ సాటర్ డే అంటారు. తర్వాతి రోజైన ఆదివారం ఏసు పునర్జీవితుడై మరణించి తిరిగి లేచిన రోజున 'ఈస్టర్ సండే' లేదా 'పునరుద్ధాత దినోత్సవం' అంటారు. మట్టల ఆదివారం నుంచి ఈస్టర్ ఆదివారం వరకూ ఉండే వారం రోజులు 'పరిశుద్ధ వారం'గా ఆచరిస్తారు. మరణించిన పితరుల సమాధులు శుభ్రం చేసి, స్మరించుకుని ప్రార్థనలు చేసి నివాళి ఘటిస్తారు. ఈ కాలమంతా దైవధ్యానంతో శారీరక, మానసిక క్షాళన గావిం చుకుని మనసా వాచా కర్మణా శుచి గావించడం ఆధ్యాత్మిక జీవితంలో ఒక భాగం.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, క్రైస్తవ సాహిత్య పరిశోధకులు, 98481 23655

(నేడు 'పామ్ సండే')

శ్రీవారి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ సుందర్ శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

ముగిసిన గవర్నర్ చీరాల పర్యటన

చీరాల టౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చీరాల పర్యటన ముగిసింది. శుక్రవారం వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయన శనివారం ప్రత్యేక కాన్వాయ్‌లో విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. వాడరేవులోని ఐటీసీ అతిథి గృహంలో బస చేసిన గవర్నర్‌ను బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ కె.గోపికృష్ణ, పలువురు పోలీసు అధికారులు గవర్నర్‌కు వీడ్కోలు పలికారు.

ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



తిరుమల: విశాఖకు చెందిన మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు శనివారం శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. సంబంధిత డీడీని తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు.

75 ఏళ్ల వయసులో.. మూడో పీహెచ్‌డీ



వెంపటి శ్రీరామమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ మారుతీనగర్‌కు చెందిన వెంపటి శ్రీరామమూర్తి ఏడున్నర దశాబ్దాల వయసులోనూ మూడో పీహెచ్‌డీ అందుకున్నారు. ఇంగ్లిష్‌లో ఆయన చేసిన పరిశోధనకు మణిపూర్‌లోని బిర్ టికెన్ డ్రాజిట్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. గతంలో మాలవి దేశం సెంట్రల్ క్రిస్టియన్ యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్‌లోనే చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అందుకున్నారు. కాగా ఆయన జ్యోతిష శాస్త్రంపై చేసిన పరిశోధనలకు శ్రీలంకలోని జ్యోతిష విశ్వ విద్యాపీఠం నుంచి తొలిసారిగా డాక్టరేట్ అందుకున్నారు. శ్రీరామమూర్తి గతంలో శాతవాహన కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా చేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం నగర శివారులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

రొయ్యల శుద్ధి కంపెనీలో గ్యాస్ లీక్

10 మంది కార్మికులకు అస్వస్థత

తోటపల్లిగూడూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం అనంతపురం గ్రామంలోని రొయ్యల శుద్ధి కంపెనీలో శనివారం అమ్మోనియా గ్యాస్ లీకైన ఘటనలో 10 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆపరేటర్ ఎం.సురేశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. యూనిట్లో గ్యాస్ లీకైన వెంటనే కార్మికులు బయటకు పరుగులు తీశారు. అప్పటికే ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు గ్యాస్ ప్రభావానికి లోనవడంతో అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయారు. వీరందరినీ కంపెనీ యాజమాన్యం చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించింది. ఘటనపై ఆర్డీఓ అనూష వివరాలు సేకరించారు.

ఆలోచించడంలో 'ఫెయిల్' అయ్యారు

ఇద్దరు బలవన్మరణం • మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఫెయిల్ అయితే మరో అవకాశముంటుంది. కాస్త కష్టపడితే గట్టెక్కవచ్చన్నది ఆలోచించలేకపోతున్నారు. పరీక్షలంటే భయమొద్దు. పరీక్షలే జీవితం..మార్కులే ప్రామాణికమంటూ యువ మనసుల్లో చొప్పిస్తున్న బలవంతపు ధోరణులు చివరికి వారిని చిదిమేస్తున్నాయి. పది, ఇంటర్..ఇలా పరీక్షల ఫలితాలు వెలువడుతున్నాయంటే చాలు..ఎక్కడో ఏదో దారుణం. కన్నవారికి తీరని శోకం. తాజాగా ఇంటర్ ఫలితాలు శనివారం వెలువడిన వేళ..ఉత్తీర్ణులు కాలేకపోయామనే మనస్తాపంతో రాష్ట్రంలో ఇద్దరు విద్యార్థులు అర్థంతరంగా తనువు చాలించగా, మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

ఫిజిక్స్‌లో 10 మార్కులొచ్చాయని..



చరణ్‌తేజ్ (ఫైల్)

తగరపువలస: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పాస్ కాలేదనే బాధతో గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేటకు చెందిన విద్యార్థి గుండు చరణ్‌తేజ్ (18) ఇంట్లో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫలితాలను చూసిన విద్యార్థి అన్నయ్య ఫోన్ చేసి తమ్ముడుకు చెప్పాడు. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేయగా స్పందించలేదు. కంగారుపడి ఇంటికి వచ్చి చూడగా చరణ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. తండ్రి జి.ఎన్.ఎస్.ప్రసాద్ సివిల్ కాంట్రాక్టర్. తల్లి అరుణకుమారి గృహిణి. స్థానిక కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన చరణ్‌కు ఫిజిక్స్‌లో 10 మార్కులు రావడంపై అతని అన్నయ్య ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రీ వాల్యూయేషన్ లేదా మళ్లీ పరీక్ష రాసుకోవడమో జరిగేదని, ఇంతలోనే తన తమ్ముడు ప్రాణం తీసుకున్నాడని చరణ్ సోదరుడు కన్నీరుమున్నీరయ్యాడు.

ఆశించిన ఫలితం రాలేదని..



మస్తాన్ (ఫైల్)

బండి ఆత్మకూరు: నంద్యాల జిల్లా బండిఆత్మకూరుకు చెందిన జాలె.మౌలాలి, సుబ్బమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. మౌలాలి ఓ ప్రైవేటు స్కూల్లో అటెండర్. సుబ్బమ్మ స్థానిక కస్తూరిబా గాంధీ కళాశాలలో ఆయాగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు చిన్న మస్తాన్(16) నంద్యాల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణుడు కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ప్రాణం తీసుకున్నాడు.. తండ్రి మౌలాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్ మోహన్ కేసు నమోదు చేశారు.

ఆదోనిలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లా ఆదోని పట్టణం అరుణజ్యోతినగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అవడంతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ద్వితీయ సంవత్సరంలో రెండు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న విద్యార్థినిని కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది.

విద్యుదాఘాతంతో ముగ్గురి దుర్మరణం

తూర్పు గోదావరి జిల్లాలో విషాదం





బలసాని అన్నవరం, జాజుల వెంకటేశ్వరరావు, ఆకుల శ్రీరాములు (ఫైల్)

కోరుకొండ: విద్యుదాఘాతానికి గురై తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం కాపవరం గ్రామానికి చెందిన జాజుల వెంకటేశ్వరరావు (55), ఆకుల శ్రీరాములు (30), బలసాని అన్నవరం అలియాస్ సత్యనారాయణ (45) శనివారం ధాన్యం బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే ఐరన్ కన్వేయర్ (ట్రాలీ)ను గోడౌన్ నుంచి మిల్లులోకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు ఆ ట్రాలీ తగిలింది. దీంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురైన ఆ ముగ్గురూ ఒక్కసారిగా కింద పడి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఇతర కార్మికులు శ్రీరంగం నాగ వెంకటహరి, తూము సీతయ్య, ఆకుల నల్లయ్య కూడా గాయపడ్డారు. వీరు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్ కేసు నమోదు చేశారు. సీఐ సత్యకిషోర్ దర్యాప్తు చేస్తున్నారు.

కన్నులపండువగా కోదండరాముడి రథోత్సవం



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామి రథోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతారామలక్ష్మణులు రథాన్ని అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించారు. కోలాటాలు, డప్పుల నడుమ భక్తులు శ్రీరామ నామం జపిస్తూ రథాన్ని ముందుకు లాగారు. బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమివ్వనుండగా, రాత్రికి అశ్వవాహనంపై స్వామి ఊరేగుతారు. – ఒంటిమిట్ట

వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు



తిరుమలలో మూడురోజులుగా నిర్వహిస్తోన్న సాలకట్ల వసంతోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పతో పాటు శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారు, శ్రీరుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఒకే వేదికపై సమస్త మూలవరులను భక్తులు దర్శించారు. ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడసేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా టీటీడీ రద్దుచేసింది. – తిరుమల

వెరైటీ వెడ్డింగ్ కార్డు



తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడూరి లక్ష్మీనారాయణ తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను వినూత్నంగా రూపొందించారు. పెళ్లి విందులో వడ్డించే వంటకాల జాబితాను అందులో ప్రచురించారు. విందు సమయంలో ఆహార పదార్థాల వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ ప్రచురించారు. 'దయచేసి ఎవరూ అన్యథా భావించవద్దు అని వినయపూర్వక ప్రార్థన' అంటూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. – కొవ్వూరు

'గడప గడపకు..' ఆ బాలికకు మలుపు!

- చదువు మానేసిన బాలికకు కొత్త జీవితం
- జగన్ ప్రభుత్వ కార్యక్రమంతో ఇంటర్‌లో చేరిక
- 966 మార్కులతో ఇప్పుడు కర్నూలు జిల్లాలో బైపీసీ టాపర్



తల్లిదండ్రులు హనుమంతమ్మ, శీనప్పతో నిర్మల

ఆస్పరి: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎంతో మందికి ఆశాజ్యోతి వెలిగించిందనడానికి చక్కటి ఉదాహరణ.. నిర్మల. చదువు మానేసిన ఈ బాలిక జీవితాన్ని, జగన్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం మలుపు తిప్పింది. ఇంటర్మీడియట్ బైపీసీలో 1000కి 966 మార్కులతో ఇప్పుడు కర్నూలు జిల్లాలో ఆ బాలిక గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా సామాన్యుల జీవితాల్లో వచ్చే మార్పుకు ఇది గొప్ప ఉదాహరణ. ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని చెబుతున్న ఈ బాలిక వివరాల్లోకి వెళితే, ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన శీనప్ప, హనుమంతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. వ్యవసాయ పనులు చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. చిన్న కుమార్తె నిర్మల 2021–22లో పెద్దహరివాణం జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో 10వ తరగతిలో 537 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు అంతటితో చదువు మాన్పించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'.. ప్రోత్సాహం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సరిగ్గా రెండేళ్ల క్రితం అప్పటి ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి పెద్దహరివాణంలో పర్యటించారు. ఆ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటుండగా, విద్యార్థిని విషయం తెలిసి చలించిపోయారు. 'నాకు బాగా చదువుకోవాలని ఉంది' అని బాలిక నిర్మల చెప్పడంతో అప్పటికప్పుడు ఈ విషయాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ జి.సృజన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కూడా నిర్మలను భుజంతట్టి ప్రోత్సహించారు. ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియట్ బైపీసీలో చేర్పించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలిక 440కి 420 మార్కులు సాధించింది. తాజాగా విడుదలైన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000కి 966 మార్కులు సాధించి, జిల్లాలో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. జిల్లాలో 26 కస్తూర్బా పాఠశాలలు ఉండగా.. బైపీసీ గ్రూపు ఆస్పరిసహా ఎనిమిది పాఠశాలల్లో ఉంది. చక్కటి ఫలితాలతో నిర్మల, బాలికలకు ఆదర్శంగా నిలిచినట్లు ఆస్పరి కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శారూన్ స్మైలీ పేర్కొన్నారు.

భారతీయులే లక్ష్యంగా ట్రంప్ మరో బాంబు

గ్రీన్‌కార్డుదారులైనా, హెచ్-1బి వీసాదారులైనా అనుక్షణం ఐడీ వెంట ఉంచుకోవాల్సిందే

- మర్చిపోతే జరిమానాలు, కఠినచర్యలు
- అమల్లోకి వచ్చేసిన కొత్త రూల్స్

అమెరికాలోని మనోళ్లపై తెంపరి ట్రంప్ మరో బాంబు పేల్చారు. గ్రీన్‌కార్డు, హెచ్1బీ వీసాలపై అక్కడ చట్టబద్ధంగా నివసిస్తున్న భారతీయులే లక్ష్యంగా మరో వేధింపుల పర్వానికి తెర తీశారు. వాళ్లు నిరంతరం తమ ఐడీ కార్డును విధిగా వెంట ఉంచుకోవాల్సిందేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు కఠిన నిబంధనను శుక్రవారం (ఏప్రిల్ 11) నుంచే అమల్లోకి తెచ్చింది. లేదంటే జరిమానాలతో పాటు కఠినచర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఇంకా ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోని అక్రమ వలసదారులను గుర్తించడంలో ప్రభుత్వానికి దోహదపడుతుందంటూ అక్కడి న్యాయస్థానం కూడా ఈ కఠిన నిబంధనకు పచ్చజెండా ఊపింది. అమెరికా పౌరసత్వంలేని 18 ఏళ్లు నిండిన వారంతా తమ చట్టబద్ధ నివాసానికి సంబంధించిన ఐడీ కార్డును 24 గంటలూ వెంట ఉంచుకోవాల్సిందేనని కొత్త నిబంధన సూచిస్తోంది. విదేశీయుల నమోదు చట్టం (1940)లోని ఈ విదేశీయుల నమోదు ఆవశ్యకత (ఏఆర్ఆర్) నిబంధనలు గతంలో ఉన్నవే. కానీ వాటిని ఏనాడూ అమలుచేయలేదు. కోర్టు అనుమతితో కోట్ల మంది అక్రమవలసదారులే లక్ష్యంగా ఈ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ట్రంప్ సర్కారు నిర్ణయించింది. హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి క్రిస్టీ నోయెమ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ మేరకు వెల్లడించారు. అమెరికాలో ప్రస్తుతం దాదాపు 54 లక్షల మంది భారతీయులున్నారు. 2022 గణాంకాల ప్రకారం 2.,2 లక్షల మంది భారతీయులు అక్కడ అక్రమంగా నివసిస్తున్నారు. అయితే మొత్తం అక్రమ వలసదారుల్లో వీరు కేవలం 2 శాతమేనని సమాచారం.



ఏమిటీ నిబంధనలు ?

అక్రమంగా వలస వచ్చిన విదేశీయులు, చాన్నాళ్లుగా అమెరికాలో అక్రమంగా ఉంటూ ఇప్పటిదాకా వివరాలు నమోదు చేసుకోని వలసదారులను గుర్తించి దేశం నుంచి బహిష్కరించడమే లక్ష్యంగా ఈ కఠిన నిబంధనలను తెచ్చారు. వాటి ప్రకారం అమెరికాకు వచ్చి 30 రోజులకు మించి ఉండాలనుకునే వాళ్లు తమ వీసా, ఐడీ కార్డులను కచ్చితంగా అనుక్షణం వెంట ఉంచుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో అధికారులు సోదాలు, తనిఖీల వేళ ప్రశ్నిస్తే వెంటనే వాటిని చూపించాలి. లేదంటే జరిమానాలు, ఇతర కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదు. దీని ప్రకారం అమెరికా పౌరసత్వం లేని 18 ఏళ్లు నిండిన వాళ్లంతా ఐడీ కార్డును వెంటే ఉంచుకోవాలి. అమెరికా పౌరులు కాని 14 ఏళ్లు నిండిన టీనేజర్ వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలి. 14వ పుట్టినరోజుకు ముందు నమోదు చేసినా మళ్లీ కొత్తగా నమోదు చేసుకుని మరోసారి వేలిముద్రల వంటివి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు టీనేజర్ 325ఆర్ దరఖాస్తు సమర్పించాలి. వారి తల్లిదండ్రులు సైతం 30 రోజుల్లోపు కచ్చితంగా నమోదు చేయించుకోవాలి.

..అయినా ఉండనివ్వరు

మరోసారి నమోదు చేసుకున్నా వారిని అమెరికాలో ఉండనిచ్చే ప్రసక్తే లేదని ట్రంప్ సర్కారు స్పష్టం చేసింది. అక్రమవలసదారుల వాస్తవిక సంఖ్యను తేల్చడం, వారిని కనిపెట్టి వెళ్లగొట్టడమే రీ రిజిస్ట్రేషన్ లక్ష్యమని హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు చెప్పారు. తాజాగా నమోదు సమయంలో కొత్త అడ్రస్, వ్యక్తిగత, కుటుంబ వివరాలు తెలపాల్సి ఉంటుంది. వాటిని కావాలని మార్చి రాస్తే స్వదేశానికి బదులు జైలుకు పంపవచ్చని కూడా తెలుస్తోంది. కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాక కూడా పేర్లను నమోదు చేయనివారు సోదాలు, తనిఖీల్లో దొరికితే భారీ జరిమానా, ఆర్నెల్ల దాకా జైలుశిక్ష వేస్తారు.

అడ్రస్ అప్‌డేట్ చేయకుంటే 5 వేల డాలర్ల జరిమానా

గ్రీన్‌కార్డు, వీసాదారులు మరో చోటుకు మారితే కొత్త చిరునామాను ప్రభుత్వానికి కచ్చితంగా తెలియజేయాలి. 10 రోజుల్లోపు తెలపని పక్షంలో 5,000 డాలర్ల జరిమానా విధిస్తారు. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాక గ్రీన్‌కార్డు, హెచ్-1బీ వీసాదారులు తమ సమాచారాన్ని మరోసారి నమోదు చేయించుకోవాల్సిన పనిలేదు. కాకపోతే గ్రీన్ కార్డ్, హెచ్1బీ ఐడీ కార్డును మాత్రం ఎప్పుడూ విధిగా వెంట ఉంచుకోవాల్సిందే.

\- సాక్షి, నేషనల్ డెస్క్

రాష్ట్రపతికీ మూడు నెలలే

బిల్లులపై ఆలోపు నిర్ణయం తీసుకోవాలి

- స్పష్టమైన గడువు నిర్దేశించిన సుప్రీంకోర్టు
- లేదంటే రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించవచ్చు
- ఈ విషయమై రాష్ట్రపతికి వీటో అధికారాల్లేవు
- ఆ నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతం కావు
- తమిళనాడు గవర్నర్ కేసులో చరిత్రాత్మక తీర్పు
- రాష్ట్రపతికి గడువు నిర్దేశించడం ఇదే తొలిసారి



న్యూఢిల్లీ: గవర్నర్ల నుంచి ఆమోదం నిమిత్తం రాష్ట్రపతి వద్దకు వచ్చే బిల్లుల విషయమై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వాటిపై రాష్ట్రపతి మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌కు సంబంధించిన కేసుపై ఇటీవల వెలువరించిన తీర్పులో ఈ మేరకు స్పష్టం చేసింది. రాష్ట్రపతికి సర్వోన్నత న్యాయస్థానం ఇలా గడువు నిర్దేశించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. మూణ్నెల్లు దాటినా సరైన కారణాలు చూపకుండా బిల్లులపై రాష్ట్రపతి ఏ నిర్ణయమూ తీసుకోని పక్షంలో సంబంధిత రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, ''బిల్లుల విషయంలో 201 ఆర్టికల్ కింద రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతమేమీ కాదు. వాటిని కోర్టులు సమీక్షించవచ్చు''అని కూడా పేర్కొనడం విశేషం! బిల్లులపై నిర్ణయం విషయంలో గవర్నర్లకు స్పష్టమైన గడువు నిర్దేశిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఎం.మహదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న చరిత్రాత్మక తీర్పు వెలువరించడం తెలిసిందే. ''అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవర్నర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి. రెండోసారీ పంపితే నెలలోపు విధిగా ఆమోదించాల్సిందే తప్ప రాష్ట్రపతికి పంపడం చట్టవిరుద్ధం''అని స్పష్టం చేసింది. అలా ఈ విషయమై గవర్నర్‌కు తొలిసారిగా గడువు విధించింది. బిల్లుల విషయమై మూడు నెలల గడువును రాష్ట్రపతికి కూడా వర్తింపజేయడం విశేషం. ఆ తీర్పు తాలూకు 415 పేజీల పూర్తి ప్రతిని సుప్రీంకోర్టు శుక్రవారం వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచింది.

రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడాలి

ఆర్టికల్ 201 ప్రకారం గవర్నర్ తన వద్దకు పంపిన బిల్లును రాష్ట్రపతి ఆమోదించవచ్చు, లేదా పెండింగ్‌లో పెట్టవచ్చు. అది ఎంతకాలమన్న విషయమై అందులో రాజ్యాంగం గడువూ నిర్దేశించలేదు. అంతమాత్రాన బిల్లులపై నిరవధికంగా ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఉండేందుకు రాష్ట్రపతికి 'పాకెట్ వీటో'అధికారాలేమీ ఉండబోవని ధర్మాసనం స్పష్టం చేసింది. ''రాష్ట్రపతి తన వద్దకొచ్చిన బిల్లుపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందే (షల్ డిక్లేర్) అని ఆర్టికల్ 201లో స్పష్టంగా పేర్కొన్నారు. దానికి ఆమోదం తెలపడమో, పెండింగ్‌లో పెట్టడమో ఏదో ఒకటి తప్పనిసరన్నదే దాని ఉద్దేశం. అంతే తప్ప రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అదే రాజ్యాంగం తాలూకు స్ఫూర్తికి విరుద్ధంగా ఉపయోగించవచ్చని కాదు. అదీగాక ఏ అధికారమైనా వాడుకునే విషయంలోనైనా సముచిత కాలావధి తప్పనిసరి. చట్టపరంగా కూడా అదే సరైనది. ఈ సాధారణ న్యాయసూత్రానికి 201 ఆర్టికల్ కింద రాష్ట్రపతికి సంక్రమించిన అధికారాలు కూడా అతీతం కాదు''అని పేర్కొంది. ''ఏదైనా బిల్లుపై రాష్ట్రపతి నిర్ణయం మూడు నెలలకు మించి ఆలస్యమయ్యే పక్షంలో అందుకు తగిన కారణాలను విధిగా నమోదు చేసి సంబంధిత రాష్ట్రానికి తెలియపరచాలి. రాష్ట్రాలు కూడా వాటికి సరైన వివరణలు, సమాధానాలివ్వడం ద్వారా ఈ విషయంలో పూర్తిగా సహకరించాలి''అని స్పష్టం చేసింది.

కోర్టుల పాత్ర పోషించొద్దు

చట్టసభలు రూపొందించే బిల్లుల రాజ్యాంగబద్ధత విషయంలో కూడా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఆ కారణంగా బిల్లులను పెండింగ్‌లో పెట్టే పక్షంలో వాటి రాజ్యాంగబద్ధతను తేల్చాల్సింది సుప్రీంకోర్టు మాత్రమే. కనుక ఆర్టికల్ 143 ప్రకారం ఈ అంశాన్ని విధిగా సుప్రీంకోర్టుకు నివేదించాల్సి ఉంటుంది''అని స్పష్టం చేసింది. అంతే తప్ప వాటిపై ప్రభుత్వాలే నిర్ణయాలు తీసుకుని కోర్టుల పాత్ర పోషించడానికి వీల్లేదని పేర్కొంది. ''పక్తు న్యాయపరమైన అంశాలివి. ఇలాంటి వాటిలో కార్యనిర్వాహక విభాగం వేలు పెట్టడానికి వీల్లేదని చెప్పడానికి మేం ఎంతమాత్రమూ సంశయించడం లేదు. ఎందుకంటే బిల్లుల రాజ్యాంగబద్ధతపై లోతుగా పరిశీలన జరిపి తగిన చర్యలను సిఫార్సు చేసే అధికారం కేవలం రాజ్యాంగ ధర్మాసనాలది మాత్రమే''అని వివరించింది.



కొత్త సుంకాల నుంచి ఎలక్ట్రానిక్స్‌కు మినహాయింపు

- ట్రంప్ సర్కారు తాజా ప్రకటన
- జాబితాలో స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌లాప్‌లు
- చాలావరకు విదేశాల్లో తయారయ్యేవే
- అమెరికా కంపెనీల ప్రయోజనాలే లక్ష్యం!

వాషింగ్టన్: ప్రతీకార సుంకాల విషయంలో ట్రంప్ సర్కారు మరో యూ టర్న్ తీసుకుంది. 20 రకాల కీలక ఎలక్ట్రానిక్ వస్తువులను కొత్త సుంకాల జాబితా నుంచి మినహాయిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. అన్ని దేశాల ఉత్పత్తులపైనా అమెరికా విధించిన 10 శాతం బేస్‌లైన్ టారిఫ్ నుంచి కూడా వీటిని మినహాయించినట్టు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం పేర్కొంది. చైనా దిగుమతులపై విధించిన 145 శాతం సుంకాలు కూడా వీటికి వర్తించబోవు. టారిఫ్‌ల దెబ్బకు అమెరికా కంపెనీలు నష్టపోకుండా చూడటమే దీని వెనక ప్రధానోద్దేశంగా కన్పిస్తోంది. స్మార్ట్‌ఫోన్లు మొదలుకుని ల్యాప్‌లాప్‌లు, సెమీ కండక్టర్ చిప్‌ల దాకా ఈ జాబితాలో ఉన్నాయి. వీటిలో చాలా వస్తువులు అమెరికా బయట తయారయ్యేవే. హెచ్చు టారిఫ్‌ల దెబ్బకు వీటి ధరలు చుక్కలనంటుతాయంటూ అమెరికా టెక్ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడటం విశేషం. దీనితో యాపిల్, సామ్‌సంగ్ వంటి మొబైల్ దిగ్గజాలతో పాటు ఎన్‌విడియా వంటి చిప్ తయారీ కంపెనీలకు లబ్ధి చేకూరనుంది. అయితే ఇది తాత్కాలిక నిర్ణయమేనని అమెరికా ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వాటిపై త్వరలో ఎంతోకొంత టారిఫ్ ప్రకటించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యాపిల్ ఉత్పత్తుల్లో ఏకంగా 80 శాతానికి పైగా చైనాలో, మిగతా మొత్తం భారత్‌లో తయారవుతాయని అంచనా.

మినహాయింపు జాబితాలో...

స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డ్రైవ్‌లు, టెలికాం పరికరాలు, చిప్-సెమీ కండక్టర్ తయారీ యంత్రాలు, రికార్డింగ్ పరికరాలు, డేటా ప్రాసెసింగ్ యంత్రాలు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు విడిభాగాలు, ఫ్లాట్ ప్యానల్ మానిటర్లు

రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే చట్టాలుగా ఆ 10 బిల్లులు

స్టాలిన్ సర్కారు గెజిట్ • దేశ చరిత్రలోనే తొలిసారి

చెన్నై/న్యూఢిల్లీ: తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్.ఎన్.రవికి మధ్య వివాదానికే గాక అంతిమంగా సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పుకు కారణమైన 10 బిల్లులు ఎట్టకేలకు చట్టంగా మారాయి. ఆ క్రమంలో మరో సంచలనానికి కారణమయ్యాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా గవర్నర్ గానీ, రాష్ట్రపతి గానీ ఆమోదించకుండానే చట్టంగా మారిన బిల్లులుగా చరిత్ర సృష్టించాయి! ఇది భారత శాసననిర్మాణ చరిత్రలోనే కనీవిని ఎరుగని సంఘటనగా నిలిచిపోనుంది. ఆ 10 బిల్లులను అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపినా గవర్నర్ ఆమోదముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, అది చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చడం తెలిసిందే. వాటికి గవర్నర్ ఆమోదం లభించినట్టుగానే పరిగణిస్తున్నట్టు పేర్కొంటూ ఆర్టికల్ 142 కింద తనకు సంక్రమించిన విశేషాధికారాల ద్వారా ఏప్రిల్ 8న తీర్పు వెలువరించింది. దాంతో గవర్నర్ గానీ, రాష్ట్రపతి గానీ లాంఛనంగా ఆమోదించకుండానే సదరు 10 బిల్లులకు స్టాలిన్ సర్కారు చట్టబద్ధత కల్పించగలిగింది. తీర్పు పూర్తి ప్రతి శుక్రవారం రాత్రి అందుబాటులోకి రాగానే ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగానే వాటికి చట్టరూపం కల్పిస్తున్నట్టు అందులో స్పష్టంగా పేర్కొంది. వీటిలో తమిళనాడు వర్సిటీలు, ఫిషరీస్ వర్సిటీ, వైస్ చాన్స్‌లర్ల బిల్లులు తదితరాలున్నాయి. దీన్ని చరిత్రాత్మక ఘటనగా డీఎంకే అభివర్ణించగా చరిత్ర సృష్టించడం తమ పార్టీ నైజమంటూ సీఎం స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

రాజకీయాలకు అతీతంగా ఉండాలి

రాష్ట్రస్థాయిలో ఒక బిల్లు చట్టంగా రూపొందాలంటే ముందుగా అసెంబ్లీ, తర్వాత గవర్నర్ ఆమోదం పొందాలి. గవర్నర్ దాన్ని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టవచ్చు. రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చు. లేదంటే అసెంబ్లీ పునఃపరిశీలన నిమిత్తం తిప్పి పంపవచ్చు. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా గవర్నర్ విధిగా అనుమతి తెలిపాల్సిందే. అలాగాక రెండోసారి అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లులను తమిళనాడు గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపడాన్ని స్టాలిన్ సర్కారు 2023లో సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై కోర్టు గత మంగళవారం తీర్పు వెలువరించింది. గవర్నర్ చర్య రాజ్యాంగవిరుద్ధమని, ఆర్టికల్ 200కు ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. గవర్నర్ పునఃపరిశీలనకు వచ్చిన 2023 నవంబర్ 18వ తేదీనే బిల్లులకు ఆమోదం లభించినట్టే పరిగణిస్తున్నట్టు పేర్కొంది. అంతేగాక, ''ఇకపై గవర్నర్లు తమ వద్దకొచ్చే బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి. అదే బిల్లు రెండోసారి వస్తే నెలలోపు ఆమోదం తెలిపి తీరాలి'' అని గడువు విధిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. తద్వారా గవర్నర్ వ్యవస్థను తక్కువ చేయడం తమ ఉద్దేశం కాదని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. ''ఆ స్థానానికి ఉండే అత్యున్నత గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన గురుతర బాధ్యత గవర్నర్లపై ఉంటుంది. ప్రథమ పౌరునిగా రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి అని ప్రమాణం చేశాక రాజకీయ మొగ్గుదలలు తదితరాలకు అతీతంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా మెలగాలి. అలాగాక ప్రజలకు ప్రతిరూపమైన అసెంబ్లీ నిర్ణయాలకు విరుద్ధంగా నడుచుకోవడమంటే చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించడమే'' అని స్పష్టం చేసింది.



తమిళనాడు సీఎం స్టాలిన్

చైనాతో జుకర్‌బర్గ్ కుమ్మక్కు

- అక్కడ వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారు
- కమ్యూనిస్ట్ సర్కార్ చేతికి ఫేస్‌బుక్ అమెరికా యూజర్ల డేటా?
- మాజీ ఉన్నతాధికారిణి సంచలన ఆరోపణ

వాషింగ్టన్: చైనాతో అమెరికా ఓవైపు టారిఫ్‌ల అంశంలో వాణిజ్య యుద్ధంచేస్తుంటే మరోవైపు అమెరికా పారిశ్రామికవేత్త, ఫేస్‌బుక్, మెటా సంస్థల అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని మెటా మాజీ ఉన్నతాధికారిణి సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా జాతీయ భద్రతను పణంగా పెడుతూ 'మెటా'వినియోగదారుల డేటాను చైనా చేతుల్లో పెట్టేందుకు జుకర్‌బర్గ్ తెగించారని మాజీ మెటా అంతర్జాతీయ విధానాల మహిళా డైరెక్టర్ సారా విన్ విలియమ్స్ ఆరోపించారు. లక్షల కోట్ల విలువైన చైనా సోషల్‌మీడియా మార్కెట్‌లో తన వ్యాపారాన్ని విస్తరించడమే ధ్యేయంగా జుకర్‌బర్గ్ అక్కడి కమ్యూనిస్ట్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటున్నారని సారా తెలిపారు. చైనాలో 18 బిలియన్ డాలర్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించాలని జుకర్‌బర్గ్ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆమె చెప్పారు. చైనాలో ఏదైనా ప్రభుత్వ వ్యతిరేక అంశం, వివాదం, ఉద్యమం విస్తృతమై అది దేశవ్యాప్తంగా విస్తరించేదాకా ఆ విషయం ప్రపంచదేశాలకు తెలియకుండా జుకర్‌బర్గ్ తన అనుబంధ సంస్థలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్‌లలో తొక్కిపెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారని సారా వెల్లడించారు. అమెరికా యూజర్ల డేటాపైనా సమీక్షా అధికారం చైనాకు దఖలుపడనుందని ఆమె మరో సంచలన ఆరోపణ చేశారు. సంబంధిత వివరాలను ఆమె తన ఆత్మకథ 'కేర్‌లెస్ పీపుల్'పుస్తకంలో పేర్కొన్నారు. ప్రజావేగులా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అమెరికాలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అనైతిక వ్యాపారానికి సంబంధించి ఆరోపణలు వెల్లువెత్తడంతో అమెరికా కాంగ్రెస్ ఎదుట మెటా విచారణను ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే సారా ఇటీవల యూఎస్ కాంగ్రెస్ ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని వినిపించారు. ఈ వాంగ్మూలంలోనే సారా పలు అంశాలను బయటపెట్టారు. అయితే ఉద్యోగంలో సరైన పనితీరు కనబర్చనికారణంగా సారాను 2017లోనే తొలగించామని మెటా చెబుతోంది. న్యూజిలాండ్ మాజీ దౌత్యవేత్త అయిన సారా 2011లో ఫేస్‌బుక్‌లో చేరారు.

యూపీఐ సేవల్లో తీవ్ర అంతరాయం

శనివారం మధ్యాహ్నం సమస్య తీవ్రం

- పరిష్కార చర్యలు తీసుకుంటున్నామన్న ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ: భారత్‌లో నిత్యజీవిత కృత్యంగా మారిపోయిన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. శనివారం మధ్యాహ్నం దేశవ్యాప్తంగా ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో తీవ్ర అవాంతరం ఏర్పడింది. జిరాక్స్ తీస్తే చెల్లించే రెండు రూపాయల మొదలు వ్యక్తిగత చెల్లింపు కింద ఏకంగా రూ.1 లక్ష దాకా నిత్యం నిరాటంకంగా కొనసాగుతున్న డిజిటల్ పేమెంట్లు ఆగిపోవడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల్లో ఇలా సమస్యలు తలెత్తడం గత నెలరోజుల్లో ఇది నాలుగోసారి. ఏప్రిల్ రెండో తేదీ, మార్చి 31, 26వ తేదీల్లో సైతం యూజర్లు ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారు. యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులను ట్రాక్ చేసే డౌన్‌డిటెక్టర్ సంస్థ ప్రకారం శనివారం ఉదయం 11.30 గంటల తర్వాత సమస్య మరింత ఎక్కువైంది. భారతీయ రిజర్వ్‌బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొంతకాలం క్రితం యూపీఐ సేవలను అందుబాటులోకి తేవడం తెల్సిందే. ''శనివారం నాటి సమస్యకు పరిష్కార చర్యలు తీసుకుంటున్నాం. సేవల అంతరాయానికి చింతిస్తున్నాం'అని ఎన్‌పీసీఐ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేసింది. ''పర్సు ఖాళీ. ఆన్‌లైన్‌లో ఆటోవాలాకు డబ్బులిద్దామంటే యూపీఐ పనిచేయట్లేదు. చాలా ఇబ్బంది పడ్డా''అని ఒక యూజర్ అసహనం వ్యక్తంచేశారు. యూపీఐ పేమెంట్ సమస్యలొచ్చే వీలుందని కాస్త ముందుగా సమాచారం ఇస్తే చాలా బాగుంటుందని మరో యూజర్ అన్నారు. సాధారణ చెల్లింపుల కుతోడు ఆటోపే ఫీచర్ అందుబాటులోకి వచ్చాక వివిధ రకాల బిల్లులు, చందాలకు చెల్లింపులు ఆటోమేటిక్‌గా జరుగుతుండటంతో దేశవ్యాప్తంగా రోజూ యూపీఐ ట్రాన్సాక్షన్‌ల సంఖ్య ఎప్పటికప్పుడు రికార్డుల స్థాయిలో పెరుగుతోంది. మార్చి నెలలో ఏకంగా రూ.24.77 లక్షల కోట్ల విలువైన యూపీఐ చెల్లింపులు జరిగాయి. గత నెలలో పోలిస్తే ఇది ఏకంగా 12.7 శాతం ఎక్కువ. జనవరిలో ఏకంగా 16.99 బిలియన్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. వీధి వ్యాపారులు, చిల్లర వర్తకులు, చిరు వ్యాపారులు, దుకాణాల్లో యూపీఐ చెల్లింపులు నేడు సర్వసాధారణమయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం రిటైల్ వ్యాపార చెల్లింపుల్లో 80 శాతం చెల్లింపులు యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

అకాలీదళ్ చీఫ్‌గా సుఖ్‌బీర్ మళ్లీ ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: మతపరమైన దుష్ప్రవర్తన కారణంగా రాజీనామా చేసిన ఐదు నెలల తర్వాత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) చీఫ్‌గా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడ జరిగిన సమావేశానికి పంజాబ్, ఇతర రాష్ట్రాల నుంచి హాజరైన 524 మంది ప్రతినిధులు పార్టీ అధ్యక్షుడిగా సుఖ్‌బీర్‌ను ఏకగ్రీవంగా తిరిగి ఎన్నుకున్నారు. తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ స్థానంలో 2008లో సుఖ్‌బీర్ తొలిసారిగా శిరోమణి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి పార్టీ చీఫ్‌గా కొనసాగుతూ వస్తున్న ఆయన, గతేడాది రాజీనామా చేశారు. దాదాపు ఐదు నెలల కాలంలో మతపరమైన శిక్ష లేదా 'తంఖా'ను అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో అనుభవించారు. కాగా, ఈనెల 13న భటిండాలో జరిగే పార్టీ సమావేశంలో సుఖ్‌బీర్ ప్రసంగించనున్నారు. బాదల్ ఎన్నికతో పంజాబ్‌లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలున్నాయి. పంజాబ్‌లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఉన్న శిరోమణి అకాలీదళ్, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పాత మిత్రుడైన బీజేపీకి దగ్గరయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.




సుఖ్‌బీర్ సింగ్

నేషనల్ హెరాల్డ్ కేసులో రూ.661 కోట్ల ఆస్తుల స్వాధీనం

ఆస్తులున్న చోట్ల స్వాధీన నోటీసులు అంటించిన ఈడీ అధికారులు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నేషనల్ హెరాల్డ్ కేసులో గతంలో అటాచ్ చేసిన స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు జారీచేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం ప్రకటించింది. ఈ మేరకు ఇప్పటికే తాము జప్తుచేసిన రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులున్న చోట్ల ఈడీ అధికారులు 'స్వాధీన నోటీసులు'అంటించారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని ఐటీఓ ప్రాంతంలో ఉన్న హెరాల్డ్ హౌస్, ముంబైలోని సర్వే నంబర్ 341లో ఉన్న బాంద్రా(ఇ) రెండో ప్లాట్, లక్నోలోని విశ్వేశ్వర్ నాథ్ రోడ్డులో అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ భవంతికి ఈడీ అధికారులు నోటీసులు అంటించారు. వెంటనే ఖాళీచేయాలని ఈ స్థిరాస్తుల్లో నడుస్తున్న కార్యాలయాలు, ఆఫీస్‌లు, దుకాణాలను ఆదేశిస్తూ నోటీసులిచ్చారు. ముంబైలోని హెరాల్డ్ హౌస్‌లో 7, 8, 9వ అంతస్తుల్లో నడుస్తున్న జిందాల్ సౌత్‌వెస్ట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఆఫీస్ వెంటనే ఖాళీచేయాలని, స్థిరాస్తిని తమకు అప్పగించాలని, లేదంటే నెలవారీ అద్దెను ఇకపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్‌కు బదిలీచేయాలని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే అటాచ్ చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు తమకు మనీలాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ)లోని సెక్షన్(8), రూల్5(1)ద్వారా దఖలుపడ్డాయని ఆ నోటీస్‌లో ఈడీ పేర్కొంది. 2023 నవంబర్‌లో రూ.661 కోట్ల స్థిరాస్తులతోపాటు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.90.20 కోట్ల విలువైన షేర్లనూ ఈడీ అటాచ్ చేయడం తెల్సిందే. ఈ కేసులో రూ.998 కోట్ల నేరం జరిగిందని ఈడీ గతంలో ఆరోపించింది. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మోతాలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడా, యంగ్ ఇండియా ప్రైవేట్ సంస్థలు అక్రమంగా రూ.2,000 కోట్ల విలువైన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ స్థిరాస్తులను కాజేసేందుకు కుట్ర పన్నారని ఈడీ గతంలో పేర్కొనడం తెల్సిందే.



అణు కార్యక్రమంపై ముగిసిన ఇరాన్-అమెరికా ప్రతినిధుల భేటీ

19న మరోసారి సమావేశం

మస్కట్: ఇరాన్, అమెరికా ప్రతినిధుల ముఖాముఖి మొదటి విడత చర్చలు శనివారం ఒమన్ రాజధాని మస్కట్‌లో ముగిశాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరిపేందుకు వీరు వచ్చే వారం మరోసారి సమావేశం కానున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక మొదటి విడత చర్చలు పూర్తయినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి కొద్దిసేపు మాట్లాడుకున్నట్లు ఇరాన్ వార్తా సంస్థ పేర్కొంది. కాగా, ఈ నెల 19వ తేదీన తదుపరి విడత పరోక్ష చర్చలు జరుపుతామని అరగ్చి తెలిపారు. 'ఫలితం లేని ఈ చర్చలతో సమయం వృథా. వీటిపై ఎవరికీ ఆసక్తి లేదు'అని పేర్కొన్నారు. మస్కట్ శివారులోని ఓ భవనంలో సమావేశమైన రెండు దేశాల ప్రతినిధులు రెండు గంటలపాటు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో చర్చలు ముఖాముఖి జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రతినిధి విట్కాఫ్ తెలపడం గమనార్హం. అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేయడమన్నదే తమ లక్ష్యమని ఇరాన్‌కు తెలిపినట్లు విట్కాఫ్ అంటున్నారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



మూల్యాంకనం కంప్యూటరీకరణ

మచిలీపట్నంరూరల్: జేఈడీ మొదటి సంవత్సరం మూల్యాంకనాన్ని కంప్యూటరీకరణ చేస్తున్నట్లు కృష్ణా వర్సిటీ వీసీ కె.రాంజీ శనివారం తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియను ఆయన పరిశీలించారు.



ఉత్తమ జర్నలిస్టులకు అవార్డులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉత్తమ జర్నలిస్టులకు అవార్డుల ప్రదానోత్సవం శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్వీరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



కృష్ణా జిల్లా ఎడ్లు ముందంజ

పర్చూరు(చినగంజాం): బాపట్ల జిల్లా ఉప్పుటూరు వెంకటేశ్వర, చెన్నకేశవ స్వామి వార్ల తిరుణాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బోలురాధ పోటీల్లో కృష్ణా జిల్లా ఎడ్లు ముందంజలో నిలిచాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్లు, ప్రధాన కార్యదర్శి నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో వివిధ హోదాల్లో నాయకులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ పొలిటికల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లుగా మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాసరావు, కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ ఆసిఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

నృత్యకళాకారులకు గిన్నిస్ బుక్‌లో చోటు



పెద్దఆవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లికి చెందిన శ్రీవిజయ లలిత కూచిపూడి నృత్య అకాడమీ నృత్య కళాకారులు 30 మంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారని నాట్యాచారిని జి.వనజ చంద్రశేఖర్ తెలిపారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2023 డిసెంబర్ 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భరత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,209 మంది కళాకారులతో కూచిపూడి కళావైభవం మహా బృంద నాట్య ప్రదర్శన జరిగిందని పేర్కొన్నారు. ఈ బృందంలో తమ అకాడమీ విద్యార్థులు 30 మంది భాగస్వాములయ్యారని తెలిపారు. ఆ నాట్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎక్కిందని పేర్కొన్నారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులందరికీ గిన్నిస్ బుక్ నుంచి సర్టిఫికెట్లు అందాయని వివరించారు.

కొనసాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం కూడా కొనసాగాయి. మహిళల విభాగంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ స్థాయిలో ఈ పోటీలు జరిగాయి. మాస్టర్స్ మహిళా విభాగం పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన జగపతి తిరుపతమ్మ మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించి స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సభ్యుడు గుత్తా శివరామ కృష్ణ(చంటి), కోచ్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యుడి సేవలో డీజీపీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సతీ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు, వేదపండితులు బాలకృష్ణ శర్మ, మణిదీప్ శర్మ, విరూప్ శర్మ వేద ఆశీర్వచనాలు అందజేశారు. కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఎన్టీఆర్ సత్తా

- ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా
- ప్రథమ సంవత్సరంలో 81, ద్వితీయ సంవత్సరంలో 89 శాతం ఉత్తీర్ణత
- మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు మరోసారి తమ సత్తాచాటారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతాన్ని మించి ఫలితాలు సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచింది. గత ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచిన జిల్లా ఈ ఏడాది మాత్రం తృతీయ స్థానానికి పడిపోయింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 81 శాతంతో, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 89 శాతం ఫలితాలతో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచారు. 2023 వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఫలితాలు ప్రకటించగా, గత ఏడాది నుంచి కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా ఇంటర్మీడియెట్ బోర్డు ఫలితాలను ప్రకటిస్తోంది. 39,200 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షకు హాజరవగా 31,676 మంది ఉత్తీర్ణులయ్యారు. 35,484 మంది రెండో సంవత్సరం పరీక్షలు రాయగా 31,736 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్‌లో 74.6 శాతం

ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 74.6 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 830 మంది పరీక్షలకు హాజరవగా 620 మంది ఉత్తీర్ణత (74.6 శాతం) సాధించారు. ప్రభుత్వ కాలేజీల్లో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి ఏడాది 241 మంది మంది పరీక్షలు రాయగా 206 మంది ఉత్తీర్ణులై 85 శాతం సాధించారు. రెండో సంవత్సరం 189 మంది హాజరవగా 177 మంది ఉత్తీర్ణులై 94 శాతం సాధించారు. ప్రైవేట్ కళాశాలలకు సంబంధించి 641 మంది విద్యార్థులు రెండో సంవత్సరం పరీక్షలు రాయగా 443 మంది ఉత్తీర్ణులై 69 శాతం ఫలితాలు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 66 శాతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండో సంవత్సరం విద్యార్థులు 66 శాతం ఉత్తీర్ణత సాధించారు.



మంచి మార్కులు సాధించిన పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. మొదటి ఏడాది పరీక్షకు 997 మంది హాజరవగా 485 మంది ఉత్తీర్ణులై 49 శాతం, రెండో సంవత్సరానికి సంబంధించి 606 మందికి 398 మంది ఉత్తీర్ణులై 66 శాతం ఫలితాలు సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం పరీక్షలకు 241 మంది విద్యార్థులు హాజరవగా 206 మంది ఉత్తీర్ణులై 85 శాతం, రెండో సంవత్సరం పరీక్షలకు 189 మంది హాజరవగా 177 మంది ఉత్తీర్ణులై 94 శాతం ఫలితాలను సాధించారు. ప్రభుత్వ కాలేజీలకు సంబంధించి ఫలితాల్లో రాష్ట్రంలో రెండో సంవత్సరం ఫలితాల్లో 19 స్థానం, మొదటి సంవత్సరం ఫలితాల్లో ఏడో స్థానానికి పరిమితమమైంది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ మొదటి ఏడాది 84 శాతం, రెండో ఏడాది 96 శాతం, ఏపీటీడబ్ల్యూర్ మొదటి ఏడాది 94 శాతం రెండో ఏడాది 99 శాతం, హైస్కూల్ ప్లస్ మొదటి ఏడాది 39 శాతం, రెండో ఏడాది 52 శాతం, మోడల్ స్కూల్ మొదటి ఏడాది 88 శాతం, రెండో ఏడాది 81 శాతం, కేజీబీవీ మొదటి ఏడాది 68 శాతం, రెండో ఏడాది 81 శాతం ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జి.రాజ్యలక్ష్మి ఎంపీసీలో 1000కి 984 మార్కులు, బైపీసీలో మైలవరం జెడ్పీ బాలికల పాఠశాలలో ఉన్న హైస్కూల్ ప్లస్‌లో బూక్యా హరిణి 978, పఠాన్ షాజిదా ఖాతూన్ 976, పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ రేష్మా 973 మార్కులను సాధించారు.

రోజూ రెండు పరీక్షలు

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఒకే రోజు రెండు పరీక్షలు జరుగుతాయి. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకూ మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకూ రెండో సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తారు. మే 28 నుంచి జూన్ మొదటి తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకూ అవకాశం ఉంది. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ అవకాశం కల్పించారు.

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ వేడుకలో మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకుడు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): పండు వెన్నెల.. మల్లె పందిరి.. రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి నయనానందకరంగా జరిగింది. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుకను నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులతో కొండపైన ఉన్న ఆలయం నుంచి గ్రామంలో ఊరేగించి ఎదురు కోలోత్సవం జరిపించారు. అనంతరం కొండ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలోకి విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వామికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు, పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వాసుదేవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి ఆధ్వర్యంలో నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జగ్గయ్యపేట, వత్సవాయి, చిల్లకల్లు ఎస్‌ఐలు రాజు, తోట శ్రీనివాస్ వంద మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఏసీ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ మనోహర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకను తిలకించేందుకు హాజరైన భక్తులు

విద్యుత్ చౌర్యం కేసుల్లో రూ.8 కోట్ల జరిమానా

విజయవాడస్పోర్ట్స్: గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులకు భారీగా జరిమానా విధించినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సాంబశివరావు శనివారం తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు 5,317 కేసులను నమోదు చేసి రూ.8.14 కోట్లు జరిమానా విధించామని పేర్కొన్నారు. జిల్లాలోని 30,764 సర్వీసులను తనిఖీ చేశామని, డైరెక్ట్ ట్యాపింగ్‌కు పాల్పడిన 499 మంది, ఫిల్ఫరేజ్‌కు పాల్పడిన 227 మంది, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 569 మంది, అధిక లోడుకు పాల్పడిన 3,652 మంది, బ్యాక్ బిల్లింగ్‌కు పాల్పడిన 370 మందిపై కేసులు నమోదు చేశామని వివరించారు. ఇళ్లతో పాటు పరిశ్రమలు, వ్యాపార సముదాయాలను తమ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి అపరాధరుసుం వసూలు చేసినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కృష్ణాజిల్లాలో..

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కృష్ణాజిల్లాలో 10,359 కేసులను నమోదు చేసి రూ.15.781 కోట్లు జరిమానా విధించారు. వీటిల్లో అధిక లోడు 9,736, బ్యాంక్‌బిల్లింగ్ 185, మాల్‌ప్రాక్టీస్ 271, తెఫ్ట్ ఆఫ్ ఎనర్జీ(డీటీ) 100, తెఫ్ట్ ఆఫ్ ఎనర్జీ (పీఓఈ) 67 కేసులు ఉన్నాయి.

- మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామిని దర్శించేందుకు క్యూలో బారులుదీరారు. నృసింహుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మ వార్లను దర్శించుకున్నారు.

ధరకు చెల్లిన నూకలు

- మిల్లర్ల మాయాజాలంతో ధాన్యం రైతుల గగ్గోలు
- అధిక తేమ శాతం, బియ్యం ముక్కలవుతోందంటూ ధర తగ్గించిన మిల్లర్లు
- ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడి కల్లాల్లోనే పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- వాతావరణంలో మార్పులతో ఆందోళనలో అన్నదాతలు
- ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటికి సేకరించిన ధాన్యం 7,200 టన్నులు మాత్రమే..



పైడూరుపాడులో ధాన్యం ఆరబెడుతున్న వ్యవసాయ కూలీలు



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు మారత కృష్ణారావు. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలంలోని కవులూరుకు చెందిన ఈ రైతు రబీలో 2.4 ఎకరాల్లో వరి సాగు చేశారు. వారం క్రితం రెండెకరాల్లో కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని ఆరబెట్టారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టి స్థానిక సొసైటీని సంప్రదించారు. 75 కిలోల ధాన్యం బస్తా ప్రభుత్వ మద్దతు ధర రూ.1,740 కాగా రూ.1,620కే కొనుగోలు చేస్తామని సొసైటీ సిబ్బంది చెప్పారు. అదేమని అడిగితే ఇష్టమైతే అమ్ముకో లేదంటే ఉంచుకో అని చెప్పడంతో చేసేది లేక వచ్చిన ధరకే పంటను తెగనమ్మారు. తక్కువ ధరకు విక్రయించడంతో రూ.9 వేలకు పైగా నష్టపోయినట్లు కృష్ణారావు వాపోయారు.

జి.కొండూరు: అన్నదాతకు ఆపద వచ్చింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అధిక తేమ, బియ్యంలో నూకలు వస్తున్నాయంటూ మిల్లర్లు ధర తగ్గించేశారు. ప్రకృతి కూడా సహకరించకపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు వచ్చినకాడికి తెగనమ్ముతున్నారు. ఖరీఫ్ పంటను వరదలు ముంచేశాయి. ఆ నష్టాలను పూడ్చుకునేందుకు రబీలో వరి సాగుచేసిన రైతులకు మిల్లర్ల మాయాజాలంతో కష్టాలు తప్పడంలేదు. తమకు మద్దతు ధర దక్కేలా చూడాల్సిన ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని రైతులు వాపోతున్నారు.

రైతులకు దక్కని మద్దతు

ఎన్టీఆర్ జిల్లాలో రబీ సీజన్‌లో 19,985 హెక్టార్లలో వరి సాగైంది. ప్రభుత్వం 50 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతినిచ్చింది. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా ధర రూ.2,320, 75 కేజీల బస్తా ధర రూ.1740గా నిర్ణయించింది. జి.కొండూరు, విజయవాడరూరల్ మండలాల రైతులు ధాన్యం విక్రయించేందుకు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ 17 శాతానికి తక్కువగా ఉంటే కొనుగోలు చేస్తారు. రైతులు రోజుల తరబడి ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 16 శాతం కంటే తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే మిల్లర్లు అనేక సాకులతో వేధిస్తున్నారు. మిల్లర్లు, ప్రయివేటు వ్యాపారులు, సహకార సొసైటీల సిబ్బంది ఏకమై ధాన్యంలో తేమ ఎక్కువ ఉందని, ధాన్యం ముక్కలవుతోందని సాకులు చూపి మద్దతులో కోత విధిస్తున్నారు. నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉన్న 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1740కి కొనుగోలు చేయాలి. అయితే రూ.1500 నుంచి రూ.1600లోపే మిల్లర్లు ధర చెల్లిస్తున్నారు. 17 శాతం కంటే తేమ ఎక్కువగా ఉంటే బస్తాకు రూ.1300లకు మించి ధర ఇవ్వడంలేదని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పులు వచ్చి సాయంత్రం సమయానికి వర్షపు జల్లులు పడుతుండటంతో చేసేది లేక రైతులు వచ్చిన కాడికి ధాన్యాన్ని తెగనమ్ముతున్నారు. కొన్ని గ్రామాల్లో గన్నీ సంచుల కొరత ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంకెల్లో ఇలా..

రబీ వరి సాగు విస్తీర్ణం	19,985 హెక్టార్లు
ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం	50 వేల టన్నులు
ఎకరాకు ప్రభుత్వం కొనే ధాన్యం	39.2 క్వింటాళ్లు
ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు	రూ.2,320
ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య	107
ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు	34
శుక్రవారం వరకు సేకరించిన ధాన్యం	7,200 టన్నులు
ధాన్యం సేకరిస్తున్న మిల్లుల సంఖ్య	16

బస్తా రూ.1500 చొప్పున విక్రయించా



నేను రెండు ఎకరాల్లో దాళ్వా సాగు చేశాను. వరి కోసి ధాన్యం అరబెట్టినప్పటికీ కొనేవారు లేక ప్రయివేటు వ్యాపారులకు 75 కిలోల బస్తా రూ.1500 చొప్పున విక్రయించా. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి ఉంటే బస్తాకు రూ.240 అదనంగా ధర వచ్చేది. రెండు ఎకరాలకు రూ.70 వేల పెట్టబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాను.

– జూపల్లి సుబ్బారావు, రైతు, పైడూరుపాడు, విజయవాడరూరల్ మండలం

ధాన్యం కొనే నాథుడే లేడు




నేను తొమ్మిదెకరాల్లో దాళ్వా సాగు చేశాను. రూ.3.5 లక్షల పెట్టుబడి పెట్టాను. పంట మంచిగా పండింది అనుకుంటే ధాన్యం కొనేవారు లేరు. మా గ్రామానికి పది వేల సంచులు అవసరమైతే వెయ్యి సంచులు ఇచ్చారు. ధాన్యం ఆరబెట్టి సిద్ధంగా ఉన్నప్పటికీ కొనేందుకు ఎవరూ రావడంలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– కాగితపు వెంకటేశ్వరరావు, రైతు, పైడూరుపాడు, విజయవాడరూరల్ మండలం

సింహ వాహనంపై ఆది దంపతులు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం శ్రీగంగ, పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు సింహ వాహన సేవ జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర మహామండపం నుంచి నగరోత్సవ సేవ ప్రారంభమైంది. సింహ వాహనంపై అధిష్ఠించిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మొయిన్‌రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. సింహ వాహనంపై దర్శనమిచ్చిన ఆదిదంపతులకు భక్తులు పూజాసామగ్రి సమర్పించారు. ఉదయం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మూలమంత్ర హవనం, సదస్యం, వేద స్వస్తి జరిగాయి.

వక్ఫ్ సవరణ బిల్లు ప్రమాదకరం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



నిరసనలో పాల్గొన్న నారాయణ, రామకృష్ణ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు దేశానికి చాలా ప్రమాదకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో పంజాసెంటర్‌లో శనివారం సాయంత్రం వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి నారాయణ మాట్లాడుతూ.. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నిందన్నారు. అందులో భాగంగానే అన్ని రాజ్యాంగ వ్యవస్థలపై ఆధిపత్యం చెలాయిస్తోందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బిల్లు ఆమోదంపై చంద్రబాబు మూడు సూచనలు చేశానని చెబుతున్నాడని, అవి ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు మూడు నామాలు పెట్టిన చంద్రబాబు తన బోగస్ మాటలు ఆపాలని హితవు పలికారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీజేపీకి లొంగిపోయారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ కేవలం మైనార్టీలకు మాత్రమే చెందిన అంశం కాదని, ఇది రాజ్యాంగంపై దాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సమితి కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థలు విజయదుందుభి మోగించాయని శ్రీచైతన్య విద్యాసంస్థల డీన్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంజీ రోడ్డులోని ఎంఅండ్ఎం శ్రీ చైతన్య విద్యాసంస్థల క్యాంపస్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శనివారం ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్-2025 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 992 మార్కులతో కె.మానస, జి.లహరి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అలాగే బైపీసీ విభాగంలో షేక్ ఆఫీఫా తబస్సుమ్ 992 మార్కులతో అసాధారణ ప్రతిభ కనబరిచిందన్నారు. 990 ఆపై మార్కులు 172 మంది, 247 మంది 985 ఆపై మార్కులు, 792 మంది 980 ఆపై మార్కులు, 8551 మంది 900 ఆపై మార్కులు పొందారని వివరించారు.

ఫస్టియర్ ఫలితాల్లోనూ విజయ పరంపర

ప్రథమ సంవత్సర ఫలితాల్లోనూ తమ విద్యార్థుల విజయ పరంపర కొనసాగిందన్నారు. ఎంపీసీ విభాగంలో 467 మార్కులతో ఇద్దరు విద్యార్థులు ఎం.వినూత్న, బి.యశ్వంత్ నాయక్ అగ్రస్థానంలో నిలిచారన్నారు. బైపీసీ విభాగంలో చల్ల లేఖన 437 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందారని చెప్పారు. ఎంపీసీ విభాగంలో 466 ఆపై మార్కులు 23 మంది, 465 ఆపై మార్కులు 157 మంది, 460 ఆపై మార్కులు 1212 మంది, 400 ఆపై మార్కులు 7927 మంది సాధించారని తెలిపారు. బైపీసీ విభాగం నుంచి 436 ఆపై మార్కులతో 14 మంది, 435 ఆపై మార్కులు 67 మంది, 430 ఆపై మార్కులు 469 మంది, 400 ఆపై మార్కులు 2063 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, డీన్స్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతమ్మ సేవలో అధికారులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారిని శనివారం పశుసంవర్ధక శాఖ జెడీ హనుమంతరావు, ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివరామ్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి గోశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. పశువైద్యాధికారి పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థలో రెండంచెల విధానం అమలు చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం
- సహకార రంగాన్ని వైఎస్సార్ బతికించారు : పూనూరు గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సహకార వ్యవస్థ మనుగడ సాగించాలంటే రెండంచెల విధానాన్ని అమల్లోకి తేవాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. రెండంచెల విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని, ఐదు లక్షల సంతకాలు సేకరించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తీసుకోవాలని, విజయవాడలో మహాధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీసీసీబీలను రాష్ట్ర సహకార బ్యాంకులుగా మార్పు చేయాలని, సహకార బ్యాంకింగ్‌లో రెండంచెల విధానం తేవాలని కోరుతూ శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ, సీపీఐ, సీపీఎం, రైతు, కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని రెండంచెల విధానం అమలు చేయాలన్న యూనియన్ డిమాండ్‌కు మద్దతు ప్రకటించాయి. రెండంచెల విధానంలో అటు రైతులకు, ఇటు ఉద్యోగులకు జరిగే మేలును వక్తలు వివరించారు. వ్యవసాయ రుణాల పంపిణీ జాప్యం నివారించడమే కాకుండా వడ్డీ రేట్లు తగ్గుతాయని వక్తలు పేర్కొన్నారు. సహకార వ్యవస్థ మనుగడ సాగిస్తుందన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, పక్కన నాయకులు

గ్రామీణ పేదలకు మేలు..

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థను వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రావడానికి ముందు, తర్వాత అని రెండుగా విభజించి చూడాల్సి ఉంటుందన్నారు. 2002 సంవత్సరానికి పూర్వం సహకార వ్యవస్థను అప్పటి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. 2004లో అధికారం చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుదేలైన సహకార రంగాన్ని ఆదుకొని గాడిలో పెట్టారన్నారు. రూ.వందల కోట్ల ఆర్థిక సాయం అందించి సహకార వ్యవస్థను బతికించారన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన బ్యాంకులను లాభాల బాట పట్టించారని చెప్పారు. సహకార వ్యవస్థలో రెండంచెల విధానం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేరళ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొని మన రాష్ట్రంలోనూ రెండంచెల విధానం అమల్లోకి తేవాలన్నారు. ఇందుకు తమ సహకారం ఉంటుందని, ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సహకార వ్యవస్థలో పెత్తనమంతా రాజకీయ నాయకులదేనన్నారు. ఈ నేపథ్యంలోనే అవినీతి పెరిగిపోయిందన్నారు. ఈ వ్యవస్థలో రెండంచెల విధానం అమల్లోకి తెస్తే గ్రామీణ పేదలకు మేలు జరుగుతుందన్నారు. తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు అందుతాయని చెప్పారు. ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, రైతు సంఘం నాయకులు కేశవరావు, కేవీవీ ప్రసాద్, జమలయ్య, భవానీప్రసాద్, బ్యాంకుల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో భారీగా గంజాయి పట్టివేత

- 25.65 కేజీల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్ట్
- బైక్, కారును సీజ్ చేసిన చిలకలపూడి పోలీసులు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న ఐదుగురిని చిలకలపూడి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిలకలపూడి సీఐ ఎస్‌కే నబీ శనివారం విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం ఆనంద్‌పేటకు చెందిన ఉదయ్‌కుమార్ హైదరాబాద్‌లో ఉంటూ మూడు రోజుల క్రితం మచిలీపట్నం వచ్చాడు. ఉదయ్‌కుమార్, బుట్టాయిపేటకు చెందిన షేక్ రియాజ్, బందరు మండలం నవీన్‌మిట్టల్‌కాలనీకి చెందిన గోపీ, ముస్తాఖాన్‌పేటకు చెందిన బలగం నాగరాజు, కాగి జస్వంత్‌లు శనివారం ఉదయం మాచవరం మెట్టు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చిలకలపూడి స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నాడు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారణ చేయగా ఐదుగురు గంజాయి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు 25.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాగరాజు ద్విచక్ర వాహనంతో పాటు ఉదయ్‌కుమార్ కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీటితో పాటు వారి నుంచి 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు మరింత దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి కేసులో లోతైన దర్యాప్తు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బందరు డీఎస్పీ రాజా ఆధ్వర్యంలో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయాలకు సంబంధించి ప్రజల వద్ద ఎటువంటి సమాచారం ఉన్నా నేరుగా తమకు తెలియజేసి గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ యుఎల్ సుబ్రహ్మణ్యం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



చిలకలపూడిలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నబీ, ముసుగులో నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మోదీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్ఫూర్తితో బీజేపీ పాలన

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించి, రాజ్యాంగానికి గౌరవం ఇవ్వని కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రజలందరూ ఒక్కటిగా బుద్ధి చెప్పాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే ఆరుణ అన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కార్యక్రమానికి అధ్యక్షత వహించి, పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశ అభివృద్ధి ధ్యేయంగా అంబేడ్కర్ స్ఫూర్తితో బీజేపీ పాలన అందిస్తోందన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించాలని బీజేపీ పార్టీ నిర్ణయించిందని, అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ ఆశయాలకు సంబంధించి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో సమ సమాజ స్థాపన కోసం అంబేడ్కర్ కృషి చేశారని, అన్ని వర్గాల వారికి సమాన న్యాయం అందించడం ఆయన లక్ష్యంగా పెట్టుకొని పనిచేశారని పురందేశ్వరి అన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారు



మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ ముసుగులో మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మండిపడ్డారు. విజయవాడలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తీరుపై నిప్పులు చెరిగారు. వర్గీకరణలో మాదిగలకు 6, మాలలకు 8 రోస్టర్ పాయింట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల చంద్రబాబుపై మాదిగల్లో అసంతృప్తి నెలకొందన్నారు. రోస్టర్ పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని కోరితే కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు తన రాజకీయ స్వార్థ ప్రయోజనాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మాదిగలకు మరోసారి అన్యాయం చేస్తున్నారన్నారు.

గద్దె దింపడం కూడా మాదిగలకు తెలుసు

30 ఏళ్లుగా వర్గీకరణ ఉద్యమం చేస్తున్న మాదిగలకు చంద్రబాబు చేస్తున్న సామాజిక న్యాయం ఇదేనా అంటూ నిలదీశారు. ఓ వైపు వర్గీకరణ తుది దశకు చేరుకుందని చెబుతూనే ... మరో వైపు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు ఉమ్మడిగా ప్రకటిస్తున్నారన్నారు. ఇలా చేస్తే వర్గీకరణ తర్వాత మాదిగలకు మిగిలేది ఏమిటని ప్రశ్నించారు. మాదిగల డప్పు కొట్టి, చెప్పు కుట్టి, వర్గీకరణ చేసి పెద్ద మాదిగ అవుతానంటే నమ్మి భుజాన మోసామన్నారు. తీరా వర్గీకరణ అంశం రాష్ట్రాల పరిధిలోకి వచ్చిన తర్వాత మాదిగలకు ద్రోహం చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఓట్లు వేసి గెలిపించిన మాదిగలకు గద్దె దింపడం కూడా తెలుసునని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేసిన రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతారని, ఆంధ్రాలో మాదిగలకు అన్యాయం చేసిన చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు. లోపాలను సరిచేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 25న నెల్లూరు, 30న కడప, మే 10న రాజమండ్రి, మే 20న విశాఖపట్నం, మే 30న అమరావతిలో మాదిగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నాయకులు చెరుకూరి కిరణ్ మాదిగ, పూనూరు జార్జి మాదిగ పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు, సేవకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శనివారం వైభవంగా సాగింది. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కాగా విశేష సంఖ్యలో అమ్మవారి భక్తులు, ఉభయదాతలు, సేవా సిబ్బంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తెల్లవారుజామున 5.55 గంటలకు కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

8 కిలో మీటర్ల మేర ప్రదక్షిణ..

ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ ఉత్సవ మూర్తులకు పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పు కళాకారుల విన్యాసాలు, కోలాట నృత్యాల మధ్య గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితార, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. సుమారు 8 కిలో మీటర్ల మేర సాగిన గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా భక్తుల మనోభీష్టి నెరవేరుతుందని, అమ్మవారి కరుణా కటాక్షాలతో కుటుంబం సుఖ సంతోషాలతో విరసిల్లుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. భక్తులు పసుపు నీళ్లతో గిరి ప్రదక్షిణ మార్గాన్ని శుద్ధి చేసి ఆది దంపతులకు భక్తితో పూజా ద్రవ్యాలను సమర్పించారు. గిరి ప్రదక్షిణ మార్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం భక్తులు కొండపైకి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్లు

దుర్గమ్మకు పలువురు భక్తుల విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకం, బంగారు గోపురం పనులకు భక్తులు విరాళాలను అందించారు. అమ్మవారి నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు కుటుంబం రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన కె.విష్ణువర్ధనదేవి రూ.లక్ష హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు వి.శ్రీనివాస్ రూ.1,01,116 విరాళాన్ని అందించారు. బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన డి.రామాంజనేయులు రూ.1,51,116, విశాఖపట్నంకు చెందిన కె.బాలకృష్ణారావు కుటుంబం రూ.లక్ష అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలతో సత్కరించారు.



దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారి

ఆన్‌లైన్ షేర్ మార్కెట్ పేరుతో రూ.16 లక్షల స్వాహా

పెనమలూరు: ఆన్‌లైన్ షేర్ మార్కెట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి వద్ద రూ 16,46,735 సొమ్ము స్వాహా చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు డొంక రోడ్డుకు చెందిన గరికపాటి రవీంద్రబాబు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గతేడాది మే నెలలో అతనికి షేర్‌మార్కెట్ వ్యాపారం చేయటానికి లింక్ వచ్చింది. ఆ లింక్‌ను రవీంద్రబాబు క్లిక్ చేయగా రెండు వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. షేర్ మార్కెట్ లో రవీంద్రబాబు రూ.34,11,500 పలు దఫాలుగా ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టారు. కొద్ది రోజులకు షేర్ మార్కెట్‌లో రూ.80 లక్షలు వచ్చినట్లు సైబర్ నేరగాళ్లు చూపారు. ఆ సొమ్ము రవీంద్రబాబు విత్‌డ్రా చేయటానికి యత్నించగా రూ.40 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరారు. దీనికి ఆయన నిరాకరించటంతో వాట్సాప్ గ్రూప్ నుంచి రవీంద్రబాబును తొలగించారు. జరిగిన మోసంపై బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అకౌంట్ బ్లాక్ చేయగా అప్పటికే రూ.16,46,735 సొమ్ము స్వాహా చేశారు. మిగిలిన సొమ్ము రికవరీ అయ్యింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు ముందస్తు పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి వీఎంసీ ఏర్పాట్లు చేసిందని డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు దినమైనా పన్ను చెల్లింపులకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో13 క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీపై 50శాతం రాయితీని పొందవచ్చని, 2025 -26 సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లిస్తే 5 శాతం రాయితీని పొందవచ్చని తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై శనివారం నగరానికి చెందిన శ్రీదుర్గా భవానీ నృత్య కళానిలయానికి చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పావని ప్రియాంక పర్యవేక్షణలో 22 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

మాకినేని బసవ పున్నయ్యకు నివాళి



కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశ స్వాతంత్ర్యానికి మాకినేని బసవ పున్నయ్య పోరాడారని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ పి.మధు కొనియాడారు. శనివారం గవర్నరుపేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మాకినేని బసవపున్నయ్య వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రజా సేవకు ఈ విజ్ఞాన కేంద్రం ప్రజలకు అంకితమైందన్నారు. ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు జయరాం, హరికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సేఫ్ ఎక్స్‌పో-2025

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం వుయ్ మేక్ స్కాలర్స్ సంస్థ ఆధ్వర్యంలో స్టడీ అబ్రాడ్ ఫండింగ్ ఎక్స్‌పో(ఎస్ఏఎఫ్ఈ)-2025 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 6 గంటల వరకు ఎక్స్‌పో జరుగుతుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో నిపుణుల మార్గదర్శకత్వం, విద్యా రుణాలు, స్కాలర్‌షిప్స్, వంటి వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

విద్యామందిర్ సేవలు అభినందనీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యాబోధన చేస్తున్న శ్రీ భారతీయ విద్యా మందిర్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీనగర్ కాలనీ శ్రీ భారతీయ విద్యామందిర్‌లో శనివారం దేశీయ సంప్రదాయ పద్ధతిలో వినూత్నంగా స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వివేకానందుని వస్త్ర వేషధారణలతో ఆయన గుర్తుకు తెచ్చేరీతిలో స్నాతకోత్సవం నిర్వహించటం ప్రశంసనీయం అని కొనియాడారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కరెస్పాండెంట్ దుర్గాప్రసాద్, పెనుమత్స అప్పలరాజు, చల్లా లక్ష్మీనారాయణ, భాస్కరరాజు, రాఘవరాజు, జేవీ షణత్ కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్నాతకోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న పర్యవేక్షించారు.

రోడ్డు భద్రతా నియమాలపై ర్యాలీ

పెనమలూరు: రోడ్డు భద్రతా నియమాలపై కానూరు కేసీపీ ఆదర్శ రెసిడెన్షియల్ విద్యార్థులు శనివారం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు నివారించగలుగుతామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి గులాబి పువ్వులు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడకేసిన అభివృద్ధి పనులు

- రణదీవెనగర్‌లో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి గ్రహణం
- నిలిచిన పనులు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



రణదీవెనగర్‌లో నిలిచిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వ పది నెలల పాలనలో అభివృద్ధి పడకేసింది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు మధ్యలో నిలిచిపోయాయి. కృష్ణలంక రణదీవెనగర్‌లో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే కరకట్ట దిగువన నివసిస్తున్న వందలాది పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ప్రజలకు ఇక్కట్లు

కృష్ణలంక 21వ డివిజన్‌లోని రణదీవెనగర్ కరకట్ట ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తుంటారు. రోజువారి కూలీ పనులకు వెళ్తూ చాలీచాలనీ వేతనంతో జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో శుభకార్యాలు చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేక స్థానికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా కార్యక్రమం చేసుకోవాలంటే దూర ప్రాంతలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. వేలాది రూపాయలు కల్యాణ మండపాలకు చెల్లించుకోలేక రోడ్ల పైన చేసుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నా ఏ ప్రభుత్వాలు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని పలువురు స్థానికులు కార్పొరేటర్ పుప్పాల కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి కరకట్టపై శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్డు గుర్తించారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే కరకట్ట ప్రాంత వాసులకు ఉపయోగంగా ఉంటుందని భావించి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.



భవనం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు



భవనం వెనుక వైపు ఖాళీ మద్యం సీసాలు

నాడు నిధుల మంజూరు

కమిషనర్ ఈ ప్రదేశాన్ని పరిశీలించి కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వీఎంసీ నుంచి సుమారు రూ.30 లక్షలు మంజూరవడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు చురుకుగా సాగి శ్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. పనులు శరవేగంగా జరుగుతుండడంతో కమ్యూనిటీ హాల్ త్వరలో అందుబాటులోకి వస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనివార్య కారణాలతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడం, ఆ తర్వాత ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోలేదు. పనులకు గ్రహణం ఎప్పుడు వీడుతుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

నిర్మాణ పనులు నిలిచి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి జంగిల్‌ను తలపిస్తోంది. చెత్త కుప్పలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. భవనం నిరూపయోగంగా ఉండడంతో మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనం చుట్టూ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చీకటిపడితే చాలు ఆకతాయిలు ఇక్కడకు చేరుకుంటారు. వీరి ఆగడాలకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, వీఎంసీ అధికారులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ చాలా అవసరం



చిన్నపాటి శుభకార్యాలు చేసుకునేందుకు ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కృష్ణలంక, గవర్నర్‌పేట తదితర ప్రాంతాల్లో శుభకార్యాలు చేసుకోవాలంటే అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. అంత స్థోమత మాకు లేదు. ఇది పూర్తయితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మిగిలిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– పి.రూపేష్‌కుమార్, రణదీవెనగర్, కృష్ణలంక

పనులు వెంటనే ప్రారంభించాలి



రణదీవెనగర్‌లో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. సగం పూర్తి చేసి వదిలేశారు. మిగిలిన పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి. దీని కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం. భవనం నిరుపయోగంగా ఉండటంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించాలి.

– కోరాడ రమణ, రణదీవెనగర్, 21వ డివిజన్ సీపీఎం సెక్రటరీ

ప్రతిభకు పురస్కార శోభ

విజయవాడ కల్చరల్: ప్రతిభకు పురస్కారాలు శోభనిస్తాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ క్రియాశీలక సభ్యుడు అశోక్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఉగాది సందర్భంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులకు ఉగాది, కళారత్న పురస్కారాలను అందుకున్న సందర్భంలో శనివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ జాతీయ స్థాయిలోగుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. సత్కార కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గోళ్ల నారాయణ రావు, స్వర్ణవెంకనారాయణ, మనోహర నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు. పత్రికారంగానికి చెందిన కొల్లూరి, వేమూరి బలరాం, చలపాక ప్రకాష్, దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధుసూదనరావు నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

వైభవంగా సుదర్శన యాగం



విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠ శ్రీ వెంకటేశ్వర శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జగద్గురువులు విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదేశంతో వైభవంగా రుత్వికులు సుదర్శన యాగం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, ద్వాదశ ప్రదక్షిణ, సాయంత్రం ధ్వజావరోహణ, పవళింపు సేవ, మహా మంగళహారతి కనులపండువగా నిర్వహించారు. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షకులు డాక్టర్ సి.రామ్మోహన రావు మాట్లాడుతూ స్వామి వారి ఆదేశంతో దేవాలయంలో అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కె.యక్షిత, 989 బైపీసీ సీనియర్ ఇంటర్



జి.రసజ్ఞ, 989 బైపీసీ, సీనియర్ ఇంటర్



ఎస్‌కే ముస్కాన్ 985, ఎంపీసీ, సీనియర్ ఇంటర్



ఎస్.మౌనిక, 965, ఎంఈసీ, సీనియర్ ఇంటర్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం అభినందించారు. రమేష్ బాబు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఐ.ప్రజ్ఞ 466 మార్కులు, వి.శృతి 465, పీవీఎస్ఎస్.వర్షిణి 465, ఎం.దేవహర్షిణి 465, జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను ఐ.నమ్రత 463, ఎం.కృష్ణప్రశాంత్ 434 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు కె.యక్షిత, జి.రసజ్ఞ,989 మార్కులు, వి.స్వీకృతాంజలి, బి.శ్రావణి987, ఇ.యశస్విని984 మార్కులు పొందారని చెప్పారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'త్రివేణి' జయకేతనం

పటమట(విజయవాడతూర్పు): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని, సీనియర్ ఇంటర్‌లో 97 శాతం, జూనియర్ ఇంటర్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బాపతు సీతారామిరెడ్డి తెలిపారు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 1000 మార్కులకు ఎస్‌కె ముస్కాన్ 983 మార్కులు, సీనియర్ ఎంఈసీలో ఎస్ మౌనిక 965 మార్కులు, సీనియర్ సీఈసీలో పి.జ్యోత్స్న 955 మార్కులు, నజీరున్నీసా 951, సాయి మనోజ్ఞ 942 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎస్‌కే సమీరా 460 మార్కులు, అబ్దుల్ సమీరా 445 మార్కులు, ఎంఈసీలో 500 మార్కులకు బి.శివదీక్షిత 484 మార్కులు, ఇ. సాయిసౌమ్య 482 మార్కులు సాధించారన్నారు. జూనియర్ సీఈసీలో జి. భాగ్యశ్రీ 482 మార్కులు, ఎస్ కావ్య 448 మార్కులు సాధింరారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ సాంబిరెడ్డి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఇంగ్లిష్, సంస్కృతం, ఎంఈసీలో ఎకనామిక్స్, కామర్స్, సీనియర్ సీఈసీలో ఇంగ్లీష్, సంస్కృతంలో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ శ్రీధర్, ఇన్‌చార్జిలు విజయలక్ష్మి, శ్యామల, పుష్పలత ప్రత్యేకంగా అభినందించారు.

మోడరన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని మోడరన్ అకాడమీ డైరెక్టర్ సుంకర నాగపూర్ణిమ శనివారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో చలువాది లేఖ్య సుకీర్తి 500 మార్కులకు 491, టీఎల్ గోవర్ధన్490, పి.చందన దుర్గ489, కె.జ్ఞానలక్ష్మినిఖిత486, పి.మణితేజ486 మార్కులు పొందారని తెలియజేశారు. జూనియర్ ఇంటర్‌లో తమ విద్యాసంస్థ నుంచి హజరైన విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. సీనియర్ ఇంటర్ సీఈసీలో 94.5 శాతం ఉత్తీర్ణత పొందారని ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

శ్రీనివాసా గ్రావిటీ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు చెప్పారు. జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థ నుంచి ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 94 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కె. డింపుల్ 470 కి 465 మార్కులు, ఎం.సంజన, కె.మాధవ ప్రసాద్, జీ.అభినవ్, కె.దర్శన్464 మార్కులు సాధించారని చెప్పారు. 460 పైన మార్కులు 46 మంది విద్యార్థులు. 450 కి పైగా మార్కులు 85 మంది విద్యార్థులు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీలో రవికిరణ్ వెయ్యి మార్కులకు 988 మార్కులు, ఎల్. హాసిని, కె మహేష్ 987 మార్కులు పొందారన్నారు. 980 పైన మార్కులను 12 మంది సాధించారన్నారు. సీనియర్ బైపీసీలో షబానా వెయ్యి మార్కులకు 983 మార్కులు సాధించిందన్నారు.

మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

స్థానిక మొగల్రాజపురంలోని మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు చెప్పారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను రత్నమాంబ వీధిలో ఉన్న కళాశాల ఆవరణలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్ ఇంటర్‌లో ఎం.భావన కృష్ణ 490, వి.శ్రీరేణుకసుజిని489, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో నాగవెంకటసత్యవిహారిక 975 మార్కులు, కె.నాగసుజిత 973, ఎం.నవ్య 972, జీ జ్యోత్స్న 971 మార్కులు పొందారని చెప్పారు. సత్తా చాటిన విద్యార్థులను కళాశాల అకడమిక్ ప్రిన్సిపాల్ షరీఫ్, అధ్యాపకులు అభినందించారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ సెర్మనీ



పట్టా తీసుకున్న విద్యార్థులతో చైతన్య రీజినల్ ఇన్‌చార్జి పద్మ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పటమట శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్‌లో యూకేజీ నుంచి ఒకటో తరగతికి, ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రీజినల్ ఇన్‌చార్జి పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల స్థాయిలో నిర్వహించే ఈ వేడుకను పాఠశాల స్థాయిలో నిర్వహించి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు మధురానుభూతిని అందించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టా తీసుకున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, జోనల్ ఇన్‌చార్జిలు సౌజన్య, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

నలందలో ఉత్సాహంగా 'క్రౌన్ ది టాలెంట్'



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద విద్యానికేతన్ కో కరిక్యులర్ యాక్టివిటీస్‌లో భాగంగా క్రౌన్ ది టాలెంట్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వివిధ ఒలింపియాడ్స్, ఇతర యాక్టివిటీస్‌లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఐదో తరగతి విద్యార్థి అభిరామ్ పాండే మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించగా అతనికి రూ.5 వేలు నగదు బహుమతి, బంగారు పతకం అందజేశారు. 4వ తరగతి విద్యార్థి జస్‌జోత్ సింగ్ భక్షి ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో 3వ ర్యాంకు సాధించగా రూ.2500 నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ నలందలో చదువుతున్న ప్రతి విద్యార్థి మాకు ప్రత్యేకమని, వారిలో టాలెంట్స్‌ను గమనిస్తూ వ్యక్తిగత శ్రద్ధను చూపిస్తామన్నారు. క్రియేటివిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌కు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉషారాణి, ఇతర సీసీఏ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

స్టెల్లాలో పూర్వ విద్యార్థినుల సమావేశం



ఓరుగంటి సాయమ్మను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

పటమట(విజయవాడతూర్పు): కళాశాలలో క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారని, ప్రతి విద్యార్థిని అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఏపీ హైకోర్టు ఏజీపీ ఓరుగంటి సాయమ్మ అన్నారు. శనివారం పటమట స్టెల్లా కళాశాలలో పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల పురోభివృద్ధికి ప్రత్యేక కోర్సులు అందిస్తూ, మంచి పౌరులుగా తీర్చి దిద్దుతోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, కరెస్పాండెంట్ లిన క్వాడ్రస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థినులు పలురంగాల్లో ఉన్నతస్థానాల్లో ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ సిస్టర్ ఇన్నసియమ్మ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, సిస్టర్ లావణ్య , స్టూడెంట్స్ డీన్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై మాట్లాడుతున్న రామకృష్ణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతీయ రైల్వే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎల్ఆర్ఎస్ఏ (ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆరవ నంబర్ ప్లాట్‌ఫాంలోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ రైల్వేలోని లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై రైల్వేశాఖ మంత్రి మల్టీ డిసిప్లినరీ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తుందని ప్రకటించినట్లు తెలిపారు. కానీ నేటికీ లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రైల్వే బోర్డు, రైల్వేశాఖ తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా డ్యూటీ అవర్స్‌ను గూడ్స్‌లలో 8 గంటలు, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలని కోరారు. రాత్రి డ్యూటీలను రెండు రాత్రులకు పరిమితం చేయాలని, పీఆర్‌ను 30 గంటల నుంచి 40 గంటలకు పెంచాలని, 130 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లలో ట్రిప్ అలవెన్స్, కో-పైలట్‌లను నియమించాలని, మెమో, డెమో రైళ్లలో ఏఎల్‌పీలను నియమించాలని తెలిపారు. ఎఫ్ఎస్‌డి భారం నుంచి ఏఎల్‌పీకి విముక్తి కల్పించాలని, 30 గంటలలో హెడ్ క్వార్టర్స్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజనల్ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి ఆర్.వి. రాము, నాయకులు కె.రాజేష్, ఎ.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

పెనమలూరు: భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి అని తిరుపతి మోహన్‌బాబు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ శాకమూరి రవిచంద్రబాబు అన్నారు. కానూరు సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఇంగ్లిష్ విభాగం, లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎథిక్స్ ఫ్రమ్ ఎపిక్స్, ఇతిహాసంలోని మానవీయ విలువలు అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహాభారతం, రామాయణంలో నీతిపాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ధర్మం, కర్తవ్యం, నైతికత, కరుణ వంటి అంశాలను ఇతిహాస ఘట్టాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రవిచంద్రబాబును నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం రవిచంద్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధనేకులలో ఎక్స్‌లెన్స్ అవార్డులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో 13వ వార్షికోత్సవం సందర్భంగా అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులు శనివారం ప్రదానం చేశారు. తొలుత బెంగుళూరు ఇంటెల్ టెక్నాలజీ సీనియర్ డైరెక్టర్ రఫిక్ పుట్టు, న్యూఢిల్లీ పాన్ ఐఐటీ చైర్మన్ దెబశీష్ భట్టాచార్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన జీ అరుణవాణి, కే శిరీష, జీ నారాయణరావు, జే సౌమ్య, ఎస్ యాస్మిన్, ఎన్ సుజాతలకు బంగారు పతకాలు ప్రదానం చేశారు.

వికాస్‌లో జాతీయ సదస్సు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీ పరమేశ్వరరావు, డైరెక్టర్ ఎస్ కీర్తిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో వివిధ కళాశాలలు, పరిశ్రమల నుంచి పరిశోధనా పత్రాలు సమర్పించుటకు పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, సాంకేతిక నిపుణులు విచ్చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా నమీబియా దేశంలోని విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ కే వెంకటేశ్వర్లు, అమెరికా, ఓమన్ దేశాల నుంచి పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారని పేర్కొన్నారు.

•అజిత్‌సింగ్‌నగర్‌లో అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కళ్ళే లలిత ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం కళ్ళేలలిత ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కుటుంబ సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

చలో మైదాన్

ఓ 'ఆట' ఆడాల్సిందే!

పిల్లలను ఇంట్లో ఉంచొద్దు.. గ్రౌండ్‌కు పంపుదాం

ఆరోగ్యం కోసం ఏదో ఒక 'ఆట'.. మారుతున్న తల్లిదండ్రుల ధోరణి

ఒకనాడు ఆటలు అన్నం పెడతాయా..? అని అన్నవారే నేడు చలో గ్రౌండ్‌కు వెళ్దాం... అంటూ చేయిపట్టుకుని తీసుకెళ్తున్నారు..!

పొద్దంతా ఆటల్లోనే మునిగి తేలుతూ ఉంటే చదువేం కావాలి..? అని తప్పుబట్టినవారే.. నీకు ఇష్టమైన క్రీడలో ఎంత దూరమైనా వెళ్దాం అంటున్నారు..!

ఆటలు ఉద్యోగాలు కల్పిస్తాయా? పుస్తకాలతో కుస్తీ పడితే జీవితంలో నిలదొక్కుకోవచ్చు కదా? అని చెప్పినవారే ఇప్పుడు క్రీడలతోనూ కొలువులు కొట్టొచ్చని.. మరింత గొప్పగా స్థిరపడవచ్చని గట్టిగా నమ్ముతున్నారు..!

సాక్షి స్పెషల్ డెస్క్: పిల్లల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోంది. స్కూల్ వర్క్ అయిపోయాక, సెలవు రోజుల్లో.. సెల్‌ఫోన్ లేదంటే టీవీలకు అతుక్కుపోతూ శారీరక శ్రమకు దూరమవుతుండడం వారిని ఆలోచనలో పడేసింది. బాగా చదివితేనే కెరీర్ ఉంటుందన్న ఆలోచన నుంచి బాగా ఆడినా మంచి కెరీర్ ఉంటుందనే స్థితికి వచ్చారు. దీంతో శారీరక, మానసిక వికాసానికి మైదానాలకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు పిల్లలు మారాం చేస్తుంటేనో.. అల్లరిగా తిరుగుతుంటేనో.. వారిని గాడిన పెట్టేందుకు తల్లిదండ్రులకు ఆటలు ప్రత్యామ్నాయంగా కనిపించేవి. ఇప్పుడు కెరీర్ నిర్మాణం కోసం సాధనంగానూ చూస్తున్నారు. స్పోర్ట్స్ క్లబ్‌లు, మైదానాలకు తీసుకెళ్తున్నారు. హైదరాబాద్‌లో ఓ చార్టెర్డ్ అకౌంటెంట్ తన కుమారుడిని క్రికెట్‌కు అంకితం చేశారు. డ్రైవర్‌తో పాటు కారు, అన్ని వసతులు సమకూర్చారు. స్కూల్ నుంచి ప్రత్యేక పర్మిషన్ తీసుకున్నారు. ఇప్పుడా కుర్రాడు ఏజ్ గ్రూప్‌లో సెంచరీల మీద సెంచరీలు కొడుతూ అండర్-19 జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా ఎదిగాడు. ఇలా సంపన్నులే కాదు.. మధ్య తరగతి, కొందరు కిందిస్థాయి ఉద్యోగులు, చిరు వ్యాపారులు సైతం పిల్లలను ఏదో ఒక స్పోర్ట్స్ యాక్టివిటీలో చేరుస్తున్నారు. మరీ ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. మారుతున్న జీవనశైలితో పిల్లలకు శారీరక శ్రమ, వ్యాయామం తప్పనిసరి అని తెలిసొచ్చింది. ఏదో ఒక క్రీడలో శిక్షణ ఇప్పించాలనే కోరిక తల్లిదండ్రుల్లో కలుగుతోంది. ఈ నేపథ్యంలో మూడేళ్ల నుంచి మైదానాలకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. రోజువారీ శిక్షణకు గ్రామాల నుంచి జిల్లా కేంద్రాలు, పట్టణాలకు వస్తున్నవారూ ఉండడం విశేషం.

చదువును నిర్లక్ష్యం చేయకుండానే..

పిల్లలకు నచ్చిన క్రీడలో ప్రవేశం కల్పించి.. వారు రాణిస్తుంటే భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. హైదరాబాద్ వంటి చోట్ల భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే.. పిల్లల కెరీర్ కోసం వర్క్ ఫ్రమ్ హోం చేస్తూనో లేదా ఒకరు జాబ్ వదిలేయడమో చేస్తున్న ఉదాహరణలున్నాయి. ఇంకొందరు చదువును నిర్లక్ష్యం చేయకుండా చూసుకుంటున్నారు. ఏదో ఒకటి తేల్చుకోవాల్సి వస్తే మాత్రం క్రీడల వైపే మొగ్గుచూపుతున్నవారూ ఉన్నారు. ఉన్నత విద్యా కోర్సుల్లో క్రీడా కోటా ఉండడమే దీనికి కారణం.


ఎక్కువగా వ్యక్తిగత క్రీడాంశాల వైపు..

జట్టు క్రీడాంశాల్లో విజయం దక్కాలంటే సమష్టి ప్రదర్శన కీలకం. అందుకని తల్లిదండ్రులు వ్యక్తిగత క్రీడాంశాల వైపు మొగ్గుచూపుతున్నారు. అందరి దృష్టిలో పడేందుకు, ఆటతీరు బేరీజు, మెరుగుపర్చుకునేందుకు వ్యక్తిగత క్రీడాంశాలు అయితే పెద్దగా ఇబ్బంది ఉండదు.

స్పోర్ట్స్‌లో సత్తా చాటితే..

స్పోర్ట్స్‌లో సత్తాచాటి సర్టిఫికెట్ సాధిస్తే ఎంబీబీఎస్, ఇంజనీరింగ్‌తో పాటు అన్ని ప్రొఫెషనల్ కోర్సుల అడ్మిషన్లలో 0.5 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ ఉంటుంది. అయితే, ఏ రంగంలోనైనా లక్ష్య సాధనకు సరైన కార్యాచరణ రూపొందించుకోవడం.. పక్కా ప్రణాళికతో అమలు పరచడం ముఖ్యం. క్రీడలూ దీనికి మినహాయింపు కాదు. పిల్లలు వెంటనే అద్భుతాలు చేయాలని ఆశించకుండా కావాల్సినంత సమయం ఇవ్వాలి. జాతీయ స్థాయిలో విజేతలకు సర్వీసెస్, రైల్వేస్, పెట్రోలియం స్పోర్ట్స్ బోర్డు, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, కేంద్ర క్రీడాప్రాధికార సంస్థలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి దాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరితే ఆర్థిక భరోసా లభిస్తుందనడంలో సందేహం లేదు.

- ఆస్ట్రేలియా జనాభాలో 71.8 శాతం, జపాన్‌లో 60.3 శాతం స్పోర్ట్స్ ఆడుతున్నారు. ఇండియాలో వీరు 6 శాతం మాత్రమే.



మా వాడిని గాడిన పెట్టండి ప్లీజ్..

ఇటీవలి కాలంలో సూపర్ హిట్ కొట్టిన ఓ సినిమా హీరో కుమారుడు (11) ఇంట్లో సెల్‌ఫోన్‌కు బానిసయ్యాడు. ఏమాత్రం శారీరక శ్రమ లేకపోవడంతో బరువు కూడా బాగా పెరిగాడు. అతడిని దారికితేవడం ఎలా అనేది హీరో కుటుంబానికి పెద్ద సమస్యగా మారింది. దీనికి పరిష్కారం క్రీడలేనని భావించి కోచింగ్‌లో చేర్పించారు. 'ముందు మావాడి ఫిజికల్ యాక్టివిటీ పెంచండి... తర్వాత ఆట నేర్పించండి. అప్పుడైనా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటాడు' అని కోచ్‌ను హీరో భార్య కోరడం గమనార్హం.



కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతూ..

మానసిక, శారీరక ఎదుగుదలకు..

- ప్రతి రోజూ సగటున పిల్లలు 5-7 గంటలు స్క్రీన్ ముందు గడుపుతున్నారు. క్రీడల ద్వారా ఈ స్క్రీన్ టైమ్‌ను తగ్గించడంతో పిల్లల్లో దృష్టి సమస్యలు, మానసిక ఒత్తిడి తగ్గి, బుద్ధి వికాసం మెరుగవుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు.
- ఈ కాలం పిల్లల్లో మనో వికాసం, జ్ఞాపకశక్తి తగ్గుతోంది. నాన్ డిజిటల్ గేమ్స్ ఆడేవారిలో జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉంటుందని అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి.
- స్పోర్ట్స్ ఆడేవారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎక్కువగా ఉంటాయి. పాజిటివ్ దృక్పథం, క్రమశిక్షణ, జీవితంపై కసి, పట్టుదల ఏర్పడతాయి. గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుంది.
- ఆటలు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి. వ్యక్తిగా ఎదిగేందుకు దోహదం చేస్తాయి.
- సెల్‌ఫోన్ వ్యసనం, ఒంటరితనం, ఉత్సాహరాహిత్యాన్ని తగ్గించడానికి క్రీడలు అద్భుత మార్గం.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం పిల్లలకు కనీసం రోజుకు 60 నిమిషాల శారీరక శ్రమ (ఫిజికల్ యాక్టివిటీ) తప్పనిసరి.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనం ప్రకారం భారత్‌లో 90 శాతం పిల్లలు సిఫార్సు చేసిన శారీరక వ్యాయామాన్ని పాటించట్లేదు.

స్పోర్ట్స్ సందడే సందడి..



- హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని ఓ ప్రైవేటు క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో రెండేళ్ల కిందటి వరకు 20 మంది పిల్లలు కూడా ఉండేవారు కాదు. ఇప్పుడు వీరి సంఖ్య 80కి పెరిగింది.
- హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టేడియంలో బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే తదితర వ్యక్తిగత క్రీడల్లో శిక్షణకు వస్తున్నవారి సంఖ్య కొన్ని రోజుల్లోనే రెట్టింపైంది.
- విజయవాడలో 25 ప్రైవేటు క్రికెట్ కోచింగ్ సెంటర్లు, 22 బ్యాడ్మింటన్, 6 టెన్నిస్ అకాడమీలు, 12 చెస్ కోచింగ్, 30 యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 6 వేల మంది పైగా శిక్షణ పొందుతున్నారు.
- విశాఖపట్నం వాటర్ స్పోర్ట్స్‌కు హబ్‌గా ఉంది. క్రికెట్‌తో పాటు రైఫిల్ షూటింగ్, చెస్, స్విమ్మింగ్, క్రికెట్, వాలీబాల్ కోచింగ్ ఇస్తున్నారు. నెల్లూరు జిల్లాలో 20 ప్రైవేటు ఇండోర్ స్టేడియాలు ఉన్నాయి.
- అనంతపురం ఆర్డీటీ ఆధ్వర్యంలో హాకీ, ఫుట్‌బాల్, టెన్నిస్, క్రికెట్, ఆర్చరీ, సాఫ్ట్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు.

బుమ్రా స్టయిల్.. హార్దిక్ ఆటిట్యూడ్

కొందరు పిల్లలపై భారత జాతీయ క్రీడాకారుల ప్రభావం చాలా ఉంటోంది. క్రికెట్ అకాడమీల్లో పదేళ్ల వయసు పిల్లలు టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా డిఫరెంట్ బౌలింగ్ స్టయిల్‌ను ప్రాక్టీస్ చేస్తున్నారు. మరికొందరు ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఆటిట్యూడ్‌ను ఫాలో అవుతున్నారు. మాజీ క్రికెటర్ మిథాలీరాజ్ జీవిత కథ ఆధారంగా నిర్మించిన 'శభాష్ మిథు' వంటి సినిమాలు చూసి స్ఫూర్తి పొంది గ్రౌండ్‌కు వెళ్తున్న బాలికలూ ఉండడం గమనార్హం. మరికొందరు అమ్మాయిలైతే కామ్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధును ఆరాధిస్తున్నారు. కాబట్టి.. పరీక్షలు ముగిశాయి.. ఇంటిపట్టునే ఉండకుండా పిల్లలను సమీపంలోని క్రీడా మైదానాలకు తీసుకువెళ్లండి.. వారికి ఇష్టమైన ఆటలు ఆడనివ్వండి... సహజ నైపుణ్యం ఉంటే సెలవుల తర్వాత కూడా కొనసాగించండి.. ఏమో వారిలో భవిష్యత్ చాంపియన్స్ ఉండవచ్చు! ఆల్ ద బెస్ట్...!

వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి



మాది ఆత్మకూరు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. మా అక్కలు ఇద్దరూ ఫుట్‌బాల్‌తో నేషనల్స్ ఆడి ఆర్థిక కష్టాలతో ఆపేశారు. నేను ఫుట్‌బాల్‌లో ఇండియాకు ఆడుతున్నా. ఇందులో ఆర్డీటీ సహకారం మరువలేనిది.

– అనూష, జాతీయ ఫుట్‌బాల్ జట్టు సభ్యురాలు, అనంతపురం

అంతర్జాతీయ స్థాయిలో ఆడించడం నా కల



మా కుమారుడు సాయి శంకర్ టెన్నిస్ స్కూల్ గేమ్స్‌లో మూడుసార్లు నేషనల్స్ ఆడాడు. ఎన్ని కష్టాలు ఉన్నా అన్నీ పక్కనపెట్టి పుణె, పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్ వంటి చాలాచోట్ల శిక్షణ ఇప్పించా. ఆర్థిక సహకారం ఉంటే మరింత మెరుగైన శిక్షణతో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నది నా లక్ష్యం.

– దేశం చంద్రశేఖర్, సాయి శంకర్ తండ్రి, కర్నూలు

శిక్షణ బాగుంది..



మా అబ్బాయి జాన్ అభిషేక్ 9వ తరగతి! ఏడాదిగా డీఎస్ఏలో రైఫిల్ షూటింగ్‌కు వెళుతున్నాడు. ప్రస్తుతం ఉన్న 10 మీటర్ల రేంజ్‌ను 25 మీటర్లుగా అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే పిల్లలు పతకాలు సాధిస్తారు.

– ఎం.షీల, కాకినాడ

అత్యుత్తమ శిక్షణ



విశాఖలో బాక్సింగ్, వాలీబాల్‌లో రెసిడెన్షియల్‌గా శిక్షణ ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల క్రీడాకారులు కూడా ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. స్పోర్ట్స్‌పై ఇటీవల పిల్లల్లో ఆసక్తి పెరిగింది. ఇది మంచి పరిణామం. క్రీడల్లో ఉన్నవారు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారు.

– సత్యనారాయణ, కోచ్, విశాఖపట్నం

క్లుప్తంగా...

ఫీజులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర



సాక్షి, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను కూటమి సర్కారు చెల్లించని కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తోన్న విద్యార్థులు చదువులకి దూరమవుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర శనివారం పేర్కొన్నారు. విద్యార్థుల్ని కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల కోసం విద్యార్థుల్ని వేధించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెంట్రల్ జైలుకు మాజీ ఎంపీ గోరంట్ల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. శనివారం ఉదయం 5.20 గంటల సమయంలో మాధవ్‌తో పాటు మరో ఐదుగురిని 14 రోజుల రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలు అధికారులకు అప్పగించారు. మొదట నెల్లూరు జైలుకు రిమాండ్ కోసం పంపాలని న్యాయమూర్తి ఆదేశించినప్పటికీ అక్కడ ఇబ్బందులు ఉన్నాయని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం జైలుకు తీసుకువచ్చారు. గోరంట్ల మాధవ్‌తో పాటు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన రమేష్, దామోదర్, శివప్రసాద్, శివయ్య, సురేందర్ 14 రోజుల రిమాండ్‌లో ఉండనున్నారు.

ఉదయం 6 గంటలకే ఫీల్డ్‌లో ఉండండి

టెలీకాన్ఫరెన్స్‌లో కమిషనర్లను ఆదేశించిన మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: మున్సిపల్ కమిషనర్లు రోజూ ఉదయం 6 గంటల నుంచే క్షేత్ర స్థాయి పర్యటన చేయాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. శనివారం మున్సిపల్ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనారోగ్య కారణాలతో క్షేత్ర స్థాయి పర్యటన చేయలేని అధికారులకు డైరెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగిస్తామని నారాయణ చెప్పారు. అధికారులు సైతం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగం కావాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు సబబే

గవర్నర్లకు కాల పరిమితి విధించడం తప్పేమీ కాదు

సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని గవర్నర్లు కల్పించారు

ఇటీవలి కాలంలో ప్రభుత్వాలను ఇబ్బంది పెడుతున్నారు

న్యాయ నిపుణుల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: శాసనసభ ఆమోదించిన బిల్లులపై తమ నిర్ణయం వెలువరించే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు కాల పరిమితిని ఖరారు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును న్యాయ నిపుణులు స్వాగతిస్తున్నారు. రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి విధించడం తప్పేమీ కాదని స్పష్టంచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సిందేనని, ఇందుకు రాష్ట్రపతి, గవర్నర్లు అతీతులు కాదంటున్నారు. బిల్లుల విషయంలో గవర్నర్లు చేస్తున్న అసాధారణ, రాజకీయ జాప్యం వల్ల ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడకుండా సుప్రీంకోర్టు తీర్పు రక్షిస్తుందని పేర్కొంటున్నారు. ఇది చారిత్రక తీర్పుగా అభివర్ణిస్తున్నారు.

ప్రజా తీర్పును గవర్నర్లు అడ్డుకోలేరు



చట్టసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్లను, మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రపతిని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా సమర్థిస్తున్నా. చట్టసభల నిర్ణయాల్లో ప్రజల ప్రయోజనాలే ప్రతిబింబిస్తుంటాయి. చట్టసభలు తీసుకునే నిర్ణయాలను రాష్ట్రపతి చేత నామినేట్ అయ్యే ఓ గవర్నర్ తన ఇష్టానుసారం అడ్డుకోవడం సబబు కాదు. ఇది రాజ్యాంగ విరుద్ధం. సుప్రీంకోర్టు తీర్పు చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది.

– సీవీ నాగార్జునరెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది

ఇది సరైన తీర్పే



సుప్రీంకోర్టు సరైన తీర్పే ఇచ్చింది. గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా నడుచుకోకపోవడం, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నచోట ఆ ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడం చేస్తున్నారు. ఇటీవల గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను రాజకీయంగా దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. పరిధులు దాటుతున్నారు. రాజ్యాంగ విలువలకు, సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను పట్టించుకోవడం లేదు. గవర్నర్ల తీరుతో సుప్రీంకోర్టు విధిలేని పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తాజా తీర్పునిచ్చింది.

– సీవీ మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది

న్యాయ సమీక్ష తప్పేమీ కాదు



చట్టసభల ఆమోదం పొందిన బిల్లుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్రపతికి నిర్దిష్ట గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేక కోణంలో చూడాల్సిన అవసరం లేదు. రాజ్యాంగానికి లోబడే సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. తన వద్దకు వచ్చే బిల్లుల విషయంలో నిర్ణయానికి సంబంధించి రాష్ట్రపతికి ఇప్పటివరకు నిర్దిష్ట గడువు అంటూ లేదు. గడువు లేదన్న నెపంతో ఏళ్ల తరబడి ఆ బిల్లులను అలా పెండింగ్‌లో పెట్టుకుంటామంటే ఎలా? ప్రజల ఆకాంక్షలు ఏం కావాలి? శాసనసభ చేసిన బిల్లులు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే అందులో రాష్ట్రపతి, గవర్నర్లు జోక్యం చేసుకోవచ్చు. అలాగే ఆ బిల్లులు ఏకపక్షంగా, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంటే కోర్టులు జోక్యం చేసుకుంటాయి. గవర్నర్ల తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నప్పుడు, వారి నిర్ణయాలు రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు కోర్టులు న్యాయ సమీక్ష చేయడం తప్పేమీ లేదు. సుప్రీంకోర్టు అదే చేసింది.

– చిత్తరవు నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది

రేషనలైజేషన్‌తో సచివాలయ ఉద్యోగుల్లో గందరగోళం


ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, అమరావతి: 'రేషనలైజేషన్ పేరిట గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం చేస్తున్న మార్పులతో ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. ఇది కచ్చితంగా సచివాలయ ఉద్యోగులను తగ్గించే చర్య. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోంది' అని వైఎస్సార్‌సీపీ పెన్షనర్స్ అండ్ ఎంప్లాయీస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొద్దికాలంలోనే దేశంలోనే ఎక్కడా లేని విధంగా 2019 అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నాడు ఒకేసారి 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ప్రారంభించారు. ఒక్కో సచివాలయంలో పది మంది శాశ్వత ఉద్యోగులను నియమించి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను చేర్చారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో 25వేల ఉద్యోగాలు, రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు)లో 4వేల పోస్టులు ఖాళీగా ఉన్నా కూటమి ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. మరోవైపు 1.27 లక్షల ఉద్యోగుల్లో 15 వేల మంది ఎక్కువగా ఉన్నారంటూ ప్రచారం చేస్తోంది. రేషనలైజేషన్ పేరుతో జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ఉద్యోగుల సంఖ్యను కూడా తగ్గిస్తోంది. ఈ మేరకు జీవో నంబర్ 1 జారీ చేసింది. ఉద్యోగులను విభజిస్తోంది. స్థానికులు సమస్యలపై నిలదీస్తే భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిని దూషించారు' అని చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

బీసీలు చదువుకోవడం చంద్రబాబుకు ఇష్టం ఉండదు

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆగ్రహం



రాజమహేంద్రవరం సిటీ: 'బీసీలు ఎప్పటికీ చదువుకోకూడదు. విద్యావంతులు కాకూడదు. కేవలం కులవృత్తులకే పరిమితం కావాలి.. అనే దుర్మార్గపు ఆలోచనను సీఎం చంద్రబాబు చేస్తున్నారు.' అని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన శనివారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ సమాజంలో బీసీలు కూడా అందరితో సమానంగా ఎదగాలని, అందుకు విద్య ఒక్కటే మార్గమని మహాత్మా జ్యోతిరావు పూలే భావించారని తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తి జయంతి పేరిట ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీలను ఇంకా కుల వృత్తులకే పరిమితం చేస్తూ వారిని అణగదొక్కాలనే మనువాద భావజాలాన్ని చంద్రబాబు ప్రదర్శించారని మండిపడ్డారు. 'బీసీలపై చంద్రబాబు ప్రేమంతా కపట నాటకం. వారి అభివృద్ధిపై ఆయనకు ఏనాడూ చిత్తశుద్ధి లేదు. ఇన్నాళ్లూ బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారు. బీసీలపై చంద్రబాబుకు నిజంగా ప్రేమ ఉంటే గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఎందుకు కొనసాగించడం లేదు? బీసీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న అమ్మఒడిని ఎందుకు అమలు చేయడం లేదు? ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎందుకు నిర్వీర్యం చేశారు? వసతి దీవెన, విదేశీ విద్యా దీవెనకు ఎందుకు మంగళం పాడారు? ఒకవైపు పథకాలు ఆపేసి బీసీల వెన్ను విరిచారు. మరోవైపు జోగి రమేష్, గోరంట్ల మాధవ్ వంటి బీసీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు..' అని చెల్లుబోయిన వేణు ఆగ్రహం వ్యక్తంచేశారు.

న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచాలి

ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసమూర్తి



సమావేశాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసమూర్తి

సాక్షి, అమరావతి: న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచే దిశగా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ అధివక్త పరిషత్ (ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి అన్నారు. ఈ విషయంలో ఏబీఏపీ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుందని చెప్పారు. ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం గుంటూరు జిల్లా, చినకాకానిలో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 175 మంది న్యాయవాద ప్రతినిధులు, అండమాన్ నికోబార్‌కు చెందిన న్యాయవాదులు సైతం హాజరయ్యారు. కె.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఈ సమావేశాల ఉద్దేశాన్ని ఫలప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ న్యాయవాది పరిషత్ ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు మాట్లాడుతూ ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఏపీలో నిర్వహించడం తమకు గర్వకారణమన్నారు. ఏబీఏపీ ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు న్యాయవాది దివ్వెల భరత్‌కుమార్, కేంద్ర కార్యాలయం కార్యదర్శి సంతోష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఏపీ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే శ్రీధర్ ఒంటెత్తు పోకడలపై కార్యకర్తల ఆగ్రహం
- టీడీపీ కార్యాలయంపై దాడి.. అద్దాలు ధ్వంసం, విరిగిన కుర్చీలు
- రెండు గంటలపాటు ఇన్‌చార్జి మంత్రి దిగ్బంధం



కుర్చీలు ధ్వంసం చేసిన కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలోనే టీడీపీ నూతన కార్యాలయంపై దాడి జరిపి అద్దాలు ధ్వంసం చేశారు. జనసేన ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. దీంతో జాతీయ రహదారిపై మూడు గంటలపాటు గందరగోళ వాతావరణం నెలకొంది. మంత్రి జనార్దన్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ కార్యాలయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. 2 గంటల తర్వాత పోలీసుల సమక్షంలో షట్టర్లు తెరిచి మంత్రిని, మిగిలిన వారిని బయటకు పంపించారు.

ఇదీ నేపథ్యం

టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు చాలాకాలంగా రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ టీడీపీ మనుగడను కాపాడారు. అయితే, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన ముక్కా రూపానందరెడ్డికి చంద్రబాబు పార్టీ పగ్గాలు అప్పగించడంతో టీడీపీ వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. నూతన ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తన ప్రాబల్యంతో చంద్రబాబును ఒప్పించి జనసేనకు కేటాయించిన సీటును తన వర్గీయుడు అరవ శ్రీధర్‌కు ఇప్పించుకున్నారు. అనంతరం వీరిద్దరు ఒంటెత్తు పోకడలతో టీడీపీ నేతలను దూరం పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ అభిమానులు మంత్రి రాకను తెలుసుకుని అక్కడికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేసి గందరగోళం సృష్టించారు. కాగా.. రైల్వేకోడూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి విశ్వనాథనాయుడు, పంతగాని నరసింహ ప్రసాద్ పార్టీ కార్యాలయం లోపల ఉన్న మంత్రిని కలిసి పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్ల నుంచి తాము పని చేస్తున్నప్పటికీ చిన్నచూపు చూడటం సబబు కాదని తెలిపారు. అనంతరం మాజీ ఇన్‌చార్జి విశ్వనాథ నాయుడు మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తిని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా నియమించినా పార్టీపై అభిమానంతో అధిష్టానం మాటల్ని నమ్మి ఇన్‌చార్జికి సహకరిస్తూ వచ్చామన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, ఒంటెత్తు పోకడలు సరికాదన్నారు. ఈ ఘటనతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే ఏమీ మాట్లాడకుండా మౌనంగా అక్కడి నుంచి నిష్క్రమించడం గమనార్హం.

నోస్టాల్జియా



వేసవి అలాగే ఉంది.. సూరిబాబు కూడా ఏం మార్లేదు.
కాని రోజులే మారిపోయాయి.
అలనాటి వేసవికి ఇప్పటి వేసవికి
సేమ్యా ఐస్‌కు క్రీమ్ స్టోన్‌కు ఉన్నంత తేడా ఉంది.
ఊళ్లకు వెళ్లడం బంధువుల పిల్లలతో గడపడం
ఇప్పుడు ఏడ?
పరీక్ష... పరీక్ష తర్వాత ఎంట్రన్స్...
లేదా బ్రిడ్జ్ కోర్స్... కాకుంటే స్పెషల్ ఇంగ్లిష్..
ఓహ్..
అలా చూడండి సీమచింత గుబ్బలు గుర్తు చేసుకోండి.
మీ పిల్లలకు వేసవి హక్కులు ఇవ్వండి.
వారి రాజ్యాంగాన్ని పరిరక్షించండి!

సేమ్యా ఐస్... ఆరంజీ సోడా...

సెలవులొచ్చాయంటే పరీక్షలు అయిపోయినట్టు. లేదా పరీక్షలైపోయాయంటే సెలవులొచ్చినట్టు. సరిగా చెప్పాలంటే ఏప్రిల్, మే నెలలు వచ్చాయంటే పిల్లలకు పండుగ వచ్చినట్టు.

ఆ నెలలు వారివి. ఆ నెలలకు రాజులు వారు. ఆ నెలలు వారికి ఆహ్లాదం పంచేందుకు వచ్చేవి. ఆటలు నేర్పేందుకు వచ్చేవి. సరదాలు తీర్చేందుకు వచ్చేవి. బస్సెక్కి వస్తావో రైలెక్కి వస్తావో అని... ఒకరి ఇంటికి మరొకరు వెళ్లేందుకు, వెళ్లి ఉండేందుకు ఆ నెలలు వచ్చేవి.

వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లల కోసం జ్ఞాపకాలు తెచ్చాయని అర్థం.

కాని ఇవాళ? సెలవులైన వెంటనే ఐఐటి ఫౌండేషన్ అంటున్నారు. పై క్లాసులకు బ్రిడ్జ్ కోర్స్ అంటున్నారు. స్పెషల్ ఇంగ్లిష్ క్లాసుల్లో పెడుతున్నారు. ఎప్పుడో రాబోయే పరీక్షలకు ఇప్పటినుంచే ప్రిపేర్ చేయిస్తున్నారు. పరీక్షలు అయిపోయినా పరీక్షల బాధ తప్పడం లేదు. ఇలా బాధిస్తున్న తల్లిదండ్రులందరూ ఒకప్పుడు వేసవి సెలవుల్లో ఎంజాయ్ చేసిన వారే. వారికి దక్కింది పిల్లలకు కూడా దక్కాలని ఎందుకు కోరుకోవడం లేదు?

ఏ ఊరికి వెళుతున్నారు?

పరీక్షలు మొదలైనప్పటి నుంచి పరీక్షలయ్యాక ఏ ఊరికి వెళ్లబోతున్నారో పిల్లలకు తెలిసేది. బాబాయి ఊరా? మేనత్త ఊరా? అమ్మమ్మ ఊరా? ఏ ఊరు వెళితే ఎవరు తోడుంటారు... వారితో ఎలాంటి ఆటలు ఆడొచ్చు. ఎగ్జయిట్‌మెంట్‌తో నిద్ర పట్టేది కాదు. పరీక్షలు ఎంత త్వరగా అవుతాయా అని ఎదురు చూపులు. నాన్న పర్మిషన్ దొరికితే అమ్మతోపాటు చలో ఊరు. వేసవి సెలవుల్లో ఊళ్లకు ఎందుకు వెళతారంటే వచ్చాక ఫ్రెండ్స్‌కు గొప్పలు చెప్పుకోవాలి గదా మరి. మేం వెళ్లిన ఊళ్లో ఎన్ని సినిమా హాళ్లు ఉన్నాయో తెలుసా? సెకండ్ షోలకు ఎలా వెళ్లామో తెలుసా? ఏం తిన్నాం ఏం తాగాం... ఏ స్టిక్కర్లు కొనుక్కున్నాం... ఎన్ని గోలీలు సేకరించాం... క్రికెట్ ఆడితే బంతి ఎన్నిసార్లు కనపడనంత దూరం వెళ్లి మాయమైంది... పొలాలు చూడటం... తాటి ముంజలు తినడం... సముద్ర స్నానంలో జేబుల్లో నిండిన ఇసుక... నది ఒడ్డున జలకాలాట... ఎడ్లబండి సవారీ... ఆరుబయట పక్కలేసుకుని నిద్ర.... ఎన్నని! వింటున్న స్నేహితులు కుళ్లుకుంటే ఆనందం. కాని నేడు? వేసవి సెలవుల్లో పిల్లల్ని ఇల్లు కదలనీకుండా చేయడం వల్ల తెల్లమొహాలేసుకుని తర్వాతి క్లాసుకు వెళుతున్నారంతే.

మేసే నోళ్లు... సీజన్ చిరుతిళ్లు

ప్రతి సీజన్‌కు చిరుతిళ్లు ఉంటాయి. వేసవి చిరుతిళ్లు మాత్రం పిల్లల కోసమే తయారవుతాయి. ఐస్‌బండ్లు గంట గణగణలాడిస్తూ ఊళ్లలో తిరుగుతాయి. ఆరంజ్ ఐస్, ద్రాక్షా ఐస్, బాదం ఐస్, పాల ఐస్, సేమ్యా ఐస్.... ఐస్ చప్పరించడం కూడా కళే. విరిగి కింద పడకుండా పుల్ల మిగిలేలా ఐస్ తిన్నవాడే మొనగాడు. ఇవిగాక ముద్ద ఐస్. అంటే ఐస్ గోలా. ఐస్‌ను పిండి పిండి చేసి ఒక పుల్లకు ముద్దలా అదిమి దాని మీద రంగు రంగుల ఎసెన్స్ పోసి ఇస్తారు. ఈ ముద్ద ఐస్‌ను జుర్రుకుంటూ ఉంటే నా సామి రంగా. ఇవేనా? ఐస్‌సోడా... సుగంధ... మసాలా మజ్జిగ.... పుదీనా నీరు... చెరకు రసం... కొబ్బరి నీళ్లు... ప్రతి ఇంట్లో రస్నా కొన్నాళ్లు రాజ్యం ఏలింది.... బెంగ ఖూరు మామిడిని పలుచగా కోసి ఉప్పు కారంతో పాటుగా అమ్ముతారు... వహ్వా... జీడిమామిడి కాయలు అమ్ముతారు... సీమచింత గుబ్బలు అమ్ముతారు.... పిల్లలు బకాసురులవుతారు. సెలవుల్లో ఖర్చు పెట్టడానికి దాచిన మట్టి కుండీలను పగుల గొడతారు.

ఆటలో ఆటలు

రాబోయే విద్యా సంవత్సరానికి సరిపడా శారీరక బలం, దృఢత్వం వేసవిలో పిల్లలకు వస్తుంది. అలాంటి ఆటల డిజైన్ మనకు ఉంది. కుందుడు గుమ్మ, ఒంగుళ్ల దూకుళ్లు, దాగుడుమూతలు, కోతి కొమ్మచ్చి, నేలా మిట్ట, దొంగ పోలీస్, ఐస్‌బాయ్, గోలీలాట, బిళ్లంగోడు... ఇవన్నీ శరీరానికి తర్ఫీదు ఇస్తే, కూచుని ఆడే ఆటలు పరమపద సోపానపటం, చుక్కచుక్కపుల్ల, పులిజూదం, గవ్వలాట, సీతారాములు... ఇవన్నీ బుద్ధిని పదును పెడతాయి. కొత్త ఊళ్లో కొత్త స్నేహితులవుతారు. మళ్లీ వేసవికి తప్పకుండా రావాలని వీరు మాట తీసుకుంటారు.

అనుబంధాల కాలం

వేసవి సెలవులొచ్చేది అనుబంధాలు పెనవేయడానికి... బంధాలు నిలబెట్టడానికి. తల్లి తరఫువారు తండ్రి తరుపు వారు ఎవరు ఎవరో పిల్లలకు ఈ సీజన్‌లో తెలుస్తుంది. వారి పిల్లలు తెలుస్తారు. వీరంతా మనవారన్న మాట అనే భావం వారికి ఆనందం ఇస్తుంది. వారిలో వారు పార్టీలు కట్టుకుంటారు. పెద్దవాళ్లు పిల్లలను దగ్గరకు తీస్తారు. బట్టలు కుట్టిస్తారు. కానుకలు కొనిపెడతారు. ముద్దు చేస్తారు. అమ్మా నాన్న కాకుండా మనల్ని ముద్దు చేసే వారు వేరే ఉన్నారన్న భావన కూడా పిల్లలకు చాలా బాగుంటుంది. కొందరికి మేనత్త నచ్చుతుంది. కొందరు బాబాయికి అంటుకు పోతారు. కొందరు పెదనాన్న పార్టీ. కొందరు పెద్దమ్మలకు ఫ్యాన్స్ అవుతారు. తాతయ్య ఎన్నో కబుర్లు చెబుతాడు. ఆకాశం కింద పక్కలు వేసి నానమ్మ చెప్పే కథలు జీవితాంతం తోడుంటాయి.

ఏవీ ఆ నిరుడు కురిసిన హిమ సమూహాలు?

ఆలోచించి చూడాలి. పిల్లలు ఏం పొందుతున్నారు. జీవితంలో ఏ జ్ఞాపకాలు దాచుకుంటున్నారు. ఏ బంధాలను బలపరుచుకుంటున్నారు. వారిని ఈ జీవన ధోరణి ఒంటరిని చేస్తూ పోతోందా లేదా తనవాళ్లతో బలపడేలా చేస్తోందా? ఇవాళ పిల్లలు ఏ సమస్య వచ్చినా తల్లిదండ్రులతో చెప్పుకోలేక ఏ అత్తయ్యకో, బాబాయికో చెప్పుకోవాలనుకుంటే అలాంటి బంధాలను ఈ వేసవిలోనే కదా పాదువేయాలి. పాదువుకునేలా చేయాలి. కజిన్స్ బలం లేకుండా పోయిన పిల్లలు ఎందుకు పెరుగుతున్నారు. పెద్దల మధ్య తగాదాలు పిల్లల మధ్య వరకూ ఎందుకొస్తున్నాయి. మన సొంత మనుషులే లేకపోతే బయట వారు జీవితంలో ఎందుకు తోడు నిలబడతారు?

వేసవి ఎండల్ని కాదు. సందేశాలను తీసుకువస్తుంది. వేసవి సెలవులు సంవత్సరం మొత్తానికి అవసరమైన రిపేర్లు చేసుకోమని చెప్పడానికి వస్తుంది. పిల్లలకు హక్కులు వున్నాయి. వేసవి సెలవులు అయినవారితో గడపడం వారి హక్కు. ఆ హక్కును వారికి ఇవ్వండి. వాటిని కోల్పోయేలా చేస్తే వారు పెద్దయ్యాక మనం మరేదో కోల్పోయేలా చేస్తారు.

– కె



ప్రగతి

మెనోపాజ్ గురించి ఎంత మాట్లాడితే అంత అర్థమవుతుంది..
అర్థమైతేనే దాని మేనేజ్‌మెంట్ తెలుస్తుంది!
అందుకే మెనోపాజ్ ఎక్స్‌పీరియెన్స్‌ను షేర్ చేసుకోవడానికి
ముందుకొచ్చారు టాలీవుడ్ ప్రముఖ నటి ప్రగతి..
ప్లాట్‌ఫామ్ దొరికినప్పుడల్లా మెనోపాజ్ గురించి మాట్లాడుతూంటే
అది చర్చగా మారుతుంది. అవగాహన కలుగుతుంది.
ఆడవాళ్ల పట్ల కేర్ పెరుగుతుంది అంటున్నారు...

షేర్ చేసుకుందాం కేర్ తీసుకుందాం

ఉ మెనోపాజ్ అర్థం చేసుకుందాం

నిర్వహణ: సరస్వతి రమ

నిజంగా చెప్పాలంటే ఇది నేను ఎక్స్‌పీరియెన్స్ చేస్తున్న ఫేజ్. మానసికంగా ఇదెంత ప్రభావం చూపుతోందంటే.. కోపం.. బాధ.. దుఃఖం.. ఆవేశం.. ఇలా ఎమోషన్స్ ఏవీ మన కంట్రోల్‌లో ఉండవు. దేనికి ఎలా రెస్పాండ్ అవుతున్నామో తెలియదు. ఒక రకమైన అలజడి. వణుకు తెప్పిస్తుంది. భయపెడుతుంది. మనల్ని మనమే గుర్తుపట్టలేని పరిస్థితిని కల్పిస్తుంది.

గట్టి దెబ్బే కొడుతుంది..

దీన్ని తట్టుకోవడం చాలా కష్టం. ఈ మూడ్ స్వింగ్స్ వల్ల మనమేం చేస్తున్నామో మనకే తెలియదు. ఆ సమయంలో మన పనులు డ్యామేజింగ్‌గా కూడా ఉండొచ్చు. అది ఎదుటి వ్యక్తులను హర్ట్ చేయొచ్చు. మన ఈ ప్రవర్తన ఇంట్లో వాళ్లకూ అర్థమవడం కష్టం. ఫ్రెండ్స్‌కి చెప్పుకుందామనుకుంటే.. ఎక్కడి నుంచి .. ఎలా మొదలుపెట్టాలో తెలియదు. అసలు ఇది షేర్ చేసుకునే విషయమేనా అనే సంశయం. ఇలా అన్నిరకాలుగా ఇది మనల్ని ఒంటరిని చేస్తుంది. మానసికంగా గట్టి దెబ్బే కొడుతుంది.

నార్మలైజ్ చేయాలి



'మెనోపాజ్‌ను అనకూడని, వినకూడని మాటలా భావిస్తారు మన సమాజంలో! దీని గురించి ఎంత ఎక్కువగా మాట్లాడితే.. ఎంతగా చర్చిస్తే అంతగా అవగాహన పెరుగుతుంది.. అంత ఎక్కువగా మహిళలకు మద్దతు అందుతుంది. సమాజం మీద సెలబ్రిటీల ప్రభావం ఎక్కువ కాబట్టి ఈ బాధ్యతలోనూ వాళ్లు ముందుండాలి. మెనోపాజ్ గురించి మాట్లాడుతూ దాన్ని నార్మలైజ్ చేయాలి!'

- లారా దత్తా, బాలీవుడ్ నటి.

ముందు మనల్ని మనం..


ఈ ఫేజ్‌ను డీల్ చేస్తూ నేను తెలుసుకున్నదేంటంటే.. డైట్, మెడిసిన్ అంతగా హెల్ప్ చేయవని. ఫిజికల్ యాక్టివిటీ మాత్రమే ఈ మానసిక ఒత్తిడి నుంచి రిలీఫ్‌నిస్తుందని. అందుకే ఎక్సర్‌సైజ్, యోగాను లైఫ్ స్టయిల్ లో భాగం చేసుకోవాలి. ట్రావెల్ లేదా మనకు నచ్చిన పనితో మనల్ని మనం ఎంగేజ్ చేసుకోవాలి. నేను నేర్చుకున్నది ఇదే! దీన్ని ఫాలో అవుతూ నా ప్రొఫెషనల్ లైఫ్ ప్రభావితం కాకుండా చూసుకుంటున్నాను. ఎందుకంటే అదే ఇన్‌కమ్ సోర్స్ కాబట్టి. అంతేకాదు మన వ్యక్తిగత సమస్యలు వర్క్ ప్లేస్‌లో చర్చకు తావు ఇవ్వకూడదు! ఇంకో విషయం ఏంటంటే.. మన మూడ్‌స్వింగ్స్ నేరుగా ప్రభావం చూపించేది కుటుంబం మీదనే. ఎంత ఇబ్బంది అయినా వర్క్ ప్లేస్‌లో ఒక ఎరుకతో ఉంటాం.. ఉండాలి కూడా! అందుకే ముందు మనల్ని మనం మేనేజ్ చేసుకోవడం తెలుసుకోవాలి. ఇంట్లో వాళ్లతో మన పరిస్థితిని వివరించి.. వాళ్ల సపోర్ట్ కూడా తీసుకోవాలి. దీనివల్ల వర్క్ ప్లేస్‌లో డీల్ చేయడమూ తేలికవుతుంది.

సందర్భం దొరికినప్పుడు..

ఈ ఫేజ్‌లోని ఆడవాళ్లకు కచ్చితంగా సపోర్ట్ కావాలి. ఆల్రెడీ ఆ ఫేజ్‌ను అధిగమించిన వాళ్లు తమ అనుభవాలను, డీల్ చేసిన తీరును షేర్ చేసుకోవడం వల్ల ఆ ఫేజ్‌లోకి ఎంటర్ అయిన మహిళలు ధైర్యం తెచ్చుకుంటారు. ఈజీగా మేనేజ్ చేయగలమనే భరోసా వస్తుంది. దీనివల్ల సిస్టర్‌హుడ్ డెవలప్ అవుతుంది. అంతేకాదు ఇలాంటి సందర్భం, ప్లాట్‌ఫామ్ దొరికినప్పుడల్లా సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన మహిళలు దీనిగురించి మాట్లాడటమో.. తమ అనుభవాన్ని పంచుకోవడమో చేస్తే.. మెనోపాజ్ మీద అందరికీ అవగాహన కలుగుతుంది. ఆడవాళ్ల సమస్యలు, బాధలు అర్థమవుతాయి. ఇంటా, బయటా కూడా సపోర్ట్ అందే ఆస్కారం పెరుగుతుంది.

– శిరీష చల్లపల్లి

హెల్త్



చెమట చుక్కలు చూపుతోందా?

చెమట పట్టడం అందరిలో కనిపించే ఓ జీవక్రియ. వాతావరణంలో వేడిమి పెరిగినప్పుడు దానికి తగ్గట్లుగా దేహ ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. దాన్ని క్రమబద్ధీకరించేందుకు చెమటలు పట్టి... అవి దేహంలోని ఉష్ణోగ్రతను గ్రహించి ఆవిరి కావడంతో దేహం చల్లబడుతుంది. ఇదే పని వ్యక్తులు శారీరక శ్రమ చేసినప్పుడూ, బాగా ఆటలాడినప్పుడూ జరుగుతుంది. అంతేకాదు... బాగా ఆందోళనకు గురైనప్పుడు, భయపడ్డప్పుడు చెమట పడుతుంది. ఇది మానవ మనుగడకు ప్రకృతి చేసిన ఏర్పాటు. కొందరిలో అతిగా చెమటలు పడుతుంటాయి. ఇలా ఎందుకు జరుగుతుందో, ఇలాంటి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలు తెలిపే కథనమిది.

మనుషుల్లో ఎక్రైన్ అలాగే అపోక్రైన్ గ్లాండ్స్ అనే రెండు రకాల గ్రంథులుంటాయి. వీటిల్లో ఎక్రైన్ గ్లాండ్స్ అనే చెమట గ్రంథులు పుట్టినప్పటి నుంచీ ఒంటి నిండా వ్యాపించి ఉంటాయి. అయితే అపోక్రైన్ గ్రంథులనేవి బాహుమూలల్లోనూ, ప్రైవేట్ పార్ట్స్ దగ్గర ఉండి, కొంతకాలం తర్వాత (అంటే ముఖ్యంగా యుక్తవయసుకు వచ్చాక) అవి క్రియాశీలమవుతాయి. అందుకే చిన్నప్పుడు కాకుండా యుక్తవయసుకు వచ్చాకే బాహుమూలాల్లోనూ, ప్రైవేట్ పార్ట్స్ దగ్గర చెమట పట్టడం మొదలవుతుంది.

చెమటలు పట్టడం కొందరిలో మరీ ఎక్కువ...

కొందరిలో చెమట పట్టడం చాలా ఎక్కువగా జరుగుతుంటుంది. చెమటలు ఎక్కువగా పట్టడం వల్ల చాలా సమస్యలూ ఎదురవుతాయి. కొందరిలో అరికాళ్లు తేమగా అవుతుంటాయి. మరి కొందరిలో అరచేతుల్లో చెమటలు ఎక్కువగా పట్టడంతో ఏది పట్టుకున్నా తడిసిపోవడం, జారిపోవడం కూడా జరుగుతుంటుంది. 'హైపర్ హిడరోసిస్'లో మళ్లీ రెండు రకాలు. అవి...

- జనరలైజ్‌డ్ హైపర్ హిడరోసిస్ (దేహమంతటా విపరీతంగా చెమటలు పట్టడం)
- లోకలైజ్‌డ్ హిడరోసిస్ (దేహంలోని కొన్ని చోట్లలోనే చెమటలు ఎక్కువగా పట్టడం).

జనరలైజ్‌డ్ హైపర్ హిడరోసిస్‌కి కారణాలు...

- చలికాలంలో వాతావరణం చల్లగా ఉన్నందున చెమటలు పట్టడం పెద్దగా జరగదు. కానీ వేసవిలో... అందునా మార్చి నుంచి వాతావరణంలో వేడిమి పెరగడంతో విపరీతంగా చెమటలు పడుతుంటాయి.

చెమటలకు మరికొన్ని కారణాలు...

- విపరీతమైన దేహ శ్రమ లేదా వ్యాయామం తర్వాత
- వైరల్ ఫీవర్స్, మలేరియా, క్షయ వంటి జబ్బులతో జ్వరం వచ్చి తగ్గాక
- గుండెకు సంబంధించిన వ్యాధుల్లో అంటే షాక్, హార్ట్ ఫెయిల్యూర్స్‌లో
- ఎండోక్రైన్ లేదా హార్మోనల్ డిజార్డర్స్‌లో (అంటే హైపర్ పిట్యుటరిజమ్, హైపర్ థైరాయిడిజమ్, ఇన్‌కసులినోమా, డయాబెటిస్ వంటి సమస్యల్లో)
- లింఫోమా, కార్సినాయిడ్ సిండ్రోమ్ వంటి క్యాన్సర్లు ఉన్నవారిలో
- గర్భిణుల్లో అలాగే మెనోపాజ్‌కు దగ్గరవుతున్నప్పుడు
- స్థూలకాయం ఉన్నవారిలో
- మద్యం తాగాక
- ఫ్లూయాక్సిటిన్ వంటి మందులు వాడుతున్నప్పుడు
- పార్కిన్‌సన్స్ జబ్బులున్నవారిలో, వెన్నెముక దెబ్బతినడం వంటి న్యూరలాజికల్ సమస్యలున్నవారిలో చెమటలు ఎక్కువగా పడుతుంటాయి.

లోకలైజ్‌డ్ హైపర్ హిడరోసిస్ రకాలు...

- ఎమోషనల్ ఆర్ ఎసెన్షియల్ హైపర్ హిడరోసిస్ : తీవ్రమైన ఉద్విగ్నత ఉన్నప్పుడు లేదా ఉద్వేగాలు లేదా భయాలకు లోనైనవారిలో అరచేతులు, అరికాళ్లలో విపరీతంగా చెమటలు పడుతుండటం చాలామంది అనుభవంలోకి వచ్చే విషయమే
- యాగ్జిలరీ హైపర్ హిడరోసిస్ : బాహుమూలాల్లో చెమటలు పట్టడం
- గస్టెటరీ హైపర్ హిడరోసిస్ : బాగా వేడివీ లేదా బాగా ఘాటైన మసాలాలతో కూడిన ఆహారాలు తీసుకుంటున్నప్పుడు కొందరిలో పెదవుల చుట్టూ లేదా ముక్కు మీద, నుదుటి మీద, తలలో విపరీతంగా చెమటలు పట్టడం
- పోశ్చరల్ లేదా ప్రెజర్ హైపర్ హిడరోసిస్ : కుర్చీల్లో కూర్చున్నప్పుడు లేదా సీట్‌కు అనుకుని ఉన్న శరీరభాగమంతా చెమటలు పట్టడం వంటి రకాలు కూడా చూడవచ్చు
- ఎమోషనల్ లేదా ఎసెన్షియల్ హైపర్ హిడరోసిస్ : ఉన్నవాళ్లలోనూ కాస్త వైవిధ్యమైన లక్షణాలు కనిపించవచ్చు. ఉదాహరణకు కొందరిలో అరచేతులు, అరికాళ్లలో మాత్రమే చెమటలు ఎక్కువగా పడతాయి. ఇలాంటి లక్షణాలు సాధారణంగా వంశపారంపర్యంగా వస్తుంటాయి
- కొందరిలో వేసవిలో అరచేతుల్లో మరీ ఎక్కువగా చెమటలు పట్టడంతో చేతుల్లోని వస్తువులు తడిసిపోవడం, జారిపోవడం జరుగుతుండవచ్చు. అలాగే కాళ్ల నుంచి చెమటలు కారుతున్నప్పుడు వాళ్ల అరికాళ్ల గుర్తులు నేల/గచ్చు మీద కనిపిస్తుంటాయి. కొందరిలో చెప్పులూ జారిపోవచ్చు
- ఇంకొందరిలో పగటిపూట చాలా ఎక్కువగానూ, రాత్రుళ్లు తక్కువగానూ, నిద్రలో పూర్తిగా లేకుండానూ ఉండవచ్చు. లేదా మరికొందరిలో దీనికి పూర్తి భిన్నంగా ఉండవచ్చు.

ఇలా చెమట పట్టేవారిలోనూ రెండు రకాలుగా చెమటలు పట్టవచ్చు. అవి...

- కంటిన్యువస్ స్వెటింగ్ : చెమటలు నిరంతరమూ ధారాపాతంగా పడుతుండవచ్చు. వేసవిలో ఈ పరిస్థితి మరీ ఎక్కువ.
- ఫేజిక్ స్వెటింగ్ : ఏ చిన్న పనిచేసినా లేదా ఏ చిన్న పాటి ఒత్తిడికి గురైనా అప్పుడు మాత్రమే కంటిన్యువస్‌గా చెమటలు పడతాయి.

అరచేతులూ... అరికాళ్లలో చెమటలతో సమస్యలిలా...

- పిల్లల్లో ఇలా చెమట పట్టడం వల్ల వారు పరీక్షల సమయంలో బాగా ఇబ్బంది పడుతుంటారు. ఈ చెమటలు ఎక్కువ కావడం వల్ల ఒక్కోసారి జవాబుపత్రం చిరిగిపోయే ప్రమాదమూ ఉంటుంది. అందుకే ఇలాంటి పిల్లలు సాధారణంగా చేతికింద రుమాలు పెట్టుకుని రాస్తుంటారు
- టెన్నిస్, క్రికెట్ వంటి ఆటలు ఆడే క్రీడాకారుల్లో ఇలాంటి సమస్య ఉంటే బ్యాట్ లేదా టెన్నిస్ రాకెట్ జారిపోతుంటాయి
- ఆఫీసులో పని సక్రమంగా జరగకపోవడం
- నలుగురు కలిసే సోషల్ గ్యాదరింగ్స్‌లో అందరితోనూ కలవలేకపోవడం లేదా నిర్భయంగా షేక్ హ్యాండ్ ఇవ్వలేకపోవడం
- కొందరిలో నడుస్తుండగానే చెప్పులు / పాదరక్షణలు జారిపోవడం (ఇలాంటివారు షూ వేసుకోవడం వల్ల కొంతవరకు మంచి ప్రయోజనమే ఉంటుంది. అయితే విపరీతమైన చెమటల కారణంగా వారి మేజోళ్లు తడిసిపోతుంటాయి. అందుకే ఎప్పటికప్పుడు ఉతికిన, శుభ్రమైన పొడి మేజోళ్లు వాడుతుండాలి. లేకపోతే ఈ చెమటలు, మలినమైన మేజోళ్ల కారణంగా మరికొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయి. అవి..
- కాంటాక్ట్ దర్మటైటిస్: చర్మానికి సంబంధించిన అలర్జీలు రావడం
- పామ్ ఫోలిక్స్ : చర్మంపై చిన్న చిన్న నీటి బుడగలు వచ్చి దురదగా ఉండటం
- పిట్టెడ్ కెరటోలైసిస్ : చర్మానికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ రావడం
- దర్మటోఫైటోసిస్: చర్మంపై ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావడం.

చికిత్సలు...

చెమట పట్టే సమస్య కొందరిలో దానంతట అదే తగ్గిపోతుంది. తగ్గకపోతే ఈ కింది సూచనలు/చికిత్సలు అవసరమవుతాయి.

- యాంటీ పెర్‌స్పిరెంట్లు : ఇందులో చాలా రకాలు ఉంటాయి. ఫార్మాల్‌డిహైడ్, గ్లూటరాల్ డిహైడ్, 20% అల్యూమినియం క్లోరైడ్ హెగ్జాహైడ్రేట్... వీటిని డాక్టర్ల సలహా మేరకే వాడాలి. యాంటీ పెర్‌స్పిరెటంట్లు ఎక్కువగా లేదా డాక్టర్ సలహా లేకుండా వాడటం వల్ల కాంటాక్ట్ దర్మటైటిస్ అనే అలర్జీలు వచ్చే అవకాశాలెక్కువ
- డియోడరెంట్లు : ఇవి చెమటను తగ్గించవు, నిరోధించవు. కానీ చెమట వల్ల దుర్వాసనను కొంత తగ్గిస్తాయి.
- అయాన్ ఫోరోసిస్ : ఇదికరెంట్ ద్వారా చేసే చికిత్స
- బొట్యులినమ్ టాక్సిన్ : ఇదో రకం విషం. ఇంజెక్షన్ సహాయంతో చేసే చికిత్స ఇది
- శస్త్రచికిత్స : సింపాథెక్టమీ అనే సర్జరీ. (ఇటీవల దీన్ని ఎక్కువగా సిఫార్సు చేయడం లేదు. దీంతో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నందున అంతగా ప్రోత్సహించడం లేదు).



డా. స్వప్నప్రియ
సీనియర్ దర్మటాలజిస్ట్

జాగ్రత్తలు...

- రోజూ స్నానం చేయాలి. వీలైతే రోజుకు రెండుసార్లు చేస్తే ఇంకా మంచిది
- మాయిష్చరైజర్ సబ్బులు వాడేవారిలో చెమట ఎక్కువగా పట్టే అవకాశం ఉంది. ఇలాంటివారు నార్మల్ సబ్బులు వాడటం మంచిది
- చెమటలు ఎక్కువగా పట్టేవారు దాన్ని తేలిగ్గా పీల్చుకునేలా కాటన్ / నూలు దుస్తులు ధరించడం మేలు
- ఎప్పటికప్పుడు బాగా ఉతికిన, శుభ్రమైన బట్టలనే ధరిస్తుండాలి.

● యాంటిబయాటిక్స్

కాబోయే తల్లులకు జాగ్రత్త!



ఏ చిన్న ఇన్ఫెక్షన్ లేదా ఏ ఆరోగ్య సమస్య వచ్చినా చాలా మంది అడపాదడపా యాంటీబయాటిక్ టాబ్లెట్లు వేసుకుంటూ ఉంటారు. కానీ గర్భవతుల విషయంలో వాళ్లు ఇలా చేయడం ఎంతమాత్రమూ సరికాదు. ఎందుకంటే యాంటీబయాటిక్స్ మాత్రమే కాకుండా డాక్టర్ సలహా సూచన లేకుండా ఏ టాబ్లెట్‌ను కూడా గర్భవతులు వాడకూడదు. ఆ టాబ్లెట్స్ వాళ్లకు ఎంతో కీడు తెచ్చిపెట్టే అవకాశం ఉంటుంది. గర్భవతులు యాంటీబయాటిక్స్ వాడితే ఆ దుష్ప్రభావం కడుపులోని బిడ్డపై పడి... ఆ చిన్నారికి ఎన్నో రకాల కీడు జరిగే అవకాశముంటుంది. ఉదాహరణకు కాబోయే తల్లులు యాంటీబయాటిక్స్ వాడితే... అవి బిడ్డ ఎముకల ఎదుగుదలకు అవరోధంగా పరిణమించవచ్చు. దాంతో బిడ్డ అవయవ నిర్మాణంలోనే లోపాలు (అనటామికల్ అబ్‌నార్మాలిటీస్) వచ్చి, కొన్ని అవకరాలు వచ్చే అవకాశముంది. కాబోయే తల్లి స్ట్రెప్టోమైసిన్ వాడటం వల్ల బిడ్డకు వినికిడి లోపాలు వచ్చే అవకాశాలుంటాయి. తల్లులు వాడే టెట్రాసైక్లిన్ అనే యాంటీబయాటిక్ కారణంగా బిడ్డ దంతాలకు రావాల్సిన సహజమైన రంగు రాకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో బిడ్డకు వచ్చే ఆ దంతాలు తమ సహజమైన మెరుపును కోల్పోవచ్చు. సల్ఫోనమైడ్స్ అనే యాంటీబయాటిక్స్ కారణంగా బిడ్డ పుట్టిన నెలలోపే వారికి కామెర్లు రావచ్చు. అయితే ప్రెగ్నెన్సీలో సైతం తీసుకోదగిన కొన్ని సురక్షితమైన యాంటీబయాటిక్స్ కూడా ఉంటాయి. అంటే... గర్భవతి ఏ త్రైమాసికంలో ఉందో దాన్ని బట్టి కొన్ని యాంటీబయాటిక్స్‌ను గర్భవతులకు సురక్షితంగా వాడుకోదగ్గవి ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల గర్భిణికి యాంటీబయాటిక్స్ వాడాల్సిన పరిస్థితి వస్తే డాక్టర్ల పర్యవేక్షణలో వాటిని వాడాల్సి ఉంటుంది. అలాంటివి వాడుకోవచ్చు.



డాక్టర్ రమ్య తేజ
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్

● మజిల్ క్రాంప్స్

సమ్మర్‌లో బీ కేర్‌ఫుల్



సమ్మర్ ముదరగానే చెమటలు పడుతుండటంతో దేహం ద్రవాలను కోల్పోయి, చాలామందిలో మజిల్ క్రాంప్స్ రావడం పెరుగుతుంది. అకస్మాత్తుగా నిద్రలో గానీ, కొందరిలో పగటివేళలోనే పిక్కలు, తొడకండరాలు, ఛాతీ కండరాలు పట్టేస్తుంటాయి. కంటినిండా నిద్ర లేకపోవడం, ఆహారంలో కొన్ని అవసరమైన పోషకాలు లోపించడం, దేహానికి అలసటతో కలిగే నిస్సత్తువతో పాటు కొన్ని రకాల మందులు వాడకంతోనూ కొందరిలో మజిల్ క్రాంప్స్ కనిపించవచ్చు. కండరాల అలసట వల్ల, అలాగే వ్యాయామానికి ముందు తగినంతగా స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు చేయకపోవడం, రక్తంలో ఎలక్ట్రొలైట్స్ పరిమాణం తగ్గిపోవడం కూడా కారణాలవుతాయి. ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా తాజాగా తయారు చేసుకున్న మజ్జిగలో కొద్దిగా ఉప్పు వేసుకుని తాగడం, చక్కెర లేకుండా పండ్లరసాలు, ద్రవాహారాలు తీసుకోవచ్చు. అన్ని పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకుంటూ ఉండటంతో పాటు, కంటినిండా నిద్రపోవడం వల్ల ఈ సమస్యను నివారించవచ్చు. వ్యాయామానికి ముందు చేసే వార్మప్ కూడా ఈ సమస్య నివారణకు బాగానే తోడ్పడుతుంది.




జ్యోతి సురేఖ జోడీ పసిడి గురి

సెంట్రల్ ఫ్లోరిడా: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ (భారత్) జోడీ 153-151 పాయింట్ల తేడాతో హువాంగ్ ఐజు-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించింది. తుదిపోరులో ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన భారత జోడీ... రెండో సీడ్ చైనీస్ తైపీని వెనక్కినెడుతూ స్వర్ణం కైవసం చేసుకుంది. తొలి రెండు సిరీస్‌లను 37-38, 38-39తో కోల్పోయిన భారత ఆర్చర్లు... మూడో సెట్‌లో 39-38తో తిరిగి పోటీలోకి వచ్చారు. నాలుగో సిరీస్‌లో 39-36తో సునాయాసంగా నెగ్గి పసిడి పతకం చేజిక్కించుకున్నారు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ కాంపౌండ్ విభాగాన్ని చేర్చిన అనంతరం ఈ విజయం విశ్వక్రీడల్లో భారత పతక ఆశలను మరింత పెంచింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకుముందు కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం నెగ్గగా... రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది.

సిక్సర్ల అభి‘ షేక్’

అభిషేక్ శర్మ సెంచరీ మోత



అభిషేక్

తొలి ఐదు మ్యాచ్‌లలో కలిపి 51 పరుగులు... ఈ సీజన్‌లో అభిషేక్ శర్మ ప్రదర్శన ఇది. వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న అతను తన గత ఏడాది ఆటను ఒక్కసారిగా గుర్తు తెచ్చుకున్న ట్లున్నాడు. పంజాబ్‌పై మ్యాచ్‌లో ఒక్కసారిగా తన కసినంతా ప్రదర్శిస్తూ వీర విధ్వంసం సృష్టించాడు. కేవలం బౌండరీలతోనే 116 పరుగులు బాది శతకనాదం చేశాడు. ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం అంటూ రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శిస్తూ ఈ ఇన్నింగ్స్ విలువేమిటో చెప్పాడు. అభిషేక్‌కు హెడ్ మెరుపులు తోడవడంతో 246 పరుగుల లక్ష్యాన్ని కూడా మరో 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి సన్‌రైజర్స్ సంచలనం సృష్టించింది. మరో వైపు సమష్టి ప్రదర్శనతో 245 పరుగులు చేసి కూడా ఓటమిపాలైన పంజాబ్ కింగ్స్ తీవ్ర నిరాశకు లోనైంది. ఓవరాల్‌గా 492 పరుగులతో అభిమానులకు ఫుల్ జోష్ దక్కింది.

- 55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 141
- సన్‌రైజర్స్ సూపర్ విజయం
- 8 వికెట్లతో పంజాబ్ కింగ్స్ చిత్తు

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ సీజన్ నాలుగు వరుస పరాజయాల తర్వాత నిస్తేజంగా కనిపించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఘనమైన రీతిలో కోలుకుంది. తమ అసలు ఆటను ప్రదర్శిస్తూ లీగ్‌లో తమను తక్కువగా అంచనా వేయవద్దనే సందేశాన్ని ఇచ్చింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 82; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (23 బంతుల్లో 42; 7 ఫోర్లు, 1 సిక్స్), ప్రియాన్ష్ ఆర్య (13 బంతుల్లో 36; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. అనంతరం సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 247 పరుగులు సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అభిషేక్ శర్మ (55 బంతుల్లో 141; 14 ఫోర్లు, 10 సిక్స్‌లు) ఐపీఎల్‌లో తన తొలి సెంచరీని నమోదు చేయగా, ట్రవిస్ హెడ్ (37 బంతుల్లో 66; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 75 బంతుల్లో 171 పరుగులు జోడించారు.

మెరుపు బ్యాటింగ్...

పవర్‌ప్లేలో 89 పరుగులు...10 ఓవర్లు ముగిసే సరికి 120. తర్వాతి 5 ఓవర్లలో 57 పరుగులు...ఆఖరి 5 ఓవర్లలో 68 పరుగులు... పంజాబ్ కింగ్స్ ఇలా దాదాపు అన్ని దశల్లోనూ ఒకే తరహాలో దూకుడుగా సాగింది. టాప్-7లో ఇద్దరు మినహా మిగతావారంతా చెలరేగిపోవడంతో భారీ స్కోరు సాధ్యమైంది. షమీ వేసిన తొలి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 3 ఫోర్లతో మొదలు పెట్టగా, షమీ తర్వాతి ఓవర్లో ప్రియాన్ష్ వరుసగా 6, 6, 4 బాదాడు. కమిన్స్ తొలి ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్‌తో పంజాబ్ 16 పరుగులు రాబట్టింది. అయితే తన తొలి రెండు ఓవర్లలో 28 పరుగులిచ్చిన హర్షల్...ప్రియాన్ష్‌ను అవుట్ చేయడంతో సఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన మలింగ తన తొలి వికెట్‌గా ప్రభ్‌సిమ్రన్‌ను వెనక్కి పంపించాడు. ఆ తర్వాత శ్రేయస్, నేహల్ వధేరా (22 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యం కూడా జోరుగా సాగింది. వీరిద్దరు మూడో వికెట్‌కు 40 బంతుల్లోనే 73 పరుగులు జోడించారు. అన్సారీ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాదిన శ్రేయస్ 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. శశాంక్ సింగ్ (2) విఫలం కాగా, మలింగ ఓవర్లో శ్రేయస్ 4 ఫోర్లతో చెలరేగాడు. అయితే రెండు బంతుల వ్యవధిలో మ్యాక్స్‌వెల్ (3), శ్రేయస్‌లను హర్షల్ అవుట్ చేయడంతో 18, 19 ఓవర్లలో కలిపి 13 పరుగులే వచ్చాయి.

ఒకే ఓవర్లో 27 పరుగులు...

షమీ వేసిన ఆఖరి ఓవర్లో కింగ్స్ పండగ చేసుకుంది. ఫామ్‌లో లేక ఇబ్బంది పడుతున్న స్టొయినిస్ ఈ ఓవర్లో చెలరేగిపోయాడు. చివరి 4 బంతుల్లో అతను వరుసగా 6, 6, 6, 6 బాదడంతో మొత్తం 27 పరుగులు లభించాయి.

బౌండరీల వర్షం...

అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో హెడ్ 2 ఫోర్లు కొట్టడంతో రైజర్స్ విధ్వంసం మొదలైంది. యాన్సెన్ ఓవర్లో అభిషేక్ నాలుగు ఫోర్లు కొట్టగా, అర్ష్‌దీప్ తర్వాతి ఓవర్లో హెడ్ వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో చెలరేగిపోయాడు. పవర్‌ప్లేలో జట్టు 83 పరుగులు సాధించింది. 19 బంతుల్లోనే అభిషేక్ హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. మరో వైపు మ్యాక్స్‌వెల్ ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు బాదిన హెడ్ 31 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. యాన్సెన్ వేసిన ఓవర్లో మళ్లీ శివమెత్తిన అభిషేక్ 2 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదాడు. చహల్ ఓవర్లో ఎట్టకేలకు హెడ్ వెనుదిరిగిన తర్వాత అదే ఓవర్ చివరి బంతికి సింగిల్ తీసి 40 బంతుల్లో అభిషేక్ సెంచరీ మార్క్‌ను చేరుకొని గర్జించాడు. ఆ తర్వాత చెలరేగి బౌండరీల వర్షం కురిపించిన అభిషేక్ జట్టును అలవోకగా విజయం దిశగా నడిపించాడు. సాహసవంతులకే అదృష్టం కలిసి వస్తుందన్నట్లు అభిషేక్‌కు రెండు లైఫ్‌లు లభించాయి. 28 వద్ద ఠాకూర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇవ్వగా అది నోబాల్‌గా తేలింది. ఆ తర్వాత 56 వద్ద చహల్ తన బౌలింగ్‌లోనే సునాయాస క్యాచ్‌ను వదిలేశాడు. దీనిని అతను బ్రహ్మాండంగా వాడుకున్నాడు.


స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) నితీశ్ రెడ్డి (బి) హర్షల్ 36; ప్రభ్‌సిమ్రన్ (సి) కమిన్స్ (బి) మలింగ 42; శ్రేయస్ (సి) హెడ్ (బి) హర్షల్ 82; వధేరా (ఎల్బీ) (బి) మలింగ 27; శశాంక్ (ఎల్బీ) (బి) హర్షల్ 2; మ్యాక్స్‌వెల్ (బి) హర్షల్ 3; స్టొయినిస్ (నాటౌట్) 34; యాన్సెన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 245. వికెట్ల పతనం:** 1-66, 2-91, 3-164, 4-168, 5-205, 6-206. **బౌలింగ్:** మొహమ్మద్ షమీ 4-0-75-0, కమిన్స్ 4-0-40-0, హర్షల్ 4-0-42-4, ఇషాన్ మలింగ 4-0-45-2, అన్సారీ 4-0-41-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చహల్ 66; అభిషేక్ (సి) (సబ్) దూబే (బి) అర్ష్‌దీప్ 141; క్లాసెన్ (నాటౌట్) 21; ఇషాన్ కిషన్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (18.3 ఓవర్లలో 2 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-171, 2-222. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-1, యాన్సెన్ 2-0-39-0, యశ్ ఠాకూర్ 2.3-0-40-0, మ్యాక్స్‌వెల్ 3-0-40-0, ఫెర్గూసన్ 0.2-0-1-0, స్టొయినిస్ 0.4-0-6-0, చహల్ 4-0-56-1, శశాంక్ 2-0-27-0.

75 ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ల జాబితాలో షమీ రెండో స్థానంలో నిలిచాడు. అతను 75 పరుగులివ్వగా, ఇదే సీజన్‌లో రాజస్తాన్ బౌలర్ ఆర్చర్ 76 పరుగులు ఇచ్చాడు.

1 ఐపీఎల్‌లో భారత బ్యాటర్ సాధించిన అత్యధిక స్కోరు ఇదే. కేఎల్ రాహుల్ (132) పేరిట ఉన్న రికార్డును అభిషేక్ శర్మ సవరించాడు.



హెడ్

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	4	4	0	8	1.278
గుజరాత్	6	4	2	8	1.081
లక్నో	6	4	2	8	0.162
కోల్‌కతా	6	3	3	6	0.803
బెంగళూరు	5	3	2	6	0.539
పంజాబ్	5	3	2	6	0.065
రాజస్తాన్	5	2	3	4	-0.733
హైదరాబాద్	6	2	4	4	-1.245
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	6	1	5	2	-1.554

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X బెంగళూరు
వేదిక: జైపూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ఢిల్లీ X ముంబై
వేదిక: ఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

లక్నో ‘హ్యాట్రిక్’

- సూపర్ జెయింట్స్‌కు వరుసగా మూడో విజయం
- 6 వికెట్లతో గుజరాత్ టైటాన్స్ చిత్తు



పూరన్



మార్క్‌రమ్

లక్నో: బాధ్యతాయుతమైన బౌలింగ్‌కు దూకుడైన బ్యాటింగ్ తోడవడంతో... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసుకుంది. లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి పోరులో లక్నో 6 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 60; 6 ఫోర్లు, 1 సిక్స్), సాయి సుదర్శన్ (37 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. వీరిద్దరు ధాటిగా ఆడటంతో 12 ఓవర్లు ముగిసేసరికి గుజరాత్ వికెట్ నష్టపోకుండా 120తో నిలిచింది. టైటాన్స్ మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనుకుంటే... లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి గుజరాత్‌ను కట్టడి చేశారు. లక్నో బౌలర్లలో శార్దుల్ ఠాకూర్, రవి బిష్ణోయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో లక్నో సూపర్ జెయింట్స్ 19.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మార్క్‌రమ్ (31 బంతుల్లో 58; 9 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీలతో రెచ్చిపోగా... నికోలస్ పూరన్ (34 బంతుల్లో 61; 1 ఫోర్, 7 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన లక్నో సారథి రిషభ్ పంత్ (21; 4 ఫోర్లు), ఆయుశ్ బదోనీ (28 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) పర్వాలేదనిపించారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు పడగొట్టాడు.

సాక్షి సినిమా



● ప్రియదర్శి, రూప

సారంగపాణి వినోదం

‘జెంటిల్‌మన్, సమ్మోహనం’ వంటి హిట్ చిత్రాల తర్వాత దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందిన మూడో చిత్రం ‘సారంగపాణి జాతకం’. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రనిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ‘‘పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా తీయాలనే నా కల ‘సారంగపాణి జాతకం’తో నెరవేరింది. ఫస్ట్ కాపీతో సహా సినిమా రెడీ అయ్యింది. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. మా చిత్రాన్ని ఈ నెల 18న విడుదల చేద్దామనుకున్నాం. అయితే బయ్యర్ల సూచన మేరకు, మరిన్ని మంచి థియేటర్ల సౌలభ్యత కోసం 25న రిలీజ్ చేస్తున్నాం. ‘బలగం, 35 చిన్న కథ కాదు, కోర్టు’ సినిమాలతో ప్రియదర్శి స్థాయి పెరిగింది. ‘సారంగపాణి జాతకం’తో వంద శాతం వినోదం పంచుతారాయన. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను’’ అని తెలిపారు.

ప్రామిస్‌ని నిలబెట్టుకున్నాం

- హీరో ప్రదీప్



● దీపిక, ప్రదీప్, భరత్, నితిన్

‘‘ఈ వేసవిలో మంచి తెలుగు సినిమా చూసి నవ్వుకుందాం అని భావించే ప్రతి ఫ్యామిలీని ‘మా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’కి ఆహ్వానిస్తున్నాం. మా సినిమా చూసి, థియేటర్స్ నుంచి బయటకొచ్చే ప్రతి ఒక్కరి ముఖంలో నవ్వు కనిపిస్తోంది. మా సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకుల పెదవులపై నవ్వు ఉంటుందని ప్రామిస్ చేశాను. ఆ ప్రామిస్‌ని నిలబెట్టుకున్నాం’’ అని ప్రదీప్ మాచిరాజు అన్నారు. ప్రదీప్ మాచిరాజు, దీపిక పిల్లి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’. నితిన్-భరత్ దర్శకత్వంలో ఈ సినిమాను మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించింది. ఈ చిత్రం ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో... ‘‘క్లీన్ కామెడీతో అందర్నీ నవ్విస్తామని చెప్పాం. అదే చేశాం’’ అన్నారు నితిన్-భరత్. గెటప్ శ్రీను, మ్యూజిక్ డైరెక్టర్ రథన్, మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

రాములోరి గొప్ప చెప్పుకుందామా...



● చిరంజీవి

చిరంజీవి హీరోగా నటించిన చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో త్రిషా కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. ఈ సినిమాకి కీరవాణి సంగీతం అందించారు. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఈ చిత్రంలో ‘రామ రామ...’ అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు. ‘హే తయ్య తక్క తక ధిమి చెక్క భజనలాడి రాములోరి గొప్ప చెప్పుకుందామా, ఆ సాములోరి పక్కనున్న సీతామాలక్ష్మమ్మ లక్షణాలు ముచ్చటించుకుందామా....’ అంటూ ఈ పాట సాగుతుంది. ‘జై శ్రీరామ్..’ అంటూ చిరంజీవి వాయిస్ కూడా ఈ పాటలో వినిపిస్తుంది. ‘‘సీతారాముల కల్యాణం వేడుక నేపథ్యంలో సాగే ఈ పాట విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. ఆధ్యాత్మిక, దైవిక శక్తితో నిండిన ఈ పాటని తనదైన శైలిలో కంపోజ్ చేశారు కీరవాణి. ఈ పాటలో భక్తి, సాంస్కృతిక గొప్పతనాన్ని రామజోగయ్య శాస్త్రి కవితాత్మకంగా అందించారు. శంకర్ మహదేవన్, లిప్సిక ఎనర్జిటిక్‌గా పాడారు’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: ఛోటా కె. నాయుడు.

క్రిష్ 4లో?

బాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ ‘క్రిష్’ నుంచి ‘క్రిష్ 4’ రానున్న సంగతి తెలిసిందే. ‘క్రిష్’ ఫ్రాంచైజీలో ఇప్పటివరకు వచ్చిన మూడు సినిమాల్లో హీరోగా నటించిన హృతిక్ రోషన్... ‘క్రిష్ 4’ సినిమాలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించనున్నారు. రాకేష్ రోషన్, ఆదిత్యా చోప్రా నిర్మించనున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం కానుంది. ఇప్పటికే ఈ మూవీలో ప్రీతీ జింతా, వివేక్ ఓబెరాయ్ వంటి వారు నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. తాజాగా ప్రియాంకా చోప్రా పేరు తెరపైకి వచ్చింది. కాగా ఇటీవల ప్రియాంకా చోప్రా – నిక్ జోనస్ (ప్రియాంక భర్త)లను హృతిక్ అమెరికాలో కలిసి, మాట్లాడటంతో ఈ వార్తలకు బలం చేకూరినట్లు అయింది. వీరి మధ్య ‘క్రిష్ 4’ అంశం కూడా చర్చకు వచ్చిందని, ఈ మూవీలో ప్రియాంకా చోప్రా దాదాపు ఖరారు అయ్యారని ప్రచారం జరుగుతోంది.



● ప్రియాంకా చోప్రా

డియర్ ఉమ మంచి కథ

- నటి-నిర్మాత-రచయిత సుమయ రెడ్డి

‘‘ఓ మంచి కథని ప్రేక్షకులకు అందించాలని ‘డియర్ ఉమ’ కథ రాశాను. అయితే నన్ను నమ్మి నిర్మించేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారా? అనుకున్నాను. అప్పుడు మా అమ్మ జ్యోతి రెడ్డి నన్ను సపోర్ట్ చేశారు. దాంతో నేనే నిర్మించాను. మా సినిమాని అందరూ చూసి ఆదరించాలి’’ అని సుమయ రెడ్డి అన్నారు. ఆమె హీరోయిన్‌గా నటించి, కథ అందించడంతో పాటు నిర్మించిన చిత్రం ‘డియర్ ఉమ’. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సుమయ రెడ్డి మాట్లాడుతూ– ‘‘రథన్‌గారి పాటలంటే నాకు ఇష్టం. ఆయన మా సినిమా ఒప్పుకుంటారా? లేదా అనుకున్నాను. కథ వినగానే ఒప్పుకున్నారు’’ అన్నారు. ‘‘డియర్ ఉమ’ నా మొదటి తెలుగు సినిమా కావడం హ్యాపీగా ఉంది’’ అన్నారు పృథ్వీ అంబర్. ‘‘ఎన్నో కష్టాలు దాటి ఈ సినిమా తీశాం. ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు సాయి రాజేశ్ మహాదేవ్. ‘‘ఈ చిత్రంలోని పాటలు, నేపథ్య సంగీతం బాగుంటాయి’’ అని మ్యూజిక్ డైరెక్టర్ రథన్ చెప్పారు.



● సుమయ రెడ్డి, పృథ్వీ అంబర్

చివరి ఇరవై నిమిషాలు కన్నీళ్లు ఆపుకోలేకపోయా!

- హీరో ఎన్టీఆర్



● ప్రదీప్ చిలుకూరి, సయీ మంజ్రేకర్, కల్యాణ్ రామ్, విజయశాంతి, ఎన్టీఆర్, సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా

‘‘ఈ వేదికపైన ఎన్నోసార్లు నేను, అన్న (కల్యాణ్ రామ్) నిల్చొని ఉన్నప్పుడు మా నాన్నగారు (హరికృష్ణ) రావడం, మాట్లాడటం జరిగింది. ఈరోజు విజయశాంతిగారు మాట్లాడుతుంటే మొదటిసారి వేదికపైన మా నాన్నగారు లేరనే లోటు తీరినట్టయింది. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో నాన్నగారు ఉండుంటే ఎలా ఉంటుందో విజయశాంతిగారు మాట్లాడినప్పుడు నాకు ఆ లోటు భర్తీ అయిపోయింది’’ అని హీరో ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి కీలక పాత్రలో నటించిన చిత్రం ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ మాట్లాడుతూ– ‘‘భారతదేశ చిత్ర పటంలో హీరోలతో సమానంగా నిల్చున్న ఏకైక మహిళ ఎవరన్నా ఉన్నారంటే అది విజయశాంతిగారు ఒక్కరే. ‘కర్తవ్యం, ప్రతిఘటన, మగరాయుడు’... ఇలా ఎన్నో సినిమాల్లో అద్భుతమైన పాత్రలు చేశారామె. ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’ని చూశాను. విజయశాంతిగారు లేకపోతే ఈ చిత్రం లేదు. పృథ్వీ, సోహైల్ ఖాన్, ప్రదీప్ చిలుకూరి, సునీల్, అశోక్ గార్లు... ఇలా ఎవరు లేకున్నా ఈ సినిమా లేదు. 18న ఈ మూవీ మీ ముందుకొస్తోంది. రాసిపెట్టుకోండి... ఆఖరుగా వచ్చే ఇరవై నిమిషాలు ప్రేక్షకుల కళ్లల్లో నీళ్లు తిరక్కపోతే... అంత అద్భుతంగా తీశారు ప్రదీప్‌గారు. సినిమా చూస్తున్న నాకు కూడా కన్నీళ్లు ఆపుకోవడం కుదరలేదు. ఆ ఆఖరి ఇరవై నిమిషాలు అలా రావడానికి ఒకే ఒక్క కారణం కల్యాణ్ అన్న మాత్రమే. దర్శకుడి ఐడియాని ఆయన నమ్మారు. ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’ అన్న కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోతుందని నా నమ్మకం. మనసు పెట్టి, ప్రాణం పెట్టి నటించారు. బహుశా అది విజయశాంతిగారు కాకుండా వేరే వారు అయ్యుంటే ఆయన అంత అద్భుతంగా చేసేవారో కాదో నాకు తెలీదు. ఆమెను ఓ తల్లిగా నమ్మారు కాబట్టి అంత అద్భుతంగా నటించారు. ప్రేక్షకులు, మా ఫ్యాన్స్ అందరూ ముందుగా ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’ని ఎంజాయ్ చేయండి. ఆ తర్వాత ఆగస్టు 14న రిలీజ్ అవుతున్న ‘వార్ 2’ (హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటించారు) కూడా మిమ్మల్ని అలరిస్తుంది. పక్కాగా ప్లాన్ చేసి ఈ ఏడాది మిమ్మల్ని అందర్నీ తప్పకుండా కలుస్తాను’’ అని చెప్పారు.

కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ‘‘మీరు చాలా సినిమాలు చూస్తారు. మేం కూడా చేస్తాం. సినిమా అయ్యాక పార్కింగ్‌కి వెళ్లి బైక్, కార్ స్టార్ట్ చేసుకోగానే సినిమాని మర్చిపోతాం. కానీ, చాలా అరుదుగా నటులుగా మాకు గానీ, ప్రేక్షకులుగా మీకు గానీ కొన్ని సినిమాలు ఇంటికెళ్లేదాకా మనసుని హత్తుకుంటాయి. అలాంటి సినిమా మా ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’’ అన్నారు.

విజయశాంతి మాట్లాడుతూ– ‘‘ఎన్టీ రామారావుగారు ఓ డిక్షనరీ. ఆయనలో కొంత వచ్చినా ఎవరైనా గొప్ప నటీనటులు అయిపోతారు. ఆయన వద్ద నుంచి ఆశీర్వాదాలు తీసుకోవడం నా అదృష్టం. ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’ సెట్స్‌లో నేను అనుకున్నదానికంటే అద్భుతంగా, చాలా సౌకర్యంగా చూసుకున్నాడు కల్యాణ్ బాబు. ఈ సినిమాని అందరూ థియేటర్లో చూసి, సూపర్ హిట్ అని చెప్పాలి’’ అని అన్నారు.

ఈ వేడుకలో కెమేరామేన్ రాంప్రసాద్, నటులు జోగి నాయుడు, సందీప్, రచయిత శ్రీకాంత్ విస్సా, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, రచయిత రఘురామ్ పాల్గొన్నారు.

కనులు కనులు కలిసి...



● రూపేష్, ఆకాంక్షా సింగ్

‘‘మా రాజేంద్రప్రసాద్ అన్నయ్య నటించిన ‘షష్టి పూర్తి’ ఫీల్ గుడ్ సినిమా అవుతుందనిపిస్తోంది. అందరూ చూడండి’’ అని హీరో రవితేజ చెప్పారు. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో, రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం ‘షష్టిపూర్తి’. పవన్ ప్రభ దర్శకత్వంలో హీరో రూపేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ‘ఇరు కనులు కనులు కలిసి మురిసె...’ అంటూ సాగే రెండో పాటని రవితేజ ఆవిష్కరించారు. రెహమాన్ రాసిన ఈ పాటను ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు. ఈశ్వర్ కొరియోగ్రఫీ చేశారు. ‘‘ఈ పాటకు ఇళయరాజాగారు బాణీ ఇవ్వగానే ‘సాగర సంగమం’ చిత్రంలోని ‘మౌనమేలనోయి’లా గొప్ప పాట అవుతుందనే అనుభూతి కలిగింది’’ అని తెలిపారు పవన్ ప్రభ.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కమ్మ/1st మ్యారేజ్ / 38/ 5'5" / MBA / ఫైనాన్స్ బిజినెస్/15Cr. ప్రాపర్టీ / 3L. రెంటల్ ఇన్ కం, ఆస్తి పట్టింపు లేని వరునికి 1వ, 2వ వధువు కావలెను. నో బ్రోకర్స్. 9247489431 [HA-16498]

మాల/M.Tech(IIT) / C.Govt. A.E. రైల్వే / 98000/-PM / 5'10"ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7416584304 [HA-15021]

SC మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/14 Lalkhs. PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15021]

SC మాల/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. బ్యాంక్ మేనేజర్/ SBI/80,000/-PM /5'10"ఎత్తు/29సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15021]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 80,000/-PM /5'10" ఎత్తు/29సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-15021]

మాదిగ/B.Tech, IIT/ C.Govt. Asst. మేనేజర్/యూనియన్ బ్యాంక్/98000/-PM/ 5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15021]

కాపు, 56, D.Pharm, విడోయర్, VRS, మందుల షాపు ఇల్లు ఉన్న వరునికి ఉద్యోగం /వసతి ఉన్న విడో/Rtd/కుల వయసుతో పనిలేని వధువు కావలెను. 9347204671 [H-783623]

యాదవ, 35Y/5'5"/Pvt. Job, సొంత ఇల్లు స్థిరాస్తిగల కుల పట్టింపు లేని వరునికి తగిన 1వ, 2వ (పిల్లలున్న OK) సాంప్రదాయ పేద కుటుంబం వధువు కావలెను. Ph: 9952882957 [H-783623]

SC మాదిగ/28/5'8"/M.Tech(Civil) Assistant Engineer, Irrigation Department 70,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వరుడికి వధువు కావలెను(కట్నం ముఖ్యం కాదు). Ph: 8919289481 [HA-15020]

SC మాల/27/5'8"/B.Tech/MBA/SWE/ MNC/80,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వరుడికి వధువు కావలెను (కట్నం ముఖ్యం కాదు).Ph: 9346675639 [HA-15020]

రెడ్డి, B.Tech, M.Tech, Hight 5'8", వయసు: 27, తెలుపు రంగు బెంగళూరులో జాబ్ వరుడికి రెడ్డి కాస్ట్ వధువు కావలెను సంప్ర॥ విజయవాడ ✆ 6301551755 [B-752893]

Reddy MS Ortho 5'8" 30 yrs. వరునకు డాక్టర్, వెల్‌సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. మీడియేటర్స్ వద్దు. డైరెక్ట్‌గా సంప్ర: 9160947999, 9866647033 [B-7]

★★

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్–Ph: 85199 34926 [L-779117]

నెల్లూరు, కమ్మ, 39Y, కులపట్టింపు లేదు, 2వ మ్యాచ్, OWN బిజినెస్ గల అందమైన వరునకు వెల్‌సెటిల్డ్ వధువు కావలెను.డైరెక్ట్‌వరుడు:9603959855. [NA-6881]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య 43సం॥, 5'.5", బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల అబ్బాయికి అందమైన 1వ, 2వ అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్) సంప్ర: 7995585722, 9848817137. [T-2397]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 32, B. Pharm సొంత బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఐనా OK) అన్ని వయస్సుల వారికి 1st or 2nd సంబంధాలు కలవు. Ph: 9515673252 [H-783623]

కమ్మ / 50Y / విడో / Govt.Job / Own Petrol Pumb/71 Acres Land/28Lac Income కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 9347216440 [H-783532]

పద్మశాలి/విడో /45 /ఇంటర్ /ప్రైవేట్ జాబ్/Own House/5 ఎకరాల Land గల వధువుకు కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. 9705499686 [H-783532]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No:3, Banjara Hills (TV-9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings : 10 AM - 5 PM. www.avinashreddy.com +91 9848011818 / +91 9393311818

వధువు కావలెను

రెడ్డి Business, BBA (USA), 28, 5' 11", Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 29, 5' 11", SWE, 160 K, 15Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6', Engineer, 100 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, Residency Doctor, 27, 5' 5", Rich Family, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 8", 65 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 27, 5' 7", Analyst, 101 K, 8 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Bengaluru, BE, MTech (IIT), 28, 5' 6", 50 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి CA, 29, 6' 2", Associate, 15 L P/A, 10Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSIT (IIIT), MS, 30, 6' 2", Sr. Engineer, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Rich Family, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 8", H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Austin, BE, MBA, 28, 5' 5", Product Manager, 200 K, 8 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 25, 5' 5", PG Doctor, 60 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS (USA), 33, 5' 5", 25 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కుల పట్టింపు లేదు/డివోర్స్/43/Urban Development & Infrastructure/1L PM/Own House, Rents/ 25 Acrs Lands/కోట్ల ఆస్తులు గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. 7075238992 [H-783532]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి పట్టింపు లేదు/Age: 32/ B.Pharm సొంత వ్యాపారం, మంచి ప్రాపర్టీస్ గల వధువుకి 1వ, 2వ వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9100147176 [H-783623]

రెడ్డి/విడో/50Y/Hyd lo Own Hostels Rents సొంత క్లాత్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్)(నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-783532]

SC హిందూ మాదిగ / M.Sc / C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్ / రైల్వేస్/50,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15021]

SC హిందూ మాల/M.Tech, IIS/ SWE /Intel / 28 Lakhs P.A / 5'4"ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15021]

యాదవ/B.Tech /Govt.కస్టమ్స్ ఆఫీసర్ /80,000/-PM / 5'4"ఎత్తు / 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-15021]

SC మాదిగ / B.Tech(EEE) / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 65000/-PM/ 5'4"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15021]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com, Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను(ఇల్లరికం ఐనా OK)అన్ని కులాల వారికి Inter cast వివాహాలు చూడబడును. Ph: 8121347478 [H-783623]

కమ్మ/విడో / కుల పట్టింపు లేదు/ఏజ్ : 50yrs/2nd Mach/5'5"/ ఫెయిర్/Govt.జాబ్ 95K (pm) ప్రాపర్టీ గల వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. #9581120134 [HA-34277]

రెడ్డి/కుల పట్టింపు లేదు, 26y/B.Tech/ 5'3"H/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9885463158 [HA-15020]

ఆర్యవైశ్య/21y&22y&23y&25y&26y&27y&28y & 29y&30y&31y&33y&35y & 36y&37y & 39y&40y & 41y&42y&43y&45y&47y & 48y&49y&50y/జి.సుప్రజా గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-15020]

రెడ్డి కాపు/Govt.ఎంప్లాయ్ 89K (pm) కుల పట్టింపు లేదు 34yr/B.Tech & బిజినెస్ వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [HA-15020]

★★

రెడ్డి 27Y 5'2" 8o cr MBA వధువుకు Hydలో సెటిలైన Business Man వరుడు కావలెను. సంప్ర॥ కళ్యాణ ప్రాప్తిరస్తు మ్యారేజ్ బ్యూరో సెల్ : 82731 59456.

SC మాల/33/ఎత్తు 5'4", గవర్నమెంట్ జాబ్ (అసిస్టెంట్ ఇంజనీర్) చేస్తున్న వధువుకు వరుడు కావలెను (నెల్లూరు) ఫోన్ : 9989246539 [HA-10578]

వేదికలు



పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ: తెనాలి (గుంటూరు జిల్లా) వారి 14వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 20.04.2025 ఆదివారము ఉ.9గం.ల నుండి. ✆ 9963924665, 9849851322. [T-312]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15026]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పెళ్లి/విడో సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-783532]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15026]

2వ పెళ్లి ప్రత్యేకం. 45yrs-60yrs, Govt, Pvt, రిటైర్డ్, బిజినెస్, హౌస్‌వైఫ్స్, సంబంధముల కొరకు సంప్ర: Ph: 9848023736 [HA-15021]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15026]

Padmashali పెళ్ళి సంబం ధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15026]

Divorced & Widowed పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15026]

టీటీడీ గోశాలలో గోవుల మృతిపై విచారణకు ఆదేశించాలి

- తక్షణమే నిజనిర్ధారణ కమిటీ వేయాలి
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) గోశాలలో మూడు నెలల్లో వందకు పైగా గోవులు మృతిచెందిన ఘటనపై ప్రభుత్వం తక్షణమే నిజనిర్ధారణ కమిటీని నియమించి విచారణకు ఆదేశించాలని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తిరుమల పవిత్రత మంటగలిసే ఘటనలే వరుసగా జరుగుతున్నాయని, వీటిని చూసి హిందువులు మనోవ్యథకు గురవుతున్నారన్నారు. గోశాలలో గోవులు చనిపోయి ఎలా పడి ఉన్నాయో ఫొటోలతో వెలుగులోకి తెచ్చింది.దీనిపై బాధ్యత కలిగిన టీటీడీ అధికారి ఎవరూ మాట్లాడలేదు. బీజేపీ నేత భానుప్రకాశ్ ఇందులో కొంత వాస్తవం ఉందని అంగీకరించారు. మంత్రి లోకేశ్ మాత్రం బాధ్యత లేకుండా ఇదంతా దుష్ప్రచారమంటూ తేలికగా కొట్టిపారేశారు. మీకు చిత్తశుద్ధి ఉంటే గోవుల మరణాలపై ఒక కమిటీని నియమించి వాస్తవాలను ప్రజలకు, హిందూ సమాజానికి వెల్లడించాలి. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా రాజకీయ కేంద్రంగా తయారు చేసింది. తిరుమలలో ఉన్నది టీటీడీ కాదు... టీడీపీ కార్యాలయం. టీటీడీ బోర్డు వీఐపీల సేవలో తరిస్తోంది. సామాన్య భక్తులకు సేవలందించే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తాజాగా శనివారం కొందరు వ్యక్తులు అన్ని భద్రతలను దాటుకుని పాదరక్షలతో శ్రీవారి మహాద్వారం వద్దకు వెళ్లారు. ఇది స్వామివారి క్షేత్రాన్ని అపవిత్రం చేయడం కాదా? మధ్యాహ్నం స్వామివారి నైవేద్యం కూడా 15 నిమిషాలు ఆలస్యమైందంటే స్వామివారి పట్ల టీటీడీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోంది. టీడీపీ పాలనలో 2014–19 మధ్య కూడా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ గోశాలలోనూ గోవులు మృతిచెందితే కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారు. గోశాలను దూరంగా తరలించారు. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విజయవాడ నగరంలోని వీవీ నరసరాజు రోడ్డులోని గోశాలను కూల్చేశారు. రాష్ట్రంలోని అన్ని గోశాలల్లో గోవుల పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలి. గోవుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతాం.' అని మల్లాది విష్ణు స్పష్టం చేశారు.

తిరుమలలో గోవుల మృతిపై పిల్ వేస్తా

కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణియన్ స్వామి స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : టీటీడీ గోశాలలో పెద్ద సంఖ్యలో గోమాతల మృతిపై కోర్టులో పిల్ దాఖలుకు సమాయత్తమవుతున్నట్లు కేంద్ర మాజీ మంత్రి, విరాట్ హిందూస్తాన్ సంఘం అధ్యక్షుడు సుబ్రమణియన్ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'గత మూడు నెలల్లో టీటీడీ గోశాలలో పవిత్రమైన దేశీయ ఆవులు అనారోగ్యంతో పాటు సరైన మేత లేకపోవడం వల్ల చనిపోయాయని టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించి మరింత సమాచారాన్ని నేను సేకరిస్తున్నా. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం గోవులను రక్షించడం ప్రభుత్వం బాధ్యత. న్యాయస్థానంలో త్వరలో దాఖలు చేయడానికి వీలుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం సిద్ధమవుతోంది' అని ఆ పోస్ట్‌లో తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరులో వైద్యుల మోసాలు

యాప్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన 156 మంది వైద్యులు
ఇదే బాటలో 76 మంది సిబ్బంది

సాక్షి, అమరావతి: ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) యాప్ ఆధారిత హాజరు నమోదులో మోసాలకు పాల్పడుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖలో పనిచేస్తోన్న పలువురు వైద్యులు, సిబ్బంది పట్టుబడ్డారు. ఐఫోన్ యాప్‌లోని ప్రత్యేక వెసులుబాటును ఆసరా చేసుకుని మోసానికి పాల్పడుతోన్న 156 మంది వైద్యులు, 76 మంది సిబ్బందిని గురువారం రాష్ట్ర స్థాయి అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీరిలో ఎక్కువ మంది శ్రీకాకుళం, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల నుంచి ఉన్నారని వెల్లడైంది. ట్యాంపరింగ్‌కు పాల్పడిన వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోలకు రాష్ట్ర అధికారులు సూచించినట్లు తెలిసింది. వీరిని సస్పెండ్ చేయడంతో పాటు, తాత్కాలిక ఉద్యోగులైతే విధుల నుంచి తొలగించే సూచనలున్నాయి.

టీచర్ల వైద్య సర్టిఫికెట్ల జారీకి క్యాంపులు

- ఈనెల 24 నుంచి 26వరకు ఏర్పాటు
- వైద్య విద్య డైరెక్టర్‌కు పాఠశాల విద్యాశాఖ లేఖ




సాక్షి, అమరావతి: వచ్చే నెలలో చేపట్టనున్న బదిలీల్లో భాగంగా టీచర్ల కోసం మెడికల్ బోర్డుల క్యాంపులు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్‌కు శనివారం లేఖ రాశారు. ఉపాధ్యాయ బదిలీల్లో వివిధ జబ్బులతో ఇబ్బంది పడుతున్న వారికి మొదటి ప్రాధాన్య క్రమంలో అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా కొన్ని జబ్బుల జాబితాను బదిలీల చట్టంలో చేర్చారు. ఆయా జబ్బులున్న వారిని పరీక్షించేందుకు ఈ నెల 24 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. చికిత్స పొందుతూ మానసిక వైకల్యం గల జీవిత భాగస్వామి (స్పౌజ్) గల ఉపాధ్యాయులు, వీటితోపాటు ఉపాధ్యాయుల సంతానానికి ఉన్న జబ్బులకు కూడా బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ విభాగంలో మానసిక వైకల్యం, బాల్య మధుమేహం/తలసేమియా/హిమోఫీలియా/కండరాల బలహీనత/పుట్టుకతో గుండె జబ్బులతో జన్మించి శస్త్రచికిత్స చేయించుకున్న పిల్లలు కలిగిన ఉపాధ్యాయులను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది.

వారికీ మినహాయింపు ఇవ్వండి

ఉపాధ్యాయ బదిలీల నిమిత్తం వేతనాలలో దివ్యాంగ అలవెన్సు పొందుతున్న వారికి మెడికల్ బోర్డు ధ్రువీకరణ పత్రం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యా శాఖను కోరారు. 'సెల్ఫ్' కింద ఉపాధ్యాయులకు వర్తింపచేసే జబ్బులన్నీ స్పౌజ్‌కు కూడా వర్తింపజేయాలన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికి పరిమితులు లేకుండా బదిలీకి అనుమతించాలన్నారు. 6 నెలలలోపు వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్న వారిని అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

పులివెందుల మీటింగ్‌లో గ్రూపుల గోలేంటి?

- నాయకుల మధ్య విభేదాలతో సమస్యలు
- టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



సాక్షి, అమరావతి: పులివెందుల సమావేశంలో రెండు గ్రూపులు గొడవ పడటం ఏంటి? ఇలాంటి వర్గాల ఏర్పడటానికి పార్టీలో వీల్లేదు. వైఎస్సార్ కడపలో మహానాడు ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామనుకున్నాను. మీరేమో ఇలా విభేదాలతో వీధికెక్కుతున్నారు. మీ తీరుతో చులకనయ్యే పరిస్థితి ఏర్పడుతోందంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు, ఇతర నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందులో పార్టీ నేతల మధ్య విభేదాలతోనే సమస్యలు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు.అందరూ కలిసి పని చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ పునర్వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి:వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించారు. ఈ విషయాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 33 మందిని పీఏసీ సభ్యులుగా నియమించారని, పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పీఏసీ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని పేర్కొంది. పీఏసీ సభ్యులుగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, విడదల రజిని, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేష్‌బాబు, మాజీ మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రులు షేక్ బెపారి అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్‌ఖాన్, మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌లను నియమించారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు పీఏసీ శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.



మరికొన్ని నియామకాలు

వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పలువురు నాయకులను వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసిన మరో ప్రకటనలో పేర్కొంది. అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్తగా పినిపే విశ్వరూప్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షునిగా చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ ఆసిఫ్, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి(వై.విశ్వేశ్వరరెడ్డి స్థానంలో)లను నియమించారు.

శ్రీచైతన్య జయకేతనం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 467 మార్కులతో ఇద్దరు స్టేట్ టాప్ మార్కులు, బైపీసీలో 437 మార్కులతో స్టేట్ ఫస్ట్, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 992 మార్కులతో ముగ్గురు స్టేట్ ఫస్ట్, బైపీసీలో 992 మార్కులతో స్టేట్ టాప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య నిర్వహించిన పటిష్టమైన కార్యక్రమాలు, ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో.. త్వరలో జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్‌ల్లో కూడా తమ విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నారాయణ రికార్డు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఇంటర్–2025 ఫలితాల్లో నారాయణ రికార్డుల మోత మోగించింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 468 మార్కులతో స్టేట్ ఫస్ట్ ఒకరు, ఏకంగా ఎనిమిది మంది 467 మార్కులు, 55 మంది 466 మార్కులు సాధించినట్లు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు నలుగురు విద్యార్థులు 436 మార్కులు, 27 మంది 435 మార్కులు సాధించారని వెల్లడించారు. సీనియర్ ఇంటర్‌లో 1,000 మార్కులకు ముగ్గురు విద్యార్థులు 992 మార్కులు, 39 మంది 990 మార్కులు, 93 మంది 989 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యా సంస్థల తరఫున అభినందనలు తెలిపారు.

తిరుమల విద్యా సంస్థల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తమ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470కి 467 మార్కులు ఐదుగురు విద్యార్థులు సాధించారని, 464 పైన 650 మంది, 460 పైన 1,903 మంది, 450 మార్కుల పైన 3,816 మంది సాధించారన్నారు. బైపీసీలో 440కి 436 మార్కులు 12 మంది విద్యార్థులు సాధించారని, 430 పైన 221 మంది, 400 పైగా 641 మంది మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 1,000కి గాను 8 మందికి 991 మార్కులు వచ్చాయన్నారు. 82 మంది విద్యార్థులకు 989 పైన, 470 మందికి 985 పైన, 2,269 మంది విద్యార్థులకు 970 పైన, 3,669 మంది విద్యార్థులకు 950 మార్కుల పైన వచ్చాయని, 99.30 శాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు.

భాష్యం విజయ కేతనం


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు విజయ కేతనం ఎగుర వేశారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో ఐదుగురు 470కి 466 మార్కులు, 420 మంది 460కి పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎస్.జయ 991 మార్కులు.. జె.తారణి, కె.కావ్యశ్రీ 990 మార్కులు సాధించారని చెప్పారు. ఇదే విభాగంలో 218 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో ఎ.ప్రమోదలక్ష్మి 440 మార్కులకుగానూ 436 మార్కులు.. మరో పది మంది విద్యార్థులు 435 మార్కులు సాధించారని తెలిపారు. మొత్తం 84 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపీసీ విభాగంలో ఇద్దరు 989 మార్కులు, ముగ్గురు 988 మార్కులు సాధించారని చెప్పారు. ఈ ఫలితాల వెనుక అత్యుత్తమ విద్యా ప్రణాళిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో వై.ప్రసన్నాంబిక, లక్ష్మీ సంజన, కె.బాల వేంకటేశ్వరరావు, తాడి మాధవి 470 మార్కులకు 466 సాధించారన్నారు. మరో 16 మంది 465 మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీలో టి.సాహితి, బి.అనిత 435మార్కులు, ఎనిమిది మంది 432 మార్కులు.. ఎంఈసీ విభాగంలో పి.వెన్నెల 491 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎం.సవిత 992, షేక్ అషిన్, యాస్మిన్ షేక్ 991 మార్కులు సాధించారని చెప్పారు. సీనియర్ బైపీసీలో టీవై ప్రియ, పీబీఎల్ స్పృహది 989 మార్కులు.. సీనియర్ ఎంఈసీ విభాగంలో ఎస్ఎస్ దుర్గ చంద్రిక 980 మార్కులు, త్రిపుర నాగశ్రీ 976 మార్కులతో ప్రతిభ చూపారన్నారు.

శశి వేలివెన్ను విద్యార్థుల విజయదుందుభి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తమ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మరోసారి సత్తా చాటారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.సాత్విక్ వర్మ, బి.సన్విత, డీపీబీ బంగారం 990 మార్కులు, సీనియర్ బైపీసీలో కె.లీలా వినోదిని 990 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 15 మందికి 466 మార్కులు, జూనియర్ ఇంటర్ బైపీసీలో నలుగురికి 435 మార్కులు వచ్చాయన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

శ్రీ విశ్వశాంతి విద్యార్థుల ఘనత

కంకిపాడు: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కృష్ణా జిల్లా ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి విద్యార్థులు అపూర్వ విజయం సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో టి హారిక 989, బి.కృష్ణప్రసాద్ 986, కె.సాగర్‌బాబు, శాంతి గుణశ్రీ, ఆదిత్యరామ్ 985 మార్కులు సాధించారు. ఇదే విభాగంలో 36 మంది విద్యార్థులు 975 మార్కులకు పైగా సాధించారు. సీనియర్ బైపీసీలో సీహెచ్ ప్రణీత 984 మార్కులు, బి త్రిలోక్య 980 మార్కులు సాధించారు. ఇదే విభాగంలో 12 మంది 977 మార్కులకు పైగా సాధించారు. మొత్తంగా 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థల చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ మాదల సూర్యశేఖర్ అభినందించారు.

తెలంగాణ

అగ్నివీర్ దరఖాస్తుల గడువు 25

సాక్షి, హైదరాబాద్: భారత ఆర్మీలో 2025–26 ఏడాదికి అగ్నివీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు రక్షణశాఖ అధికారులు తెలిపారు. తొలుత నిర్ణయించిన ప్రకారం గడువు ఈనెల 10తో ముగిసింది. అయితే, అభ్యర్థుల నుంచి వస్తున్న వినతుల మేరకు మరికొంత సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని సూచించారు.

15 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ఈ నెల 15, 16, 17 తేదీల్లో మరోసారి విచారణ జరపనుంది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఇప్పటికే రెండు దఫాలుగా తన వాదనలు వినిపించగా, మరో రెండు మూడు దఫాల పాటు వాదించనున్నారు. ఆ తర్వాత ఏపీ తరఫున వాదనలు జరగనున్నాయి.

సరిగ్గానే దిద్దుతున్నారా?



తెలుగు రాష్ట్రాల్లో పోటీ పరీక్షల మూల్యాంకనంపై అభ్యంతరాలు

సాక్షి, ఎడ్యుకేషన్

రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది విద్యార్థులు పోటీ పడే ఉద్యోగ నియామక పరీక్షల్లో జవాబు పత్రాల మూల్యాంకనం మెరుగ్గానే ఉందా? వాటిని సరిగానే దిద్దుతున్నారా? అంటే.. లేదనే సమాధానమే వస్తోంది. పలు పోటీ పరీక్షల మూల్యాంకనంపై సవాలక్ష సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఏళ్ల తరబడి చదివి పరీక్ష రాస్తే, ఆ జవాబు పత్రాలు దిద్దేనిపుణుల అర్హత, అనుభవంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలను బలపర్చేలా ఇటీవల తెలంగాణ గ్రూప్–1 పరీక్షలో వచ్చిన ఫలితాలు ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు.

'కీ' పాయింట్లకే పరిమితమై...

పోటీ పరీక్షల్లో లక్షల మంది భవిష్యత్తును నిర్ణయించేది మూల్యాంకనమే. ఇంతటి కీలకమైన మూల్యాంకనాన్ని సరిగ్గా నిర్వహించే అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అందుబాటులో ఉన్నవారితోనే మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జవాబు పత్రాలు దిద్దేవారికి అధికారులు నాలుగైదు 'కీ'పాయింట్లు ఇస్తారు. అయితే, అభ్యర్థి అంతకంటే మంచి పాయింట్లతో సమాధానం రాసినా, ఫ్యాకల్టీ ఆ కీ పాయింట్ల అన్వేషణకే పరిమితమై తగిన మార్కులు ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు వేర్వేరు సబ్జెక్టులు ఉండే పేపర్‌ను ఒక్కరితోనే మూల్యాంకనం చేయిస్తున్నారు. ఇది కూడా ఫలితాలపై ప్రభావం చూపుతోంది అని నిపుణులు చెబుతున్నారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్ పోస్టులు రెండు రాష్ట్రాల్లో భారీగా ఖాళీగా ఉండటమే సమస్యకు మూల కారణమని అభ్యర్థులు అంటున్నారు.

ఇవీ కొన్ని సమస్యలు..

- గ్రూప్–1 మెయిన్స్‌లో ఉండే పాలిటీ, గవర్నెన్స్, సొసైటీ పేపర్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. పాలిటీ వరకు మాత్రమే అకడమిక్స్‌లో ఉంటుంది. మూల్యాంకనం చేసే అధ్యాపకులకు ఇండియన్ సొసైటీ, గవర్నెన్స్ గురించి అంతగా అవగాహన ఉండదు. దీంతో వారు కీ షీట్‌పైనే ఆధారపడి మూల్యాంకనం చేస్తున్నారు.
- సైన్స్ అండ్ టెక్నాలజీ పేపర్‌లో బయాలజీ, ఫిజిక్స్, సమకాలీన సాంకేతిక రంగానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. కానీ, డిగ్రీ స్థాయిలో కోర్ సైన్స్ సబ్జెక్టులే ఉంటాయి. కరెంట్ టాపిక్స్ ఉండవు. దీంతో ఎవాల్యుయేటర్స్ కరెంట్ టాపిక్స్‌పై అవగాహన లేకుండానే మూల్యాంకనం చేస్తున్నారు.
- జనరల్ ఎస్సే పేపర్‌లో హిస్టరీ, కల్చర్, ఎకనమీ, పాలిటీ, కరెంట్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటిని మూల్యాంకనం చేయాలంటే ఒక్కో ప్రశ్నకు ఒక్కో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించాలి. కానీ.. అలా జరగట్లేదని అభ్యర్థులు అంటున్నారు.
- వేర్వేరు సబ్జెక్టులు కలిపి ఉండే పేపర్ల విషయంలో సెక్షన్ వారీగా వేర్వేరు సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయిస్తేనే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని చెబుతున్నారు.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టులు 75 శాతం ఖాళీగా ఉన్నాయి. ఏపీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 4,330 ఉంటే.. 1,048 మంది మాత్రమే ఉన్నారు. వీరిలోనూ గత నెలలో దాదాపు 150 మంది పదవీ విరమణ చేశారని సమాచారం. తెలంగాణలో 2,825 పోస్టులకుగాను 873 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి.
- డిగ్రీ లెక్చరర్ పోస్టులు కూడా దాదాపు 40 శాతం మేరకు ఖాళీగా ఉన్నాయి. ఫ్యాకల్టీ కొరతతో బోధన ప్రమాణాలు తగ్గడమే కాకుండా.. పరీక్షల నిర్వహణలో ప్రొఫెసర్ల భాగస్వామ్యం లేక లోపాలు చోటుచేసుకుంటున్నాయి.

అనువాదం కూడా సమస్యే

పోటీ పరీక్షల విషయంలో ప్రశ్నల అనువాదం కూడా ప్రధాన సమస్యగా మారుతోంది. ప్రశ్న పత్రాన్ని ముందుగా ఇంగ్లిష్‌లో రూపొందించి తెలుగులోకి అనువాదం చేస్తున్నారు. ఇందుకోసం అఫీషియల్ ట్రాన్స్‌లేటర్స్‌ను నియమిస్తున్నారు. వారు ప్రశ్న భావాన్ని అర్థం చేసుకోకుండా మక్కీకి మక్కీ (ట్రూ ట్రాన్స్‌లేషన్) అనువాదం చేస్తున్నారు. దీనివల్ల తెలుగు మీడియం అభ్యర్థులు నష్టపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

యూపీఎస్సీ తరహాలో చేయాలి

గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనం కూడా యూపీఎస్సీ సివిల్స్ మూల్యాంకనం మాదిరిగా ఒక నిర్దిష్ట విధానంలో చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూపీఎస్సీలో పోస్టుల సంఖ్యకు అనుగుణంగా మెయిన్స్‌కు 1:13 (ఒక్కో పోస్టుకు 13 మంది చొప్పున) ఎంపిక చేస్తారు. మూల్యాంకనానికి దేశవ్యాప్తంగా నిష్ణాతులైన ప్రొఫెసర్లను ఎంపిక చేస్తారు. వేర్వేరు సబ్జెక్టులు ఉండే పేపర్ల మూల్యాంకనానికి సెక్షన్ వారీగా వేర్వేరు నిపుణులను నియమిస్తారు. యూపీఎస్సీ మూల్యాంకనంలో కీ పాయింట్లను కేటాయించినప్పటికీ.. సమాధానంలో అదనపు సమాచారం ఉంటే.. వాటికీ మార్కులు ఇస్తారు. రాష్ట్రాల స్థాయిలో ఈ విధానం లేదు.

మూడో వ్యక్తితో మూల్యాంకనం చేయించాలి

గ్రూప్–1లో కచ్చితంగా ఇద్దరు నిపుణులతో మూల్యాంకనం చేయించాలి. మొదటి, రెండో మూల్యాంకనాల్లో మార్కుల మధ్య 5 శాతం వ్యత్యాసం ఉంటే మూడో వ్యక్తితో మూల్యాంకనం చేయించాలి. అప్పుడు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీలో ఇదే విధానం అమలవుతోంది. రెండు, మూడు సబ్జెక్టుల సమ్మిళితంగా ఉన్న పేపర్ల విషయంలో.. సెక్షన్ వారీగా సంబంధిత సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయించాలి. తెలుగు మీడియం అభ్యర్థులకు అర్థమయ్యే రీతిలో ప్రశ్నపత్రం అనువాదం ఉండాలి.

– ప్రొఫెసర్. వై.వెంకటరామిరెడ్డి, యూపీఎస్సీ మాజీ సభ్యుడు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- ఫలితాలను 'ఎక్స్'లో విడుదల చేసిన మంత్రి లోకేశ్
- 10,17,102 మంది హాజరవ్వగా 9,09,325 మంది పాస్
- మొదటి ఏడాది 70 శాతం.. రెండో ఏడాది 83 శాతం మంది ఉత్తీర్ణత
- బాలికల ఉత్తీర్ణత మొదటి ఏడాది 75 శాతం.. రెండో ఏడాది 86 శాతం
- బాలుర ఉత్తీర్ణత ఫస్ట్ ఇయర్ 66 శాతం, రెండో ఏడాది 80 శాతం



సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ పరీక్షల్లో బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది విద్యార్థులకు గాను 10,17,102 మంది హాజరవ్వగా 9,09,325 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,91,254 మందికి గాను 4,22,030 మంది (83 శాతం).. మొదటి ఏడాదిలో 5,25,848 మందికి గాను 4,87,295 మంది (70 శాతం) పాసయ్యారు. 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం ఇంటి నుంచి 'ఎక్స్'లో విడుదల చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఎప్పటిలాగే ఇంటర్ విద్య ఫలితాల్లో బాలికలే అత్యధిక శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో ఏడాదిలో 86 శాతం, మొదటి ఏడాది 75 శాతం.. బాలురు రెండో ఏడాది 80 శాతం, మొదటి సంవత్సరంలో 66 శాతం పాసయ్యారు.

టాప్‌లో కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలు

ఈ విద్యా సంవత్సరం ఇంటర్ (మొదటి, ద్వితీయ) ఫలితాల్లో కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ మొదటి ఏడాదిలో కృష్ణా 85 శాతం, గుంటూరు 82 శాతం, ఎన్టీఆర్ జిల్లా 81 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రెండో ఏడాది కూడా ఇవే జిల్లాలు టాప్‌లో నిలవడం గమనార్హం. కృష్ణా 93 శాతం, గుంటూరు 91 శాతం, ఎన్టీఆర్ జిల్లా 89 శాతంతో తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ రెండో ఏడాది 54 శాతంతో చిత్తూరు చివరి స్థానంలో, మొదటి సంవత్సరం ఫలితాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా 73 శాతంతో చివరిలో నిలిచింది. అనకాపల్లి జిల్లా సైతం ఇదే శాతం సాధించడం గమనార్హం.

ఒకేషనల్‌లోనూ బాలికల హవా

ఇంటర్ ఒకేషనల్ విభాగంలోనూ బాలికలే పైచేయి సాధించారు. మొదటి ఏడాది 71 శాతం, రెండో ఏడాది 84 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, బాలురు మొదటి ఏడాది 50 శాతం, రెండో ఏడాది 67 శాతం మంది విజయం సాధించారు. ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం 38,553 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,991 మంది (62 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 33,289 మంది హాజరవ్వగా 25,707 మంది (77 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఈనెల 20 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం

ఇంటర్ ఫలితాలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఇంటర్మీడియట్ బోర్డుకు తెలియజేయాలని కమిషనర్ కృతికా శుక్లా తెలిపారు. నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించిందన్నారు. ఫెయిలైన విద్యార్థులకు మే 12 నుంచి 20 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సైతం శనివారం విడుదల చేశారు. మే 28 నుంచి జూన్ 19 వరకు సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 15 నుంచి 22 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పిస్తారు.

హెచ్‌ఈసీలో చాతుర్యకు 980 మార్కులు



కంభం: ప్రకాశం జిల్లా కంభంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన తమ్మినేని చాతుర్య హెచ్‌ఈసీ గ్రూపులో వెయ్యికిగాను 980 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థిని కళాశాలలో చేరే సమయంలో సైన్స్ గ్రూపు తీసుకోమని లెక్చరర్లు సూచించినా, తాను సివిల్స్, గ్రూప్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని.. అందుకోసమే హెచ్‌ఈసీ గ్రూపు తీసుకున్నానని తెలిపింది.

పేదింట మార్కుల పంట



జియ్యమ్మవలస: మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొరవలస గ్రామానికి చెందిన బర్ల లలిత సీనియర్ ఇంటర్ బైపీసీలో వెయ్యికి 989 మార్కులు సాధించి ప్రతిభ చాటుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని తల్లిదండ్రులు సంగమేష్, సుశీల రోజువారీ కూలీలు. నెల్లిమర్ల బాలికల వసతి గృహంలో ఉంటూ అక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది.

వాట్సాప్ 'ఫలితాలు' ఏమైనట్టు?

సాక్షి, అమరావతి: ఈ ఏడాది జరిగే అన్ని పబ్లిక్ పరీక్షల ఫలితాలు, మార్కులను నేరుగా తల్లిదండ్రుల ఫోన్లకే పంపుతామని ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రచారానికే పరిమితమైంది. శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలను ఒక్క విద్యార్థి తల్లీదండ్రికీ పంపలేదు. వాస్తవానికి పరీక్షల ఫీజు చెల్లించేటప్పుడే విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను నమోదు చేశారు. స్మార్ట్ ఫోన్ లేకపోయినా ఫీచర్ ఫోన్‌కు అయినా సరే ఎస్ఎంఎస్ రూపంలో రిజల్ట్స్ పంపిస్తామని ప్రకటించారు. ఇందుకోసం ఇంటర్ చదువుతున్న 10,58,893 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను సేకరించారు. కానీ ఏ ఒక్కరికీ ఫలితాలను పంపలేదు. ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ కోసం ఇచ్చిన ఫోన్ నంబర్‌లో ఫలితాలు తెలుసుకోవచ్చని మాత్రమే చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ (9552300009) నంబర్ శనివారం మూగబోయింది.

'ఎంజేపీ'లో 98 శాతం ఉత్తీర్ణత

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బీసీ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రెండో ఏడాదిలో 98 శాతం, మొదటి ఏడాదిలో 92.40 శాతం మేర ఫలితాలు సాధించారు. మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలకు 18 ఎంజేపీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. రెండో ఏడాది పరీక్షలకు హాజరైన 1,608 మందిలో 1,578 మంది (98 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో బి.దివాకర్ 984/1000 మార్కులు, బైపీసీలో కె.కవితాబాయి 982/1000 మార్కులు సాధించారు. మొదటి ఏడాది పరీక్షలకు 1,925 మంది హాజరవ్వగా 1,779 మంది (92.40 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఎం.మనోజ్ 463/470 మార్కులు రాగా, బైపీసీలో జి.మేఘన, జి.దస్తగిరి, సీహెచ్ రాణి 435/440 మార్కులు సాధించారు. ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ కళాశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు.

వీశాట్ ఫేజ్–1 ఫలితాలు విడుదల

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలో శనివారం వీశాట్–2025 ఫేజ్–1 ప్రవేశ ఫలితాలను వీసీ నాగభూషణ్ విడుదల చేశారు. వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీ, హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వర్సిటీ ఆఫ్ క్యాంపస్‌ల్లో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్, ఫార్మా–డీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్–2025 ఫేజ్–1కు ఈ ఏడాది అనూహ్య స్పందన లభించిందని వీసీ తెలిపారు. వీశాట్–2025 ఫేజ్–1 ప్రవేశ పరీక్షను ఈ ఏడాది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించామన్నారు. గుంటూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో ఏప్రిల్ 16 నుంచి 20 వరకు మొదటి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. వీశాట్ ఫేజ్–2 ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 13 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

అయ్యో బత్తాయి..



పంటకు గిట్టుబాటు ధర లేక బత్తాయి రైతు బేల చూపులు చూస్తున్నాడు. ప్రస్తుతం టన్ను కాయల ధర రూ. 15 వేలు నుంచి రూ. 20 వేల మధ్య పలుకుతోంది. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లేకపోయేసరికి రైతులు లబో దిబోమంటున్నారు. ధర లేకపోవడంతో అనంతపురం మార్కెట్ యార్డ్‌లో బత్తాయి కాయలను ఇలా రాసులుగా పోశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మండేఎండ... చల్లని కుండ



మండుటెండలో చల్లని నీరు గొంతులో పోసుకుంటే ఆ హాయే వేరు. ప్రస్తుతం ఫ్రిజ్‌లు అందుబాటులో ఉన్నా కుండలో నీటికే కొంతమంది ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తయారీదారులు ఈ కుండకు ట్యాప్ పెట్టి విక్రయిస్తుంటారు. విశాఖ జగదాంబ కూడలి వద్ద ఉన్న కుమ్మరి వీధిలో మట్టి పాత్రలు, కుండలు తయారు చేసి ఇలా విక్రయిస్తుంటారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పచ్చని పల్లె



మండు వేసవిలోనూ ఆ ఊరు.. చుట్టూ పచ్చదనంతో కళకళలాడుతోంది. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం నల్లపురెడ్డిగాండ్ల పల్లె కొండవాలున ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో హార్టికల్చర్ కింద అరటి సాగును ప్రోత్సహించారు. దీంతో చుట్టుపక్కల కొండకోనలు ఎండిపోయి కనిపిస్తున్నా ఈ గ్రామం చుట్టూ పచ్చదనం పరచుకుని రైతులు సంతోషంగా ఉన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

మామిడి.. భరోసా కొరవడి

నూజివీడు మామిడికి సర్కారు మొండిచేయి



- ఆగిరిపల్లిలో సీఎం పర్యటన నేపథ్యంలో రైతుల ఆశలు
- గత ప్రభుత్వంలో రూ.275 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్లు
- కూటమి రాకతో అటకెక్కిన వైనం
- నల్లతామరతో ఇప్పటికే రైతుల సతమతం
- పరిశోధన స్థానం ఉన్నా పట్టించుకోని సర్కారు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: మామిడి సాగుకు నూజివీడు ఖ్యాతిగాంచింది. దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా నూజివీడు మామిడికి మంచి పేరుతో పాటు డిమాండ్ ఉంది. అలాంటి మామిడి సాగు పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుంది. అకాల వర్షాలు, తెగుళ్లతో దిగుబడులు గణనీయంగా పడిపోయి రైతులకు ఏటా కన్నీళ్లే మిగులుతున్నాయి. ఈ తరుణంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నూజివీడు నియోజకవర్గంలో పర్యటించిన క్రమంలో మామిడి రైతుల్లో ఆశల రేకెత్తాయి. ప్రాసెసింగ్ యూనిట్లు, పరిశోధనా స్థానాన్ని అభివృద్ధి చేయడం వంటి హామీలతో పాటు రైతులకు నష్టపరిహారం ప్రకటిస్తారేమోనని అందరూ ఆశగా ఎదురుచూసి భంగపడ్డారు. 6 గంటల సీఎం పర్యటనలో మామిడి రైతుల గురించి కనీసం ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

కనీస చర్చ కూడా లేకుండానే..

ఏలూరు జిల్లాలోని నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో మామిడి సాగు గణనీయంగా ఉంది. పదేళ్ల క్రితం వరకు సుమారు 80 నుంచి లక్ష ఎకరాల్లో విస్తరించిన మామిడి వరుస నష్టాలతో విస్తీర్ణంగా తగ్గుతూ వస్తోంది. ఆ స్థానంలో ఆయిల్ పామ్, కోకో తోటలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 45 నుంచి 50 వేల ఎకరాల్లో మాత్రమే మామిడి సాగు ఉంది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో పూత బాగున్నా నల్లతామర తెగులుతో 70 శాతం దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్దరసాలతో పాటు మరికొన్ని రకాలు అందుబాటులో ఉన్నాయి. మామిడికి అనుసంధానంగా ఎటువంటి పరిశ్రమలు లేకపోవడం, తెగుళ్ల నివారణను సమర్థంగా ఎదుర్కోవడానికి సాంకేతిక సహకారం, నిపుణుల సూచనలు లేకపోవడంతో ఏటా రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆగిరిపల్లి మండలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఆయనకు స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం బొకేలు బదులు మామిడి పండ్లు బహూకరించారు. అయినా సీఎం పర్యటనలో మామిడికి సంబంధించి ఎలాంటి చర్చ జరగని పరిస్థితి.

గత ప్రభుత్వంలో రూ.275 కోట్లతో యూనిట్

మామిడి సాగు పరిరక్షణకు, రైతులకు మేలు చేసేలా నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ 20 ఏళ్లుగా ఉంది. జ్యూస్ పరిశ్రమ, పల్ప్ పరిశ్రమ, మామిడి తాండ్ర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానికంగా ధరలు బాగుండటంతో పాటు విస్తీర్ణం కూడా పెరుగుతుందనే వాదన ఉంది. ఈ క్రమంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.256 కోట్లతో నూజివీడులో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 2023 నవంబర్‌లో జరిగిన సభలో ప్రకటించి వెంటనే నూజివీడు మండలంలోని సిద్ధార్థనగర్‌లో 25 ఎకరాల భూమిని కూడా సేకరించి డీపీఆర్‌ను సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో ప్రాజెక్ట్ నిలిచిపోయింది.

ఊసే ఎత్తని పాలకులు

చంద్రబాబు మొదలు లోకేష్ వరకూ మామిడికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సభల్లో పలుమార్లు చెప్పినా ఆ దిశగా అడుగులు కూడా పడలేదు. నూజివీడులో వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా మామిడి పరిశోధనా కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. పరిశోధనా స్థానం 18 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా 70 నుంచి 100 ఎకరాలు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అలాగే ముగ్గురు శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్నా సీజన్ పూర్తయిన తర్వాతే హార్టీకల్చర్, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంత్రి పార్థసారథి మామిడి పరిశ్రమను అభివృద్ధి చేస్తామని పలుమార్లు ప్రకటించినా ఆ దిశగా క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు.

అప్పులు పాలయ్యాం



గత డిసెంబర్‌లో మామిడి పూతలు బాగా వచ్చాయి. జనవరి నెలాఖరుకు పూతంతా తెగుళ్లు, పురుగులతో మాడిపోయింది. కనీసం 20 శాతం కూడా పిందె కట్టలేదు. పూత నిలుపుకోవడం కోసం పది నుంచి 15 సార్లు పురుగు మందులు చల్లించి అప్పులపాలయ్యాం. ఇప్పుడు చూస్తే తోటల్లో కాయ కూడా లేదు.

–డి.నాగమల్లేశ్వరరావు, సుంకొల్లు, నూజివీడు మండలం

నల్లతామర నుంచి రక్షించాలి



మూడేళ్లుగా తోటలు నల్లతామర బారిన పడుతున్నాయి. దీంతో రైతులు నిండా మునిగిపోతున్నారు. నల్లతామర వల్ల పూతంతా మాడిపోయి పిందె తయారు కావడం లేదు. దీంతో మామిడి రైతులు మూడేళ్లుగా నష్టాల పాలవుతున్నారు. ఈ ఏడాది మరింతగా నష్టాల్లో మునిగిపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి. –పల్లే రవీంద్రరెడ్డి, తూర్పు దిగవల్లి, నూజివీడు

బాబూ.. పని భారం తగ్గించండి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల ఆవేదన



- వలంటీర్ల పనులన్నీ సచివాలయాల సిబ్బందిపైనే
- సగం మంది ఉద్యోగులు వారి విధుల్లో పూర్తిగా బిజీ
- మిగతా వారిపై తీవ్ర ఒత్తిడి.. సెలవు రోజుల్లోనూ పని
- టార్గెట్ పూర్తి కాలేదంటూ క్రమ శిక్షణ చర్యలు
- పవన్ కళ్యాణ్‌ను కలిసేందుకు ఆరు నెలలుగా విఫలయత్నం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ తొలగింపు అనంతరం ప్రభుత్వం క్షేత్ర స్థాయి నుంచి ఏ సమాచారం సేకరించాలన్నా, సర్వేలు నిర్వహించాలన్నా ఆ పనులు పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకే అప్పగిస్తుండడంతో పంచాయతీ కార్యదర్శులు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. గత ఐదేళ్లలో ప్రతి నెలా పింఛన్ల పంపిణీ సహా ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల సర్వేలు పూర్తిగా వలంటీర్ల ఆధ్వర్యంలో కొనసాగేవి. అప్పట్లో సచివాలయాల ఉద్యోగులు వారి విధులు నిర్వహించడంతో పాటు ఆయా సర్వే కార్యక్రమాలను పర్యవేక్షించే వారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా పింఛన్ల పంపిణీ గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటి నుంచి వివిధ రకాల సమాచారం సేకరించే 14కు పైగా సర్వేలు, మరో ఐదారు అంశాల్లో గ్రామ స్థాయి నుంచి సమాచారం నమోదు చేసే కార్యక్రమాలు చేపట్టింది. వీటన్నింటినీ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారానే నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో 8–9 మంది చొప్పున ఉద్యోగులు పని చేస్తుండగా, వారిలో నాలుగైదు కేటగిరీల ఉద్యోగులు ఎక్కువ చోట్ల వారి మాతృ శాఖలకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నామని చెబుతూ సర్వేలకు దూరంగా ఉన్నారని ఉద్యోగ సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో ఈ భారం అంతా సచివాలయాల్లో ఉండే ఇతర ఉద్యోగులపై పడుతోందన్నారు. పై అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారని, పలుచోట్ల షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సారూ.. అపాయింట్‌మెంట్ ఇవ్వరూ..

ఓ వైపు నిర్దిష్ట గడువులు విధించి సర్వేల కోసం ఒత్తిడి.. మరో వైపు ఇంటి పన్నుల వసూళ్ల టార్గెట్.. ఇంకో వైపు పారిశుధ్య పనులపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చిన ప్రజాభిప్రాయంపై పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయడం.. తదితర వాటితో కొన్ని నెలలుగా పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ తెలిపింది. గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ సమావేశాల నిర్వహణ తదితర 37 రకాల గ్రామ పంచాయతీల సాధారణ కార్యక్రమాలతో బిజీగా ఉండే కార్యదర్శులకు ప్రస్తుత పనుల వల్ల భారం తీవ్రంగా పెరిగిందని ఫెడరేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సెలవులు కూడా సరిగా ఇవ్వడం లేదని, సెలవు రోజుల్లోనూ పని చేయాల్సి వస్తోందని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీలతో పాటు జిల్లా స్థాయిలో డీపీవో, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు సైతం ఉద్యోగ సంఘ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నా, ఆయన అపాయింట్‌మెంట్ దొరకలేదని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వర్ల శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.


విలక్షణం.. అడవి బిడ్డల జీవనం

చుట్టూ కొండలు..జలపాతాలు..రాళ్లూరప్పలు..పచ్చని ప్రకృతి..శబ్ద, వాయు కాలుష్యం కానరాని ప్రాంతం..ఆరోగ్యంగా జీవనం సాగించే గిరిజనం..ఎక్కడో దూరాన విసిరేసేలా ఉండే ఊళ్లు..ఇంకా అమాయకత్వాన్ని వీడని మోములు..రాయనక..రప్పనక..ఎండనక..వాననక..అడవి తల్లినే నమ్ముకున్న జీవితాలు..తరాలు గడిచినా..వారి జీవితం విలక్షణమే..పేరుకు జిల్లా కేంద్రంలో ఉన్నా సరే..వారింకా అడవిబిడ్డలే. పార్వతీపురం మండలంలోని తొక్కుడువలస, సీతంపేట, తాన్నవలస తదితర గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవన చిత్రాలివి.

–పార్వతీపురం రూరల్




అడవి నుంచి కట్టెలు మోసుకొస్తున్న యువతి



కొండల మధ్యన విసిరేసినట్లు ఉన్న తాన్నవలస గ్రామం



అమ్మానాన్న అడవికి: నేనేమో ఆటకు..



ఎవరో వచ్చారే: ఇంటి వసారాలో నుంచి భయంగా చూస్తున్న గిరిబాలలు



సీతంపేటలో చంకలో చంటిబిడ్డలతో గిరిజన మహిళలు



అడవినుంచి జీడిపళ్లు ఏరుకుని వస్తున్న గిరిజన మహిళ




తగ్గేదేలే: మోడల్ ద్విచక్ర వాహనంతో రయ్‌మని దూసుకు పోతున్న గిరిజనుడు



ఇదే మీటింగ్ హాల్: ఓ చోట కూర్చుని నలుగురూ కలిసి బాతాఖానీ




ఈ తెలివి మాకే సొంతం: ఓవైపు పశువులకు నీడలా.. మరోవైపు కావాల్సిన గడ్డిని అవే తీసుకునేలా సీతంపేటలో గిరిజనులు చేసిన ఏర్పాటు



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,462 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,393 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించరని స్పష్టం చేసింది.

ఘనంగా ముగిసిన శ్రీకోదండరాముని తెప్పోత్సవాలు



తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీరామచంద్ర పుష్కరిణిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండరామస్వామి వారి తెప్పోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజైన శనివారం రాత్రి స్వామి వారు తెప్పపై కొలువై విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి వారి ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణులు ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఆశీనులై పుష్కరిణిలో తొమ్మిది చుట్లు విహరించి భక్తులకు కనువిందు చేశారు.

విజయకీలాద్రిపై శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా సీతానగరం లోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు సకల విద్యాప్రాప్తికై హయగ్రీవ హోమం నిర్వహించామని తెలిపారు.

హంస వాహనపై లక్ష్మీనరసింహుడు



రాపూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలో వసంతోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఉభయనాంచారులతో కలసి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి హంస వాహనపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామి వారి అలంకార మండపంలో నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవీ ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నందనవనంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

హంస వాహనంపై నృసింహస్వామి



మంగళగిరి టౌన్ : చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శనివారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు గ్రామోత్సం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యం పొందారు. హంస వాహనంపై స్వామి ఆలయం చుట్టూ విహరించారు.

పోటెత్తిన కాణిపాకం



కాణిపాకం : చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం శనివారం భక్తజన సందడిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసింది. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనంతో పాటు వీఐపీ దర్శన సేవలు రద్దీగా మారాయి. ఎండను లెక్క చేయకుండా గంటల కొద్ది బారులు తీరారు. దర్శనం కోసం 2 గంటల సమయం పట్టింది. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శన సేవలు కల్పించారు. శనివారం, పౌర్ణమి గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు ఇలా కాణిపాకం దర్శనార్థం పోటెత్తారు.

ఘనంగా ప్రారంభమైన రాట్నాలమ్మ తిరునాళ్ల

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసివున్న శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవాలు శనివారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ దీపాలంకరణలతో బాణసంచా వెలుగులతో మహోత్సవాలను ఎంతో దేదీప్యమానంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మల్లన్నా..
రైలు ఆగేదెప్పుడన్నా?!

నత్తనడకన కొమురవెల్లి హాల్ట్ స్టేషన్ నిర్మాణం

- భక్తుల వినతిపై రైల్వే హాల్ట్ స్టేషన్ ఏర్పాటుకు ముందుకొచ్చిన రైల్వేశాఖ
- రూ.3 కోట్లతో రైల్వేస్టేషన్ నిర్మాణం
- త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న భక్తులు


కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి రైల్వే హాల్ట్‌స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో.. భక్తుల వినతుల మేరకు రైల్వే హాల్ట్‌స్టేషన్ మంజూరు చేశారు. గతేడాది ఫిబ్రవరి 15న మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. హాల్ట్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదు. రైల్వే స్టేషన్ కోసం భక్తులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

14 నెలలుగా సాగుతున్న నిర్మాణం

రూ.3 కోట్ల వ్యయంతో హాల్ట్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులకు శంకుస్థాపన చేసి 14 నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ రైల్వే స్టేషన్ నిర్మాణం పూర్తి కాలేదు. టికెట్ కౌంటర్, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు, మూత్రశాలలు, బెంచీలు, రైల్వే సిబ్బంది గది నిర్మాణం పూర్తయ్యాయి. ఇంకా రైల్వే స్టేషన్ ముఖద్వారం దగ్గర దేవాలయ గోపురం నిర్మాణం పూర్తికావాలి. రైల్వే స్టేషన్‌కు కోడ్ కేటాయించలేదు.

ఏడాదంతా భక్తులతో సందడి


కొమురవెల్లి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారు. ఏడాదంతా మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. ఏటా మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. ఈ మూడు నెలల్లో సుమారు 80 లక్షల మందికి పైగా కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. మిగతా రోజుల్లో ఏడాదంతా బుధ, శుక్ర, ఆదివారాల్లో సైతం భక్తులు వస్తుంటారు. వీరు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో కొమురవెల్లికి చేరుకుంటారు. రైల్వే హాల్ట్ స్టేషన్ అందుబాటులోకి వస్తే భక్తుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు రైలు రాకపోకలు రోజుకు రెండుమార్లు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసి రైలును అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.


నిలిచిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ ముఖద్వారం పనులు

కోడ్ కోసం కలెక్టర్‌కు లేఖ

హాల్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయి. ఇంకా గోపురం నిర్మించాలి. హాల్ట్ రైల్వే స్టేషన్ కోడ్ కోసం కలెక్టర్‌కు లేఖ రాశాం. కోడ్ రాగానే మరింత వేగంగా పనులు పూర్తి చేసి స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం.

– రాజేశ్ కుమార్,ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్, సికింద్రాబాద్



చాళుక్యుల కాలం నాటి రాజన్న దేవాలయం చిత్రాలు

వేములవాడ.. మినీ కాశీ



- సీఎం రాకతో పనులకు మోక్షం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో పనుల్లో కదలిక
- ఈనెల 15న రాష్ట్ర ఉన్నతాధికారుల పర్యటన

విస్తరణ పనులతో మరింత ప్రాధాన్యం


ఆలయ విస్తరణ పనులు చేపడితే భవిష్యత్‌లో రాజన్న ఆలయం ఇలా

వేములవాడ: భక్తి..సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం చాళుక్యుల కాలంనాటి మహోన్నత శిల్పకళకు నిలువెత్తు సాక్ష్యం. క్రీ.పూ. 750 ప్రాంతంలో చాళుక్యులు నిర్మించిన ఈ ఆలయం శతాబ్దాలుగా ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోంది. చాళుక్యులు వారి సామ్రాజ్యాన్ని వేములవాడ కేంద్రంగా పాలించారని శాసనాలు చెబుతున్నాయి. ఆనాటి శిల్పకళ, నిర్మాణశైలి ఈ ఆలయ గోపురాలపై స్పష్టంగా కనిపిస్తుంది.

మత సామరస్యానికి నిలయం

ఇక్కడ శివుడే ప్రధాన దైవమైనా, లక్ష్మీగణపతి, అమ్మవారు మూలవిరాట్‌గా కొలువై ఉన్నారు. ఆలయ ఆవరణలోనే అనంత పద్మనాభస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలు ఉండటంతో హరిహరక్షేత్రంగా పేరుగాంచింది. ఆలయంలోనే దర్గా ఉండటంతో మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఆలయానికి వచ్చే హిందువులు దర్గాను దర్శించుకుంటే.. ముస్లింలు రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడ నిత్యం కనిపిస్తుంటాయి. భీమేశ్వరాలయం పురాతన శిల్పకళకు ప్రతీక. బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనం మొక్కులు చెల్లించుకుంటుంటారు.

1979లో పునరుద్ధరణకు మైలురాయి

ఆలయ పునరుద్ధరణలో భాగంగా 1979లో భారీ స్థాయిలో పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ గర్భగుడి నుంచి ద్వారాలు, రాజగోపురాలను ఆధునిక శైలిలో మరమ్మతులు చేసి, ఆలయ సంప్రదాయ నిర్మాణ ఆధారంగా ఆధునీకీకరించారు. ధర్మ పుష్కరిణి, ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆలయాలు, కోటిలింగాలు అన్నీ ప్రత్యేక ఆకర్షణే.

భక్తుల రద్దీ.. నిత్యం వైభవం

ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు రాజన్న దర్శనార్థం వేములవాడకు తరలివస్తారు. మహాశివరాత్రి, శివకల్యాణోత్సవం, శ్రీరామనవమి ఉత్సవాలతోపాటు శ్రావణమాసం, కార్తీకమాసం, ఉగాది వంటి పర్వదినాల్లో ఈ సంఖ్య లక్షల్లో చేరుతుంది. భక్తులు ఆలయంలోని ధర్మ పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని తడిబట్టలతో దర్శించుకుంటుంటారు. తలనీలాలు, కోడె మొక్కులు చెల్లించుకుంటుంటారు. 'కొడుకునియ్యి రాజన్నా.. కోడెగడుతం రాజన్నా'అంటూ భక్తులు నమ్మకంతో పెద్దసంఖ్యలో చేరుకుంటారు.

ఆలయానికి నూతన శోభ

శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులను జూన్ 15 నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ఏడాది నవంబర్ 20న సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడలో ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.47 కోట్లు మంజూరు చేయడంతోపాటు బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. ఈనెల 15న రాష్ట్ర ఉన్నతాధికారులు పర్యటించి విస్తరణ పనులకు శ్రీకారం చుడతారు. ఈనెల 16న హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, 17న శృంగేరి పీఠాధిపతుల అనుమతుల కోసం వెళతారు. వారి సూచనలతో భక్తిభావం విరాజిల్లేలా పనులు చేపట్టనున్నారు. ఆలయ విస్తరణ పనులు చేపడితే భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనాలను కొనసాగించనున్నారు.


పరిపూర్ణత దిశగా..

1979లో మొదలైన పునరుద్ధరణ దశ, ఆలయాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా ఉండగా.. ఇప్పుడు జరుగుతున్న విస్తరణ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఉంటుంది. ఆలయ పురాతన శిల్పకళ, శైవ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని విస్తరించనున్నారు.

ఆకట్టుకుంటున్న డిజైన్లు

వేములవాడ రాజన్న ఆలయం సంప్రదాయానికి, శిల్పకళకు, సౌందర్యానికి ప్రతిరూపంగా రూపుదిద్దుకోనుంది. పుష్కరిణి మధ్యలో శివుడి విగ్రహం, నీటి ప్రవాహాల మధ్య మెరిసే మహాదేవుడి మూర్తి భక్తులకు అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుంది. పుష్కరిణి చుట్టూ పార్క్, నడక మార్గాలు, సాధారణ యాత్రను విశిష్ట యాత్రగా మార్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. దీని కోసం తయారు చేసిన డిజైన్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.


1979లో పునరుద్ధరణతో మారిన రాజన్న క్షేత్ర స్వరూపం


ఆలయ విస్తరణ పనులు చేపడితే భవిష్యత్‌లో రాజన్న ఆలయం ఇలా

వెయ్యేళ్లకు సరిపడేలా తీర్చిదిద్దుతాం



వేములవాడ రాజన్న గుడిని వెయ్యేళ్లకు సరిపడేలా సుందరంగా, భక్తులకు అన్ని వసతులు, సౌకర్యాలు ఉండేలా తీర్చిదిద్దుతాం. సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న గుడికి రావడంతోనే ఆలయం, పట్టణాభివృద్ధికి శ్రీకారం చుట్టినట్టయ్యింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పాలకులు కేవలం బ్రోచర్లతోనే భక్తులను మోసం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వవిప్

ము'న్నీరు'.. కన్నీరు


ఎస్సారెస్పీ జలాలతో మున్నేరు వాగు

ఒకే ఊరికి.. ఒకవైపు నిండు కుండలా మున్నేరు వాగు.. మరోవైపు అడుగంటిన వ్యవసాయ బావి.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు శివారు స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి ఉత్తరం వైపున మున్నేరు వాగు.. ఎస్సారెస్పీ జలాలతో కళకళలాడుతోంది. అదే గ్రామానికి పడమర వైపున రైతు సపావట్ కిషన్‌కు చెందిన వ్యవసాయ బావి అడుగంటిపోయింది. దీంతో ప్రొక్లెయిన్‌తో బావినుంచి పూడికతీత పనుల్లో నిమగ్నమయ్యారు.

– కురవి


వ్యవసాయ బావిలో పూడిక తీయిస్తున్న రైతు సపావట్ కిషన్

ఉద్యోగుల 'ఆయుష్'కు ముప్పు!

- ఆయుష్ ఫార్మసిస్టులకు శాపంగా జీవో 65
- అల్లోపతి కోర్సు పూర్తిచేసిన వారిని అర్హులుగా నిర్ధారిస్తూ ప్రకటన
- సర్వీస్ క్రమబద్ధీకరించాలని 334 మంది కాంట్రాక్టు ఉద్యోగుల వినతి
- న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి



ఖమ్మం జిల్లా చింతకానిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

చింతకాని: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 28వ తేదీన విడుదల చేసిన జీవో 65తో తమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆయుష్ ఫార్మసిస్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగులు వాపోతున్నారు. ఆయుష్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన జీవో తమ పాలిట శాపంగా మారిందని వాపోతున్నారు. ఈ జీవో కారణంగా.. 20 ఏళ్లుగా ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలల్లో కాంట్రాక్ట్ ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న వారంతా.. ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుష్ వైద్య విధానం, అల్లోపతి వైద్య విధానం వేర్వేరైనా.. దేశంలో ఎక్కడా లేనట్లు.. తెలంగాణలో మాత్రమే ఆయుష్‌లోకి అల్లోపతిని విలీనం చేయడం ఇందుకు కారణమవుతోందని ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 334 మంది ఉద్యోగులు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు.. కాంపౌండర్ సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా పదో తరగతి అర్హతతో.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన 2005లో 62 మందిని ఆయుష్ కాంపౌండర్లుగా నియమించారు. ఆతర్వాత 2008లో ఎన్‌హెచ్ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ద్వారా ఇంటర్‌లో సైన్స్ విద్యార్హత కలిగిన మరో 275 మందిని తీసుకున్నారు. తొలుత నియమించిన వారిలో 59 మంది మిగలగా.. అంతా కలిసి రాష్ట్రంలో ఇప్పుడు 334 మంది ఆయుష్ ఫార్మసిస్టులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక 2017లో ఉద్యోగ అర్హతలను సవరిస్తూ ఆయుష్ కాంపౌండర్ పేరుతో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను ఆయుష్ ఫార్మసిస్ట్‌గా మార్చారు. ఫార్మసిస్ట్ నియామకాలకు రెండేళ్ల ఆయుష్ డిప్లొమా ఫార్మసీ కోర్సును అర్హత (జీవో 147)గా నిర్ధారించారు. అయితే, ఏపీ, తెలంగాణలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలోనూ ఆయుష్ డిప్లొమా కోర్సును ఇప్పటివరకు ప్రవేశపెట్టలేదు. ఈ విషయమై పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని కాంట్రాక్టు ఉద్యోగులు చెబుతున్నారు.

అల్లోపతి డిప్లొమా అర్హత!

ఆయుష్ ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి అల్లోపతిలో రెండేళ్ల డిప్లొమా (డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఫార్మా డీ) పూర్తి చేసిన అభ్యర్థులనే అర్హులుగాప్రకటిస్తూ ప్రభుత్వం గతనెల 28వ తేదీన జీవో 65ను విడుదల చేసింది. వీరు సర్వీస్‌లోకి వచ్చాక ఆరు నెలల పాటు ఆయుష్ డ్రగ్స్‌పై శిక్షణ ఇస్తామని వెల్లడించింది. కానీ ఈ జీవో ద్వారా ఆయుష్ విధానంలోకి.. అల్లోపతి కోర్సు అభ్యర్థులను అర్హులుగా నిర్ధారించడం ఎన్‌సీఐఎస్ఎం (నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్) నిబంధనలకు వ్యతిరేకమని ఆయుష్ ఫార్మసిస్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ విధానంలో సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న తాము.. రెగ్యులర్ ఆయుష్ ఫార్మసిస్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌కు అర్హత కోల్పోతున్నామని వాపోతున్నారు. ఆయుష్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టకపోగా.. ఇప్పుడు అల్లోపతి డిప్లొమా పూర్తి చేసిన వారినే అర్హులుగా నిర్ధారించడం సరికాదంటున్నారు. తమ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చేలా ఉన్న జీవో 65ను వెంటనే రద్దు చేసి.. ఆయుష్ కాంపౌండర్లుగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేసిన ఉద్యోగులను ఏపీలో మాదిరి క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

జీవో 65ను రద్దు చేయాలి



ఆయుష్ కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడేలా ఉన్న జీవో 65ను వెంటనే రద్దు చేయాలి. చాలీచాలని వేతనంతో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నాం. అలాంటి మాకు శాపంగా మారిన జీవో 65పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ఈ విషయంలో న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

– తుంగపల్లి రాజ్‌ప్రవీణ్, ఆయుష్ కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్, కొణిజర్ల మండలం

నిబంధనలకు విరుద్ధం



ప్రభుత్వం విడుదల చేసిన జీవో 65 నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ నిబంధనలకు విరుద్ధంగా ఉంది. ఆయుష్ విధానంలో అల్లోపతి కోర్సు పూర్తిచేసిన వారిని అర్హులుగా నియమించడం అసంబద్ధ నిర్ణయం. ఆయుష్ వైద్య విధానం, అల్లోపతి విధానం వేర్వేరుగా ఉన్నా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఆయుష్‌లోకి అల్లోపతిని ప్రవేశపెట్టడం దారుణం.

– బానోతు శ్రీనివాస్, ఆయుష్ కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్, చింతకాని మండలం

సాక్షి సినిమా


● నాగార్జున ● ప్రభాస్ ● మహేశ్‌బాబు ● ఎన్టీఆర్ ● అల్లు అర్జున్

ఎప్పటి కప్పుడు తమ ఫ్యాన్స్ కోసం సరి కొత్త సినిమాలు చేయాలని, స్క్రీన్‌పై సరికొత్తగా కనిపించాలని హీరోలు ప్రయత్నిస్తూనే ఉంటారు. ఈ క్రమంలో కొన్ని సార్లు సమయం పట్టొచ్చు. ఇలా ఓ ఏడాది, రెండు మూడేళ్లు కొందరు హీరోలు సిల్వర్ స్క్రీన్‌ను మిస్ కావొచ్చు. అలా ఈ ఏడాది ఇప్పటికే కొంతమంది సిల్వర్ స్క్రీన్‌ను మిస్ కానున్నారు. అలా సోలో హీరోగా ఈ ఏడాది థియేటర్స్‌కు రాని కొందరు హీరోల గురించి ఓ లుక్ వేద్దాం.

బ్రేక్ పడింది బాసు!

● సోలో హీరోగా ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌ను మిస్ చేసుకుంటున్న హీరోలు

కథలు వింటున్నారు...

‘నా సామిరంగ’ సినిమాతో గత ఏడాది సంక్రాంతికి థియేటర్స్‌కు వచ్చి సూపర్ డూపర్ హిట్ అందుకున్నారు నాగార్జున. అయితే ఈ మూవీ తర్వాత నాగార్జున సోలో హీరోగా మరో మూవీపై ఇంకా సరైన స్పష్టత రాలేదు. యువ దర్శకులు నవీన్, కార్తీక్ చెప్పిన కథలను నాగార్జున విన్నారనే వార్తలు వచ్చాయి. ఇటీవల మరో యువ దర్శకుడు చెప్పిన కథను కూడా నాగార్జున విన్నారన్న వార్తలు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపించాయి. కానీ ఇప్పటివరకైతే నాగార్జున సోలో హీరో మూవీ అనౌన్స్‌మెంట్ రాలేదు. ఇలా ఈ ఏడాది నాగార్జున సోలో హీరోగా నటించే మూవీ థియేటర్స్‌కు రాకపోవచ్చని ఊహించవచ్చు. అయితే నాగార్జున అభిమానులు నిరాశపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నాగార్జున ఓ లీడ్ రోల్‌లో నటించిన ‘కుబేర’ (ఇందులో ధనుష్ హీరో), ‘కూలీ’ (రజనీకాంత్ హీరో) చిత్రాలు ఈ ఏడాదే స్క్రీన్‌పైకి వస్తాయి. శేఖర్ కమ్ముల దర్శకత్వంలోని ‘కుబేర’ సినిమా జూన్ 20న విడుదల కానుంది. అలాగే లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోని ‘కూలీ’ మూవీ ఆగస్టు 14న విడుదల కానుంది.

రెండేళ్లు ఆగాల్సిందే...

గత ఏడాది సంక్రాంతికి ‘గుంటూరు కారం’ సినిమాతో సందడి చేశారు మహేశ్ బాబు. ఆ తర్వాత వెంటనే రాజమౌళితో మూవీ ప్రకటించారు. ఈ మూవీ అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతోంది. క్వాలిటీ, కంటెంట్ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు మహేశ్‌బాబు, రాజమౌళి. దీంతో సహజంగానే ఈ మూవీ థియేటర్స్‌లోకి రావడానికి సమయం పడుతుంది. పైగా రాజమౌళితో మూవీ అంటే కనీసం రెండేళ్లైనా పడుతుంది. ఇలా ఈ ఏడాది, వచ్చే ఏడాది మహేశ్ బాబు స్క్రీన్‌పై కనిపించే అవకాశాలు లేనట్లే. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. రెండు కీలక షెడ్యూల్స్ చిత్రీకరణ జరిగింది. వేసవి సమయం కావడంతో ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లారు మహేశ్‌బాబు. ఇటు ‘ఆర్ఆర్ ఆర్’ (ఎన్టీ ఆర్-రామ్‌చరణ్‌లు హీరోలుగా నటించిన మూవీ) మూవీపై తీసిన ‘ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్’ డాక్యుమెంటరీ ప్రమోషన్స్‌లో భాగంగా రాజమౌళి జపాన్‌లో ఉన్నారు. రాజమౌళి, మహేశ్ బాబు విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్ మూవీ షూట్ మళ్లీ ప్రారంభం అవుతుందని ఊహించవచ్చు. కాగా ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలవుతుందనే ప్రచారం సాగింది. కానీ అలాంటిది ఏమీ లేదని, ఒకటే మూవీగానే విడుదలవుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంతే కాదు... 2027 మార్చి 25న ఈ సినిమాని రిలీజ్ చేసే ఆలోచనల్లో రాజమౌళి అండ్ టీమ్ ఉన్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఈ ప్రకారం మహేశ్‌బాబు సిల్వర్‌స్క్రీన్‌పై కనిపించేందుకు రెండేళ్లు ఆయన అభిమానులు ఎదురుచూడక తప్పేలా లేదు. ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

రాజాసాబ్ రానట్లే...

ప్రస్తుతం ‘ది రాజా సాబ్, ఫౌజి’ సినిమాల చిత్రీకరణలతో ప్రభాస్ చాలా బిజీగా ఉన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా ‘ది రాజా సాబ్’ సినిమాతో ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. మారుతి దర్శకత్వంలోని ఈ హారర్ కామెడీ ఫిల్మ్ ఏప్రిల్ 10న విడుదల కావాల్సింది. కానీ రిలీజ్ కాలేదు. ఈ సినిమాకి సంబంధించి కొద్దిగా షూటింగ్ బ్యాలెన్స్ ఉందని, ఇంకా సాంగ్స్ చిత్రీకరించాల్సి ఉందని ఈ చిత్రదర్శకుడు మారుతి ఇటీవల పేర్కొన్నారు. పైగా ‘ది రాజా సాబ్’ మూవీ కోసం ముందుగా అనుకున్న పాటలను క్యాన్సిల్ చేసి, ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగా కొత్త పాటలను కంపోజ్ చేస్తున్నట్లుగా ఈ చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఇటీవల ఓ సందర్భంలో తెలిపారు. ఇంకా షూటింగ్ పూర్తి కాకపోవడం, సాంగ్స్ బ్యాలెన్స్ ఉండటం, పైగా భారీగా వీఎఫ్ఎక్స్ చేయాల్సి ఉండటం వల్ల ‘ది రాజా సాబ్’ సినిమా ఈ ఏడాది థియేటర్స్‌కు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభాస్ చేస్తున్న మరో మూవీ ‘ఫౌజి’ చిత్రీకరణ ఇంకా చాలా బ్యాలెన్స్ ఉంది. సో... ఈ మూవీ 2026లో రిలీజయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ పీరియాడికల్ మూవీని నిర్మిస్తున్నారు. అయితే ప్రభాస్ ఫ్యాన్స్ పూర్తిగా నిరాశ పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే... విష్ణు మంచు హీరోగా చేసిన ‘కన్నప్ప’ సినిమాలో ఓ కీలక పాత్రలో ప్రభాస్ నటించారు. ఈ సినిమా ఈ ఏడాది జూన్ 27న రిలీజ్ కానుంది. ఈ విషయం ప్రభాస్ ఫ్యాన్స్‌కు కాస్త ఊరట కలిగించే అంశమనే చెప్పవచ్చు.

డ్రాగన్ వచ్చేది వచ్చే ఏడాదే...

గత ఏడాది ‘దేవర’ మూవీ తొలి భాగం ‘దేవర: పార్ట్ 1’తో సూపర్ సక్సెస్ అందుకున్నారు ఎన్టీఆర్. ఆ తర్వాత హిందీ మూవీ ‘వార్ 2’తో ఎన్టీఆర్ ఫుల్ బిజీ అయిపోయారు. హృతిక్ రోషన్ హీరోగా, ఎన్టీఆర్ మరో మెయిన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ హిందీ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్యా చోప్రా నిర్మాత. ఈ ‘వార్ 2’ మూవీ ఈ ఏడాది ఆగస్టు 14న విడుదల కానుంది. ఇక ఎన్టీఆర్ సోలోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ‘ఎన్టీఆర్‌నీల్’ (వర్కింగ్ టైటిల్) మూవీ అనౌన్స్‌మెంట్ రెండేళ్ల క్రితమే వచ్చింది. కానీ ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మాత్రం ఈ ఏడాది ఫిబ్రవరి 20న మొదలైంది. ఈ నెల 22 నుంచి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ఎన్టీఆర్. ఈ సినిమాని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ మూవీ రిలీజ్ ఏప్రిల్‌కి వాయిదా పడిందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా మూవీకి ‘డ్రాగన్’ అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా కన్నడ నటి రుక్మిణీ వసంత్, మరో లీడ్ రోల్‌లో టొవినో థామస్ నటించనున్నారని తెలిసింది.


మళ్లీ గ్యాప్...

‘పుష్ప’ ఫ్రాంచైజీ నుంచి వచ్చిన ‘పుష్ప: ది రైజ్, పుష్ప: ది రూల్’ సినిమాల సక్సెస్‌తో అల్లు అర్జున్ మంచి జోష్‌లో ఉన్నారు. ముఖ్యంగా ‘పుష్ప: ది రూల్’ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలవడం, సరికొత్త బాక్సాఫీస్ రికార్డులను క్రియేట్ చేసినట్లుగా మేకర్స్ వెల్లడించడం అనేవి అల్లు అర్జున్ కాన్ఫిడెన్స్‌ను మరింత పెంచినట్లున్నాయి. అయితే ‘పుష్ప: ది రైజ్’ మూవీ విడుదలైన మూడు సంవత్సరాల తర్వాత కానీ... ‘పుష్ప: ది రూల్’ సినిమా థియేటర్స్‌లోకి రాలేదు. ఇలా అల్లు అర్జున్‌ను స్క్రీన్‌పై చూసుకునేందుకు ఆయన అభిమానులు మూడు సంవత్సరాలు వెయిట్ చేశారు. కాగా మళ్లీ అల్లు అర్జున్‌ను స్క్రీన్‌పై చూసేందుకు మరో రెండు సంవత్సరాలు వెయిట్ చేయక తప్పని పరిస్థితులు కనిపిస్తున్నాయి. అల్లు అర్జున్ నెక్ట్స్ మూవీని తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కించనున్నారు. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనుంది. ఈ చిత్రం కోసం ఓ సరికొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేయనున్నారట అట్లీ. భారీగా వీఎఫ్ఎక్స్ చేయాల్సి ఉంటుందట. పైగా ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఇలాంటి ఎన్నో కారణాల వల్ల అల్లు అర్జున్ నెక్ట్స్ మూవీ మరో రెండు సంవత్సరాలు థియేటర్స్‌లోకి రాదని ఊహించవచ్చు. అలాగే 2018లో ‘నా పేరు సూర్య... నా ఇల్లు ఇండియా’ సినిమా తర్వాత అల్లు అర్జున్ హీరోగా నటించిన మరో మూవీ ‘అల... వైకుంఠపురములో..’ 2020లో విడుదలైంది. ఈ గ్యాప్ గురించి, ‘గ్యాప్... ఇవ్వలా వచ్చింది’ అన్నట్లుగా అల్లు అర్జున్ అప్పట్లో పేర్కొన్నారు. ఇలా మరోసారి అల్లు అర్జున్ కెరీర్‌లో మళ్లీ గ్యాప్ క్రియేట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇలా ఈ ఏడాది సోలో హీరోగా సిల్వర్ స్క్రీన్‌ని మిస్ చేసుకోనున్న హీరోలు మరికొందరు ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

మళ్లీ చూపుల్తో గుచ్చి గుచ్చి..!


● రవితేజ, శ్రీలీల

రవితేజ కెరీర్‌లోని బ్లాక్‌బస్టర్ మూవీ ‘ఇడియట్ (2002)’. ఈ సినిమాలోని ‘చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే మేరే హాయ్...’ పాట అప్పట్లో చాట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు కూడా ఆ పాట అప్పుడప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది. అయితే ఈ పాట మరోసారి శ్రోతల ముందుకు రానున్నట్లుగా తెలుస్తోంది. ‘ధమాకా’ వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీ లీల కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ ‘మాస్ జాతర’. ‘మనదే ఇదంతా’ అనేది క్యాప్షన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ‘సామజవరగమన’ వంటి హిట్ ఫిల్మ్‌కు రచయితగా పని చేసిన భాను భోగవరపు ‘మాస్ జాతర’ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో రవితేజ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాను తొలుత మే 9న విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదర్లేదు. జూలైలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలోని ‘తూమేరా లవర్..’ పాట లిరికల్ వీడియోను ఈ నెల 14న రిలీజ్ చేయనున్నారు మేకర్స్. ఈ పాట ప్రోమోను శనివారం రిలీజ్ చేశారు. ప్రోమోలో ‘ఇడియట్’ సినిమాలోని ‘చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే మేరే హాయ్...’ పాట మ్యూజిక్ వినిపించింది. మరి... ‘చూపుల్తో..’ పాటనే ‘తూ మేరా లవర్’గా మళ్లీ కొత్తగా తీశారా? లేక ‘తూ మేరా లవర్’ పాటలో ‘చూపుల్తో...’ పాటలోని స్టెప్స్‌ను వినియోగిస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ‘ధమాకా’ సినిమాకు సంగీతం అందించిన భీమ్స్ ఈ ‘మాస్ జాతర’ సినిమాకీ స్వరాలు సమకూర్చారు.

ఆ నిర్ణయంతో బాధపడ్డాను

- నుష్రత్ బరుచా



‘‘నేను హీరోయిన్‌గా నటించిన ‘డ్రీమ్ గర్ల్’ చిత్రానికి సీక్వెల్‌గా ‘డ్రీమ్ గర్ల్ 2’ రూపొందింది. సీక్వెల్‌లోనూ నన్నే కథానాయికగా తీసుకుంటారని ఎంతో నమ్మకం పెట్టుకున్నాను. అయితే, నన్ను కాదని అనన్యా పాండేను హీరోయిన్‌గా తీసుకున్నారు. వారి నిర్ణయంతో బాధపడ్డాను’’ అని బాలీవుడ్ బ్యూటీ నుష్రత్ బరుచా తెలిపారు. ఆయుష్మాన్ ఖురానా, నుష్రత్ బరుచా జోడీగా రాజ్ శాండిల్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘డ్రీమ్ గర్ల్’. 2019 సెప్టెంబరు 13న విడుదలైన ఈ మూవీ బాలీవుడ్‌లో హిట్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా ‘డ్రీమ్ గర్ల్ 2’ రూపొందింది. సీక్వెల్‌లోనూ ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించగా రాజ్ శాండిల్యనే దర్శకత్వం వహించారు. అయితే హీరోయిన్‌గా అనన్యా పాండేను తీసుకున్నారు. 2023 ఆగస్టు 24న విడుదలైన ఈ చిత్రం కూడా మంచి విజయం అందుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నుష్రత్ బరుచా మాట్లాడుతూ– ‘‘డ్రీమ్ గర్ల్’లోని నటీనటులందరూ ‘డ్రీమ్ గర్ల్ 2’లోనూ నటించారు. అయితే హీరోయిన్ పాత్రలో నాకు బదులు అనన్యా పాండేని తీసుకున్నారు. యూనిట్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయాను. కానీ ఈ విషయంపై నేను యూనిట్‌లోని వారితో మాట్లాడలేదు. ఎందుకంటే అవతలి వారి నిర్ణయాలను మనం కంట్రోల్ చేయలేం కదా? తమ సినిమాలో ఎవర్ని తీసుకోవాలి? అనేది మేకర్స్‌పై ఆధారపడి ఉంటుంది. వాళ్ల ఇష్టాన్ని మనం ప్రశ్నించడానికి లేదు. అందుకే బాధపడటం తప్ప ఏమీ చేయలేక పోయాను’’ అని పేర్కొన్నారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం బాలీవుడ్‌లో వైరల్‌గా మారాయి.

యాక్షన్ కోర

సునామీ కిట్టి హీరోగా చరిష్మా, పి. మూర్తి ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం ‘కోర’. ఒరాటశ్రీ దర్శకత్వంలో డా. బి. నందిని, ఏఎస్ బాలాజీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ‘‘ఓ వైవిధ్యభరితమైన కథాంశంతో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాని రూపొందించాం. ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్ రిలీజ్ చేసిన మా సినిమాలోని ‘ఒప్పుకుందిరో అంట..’ అంటూ సాగే పాట అందర్నీ ఆకట్టుకుంది. ఇంకా టీజర్‌కి కూడా మంచి ఆదరణ లభించింది. మా సినిమా కూడా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.


● సునామీ కిట్టి, చరిష్మా





పువ్వులు... కొన్ని చిరునవ్వులు

బుంగమూతి పెట్టుకుని ఓ ఫొటో, చిరునవ్వులు చిందిస్తూ మరో ఫొటో, ఏదో ఆలోచిస్తూ ఎటో చూస్తున్నట్లు ఓ ఫొటో... ఇలా రష్మికా మందన్నా తన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ఈ బ్యూటీ ఇటీవల వెకేషన్ కోసం ఒమన్ వెళ్లారు. అక్కడ బీచ్‌లో ఎంజాయ్ చేయడం, సూర్యాస్తమయాన్ని ఆస్వాదించడం... ఇలా రొటీన్‌కి భిన్నంగా టైమ్ స్పెండ్ చేశారామె. ఈ నెల 5న తన పుట్టినరోజుని కూడా అక్కడే జరుపుకున్నారు. ‘బీచ్... ఇసుక, సన్ సెట్, పువ్వులు (పూల తోట నుంచి ఉద్దేశించి అయ్యుండొచ్చు), కొన్ని చిరునవ్వులు... ఇంకా మీ ప్రేమ’ అంటూ పోస్ట్ చేశారు. ఒమన్‌లో గడిపిన వెకేషన్‌కి సంబంధించిన ఫొటోలు షేర్ చేశారు. ఇక వెకేషన్ నుంచి వచ్చిన రష్మిక హిందీ చిత్రం ‘థామా’ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ హారర్ మూవీలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నారు.


● రష్మిక

బిజినెస్ రీల్

ఆకర్- ఇంటర్‌గ్లోబ్ హోటళ్ల విస్తరణ

ఐదేళ్లలో 300 హోటళ్ల ఏర్పాటు



ముంబై: ప్రయాణ సరీ్వసుల కంపెనీ ఇంటర్‌గ్లోబ్, ఫ్రెంచ్ ఆతిథ్య రంగ భాగస్వామి ఆకర్ దేశీయంగా హోటళ్ల సంఖ్యను భారీగా విస్తరించనున్నాయి. రానున్న ఐదేళ్లలో ప్రస్తుత 71 హోటళ్లను 300కు పెంచాలని ప్రణాళికలు ప్రకటించాయి. రెండు దశాబ్దాల భాగస్వామ్యం ద్వారా ప్రస్తుతం 40 ప్రాపర్టీలు నిర్మాణంలో ఉన్నట్లు వెల్లడించాయి. తక్కువ పెట్టుబడి(అసెట్‌లైట్) పద్ధతిలో కొత్త హోటళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశాయి. వివిధ బ్రాండ్లతో స్థానిక వ్యాపారవేత్తలు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నాయి. ఇందుకు సంయుక్త సంస్థ మేనేజ్‌మెంట్ కాంట్రాక్టులను కుదుర్చుకోనున్నట్లు తెలియజేసింది.

అదానీ గ్రూప్‌లో బ్లాక్‌రాక్ పెట్టుబడి

రూ. 2,165 కోట్ల విలువైన బాండ్ల కొనుగోలు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ చేపట్టిన బాండ్ల జారీలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ భారీగా ఇన్వెస్ట్ చేసింది. అదానీ గ్రూప్ 75 కోట్ల డాలర్ల(రూ. 6,500 కోట్లు) విలువైన బాండ్ల జారీని చేపట్టగా.. 25 కోట్ల డాలర్ల(సుమారు రూ. 2,165 కోట్లు)తో సబ్‌స్క్రయిబ్ చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం 3–5ఏళ్ల కాల పరిమితితో అదానీ గ్రూప్ ఈ బాండ్లు విడుదల చేసింది. కాగా.. గతేడాది నవంబర్‌లో లంచం ఆఫర్ చేసిన కేసు నమోదుకావడంతో అదానీ గ్రూప్‌పై యూఎస్ న్యాయశాఖ పరిశోధనకు తెరతీసింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ బాండ్లలో బ్లాక్‌రాక్ పెట్టుబడులకు ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.

హైరింగ్ ప్రణాళికల్లో కంపెనీలు...

- సానుకూలంగా 45% సంస్థలు
- మిడ్–లెవెల్, కాంట్రాక్ట్ ఉద్యోగాలకు డిమాండ్
- జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున కంపెనీలు నియామకాలు చేపట్టే యోచనలో ఉన్నాయి. 45 శాతం సంస్థలు కొత్తగా పర్మనెంట్ ఉద్యోగులను తీసుకునే ప్రణాళికల్లో ఉన్నాయి. వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్, హెచ్‌ఆర్ సేవల సంస్థ జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన 'హైరింగ్, కాంపన్సేషన్, అట్రిషన్ మేనేజ్‌మెంట్ అవుట్‌లుక్ సర్వే 2025–26' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వివిధ పరిశ్రమలవ్యాప్తంగా 1,520 మంది సీఎక్స్‌వోలు, సీనియర్ అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ నివేదిక ప్రకారం 45 శాతం సంస్థలు కొత్తగా పర్మనెంట్ ఉద్యోగులను తీసుకువాలని భావిస్తుండగా 13 శాతం కంపెనీలు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు లేక ఖాళీ కాబోతున్న పోస్టులను భర్తీ చేసుకునే ప్రణాళికల్లో ఉన్నాయి. కానీ మరికొన్ని సంస్థలు హైరింగ్ విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హైరింగ్ ప్రణాళికలేమీ లేవని 16 శాతం సంస్థలు తెలిపాయి.

తాత్కాలిక స్టాఫింగ్ వైపు మొగ్గు..

తాత్కాలిక కొలువులకు కూడా డిమాండ్ పెరుగుతోంది. 26 శాతం కంపెనీలు టెంపొరరీ, కాంట్రాక్ట్ లేదా ప్రాజెక్ట్ ఆధారిత పనుల కోసం ఉద్యోగులను తీసుకునే యోచనలో ఉన్నాయి. గిగ్ వర్కర్లు, కాంట్రాక్ట్ ఆధారిత ఉద్యోగులు, అడ్వైజరీ సేవలందించే వారిని హైరింగ్ చేసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. పర్మనెంట్ ఉద్యోగులకు బదులుగా తాత్కాలిక సిబ్బందిని తీసుకునే ధోరణి పెరుగుతోందనడానికి ఇది నిదర్శనమని సర్వే పేర్కొంది. సర్వేలో పాల్గొన్న సంస్థల్లో 37 శాతం కంపెనీలు మిడ్–లెవెల్ నిపుణులను నియమించుకోనున్నట్లు తెలిపాయి. మరోవైపు, 19 శాతం కంపెనీలు ఎంట్రీ లెవెల్ ఉద్యోగులను తీసుకోవాలని భావిస్తుండగా, 18 శాతం సంస్థలు సీనియర్ లీడర్‌షిప్ స్థానాల్లోకి సిబ్బందిని నియమించుకునే యోచనలో ఉన్నాయి. 'ఆర్థిక అనిశ్చితులను దాటుకుంటూ కంపెనీలు ముందుకెళ్తున్న క్రమంలో ప్రతిభావంతులైన నిపుణులకు డిమాండ్ నెలకొంది. మిడ్–సీనియర్ ప్రొఫెషనల్స్‌కి భారీగా డిమాండ్ ఉండటంతో అట్రిషన్ (ఉద్యోగుల వలసలు) రిస్కులను అధిగమించి, సిబ్బందిని అట్టే పెట్టుకోవడంపై కంపెనీలు ఫోకస్ చేయాల్సి ఉంటుంది. 2025–26లో కంపెనీలు సమర్ధవంతమైన విధంగా హైరింగ్ ప్రణాళికలను వేసుకునేందుకు ఈ విశేషాలు ఉపయోగపడతాయి' అని జీనియస్ కన్సల్టెంట్స్ చైర్మన్ ఆర్‌పీ యాదవ్ చెప్పారు.

మరిన్ని విశేషాలు..

- 53 శాతం కంపెనీలు హైరింగ్ వృద్ధి ఒక మోస్తరుగా 5–10 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా వేస్తున్నాయి. మరోవైపు 33 శాతం కంపెనీలు 10–15 శాతం అధికంగా నియామకాలు చేపట్టాలని భావిస్తున్నాయి.
- పరిశ్రమలవారీగా చూస్తే రిటైల్, క్యూ–కామర్స్‌లో అత్యధికంగా 21 శాతం కంపెనీలు నియామకాలు చేపట్టనున్నాయి. లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ విభాగాల్లోనూ సుమారు 9 శాతం సంస్థలు సిబ్బందిని తీసుకోనున్నాయి.
- ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ వాహనాల విభాగాల్లో రిక్రూట్‌మెంట్ అధికంగా ఉంటుందని 15 శాతం కంపెనీలు భావిస్తున్నాయి. రెన్యూవబుల్స్, ఎనర్జీ, ఇంజినీరింగ్ ప్రాజెక్టుల విభాగాల్లో 11 శాతం కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నాయి.
- ఐటీ సర్వీసులు, టెలికం, టెక్నాలజీ విభాగాల్లో 13 శాతం, తయారీ, ఇంజినీరింగ్‌లో 11 శాతం, ఇన్‌ఫ్రా, రవాణా, రియల్ ఎస్టేట్‌లో 10 శాతం, బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా)లో 9 శాతం సంస్థలు హైరింగ్ యోచనలో ఉన్నాయి.
- ఇక, ఎఫ్‌ఎంసీజీ, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, మీడియా..ఎంటర్‌టైన్‌మెంట్, విద్య తదితర రంగాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం హైరింగ్ ఒక మోస్తరుగానే ఉండవచ్చని అంచనా.

మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్‌కు కాంట్రాక్ట్

ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌కు ఫ్యూజ్‌లేజ్ తయారీ



న్యూఢిల్లీ: సింగిల్ ఇంజిన్ ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ తయారీలో వినియోగించే ఫ్యూజ్‌లేజ్ తయారీకి మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ కాంట్రాక్టు అందుకుంది. 2027 మార్చికల్లా తొలి యూనిట్‌ను డెలివరీ చేయనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. దీంతో దేశీయంగా ఏరోస్పేస్ తయారీ కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించనుంది. 8 సీట్లతో రూపొందే సుప్రసిద్ధ హెచ్130 హెలికాప్టర్‌ను రవాణా, టూరిజం, మెడికల్, నిఘా, ప్రయివేట్ ఏవియేషన్ కార్యకలాపాలలో వినియోగిస్తారు. అయితే కాంట్రాక్టు విలువ వెల్లడికాలేదు. కర్ణాటకలోని కోలార్ జిల్లాలోగల మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ ప్లాంటులో ఫ్యూజ్‌లేజ్‌ను తయారు చేయనుంది. వార్షికంగా 60–70 వరకూ తయారు చేయగలమని కంపెనీ విశ్వసిస్తోంది. ఒప్పందంలో భాగంగా హెచ్130 ప్రధాన ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లీను మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ యూరప్‌లోని ఎయిర్‌బస్ హెలికాప్టర్ ప్లాంటుకు ఎగుమతి చేయనుంది. మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ అంచనా ప్రకారం హెలికాప్టర్ తొలి క్యాబిన్ అసెంబ్లీ 2027 మార్చికల్లా డెలివరీ చేసే అవకాశముంది. కాగా.. భారత్‌లో పెట్టుబడులు కొనసాగించనున్నట్లు ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్, దక్షిణాసియా ప్రాంత ఎండీ రెమీ మాయిలార్డ్ పేర్కొన్నారు. 2030కంటే ముందుగానే భారత్ నుంచి 2 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలు, సర్వీసులను అందుకునే లక్ష్యంతో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. 2023లో బిలియన్ డాలర్లు, 2024లో 1.4 బిలియన్ డాలర్ల విలువైన సర్వీసులు, విడిభాగాలను పొందినట్లు తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సామర్థ్య విస్తరణ

4.7 గిగావాట్ల రెనెవబుల్ ఎనర్జీ జత

న్యూఢిల్లీ: ఓ2 పవర్ నుంచి 4.7 గిగావాట్ల రెనెవబుల్ ఎనర్జీ ప్లాట్‌ఫామ్ కొనుగోలు పూర్తి చేసినట్లు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ పేర్కొంది. అనుబంధ సంస్థ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ద్వారా రూ. 12,468 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో పునరుత్పాదక ఇంధన ప్లాట్‌ఫామ్‌ను పూర్తిగా సొంతం చేసుకున్నట్లు వెల్లడించింది. దీంతో కంపెనీ మొత్తం స్థాపిత సామర్థ్యం 12.2 గిగావాట్లకు చేరినట్లు తెలియజేసింది. దీనిలో పునరుత్పాదక ఇంధన వాటా 54 శాతంగా పేర్కొంది. తద్వారా 2030కల్లా 20 గిగావాట్ల సామర్థ్యంవైపు అడుగులేస్తున్నట్లు తెలియచేసింది. ఓ2 పవర్ 900 మెగావాట్ల అదనపు కనెక్టివిటీకి వీలు కల్పించినట్లు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ జేఎండీ, సీఈవో శరద్ మహేంద్ర పేర్కొన్నారు. 2025 జూన్ నుంచి 2,259 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి రానున్న నేపథ్యంలో తాజా కొనుగోలుతో నిలకడగా రూ. 1,500 కోట్ల నిర్వహణ లాభ(ఇబిటా) ఆర్జనను సాధించనున్నట్లు తెలిపారు.



వాయిదాలపై చెల్లిద్దాం..



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో మూడింట ఒక వంతు రుణ ఆధారితమేనని 'ఫి కామర్స్' సంస్థ వెల్లడించింది. 2024 సంవత్సరంలో 20,000 మర్చంట్ లావాదేవీలను అధ్యయనం చేసి ఈ వివరాలు విడుదల చేసింది. ప్రతి మూడు డిజిటల్ చెల్లింపుల లావాదేవీల్లో క్రెడిట్‌కార్డు, వడ్డీతో కూడిన ఈఎంఐలు ఒకటి ఉండడం గమనార్హం. మొత్తం లావాదేవీల్లో యూపీఐతో చేసినవి 65 శాతంగా ఉన్నట్టు ఫి కామర్స్ తెలిపింది. స్వల్ప, మధ్య స్థాయి చెల్లింపులను ఎక్కువగా యూపీఐ సాయంతో చేస్తుంటే, పెద్ద లావాదేవీలు క్రెడిట్ కార్డులు, ఈఎంఐల రూపంలో ఉంటున్నాయి. ఫీజుల చెల్లింపులు, వైద్య పరమైన చెల్లింపులకు క్రెడిట్‌కార్డులను ఉపయోగిస్తున్నారు. పండుగల సందర్భంగా కొనుగోళ్లు, స్కూళ్లలో ప్రవేశాలు, సీజన్ వారీ అవసరాలకు రుణాలనే నమ్ముకుంటున్నారు. అంటే స్వల్పకాల రుణాలకు వినియోగదారులు క్రెడిట్ కార్డులు, రుణ ఈఎంఐలపై ఆధారపడుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా విద్యా సంబంధిత చెల్లింపులకు 10 శాతం, హెల్త్‌కేర్ చెల్లింపులకు 15 శాతం, ఆటో విడిభాగాల కొనుగోళ్లకు 15 శాతం మేర రుణ సాధనాల ఆధారితంగానే చెల్లిస్తున్నారు. ఒకేసారి చెల్లింపుల కంటే రుణ ఆధారిత చెల్లింపులకు ఆసక్తి చూపిస్తున్నట్టు.. వినియోగదారుల ధోరణిలో మార్పునకు ఈ ఫలితాలు నిదర్శనమని ఈ నివేదిక పేర్కొంది.

సోషల్ మీడియా సలహాలతో జాగ్రత్త

ఇన్వెస్టర్లకు సెబీ హెచ్చరికలు



న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్(ఎస్ఎంపీలు) ద్వారా సెక్యూరిటీ మార్కెట్ల సంబంధిత కుట్రపూరిత కార్యకలాపాలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పేర్కొంది. దీంతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని హెచ్చరించింది. ఎస్ఎంపీల ద్వారా సెక్యూరిటీ మార్కెట్ల మోసాలు అధికమయ్యాయని తెలియజేసింది. కేవలం సెబీ వద్ద రిజిస్టరైన ఇంటర్మీడియరీల ద్వారా లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వమంటూ పబ్లిక్‌కు సూచించింది. పెట్టుబడులు చేపట్టేందుకు అధీకృత ట్రేడింగ్ యాప్స్‌ను మాత్రమే వినియోగించుకోమంటూ సలహా ఇచ్చింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్(ట్విటర్), టెలిగ్రామ్, గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ తదితర సుప్రసిద్ధ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఇటీవల మోసపూరిత సలహాలు, లావాదేవీలు అధికమైన నేపథ్యంలోసెబీ తాజా హెచ్చరికలు జారీ చేసింది. వీటి ద్వారా ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు ఎడ్యుకేషనల్ కంటెంట్ ఆఫర్ చేస్తున్నట్లు సెబీ తెలియజేసింది. దీనిలో భాగంగా తప్పుదారి పట్టించే కాల్స్, మోసపూరిత డాక్యుమెంట్లు, తప్పనిసరిగా లేదా రిస్కులేని లాభాల అక్రమ హామీలు వంటివి ఇన్వెస్టర్లకు ఎరగా వేస్తున్నట్లు వివరించింది. అంతేకాకుండా రిజిస్టర్‌కాకుండానే పెట్టుబడి సలహాలు, సెబీ నకిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు వంటివి వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. మరికొన్ని సందర్భాలలో సెబీ రిజిస్టర్డ్ ప్లాట్‌ఫామ్స్ పేరిట మోసాలకు తెరతీస్తూ అధిక రిటర్నుల ఆశ చూపుతూ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించింది. ఇందుకు వాట్సాప్, టెలిగ్రామ్ చానళ్లలో తప్పుడు గ్రూప్‌లను సైతం సృష్టించడం ద్వారా మోసపుచ్చుతున్నట్లు పేర్కొంది. వెరసి నకిలీ సలహాదారులపట్ల అప్రమత్తంగా వ్యవహరించవలసిందిగా ఇన్వెస్టర్లను మరోసారి సెబీ హెచ్చరించింది!

టారిఫ్‌లకు బ్రేక్‌తో భారీ ఊరట

- వాణిజ్య ఒప్పందంపై చర్చలకు మరికాస్త వెసులుబాటు
- ఎఫ్ఐఈవో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రతీకార టారిఫ్‌లను 90 రోజుల పాటు వాయిదా వేయాలన్న అమెరికా నిర్ణయంతో దేశీ ఎగుమతిదార్లకు భారీగా ఊరట లభించింది. దీనితో భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) చర్చల పురోగతికి మరికాస్త వెసులుబాటు లభిస్తుందని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. ఒప్పందంపై దౌత్యపరంగా సంప్రదింపులు జరపడం, చర్చలను వేగవంతం చేయడం ద్వారా టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు భారత్‌కు వీలవుతుందని వివరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకునే దిశగా ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి తొలి విడత చర్చలు ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లో ముగిసే అవకాశం ఉంది. మరోవైపు, అమెరికాతో సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో దేశీ పరిశ్రమలకు రిస్కులు ఉన్నందున దీన్ని కుదుర్చుకునే విషయంలో భారత్ పునరాలోచన చేయాలని భారత్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) సూచించింది. ఒప్పందం ప్రకారం భారత్‌లో రైతులకు కనీస మద్దతు ధరను తొలగించడం, జన్యుపరమైన మార్పులు చేసిన ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవడం, వ్యవసాయ టారిఫ్‌లను తగ్గించడం మొదలైన గొంతెమ్మ కోర్కెలన్నీ అమెరికా కోరుతోందని పేర్కొంది. ఇలాంటివి అమలు చేస్తే రైతుల ఆదాయాలకు, ఆహార భద్రతకు, జీవవైవిధ్యానికి, చిన్న రిటైలర్ల మనుగడకు రిస్కులు తప్పవని అభిప్రాయపడింది. కార్లులాంటివి మినహాయించి 90% దిగుమతులపై ఇరువైపులా సున్నా స్థాయి టారిఫ్‌లతో డీల్‌ను భారత్ ప్రతిపాదించవచ్చని పేర్కొంది.


జేఎల్‌ఆర్ ఇండియా అమ్మకాలు 40% అప్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అత్యధిక విక్రయాలు నమోదు చేసింది. 6,183 యూనిట్లను విక్రయించింది. 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 40 శాతం అధికం. హోల్‌సేల్ విక్రయాలు 39 శాతం పెరిగి 6,266 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో డిఫెండర్ అమ్మకాలు అత్యధికంగా 90 శాతం, దేశీయంగా తయారు చేసిన రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ విక్రయాలు వరుసగా 72 శాతం, 42 శాతం మేర పెరిగాయి. రిటైల్, హోల్‌సేల్ అమ్మకాల్లో పరిశ్రమను మించిన పనితీరును కనపర్చినట్లు జేఎల్‌ఆర్ ఇండియా ఎండీ రాజన్ అంబా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ దీన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు.

ఆనంద్ రాఠీ వెల్త్ లాభం జూమ్

క్యూ4లో రూ. 74 కోట్లు



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల గ్రూప్ ఆనంద్ రాఠీ సంస్థ ఆనంద్ రాఠీ వెల్త్ గత ఆర్థిక సంవత్సరం(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 30 శాతం జంప్‌చేసి రూ. 74 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 57 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 22 శాతం ఎగసి రూ. 241 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 197 కోట్ల టర్నోవర్ అందుకుంది. వాటాదారులకు షేరుకి రూ. 7 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. పూర్తి ఏడాదికి సైతం నికర లాభం 33 శాతం వృద్ధితో రూ. 301 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 981 కోట్లుగా నమోదైంది. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 30 శాతం వృద్ధితో రూ. 77,103 కోట్లకు చేరాయి.

ఎఫ్ఎంసీజీ పరిశ్రమలో వృద్ధి అంతంతే

- 2024–25లో ఆదాయం పెరుగుదల సింగిల్ డిజిట్‌లో
- 2025–26కు సైతం అంచనాల తగ్గింపు
- బీఎన్‌పీ పారిబా ఇండియా అంచనా



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ సంస్థలకు 2024–25 సంవత్సరం మిశ్రమ ఫలితాలను మిగిల్చింది. ఆదాయం సగటున 5 శాతం వృద్ధి చెందినట్టు కంపెనీలు తెలిపాయి. అదే సమయంలో మార్జిన్లలో ఎలాంటి వృద్ధి లేకుండా ఫ్లాట్‌గానే ఉండడం గమనార్హం. గోద్రేజ్ కన్స్యూమర్, ఇమామీ మినహా మిగిలిన కంపెనీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) ఆదాయం అంచనాలను బీఎన్‌పీ పారిబా తగ్గించింది. ముడి చమురు ధరలు తగ్గడం, గ్రామీణ వృద్ధి కోలుకోవడం వంటి సానుకూలతలతో 2025–26లో సానుకూల బేస్ ఏర్పడుతుందని పేర్కొంది. 2024–25 క్యూ4లో (మార్చి త్రైమాసికం) అధిక శాతం కమోడిటీల ధరలు గరిష్ట స్థాయిలోనే ఉన్నట్టు బీఎన్‌పీ పారిబా నివేదిక వెల్లడించింది. ఇది కంపెనీల మార్జిన్లపై ప్రభావం చూపించినట్టు పేర్కొంది. పామాయిల్, టీ ధరలు మాత్రం తగ్గినట్టు తెలిపింది. స్టాపుల్స్ (నిత్యావసరాలు) విక్రయాలకు క్యూ4 బలహీన క్వార్టర్‌గా ఉంటుందని పేర్కొంది. 10 ఎఫ్ఎంసీజీ కంపెనీలకు గాను 9 కంపెనీల స్థూల మార్జిన్లు బలహీనంగా ఉంటాయని అంచనా వేస్తున్నట్టు ఈ నివేదిక తెలిపింది. అగ్రి ముడి పదార్థాల ధరల ఒత్తిళ్లు వీటిపై ఉన్నట్టు వివరించింది. టైటాన్, జుబిలెంట్ ఫుడ్స్ వంటి విచక్షణా రహిత వినియోగ ఆధారిత కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయని పేర్కొంది.

1–8 శాతం మధ్య వృద్ధి..

''2025–26 ఆర్థిక సంవత్సరంలో మేము అధ్యయనానికి పరిగణనలోకి తీసుకున్న 10 కంపెనీలకు గాను 8 కంపెనీలకు ఆదాయం వృద్ధి 1–8 శాతం మధ్యే ఉంటుంది. గోద్రేజ్ కన్స్యూమర్, ఇమామీ కంపెనీలకు వృద్ధి కాస్త మెరుగ్గా ఉండొచ్చు''అని బీఎన్‌పీ పారిబా నివేదిక తెలిపింది. ఈ సంస్థ పరిగణనలోకి తీసుకున్న మిగిలిన కంపెనీల్లో హెచ్‌యూఎల్, బ్రిటానియా, డాబర్, ఐటీసీ, మారికో, నెస్లే ఇండియా, జుబిలెంట్ ఫుడ్స్, టైటాన్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-4-2025	
విశాఖ	415-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ @ రూ.22,150 కోట్లు

- 2023–24లో 4 శాతం వృద్ధి
- కొత్తగా 1.86 లక్షల విక్రేతలు
- మొత్తం 88 లక్షలకు చేరిక



న్యూఢిల్లీ: డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ స్థిరమైన వృద్ధిని చూస్తోంది. పరిశ్రమ విలువ 2024 మార్చి నాటికి రూ.22,150 కోట్లకు చేరుకున్నట్టు ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్ (ఐడీఎస్ఏ) ప్రకటించింది. ఈ రంగంలో 470 వరకు చిన్న, పెద్ద సంస్థలు దేశంలో సేవలు అందిస్తుండగా, వీటి పరిధిలో కొత్తగా 1.86 లక్షల మంది ప్రత్యక్ష విక్రేతలు (డైరెక్ట్ సెల్లర్స్) 2023–24లో నమోదైనట్టు తెలిపింది. గత ఐదేళ్లలో (2019–20 నుంచి 2023–24) డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ ఏటా 7.15 శాతం చొప్పున వృద్ధి చెందుతూ.. రూ.16,800 కోట్ల నుంచి రూ.22,142 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. ఈ రంగంలో ఆరోగ్య సంరక్షణ, పోషకాహార ఉత్పత్తులు అధిక అమ్మకాలతో 64.15 శాతం వాటా కలిగి ఉన్నట్టు ఐడీఎస్ఏ వార్షిక నివేదిక తెలిపింది. కాస్మెటిక్స్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల అమ్మకాల వాటా 23.75 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. ఈ రెండు విభాగాల వాటా 2023–24 మొత్తం అమ్మకాల్లో 87.9 శాతంగా ఉన్నట్టు తెలిపింది. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ అమ్మకాల్లో ఉత్తరాది 29.8 శాతం వాటాతో ముఖ్య పాత్ర పోషిస్తోంది.

తూర్పు భారత్ నుంచి 24.2 శాతం అమ్మకాలు కొనసాగగా, ఇందులో పశ్చిమబెంగాల్ నుంచే 11.3 శాతం సమకూరింది. పశ్చిమ భారత్‌లో అమ్మకాలు 22.4 శాతంగా ఉంటే, దక్షిణాదిన 15.3 శాతం అమ్మకాలు కొనసాగాయి. ఎనిమిది రాష్ట్రాలతో కూడిన ఈశాన్య భారత్‌లో అమ్మకాలు 8.3 శాతంగా ఉన్నాయి.

మహారాష్ట్ర ప్రధాన మార్కెట్..

13 శాతం వాటాతో డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ అమ్మకాల్లో (2023–24) మహారాష్ట్ర అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, యూపీ, బీహార్, కర్ణాటక, ఒడిశా, హర్యానా, ఢిల్లీ, అసోం, గుజరాత్ టాప్ 10 రాష్ట్రాలుగా ఉన్నాయి. పరిశ్రమ మొత్తం ఆదాయంలో 70 శాతం ఈ రాష్ట్రాల నుంచే వచ్చింది. 2023 మార్చి నాటికి మొత్తం డైరెక్ట్ సెల్లర్స్ 88.06 లక్షలుగా ఉంటే, 2024 మార్చి నాటికి 86.2 లక్షలకు పెరిగారు. చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించే ప్రత్యక్ష విక్రేతల్లో 56 శాతం మంది పురుషులు కాగా, 44 శాతం మహిళలు ఉన్నారు. మొత్తం విక్రేతల్లో 73.2 శాతం 25–54 ఏళ్ల వయసులోని వారు కావడం గమనార్హం. అంతేకాదు విక్రేతల్లో అత్యధికులకు ఉన్నత విద్యార్హతలున్నాయి. 52 శాతం మంది గ్రాడ్యుయేషన్, 26 శాతం మందికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారే. ప్రత్యక్ష విక్రయాల్లో ఇళ్ల నుంచి చేసేవి అధికంగా ఉన్నాయి. డిజిటల్ ఛానళ్ల ద్వారా అమ్మకాలు సైతం వేగంగా పెరుగుతున్నాయి. 17 శాతం విక్రేతలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర వాటి సాయంతో అమ్మకాలు పెంచుకుంటుంటే, 15 శాతం మంది వాట్సాప్, మెస్సేజింగ్ యాప్స్ సాయం తీసుకుంటున్నారు.

ఛాంపియన్ మోహన్ బగాన్

ఐఎస్ఎల్ ట్రోఫీ కైవసం ● ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీపై 2–1తో గెలుపు



విన్నర్స్ ట్రోఫీతో మోహన్ బగాన్ జట్టు

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 11వ సీజన్‌లో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో మోహన్ బగాన్ జట్టు 2–1 గోల్స్ తేడాతో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)పై విజయం సాధించింది. వరుసగా మూడోసారి ఫైనల్ చేరిన మోహన్ బగాన్ జట్టుకు ఇది రెండో ఐఎస్ఎల్ టైటిల్ కావడం విశేషం. 2024–25 లీగ్ దశలో అద్వితీయ ఆటతీరుతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి లీగ్ షీల్డ్ దక్కించుకున్న మోహన్ బగాన్ జట్టు... ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. తుదిపోరులో మోహన్ బగాన్ జట్టు తరఫున జాసన్ కమిన్స్ (72వ నిమిషంలో), జేమీ మెక్‌లారెన్ (96వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మోహన్ బగాన్ జట్టు స్ట్రయికర్ అల్బెర్టో రోడ్రిగ్జ్ (49వ నిమిషంలో) సెల్ఫ్ గోల్‌తో బెంగళూరు ఖాతా తెరిచింది. మోహన్ బగాన్ ఆటగాళ్ల తప్పిదం వల్ల ఆట 49వ నిమిషంలోనే బెంగళూరు గోల్స్ ఖాతా తెరవగా... ద్వితీయార్ధంలో చెలరేగిపోయిన మోహన్ బగాన్ రెండు గోల్స్‌తో విజయ పతాక ఎగరవేసింది. మోహన్ బగాన్ జట్టు 20 షాట్స్ ఆడగా... అందులో ఆరింటిని ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై సంధించగలిగింది. బెంగళూరు జట్టు 18 షాట్స్‌లో నాలుగింటిని ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పైకి కొట్టింది. మ్యాచ్‌లో అత్యధిక శాతం బంతిని తమ నియంత్రణలో ఉంచుకోగలిగిన బెంగళూరు... ఫినిషింగ్ లోపాలతో గోల్స్ చేయలేకపోయింది. స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రీ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం బెంగళూరు విజయావకాశాలపై ప్రభావం చూపింది. ఓవరాల్‌గా మ్యాచ్‌లో 62 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న బెంగళూరు జట్టు 512 పాస్‌లు కొట్టగా... 38 శాతం బంతిని నియంత్రించిన మోహన్ బగాన్ జట్టు 318 పాస్‌లు ఇచ్చుకుంది. పాస్‌ల కచ్చితత్వంలోనూ బెంగళూరు 78 శాతంతో మెరుగైన ప్రదర్శన కనబర్చగా... మోహన్ బగాన్ 65 శాతంతో వెనుకబడింది. 2022–23 సీజన్‌లోనూ ఈ రెండు జట్ల మధ్యే ఐఎస్ఎల్ ఫైనల్ జరగగా... అప్పుడు కూడా బెంగళూరుపై మోహన్ బగాన్ జట్టు విజయం సాధించింది.

ఐఎస్ఎల్ విజేతలు

సీజన్	చాంపియన్
2014	అట్లెటికో డి కోల్‌కతా
2015	చెన్నైయిన్ ఎఫ్‌సీ
2016	అట్లెటికో డి కోల్‌కతా
2017–2018	చెన్నైయిన్ ఎఫ్‌సీ
2018–2019	బెంగళూరు ఎఫ్‌సీ
2019–2020	అట్లెటికో డి కోల్‌కతా
2020–2021	ముంబై సిటీ ఎఫ్‌సీ
2021–2022	హైదరాబాద్ ఎఫ్‌సీ
2022–2023	ఏటీకే మోహన్ బగాన్
2023–2024	ముంబై సిటీ ఎఫ్‌సీ
2024–2025	ఏటీకే మోహన్ బగాన్



రాణించిన రష్మిక

ప్లేఆఫ్ దశకు భారత్

పుణే: బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్–1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ అదరగొట్టింది. సొంతగడ్డపై చక్కటి ఆటతీరు కనబర్చిన భారత అమ్మాయిలు నాలుగో విజయం ఖాతాలో వేసుకున్నారు. భారత్ 2–1 తో దక్షిణకొరియాపై విజయం సాధించింది. తద్వార వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించింది. శనివారం జరిగిన తొలి పోరులో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఈ టోర్నీలో వరుసగా ఐదో విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 5–7, 6–3, 7–6 (7/5)తో షోయున్ పార్క్‌పై గెలుపొందింది. తొలి సెట్‌లో ఓడిన అనంతరం అద్భుతంగా పోరాడిన రష్మిక వరుసగా రెండు సెట్‌లు నెగ్గి శుభారంభం అందించింది. రెండో సింగిల్స్ పోరులో తెలంగాణకే చెందిన యామలపల్లి సహజ 3–6, 4–6తో డయాన్ బాక్ చేతిలో ఓడింది. దీంతో స్కోర్లు 1–1తో సమం కాగా... నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో భారత డబుల్స్ జోడీ అదరగొట్టింది. మహిళల డబుల్స్‌లో అంకిత రైనా–ప్రార్థన తొంబారే ద్వయం 6–4, 6–3తో అలవోకగా నెగ్గింది.

గెలుపు బాట పట్టాలని!

నేడు రాజస్తాన్‌తో బెంగళూరు ఢీ
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


కోహ్లి
సామ్సన్

జైపూర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న రెండు జట్ల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. ఆదివారం జైపూర్ వేదికగా జరగనున్న తొలి పోరులో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అమీతుమీ తేల్చుకోనుంది. తాజా సీజన్‌లో బెంగళూరు జట్టు 5 మ్యాచ్‌లు ఆడి 3 విజయాలు, 2 పరాజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... రాజస్తాన్ రాయల్స్ ఐదు మ్యాచ్‌ల్లో రెండింట గెలిచి మూడు మ్యాచ్‌ల్లో ఓడి 4 పాయింట్లతో ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌ను వారి సొంత మైదానాల్లో ఓడించిన బెంగళూరు... ఇప్పుడు రాజస్తాన్‌ను కూడా చిత్తు చేయాలని తహతహలాడుతోంది. మరోవైపు తమ రెండో 'హోం గ్రౌండ్' గువాహటిలో మ్యాచ్‌ల అనంతరం రాజస్తాన్ జట్టు తిరిగి జైపూర్‌లో మ్యాచ్‌కు సిద్ధమైంది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోవడం రాయల్స్‌ను ఇబ్బంది పెడుతోంది. కెప్టెన్ సంజూ సామ్సన్, నితీశ్ రాణా, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, హసరంగతో రాజస్తాన్ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. బౌలింగ్‌లో ఆర్చర్, తీక్షణ, సందీప్ శర్మ కీలకం కానున్నారు. బెంగళూరు విషయానికి వస్తే... స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్, లియామ్ లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యాతో బ్యాటింగ్ లైనప్ శత్రు దుర్భేద్యంగా ఉంది. హాజల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాళ్, సుయాశ్ శర్మ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. రాజస్తాన్ బౌలింగ్‌కు, బెంగళూరు బ్యాటింగ్‌కు మధ్య ఆసక్తికర సమరం ఖాయమే.

ఢిల్లీ X ముంబై

రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఈ సీజన్‌లో పరాజయం ఎరగకుండా... దూసుకెళ్తున్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ ఆదివారం రెండో మ్యాచ్‌లో తలపడుతుంది. అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించగా... హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలోని ముంబై ఇండియన్స్ 5 మ్యాచ్‌లాడి కేవలం ఒక్క విజయం మాత్రమే నమోదు చేసుకుంది. జట్టులో స్టార్ ఆటగాళ్లకు కొదవ లేకపోయినా... వారంతా సమష్టిగా సత్తాచాటలేకపోతుండటంతో ముంబై పోటీలో వెనుకబడిపోయింది. ఈ మ్యాచ్‌లో పరాజయం పాలైతే తిరిగి కోలుకొని ప్లే ఆఫ్స్‌కు చేరడం ముంబైకి కష్టతరంగా మారనుంది. ఈ నేపథ్యంలో విజయమే లక్ష్యంగా పాండ్యా సేన బరిలోకి దిగనుంది. డుప్లెసిస్, మెక్‌గుర్క్, అభిషేక్ పొరెల్, కేఎల్ రాహుల్, స్టబ్స్, ఆశుతోష్ శర్మ, అక్షర్ పటేల్‌తో ఢిల్లీ బ్యాటింగ్ బలంగా ఉంది. ముఖ్యంగా గత మ్యాచ్‌లో బెంగళూరుపై చక్కటి ఇన్నింగ్స్‌తో విలువ చాటుకున్న రాహుల్ ఫుల్‌ఫామ్‌లో ఉన్నాడు. స్టార్క్, కుల్దీప్ యాదవ్, విప్రాజ్ నిగమ్, ముకేశ్ కుమార్ బౌలింగ్ భారం మోయనున్నారు. ముంబై ఓపెనర్ రోహిత్ శర్మపై తీవ్ర ఒత్తిడి ఉండగా... రికెల్టన్ మెరుపులు మెరిపించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. తిలక్‌వర్మ, సూర్యకుమార్ యాదవ్, విల్ జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధిర్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయనున్నారు. బౌల్ట్, సాంట్నర్‌తో కలిసి బుమ్రా బౌలింగ్ భారం మోయనున్నాడు.

సెమీస్‌లో మధ్యప్రదేశ్, మణిపూర్ పంజాబ్

పురుషుల జాతీయ హాకీ చాంపియన్‌షిప్

ఝాన్సీ: హాకీ ఇండియా సీనియర్ పురుషుల జాతీయ చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్, మణిపూర్, పంజాబ్ జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. శనివారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో మహారాష్ట్రపై మధ్యప్రదేశ్ జట్టు షూటౌట్‌లో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో 1–1తో సమం కాగా... విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూటౌట్‌లో మధ్యప్రదేశ్ 4–2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో మధ్యప్రదేశ్ తరఫున ప్రతాప్ లక్రా (6వ నిమిషంలో), మహారాష్ట్ర తరఫున అకీబ్ రహీమ్ (9వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. షూటౌట్‌లో మధ్య ప్రదేశ్ తరఫున సుంద్రమ్ సింగ్ రజావత్, శ్రేయస్, అలీ అహ్మద్, ప్రతాప్ లక్రా గోల్స్ చేయగా... మహారాష్ట్ర తరఫున దేవేందర్ వాల్మీకి, వెంకటేశ్ మాత్రమే బంతిని గమ్యానికి చేర్చారు. మధ్యప్రదేశ్ గోల్ కీపర్ సంజయ్ చక్కటి సేవ్‌లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మణిపూర్, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ నిర్ణీత సమయంలో 0–0 గోల్స్‌తో 'డ్రా' కాగా... షూటౌట్‌లో మణిపూర్ 4–0తో గెలుపొందింది. మూడో క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ 3–2 గోల్స్ తేడాతో హరియాణపై నెగ్గింది. పంజాబ్ తరఫున అర్షదీప్ సింగ్ హుండల్ (15వ నిమిషంలో), జుగ్‌రాజ్ సింగ్ (33వ నిమిషంలో), ప్రదీప్ సింగ్ (34వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... హరియాణా తరఫున సంజయ్ (32వ నిమిషంలో), కుల్దీప్ (56వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు.

పంకజ్ అద్వానీకి రజత పతకం



న్యూఢిల్లీ: వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఐర్లాండ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో పంకజ్ హోరాహోరీగా పోరాడి ఓడాడు. శనివారం జరిగిన తుదిపోరులో పంకజ్ 7–8 (100–19, 100–0, 47–100, 52–100, 100–19, 0–100, 100–49, 3–100, 100–34, 100–4, 85–100, 100–31, 53–100, 43–100, 28–100) ఫ్రేమ్‌ల తేడాతో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ కాసియర్ చేతిలో పరాజయం పాలయ్యాడు. బిలియర్డ్స్, స్నూకర్ క్రీడాంశాల్లో వివిధ విభాగాల్లో కలిపి 28 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన పంకజ్... 'బెస్ట్ ఆఫ్ 15' పోరులో ఆరంభంలో చక్కటి ఆధిపత్యం కనబర్చినా... ఆఖర్లో పుంజుకున్న ఇంగ్లండ్ క్యూయిస్ట్ విజయం సాధించాడు. ఇక ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో పంకజ్ పోటీ పడనున్నాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న అద్వానీ... 2016 నుంచి ఈ టోర్నీలో వరుసగా టైటిల్స్ సాధిస్తూ వస్తున్నాడు.

ఇకపై వన్డేల్లో ఒకటే బంతి!

- నేడు ఐసీసీ కీలక సమావేశం
- డబ్ల్యూటీసీ పాయింట్ల కేటాయింపు పైనా చర్చ
- పురుషుల అండర్–19 ప్రపంచకప్ టి20 ఫార్మాట్‌లో!




న్యూఢిల్లీ: బ్యాటర్లకు అనుకూలంగా ఉన్న నిబంధనలను మార్చి ఆటలో బ్యాటింగ్, బౌలింగ్‌కు సమానమైన ప్రాధాన్యత కల్పించడం... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల కేటాయింపు విధానంలో మార్పులు... పురుషుల అండర్–19 ప్రపంచకప్ పోటీలను 50 ఓవర్ల నుంచి 20 ఓవర్లకు తగ్గించడం ఇలాంటి పలు అంశాలపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. ఆదివారం జింబాబ్వే రాజధాని హరారే వేదికగా ఐసీసీ బోర్డు సమావేశం జరగనుండగా... ఇందులో కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. వన్డే క్రికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉందనే దీర్ఘకాలిక ఆందోళనను పరిష్కరించే దిశగా... 50 ఓవర్ల ఫార్మాట్‌లో రెండు బంతుల నియమాన్ని మార్చే అవకాశాలున్నాయి. దశాబ్ద కాలంగా రెండు కొత్త బంతుల విధానం కొనసాగుతుండగా... భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని ఐసీసీ క్రికెట్ కమిటీ వన్డేల్లో ఒకే బంతిని ఉపయోగించాలని సిఫార్సు చేసింది. ఆటలో పోటీతత్వం పెంపొందించేందుకు ఇది సహాయపడనుంది. 'ఐసీసీ సమావేశంలో మూడు నిబంధనలపై చర్చ జరగనుంది. వన్డేల్లో ఒకే బంతి వినియోగం, టెస్టు క్రికెట్‌లో టైమర్‌ను ప్రవేశ పెట్టడం, పురుషుల అండర్–19 ప్రపంచకప్‌ను టి20 ఫార్మాట్‌లో నిర్వహించడంపై చర్చించే అవకాశం ఉంది' అని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. టెస్టు క్రికెట్‌లో ఓవర్‌కు ఓవర్‌కు మధ్య విరామాన్ని ఇకపై 60 సెకన్లకే పరిమితం చేయడంతో పాటు... రోజుకు 90 ఓవర్లు పూర్తి చేసే దిశగా మరింత పకడ్బందీ నిబంధనలను రూపొందించనున్నారు. 2026లో జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనున్న పురుషుల అండర్–19 వరల్డ్‌కప్‌ను టి20 ఫార్మాట్‌లో నిర్వహించే దిశగా చర్చ జరగనుంది.

డబ్ల్యూటీసీ పాయింట్ల విధానంలోనూ మార్పులు!

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల కేటాయింపు విధానంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త నిబంధనలు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. ఈ ఏడాది జూన్‌లో జరగనున్న భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌తో 2025–27 సర్కిల్ ప్రారంభం కానుంది. రగ్బీ తరహాలో... ప్రత్యర్థుల బలం ఆధారంగా విజయాలకు పాయింట్లు కేటాయించడంతో పాటు స్వదేశంలో గెలిచిన మ్యాచ్‌లు, విదేశాల్లో గెలిచిన మ్యాచ్‌లకు మధ్య వ్యత్యాసం తీసుకొచ్చే చాన్స్ ఉంది. అలాగే గెలుపు అంతరాన్ని బట్టి బోనస్ పాయింట్లను కేటాయించే కొత్త వ్యవస్థను తీసుకురావాలిన క్రీడా పాలకమండలి యోచిస్తోంది. ఈ అంశంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ సర్కిల్‌లో టెస్టు మ్యాచ్ విజయానికి 12 పాయింట్లు, 'టై'కు 6 పాయింట్లు, 'డ్రా'కు 4 పాయింట్లు కేటాయిస్తున్నారు. ఈ విధానం వల్ల ఎక్కువ టెస్టు సిరీస్‌లు ఆడే ప్రధాన జట్లైన భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాకు పాయింట్ల విషయంలో అన్యాయం జరుగుతోంది. 2023–25 డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా జట్టు... ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి ప్రధాన జట్లతో సిరీస్‌లు ఆడకుండానే తుదిపోరుకు అర్హత సాధించింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంకపై సిరీస్ విజయాలతో పాటు టీమిండియాతో సిరీస్ 'డ్రా' చేసుకోవడం ద్వారా ముందంజ వేసింది. ఇక 'స్లో ఓవర్ రేట్' జరిమానా విషయంలోనూ దృష్టి సారించే అవకాశం ఉంది. 2023–25 సర్కిల్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఇంగ్లండ్ జట్టు 22 పాయింట్లు కోల్పోయింది. ఫలితంగా 41.5 విజయాల శాతంతో పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. స్లో ఓవర్‌రేట్‌ను పక్కన పెడితే ఇంగ్లండ్ విజయాల శాతం 51.5గా ఉండేది. అప్పుడు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తర్వాత పట్టికలో ఇంగ్లండ్ మూడో స్థానంలో నిలిచేది. టెస్టు క్రికెట్‌ను రెండంచెలుగా విభజించాలనే అంశంపై ఇప్పుడప్పుడే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపించడం లేదు. సుదీర్ఘ ఫార్మాట్ ఆడే ప్రధాన జట్లను ఒక గ్రూప్‌గా... మిగిలిన జట్లను మరో గ్రూప్‌గా విభజించి మ్యాచ్‌లు నిర్వహించాలని చాన్నాళ్లుగా యోచిస్తున్నప్పటికీ... అది ఇప్పట్లో జరిగే పనిలా లేదు.

డీపీ మనూపై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: భారత జావెలిన్ త్రోయర్ డీపీ మనూపై నాలుగేళ్ల నిషేధం పడింది. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినందుకు గాను నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) మనూపై నిషేధం విధించింది. 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన 25 ఏళ్ల మనూ... బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో నిలిచాడు. గతేడాది ఏప్రిల్‌లో బెంగళూరు వేదికగా జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రి సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో అతడు నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్లు నిర్ధారణ అయింది. ఆ టోర్నీలో మనూ జావెలిన్‌ను 81.91 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. దాని తర్వాత మరో రెండు టోర్నీల్లో మాత్రమే మనూ బరిలోకి దిగాడు. ఆ రెండింట్లోనూ పారిస్ ఒలింపిక్స్ అర్హత మార్క్ (85.50 మీటర్లు) దాటలేకపోయాడు. అతడిపై విధించిన నిషేధం 2024 జూన్ 24 నుంచి అమల్లోకి వస్తుందని నాడా పేర్కొంది.

ఫిలిప్స్‌కు గాయం... ఐపీఎల్‌కు దూరం



అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు దూరమయ్యాడు. న్యూజిలాండ్‌కు చెందిన ఫిలిప్స్ గాయం కారణంగా మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండబోడని గుజరాత్ ఫ్రాంచైజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. తాజా సీజన్‌లో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఫిలిప్స్... ఈ నెల 6న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్ చివరి ఓవర్‌లో రైజర్స్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కొట్టిన బంతిని అడ్డుకునే ప్రయత్నంలో కిందపడ్డాడు. ఈ సమయంలో అతడి గజ్జల్లో గాయమైంది. తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతడు కోలుకునేందుకు ఎక్కువ సమయం పట్టనుంది. ఇప్పటికే దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబడ వ్యక్తిగత కారణాలతో స్వదేశానికి తిరుగు పయనం కాగా... ఇప్పుడు గుజరాత్ టైటాన్స్ జట్టు గ్లెన్ ఫిలిప్స్ సేవలను కూడా కోల్పోయింది.



అహ్మదాబాద్‌లో ఓ భారీ అపార్ట్‌మెంట్ ఏడో అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. చూస్తుండగానే అగ్నికీలలు అంతటా విస్తరించాయి. ఆ క్రమంలో భారీ పొగ నాలుగో అంతస్తు దాకా కమ్మేసింది. దాంతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను కాపాడుకునేందుకు వారిని ఒక్కొక్కరుగా ఇలా మూడో అంతస్తుకేసి వేలాడదీసింది. అక్కడివాళ్లు వారిని క్షేమంగా దింపాక తాను కూడా వారి సాయంతో అలాగే తప్పించుకుంది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం బారినుంచి అంతా సురక్షితంగా బయటపడ్డారు.

ఈదురు గాలుల ఎఫెక్ట్.. 450 విమానాలు ఆలస్యం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో శుక్రవారం వీచిన తీవ్ర ఈదురుగాలుల ప్రభావం స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారమూ కొనసాగింది. దీనికితోడు, నాలుగు రన్‌వేలకు గాను ఒక దానిని నిర్వహణ పనుల నిమిత్తం మూసివేయగా ప్రస్తుతం మూడు మాత్రమే రన్‌వేలు పనిచేస్తున్నాయి. దీంతో ఒక్కో విమానం టేకాఫ్ తీసుకునేందుకు సగటున 40 నిమిషాలు ఆలస్యమైందని అధికారులు శనివారం తెలిపారు. ఈ లెక్కన సుమారు 450 విమానాలు ఆలస్యం కావడంతో విమానాశ్రయంలో రద్దీ పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత మేర చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల తర్వాత వీచిన ఈదురు గాలుల కారణంగా 150 దేశీయ, 55కు పైగా అంతర్జాతీయ విమానాల రాకపోకలు నాలుగైదు గంటలు ఆలస్యమయ్యాయి. టేకాఫ్ తీసుకోవాల్సిన విమానాలు గాలుల ఉధృతి కొనసాగిన కారణంగా గంటల కొద్దీ రన్‌వేపై నిలిచిపోయాయి. దీంతో, కొన్నిటిని జైపూర్, లక్నో, చండీగఢ్ విమానాశ్రయాలకు మళ్లించారు. మూడు టెర్మినళ్లు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. చెకింగ్ వద్ద గంటలపాటు ఆలస్యమైంది.

ఔరంగజేబ్ ఓటమిపాలై సమాధి అయ్యిందిక్కడే

మహారాష్ట్రలో హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య

రాయ్‌గఢ్: జగజ్జేత(అలంగీర్)నని చెప్పుకున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ జీవితమంతా మహారాష్ట్రలో మరాఠాలతో పోరాటంతోనే గడిపి, ఓటమిపాలై ఈ గడ్డపైనే సమాధి అయ్యాడని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలను ఆయన ప్రశంసించారు. శివాజీ 345 వర్ధంతి సందర్భంగా ఆయన శనివారం రాయ్‌గఢ్ కోటలో ఆయనకు నివాళులర్పించారు. 100వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే నాటికి సూపర్ పవర్‌గా ఎదగాలన్న భారతదేశం లక్ష్యానికి శివాజీ మహారాజే స్ఫూర్తి అని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను మహారాష్ట్రకు మాత్రమే పరిమితం చేయవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. శివాజీ దీక్ష, పట్టుదల, సాహసం దేశానికే ఆదర్శమని, సమాజంలోని అన్ని వర్గాలను వ్యూహాత్మకంగా ఆయన ఏకం చేశారని చెప్పారు. మారాఠా సామ్రాజ్యానికి రాజధానిగా ఉన్న రాయ్‌గఢ్ కోటలోని శివాజీ సమాధి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. సంభాజీనగర్ జిల్లా ఖుల్దాబాద్‌లో ఉన్న 17వ శతాబ్దం నాటి మొఘల్ చక్రవర్తి సమాధిని మరో చోటుకు తరలించాలన్న డిమాండ్లు ఇటీవల ఎక్కువైన నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

అమెరికా కాలేజీల్లోనూ అక్రమ వలసదారుల వేట!

ఫ్లోరిడా రాష్ట్రంలోని 3 వర్సిటీల్లో కొత్తగా 'ఇమిగ్రేషన్' పోలీసులు!

తలాహస్సీ(యూఎస్): అమెరికా గ్రామాలు, పట్టణాల్లో అనుమానిత ప్రదేశాలు, జనావాస స్థలాల్లో మాత్రమే ఇన్నాళ్లు అక్రమ వలసదారుల కోసం ఇమిగ్రేషన్ అధికారుల వేట కొనసాగింది. ఇకపై 'సున్నిత ప్రదేశాల' కేటగిరీలో ఉన్న విశ్వవిద్యాలయాల్లోనూ అక్రమ వలసదారుల జాడ కనిపెట్టేందుకు ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగప్రవేశం చేయనున్నారు. ప్రస్తుతానికి ఫ్లోరిడా రాష్ట్రంలోని మూడు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోకి 'ఇమిగ్రేషన్' తనిఖీలను అనుమతించే అవకాశముంది. బోకా రాటన్ నగరంలోని ఫ్లోరిడా అట్లాంటిక్ యూనివర్సిటీ, గెయిన్స్‌విల్లేలోని ఫ్లోరిడా వర్సిటీ క్యాంపస్, తంపా సిటీలోని సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీలు ఈ మేరకు ట్రంప్ ప్రభుత్వంతో ఒప్పందానికి ముందుకొచ్చాయి. తమ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల్లోని స్థానిక పోలీసులను ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సేవల కోసం వినియోగించుకునేందుకు ఈ మూడు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అనుమతి ఇవ్వనున్నాయి. ఫ్లోరిడా రాష్ట్ర గవర్నర్ రోన్ డీశాంటిస్ సైతం తమ రాష్ట్రంలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపేందుకు ట్రంప్ సర్కార్‌కు పూర్తి మద్దతు పలుకుతున్న నేపథ్యంలో ఫ్లోరిడాలో తాజాగా ఈ పరిణామం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక, రాష్ట్ర పాలనా యంత్రాంగాలు కలిసికట్టుగా ఇమిగ్రేషన్ విభాగానికి పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ఫిబ్రవరి 19వ తేదీనే సంబంధిత ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పోలీసులకు తగు శిక్షణ

ఫ్లోరిడా అట్లాంటిక్ యూనివర్సిటీలోని పోలీస్ శాఖ(ఎఫ్ఏయూపీడీ) సిబ్బందికి ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ విధులను అప్పగించనున్నారు. ఇమిగేషన్ సంబంధిత పత్రాల తనిఖీ, ఒకవేళ అక్రమ వలసదారు చిక్కితే నిర్బంధం, అరెస్ట్, అనుసరించాల్సిన విధానాలను ఈ సాధారణ పోలీసులుకు విడమర్చి చెప్పనున్నారు. ఇందుకోసం ఎఫ్ఏయూపీడీ సిబ్బందికి '287(జీ) ప్రోగ్రామ్' పేరిట తగు శిక్షణ ఇస్తారని ఫ్లోరిడా అట్లాంటిక్ వర్సిటీ అధికార ప్రతినిధి జాషువా గ్లేంజర్ చెప్పారు. ఈ శిక్షణ బాధ్యతలను యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తీసుకోనుంది. వర్సిటీ పోలీసులకు ఇలా ఇమిగ్రేషన్ అధికారాలు దఖలుపడే అవకాశం రావడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. శిక్షణ పూర్తయ్యాక వర్సిటీ పోలీసులు ఆయా విశ్వవిద్యాలయాల ప్రాంగణాలు, క్యాంపస్, కళాశాలల్లో అనుమానితులు, విద్యార్థులు, విదేశీయులను విచారిస్తారు. తనిఖీలు చేస్తారు. అవసరమైతే ఎలాంటి వారెంట్ లేకుండానే అరెస్ట్ చేస్తారు. అయితే వర్సిటీ పాలకమండళ్ల ఈ నిర్ణయాలను విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. విద్యాలయాలను అక్రమచొరబాట్ల తనిఖీ కేంద్రాలుగా మార్చొద్దని, నిర్ణయాలను వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్‌చేశాయి. ''వర్సిటీల్లో ఉన్న వాళ్లు విద్యార్థులా కాదా అంటూ పోలీసులు అణువణువునా గాలింపులు మొదలెడితే వర్సిటీల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుంది'' అని జెనికా ఛార్లెస్ అన్నారు. ఛార్లెస్ హౌతీ నుంచి వలసవచ్చి ఫ్లోరిడా అట్లాంటిక్ వర్సిటీలో రాజనీతిశాస్త్రం చదువుతున్నారు. సురక్షిత, సమ్మిళిత విద్యకు పట్టుగొమ్మల్లాంటి వర్సిటీల్లో ఇమిగ్రేషన్ తనిఖీలు, సోదాలను నిరోధించాలని 'ప్రెసిడెంట్స్ అలయన్స్ ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ ఇమిగ్రేషన్' సంస్థ సీఈఓ మిరియం ఫెడ్‌బ్లమ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సంస్థ విదేశీ విద్యార్థుల సమస్యలపై పోరాడుతోంది.

'వక్ఫ్'పై పార్లమెంట్‌లో మౌనమెందుకు?

రాహుల్ గాంధీని ప్రశ్నించిన మాయావతి

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడకపోవడాన్ని బీఎస్పీ అధినేత్రి మాయావతి తప్పుబట్టారు. 'పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లుపై మాట్లాడకూడదని నిర్ణయించుకున్నారా? మాట్లాడరాదన్న నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారా?' అంటూ కాంగ్రెస్ అగ్రనేతను శనివారం 'ఎక్స్'వేదికగా ఆమె నిలదీశారు. వక్ఫ్ (సవరణ) చట్టం విషయంలో ముస్లింల్లో ఆగ్రహం వ్యక్తం కావడం, ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వాములు ఆందోళన చెందడం చాలా సహజమని మాయావతి అన్నారు. రిజర్వేషన్ హక్కులను అసమంజసంగా, అనవసరంగా అమలు చేయడం ద్వారా దళితులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యను అందకుండా చేయడంలో కాంగ్రెస్, బీజేపీలు సమాన దోషులని ఆమె విమర్శించారు. ఈ పార్టీల మోసం నుంచి తప్పించుకోవాల్సిన అవసరాన్ని మతపరమైన మైనారిటీలు గుర్తించడం చాలా ముఖ్యమని మాయావతి వ్యాఖ్యానించారు. ఈ పార్టీల కుట్రల ఫలితంగా బహుజనులు అన్ని రంగాల్లో నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆమె ఆరోపించారు.

పుతిన్‌తో ట్రంప్ ప్రతినిధి విట్కాఫ్ భేటీ

నాలుగు గంటలపాటు చర్చలు

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ శుక్రవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకునేందుకు ముందుకు రావాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఉక్రెయిన్‌పై ఒక అంగీకారానికి వచ్చే విషయమై సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అధ్యక్షుడు పుతిన్‌తో విట్కాఫ్ నాలుగు గంటలకుపైగా చర్చలు జరిపారని, ఇవి ఫలవంతమయ్యాయని ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ చెప్పారు. అమెరికా, రష్యాల మధ్య సంబంధాలను సాధారణ స్థాయికి తెచ్చే ప్రక్రియ సాగుతున్నందున చర్చల్లో కీలక పురోగతి సాధించొచ్చన్న ఊహాగానాలు చేయవద్దని అంతకుముందు దిమిత్రియేవ్ వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా, ఈ ఏడాదిలో పుతిన్, విట్కాఫ్‌ల మధ్య జరిగిన మూడో భేటీ ఇది. రష్యా అధ్యక్షుడు పుతిన్ వైఖరిని శుక్రవారం ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. 'ఇది మతిలేని యుద్ధం, వేలాదిగా జనం చనిపోతున్నారు. కాల్పుల విరమణకు రష్యా ముందుకు రావాలి' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీని విడదీసినట్లుగానే ఉక్రెయిన్‌ను రెండుగా చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలను ఉక్రెయిన్ దూత కీత్ కెల్లాగ్ ఖండించిన నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు స్పందించడం గమనార్హం. పశ్చిమ ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల నియంత్రణను బ్రిటన్, ఫ్రాన్సు బలగాలకు అప్పగించే ప్రతిపాదన ఉన్నట్లు కెల్లాగ్ తెలిపారని టైమ్స్‌లో ఓ కథనం వెలువడింది. అనంతరం దీనిని కెల్లాగ్ ఖండించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. కాల్పుల విరమణ అనంతరం ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు వీలుగా సైనిక మద్దతివ్వాలని చెప్పానే తప్ప, విభజన గురించి మాట్లాడలేదన్నారు.

సరిహద్దుల్లో చొరబాట్లను నిలువరించి.. ఆర్మీ జేసీవో వీరమరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద చొరబాటుదార్లతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆర్మీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో)వీర మరణం పొందారు. అఖ్నూర్ సెక్టార్‌లోని కేరి భట్టాల్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. అత్యాధునిక ఆయుధాలు ధరించిన ఉగ్రవాదులు ఒక ప్రవాహం వద్ద సరిహద్దులు దాటేందుకు యత్నించారు. బలగాలు చేస్తున్న హెచ్చరికలను వారు ఖాతరు చేయలేదు. ఈ సందర్భంగా భీకర ఎదురు కాల్పులు కొనసాగాయి. ఘటనలో జేసీవో సుబేదార్ కుల్దీప్ చాంద్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. సైన్యం దీటుగా స్పందించగా తోకముడిచిన తీవ్రవాదులు ఆక్రమిత కశ్మీర్‌లోకి పలాయనమయ్యారు. సుబేదార్ కుల్దీప్ సింగ్ హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన వారు. కాగా, బలగాలను భారీగా తరలించి, ఆ ప్రాంతాన్ని దిగ్బంధించామని అధికారులు వివరించారు. భారత్, పాక్ బ్రిగేడియర్ కమాండర్ స్థాయి అధికారుల ఫ్లాగ్ మీటింగ్ జరిగిన రెండు రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఇదే ప్రాంతంలో ఫిబ్రవరి 11వ తేదీన ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. కాగా, ముష్కరులతో జరిగిన పోరులో నేలకొరిగిన కుల్దీప్ సింగ్ చాంద్‌కు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఘనంగా నివాళులర్పించారు. ఆయన త్యాగం వెలకట్టలేదన్నారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం

భారీగా మంచుకురుస్తున్న కిష్టవార్ జిల్లాలో కొనసాగుతున్న ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు శనివారం అధికారులు తెలిపారు. దీంతో, ఛత్రు ప్రాంతంలో మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు ఉగ్రవాదులను ఏరివేసినట్లయిందన్నారు. టాప్ కమాండర్ సైఫుల్లా సహా ఈ ముగ్గురూ పాక్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్‌కు చెందిన వారేనన్నారు. వీరి వద్ద అత్యాధుని ఎం–4 కార్బైన్, ఏకే సిరీస్ రైఫిళ్లను, భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 9వ తేదీన చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్, రామ్‌నగర్ ప్రాంతాల్లోనూ బుధవారం నుంచి ఉగ్రవాదుల కోసం గాలింపు మొదలైందని చెప్పారు.

ఇండియా కూటమి పరిస్థితిపై మాట్లాడాలి

కాంగ్రెస్‌కు శివసేన(యూబీటీ) డిమాండ్

ముంబై: ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పరిస్థితిపై కాంగ్రెస్ స్పందించాలని శివసేన(యూబీటీ) డిమాండ్ చేసింది. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన కీలక భేటీల్లో ఇండియా కూటమి గురించి తలెత్తుతున్న అనుమానాలను ఆ పార్టీ అగ్ర నాయకత్వం నివృత్తి చేసి ఉండాల్సిందని అభిప్రాయం పడింది. శివసేన (యూబీటీ) నేత, పార్టీ పత్రిక సామ్నా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూడా అయిన సంజయ్ రౌత్ శనివారం ముంబైలో మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమి పార్టీలతో తరచూ కాంగ్రెస్ జరిపే సమావేశాలు ఇటీవలి కాలంలో తగ్గిపోయాయన్నారు. సామ్నా తాజా సంపాదకీయంలో కూడా ఆయన ఇదే అంశాన్ని ప్రస్తావించారు. అహ్మదాబాద్ భేటీలో కాంగ్రెస్ సొంత వ్యవహారాలపై దృష్టి పెట్టిందే తప్ప, ఇండియా కూటమి ప్రస్తావనే తేకపోవడాన్ని ఆయన ఎత్తి చూపారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇండియా కూటమి ఉనికిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని, వాటికి అహ్మదాబాద్ సెషన్‌లో కాంగ్రెస్ సమాధానం ఇవ్వాలి ఉందని రౌత్ స్పష్టం చేశారు. 'కూటమికి ఏమైంది? భూమి లోపల పాతేశారా? లేక గాలిలో కలిసి అంతర్ధానమైందా? సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేదే. ప్రస్తుత నియంత పాలనపై పోరాటంలో సారథ్యం వహించాల్సిందీ కాంగ్రెస్సే' అని ఆయన కుండబద్దలు కొట్టారు. 'రానున్న బిహార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల విషయంలో వైఖరిని స్పష్టం చేస్తుందా? మరోసారి ఓటమిని ఆహ్వానిస్తుందా?' అంటూ ఆయన కాంగ్రెస్‌ను నిలదీశారు.

కాంగ్రెస్ 'సంఘటన్ సుజన్ అభియాన్' ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఏఐసీసీ సమావేశాల్లో తీసుకున్న విధానపరమైన నిర్ణయం మేరకు కాంగ్రెస్ అధిష్టానం పార్టీ ప్రక్షాళన ప్రక్రియను ప్రారంభించింది. 'సంఘటన్ సుజన్ అభియాన్'పేరుతో గుజరాత్ రాష్ట్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న కాంగ్రెస్ హైకమాండ్... రాష్ట్రంలోని 41 జిల్లా కాంగ్రెస్ కమిటీలకు కొత్త అధ్యక్షులను ఎంపిక చేయనుంది. దీని కోసం ప్రతి జిల్లాకు ఒక ఏఐసీసీ పరిశీలకుడి చొప్పున మొత్తం 43 మంది ఏఐసీసీ పరిశీలకులు, 183 మంది పీసీసీ పరిశీలకులను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఇందులో తెలంగాణ నుంచి బలరాం నాయక్, వంశీచంద్ రెడ్డి, సంపత్ కుమార్‌లను ఏఐసీసీ పరిశీలకులుగా నియమించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి గిడుగు రుద్రరాజు, సిరివెళ్ల ప్రసాద్‌లకు పార్టీ అధిష్టానం అవకాశం ఇచ్చింది. ప్రతి జిల్లాకు నలుగురు పీసీసీ పరిశీలకులు ఒక బృందంగా ఉంటారు. వీరికి ఏఐసీసీ పరిశీలకుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. గుజరాత్‌లోని ఆరావళి జిల్లాలో ఉన్న మొడాసా పట్టణంలో ఈనెల 15న ఏఐసీసీ, పీసీసీ పరిశీలకుల తొలి సమావేశం జరగనుంది.

కథక్ దిగ్గజం కుముదిని కన్నుమూత

అహ్మదాబాద్: ప్రముఖ కథక్ నృత్యకారిణి, కొరియోగ్రాఫర్ కుముదిని లఖియా(95) శనివారం కన్నుమూశారు. వయో సంబంధ ఆరోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న కుముదిని అహ్మదాబాద్‌లోని సొంతింట్లో ఉదయం 11 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న కుముదిని కథక్‌కే జీవితాన్ని అంకితం చేశారు. 1964లోనే ఈమె కదంబ్ సెంటర్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ సెంటర్‌ను నెలకొల్పారు. ఉమ్రావ్ జాన్ తదితర హిందీ సినిమాలకు ఈమె కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. కుముదిని మరణంపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

అరెస్ట్‌కు కారణం చెప్పలేకుంటే బెయిలివ్వొచ్చు

లక్నో: అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అరెస్టుకు తగు కారణాలను అధికారులు వెల్లడించకపోయినా బెయిలివ్వవచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్ట్‌కు కారణం చెప్పడం తప్పనిసరి, దీనిని ఉల్లంఘించడం బెయిల్ మంజూరుకు ప్రాతిపదిక అవుతుందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. బెయిల్ ఇవ్వడానికి గల చట్టపరమైన పరిమితులేవీ ఇందుకు అడ్డుకావని కూడా స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి గతేడాది డిసెంబర్ 25వ తేదీన రాంపూర్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ ఏప్రిల్ 9న తీర్పు వెలువరించింది. అరెస్టుకు కారణాలను, ఇతర తప్పనిసరి భద్రతా చర్యలను నిర్ధారించడం మేజిస్ట్రేట్ విధి అని కూడా పేర్కొంది. అరెస్టయిన వ్యక్తికి సైతం సహేతుకమైన కారణాలను అర్థమయ్యే భాషలో వివరించి చెప్పాల్సి ఉంటుందని తెలిపింది. పిటిషనర్ మన్‌జీత్ సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది.

బెంగాల్ 'వక్ఫ్' అల్లర్లలో ముగ్గురు మృతి

ఇద్దరికి గాయాలు.. 118 మంది అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో వక్ఫ్ వ్యతిరేక అల్లర్లు హింసాత్మకంగా మారుతున్నాయి. వాటికి ముర్షిదాబాద్ జిల్లాలో ముగ్గురు బలయ్యారు. అల్లర్లు ఎక్కువగా జరిగిన సంసేర్‌గంజ్ ప్రాంతం జఫ్రాబాద్‌లోని శుక్రవారం ఓ ఇంట్లో తండ్రి, కుమారుడు కత్తిపోట్లతో విగతజీవులై కనిపించారని పోలీసులు తెలిపారు. సమీపంలోని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. దుండగులు ఆ ఇంట్లో వస్తువుల్ని ఎత్తుకుపోయారని మృతుల కుటుంబసభ్యులు ఆరోపించారు. సంసేర్‌గంజ్‌లోనే శనివారం చోటుచేసుకున్న మరో ఘటనలో ధులియన్‌లో తూటా గాయాలైన మరో వ్యక్తి కూడా ఆస్పత్రిలో మృత్యువాత పడ్డాడు. అల్లర్లను అదుపు చేసేందుకు బీఎస్ఎఫ్ జవాన్లు జరిపిన కాల్పుల్లో అతడు గాయపడి ఉండొచ్చని పోలీసులు అంటున్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం మాల్దా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీతోపాటు ముర్షిదాబాద్ జిల్లాలోని సుటి, సంసేర్‌గంజ్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అల్లర్లు చోటుచేసుకోవడం తెల్సిందే. చెలరేగిపోయిన నిరసనకారులు పోలీస్ వ్యాన్లు సహా పలు వాహనాలకు నిప్పుపెట్టారు. భద్రతా బలగాలపైకి రాళ్లు రువ్వారు. పలు చోట్ల రహదారులపై బైటాయించారు. అయితే, ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి ఉందని అధికారులు తెలిపారు. హింసాత్మక ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్న జంగీపూర్ సహా పలు సున్నిత ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ జవాన్లను మోహరించామన్నారు. ఘటనలకు సంబంధించి ఇప్పటి వరకు 118 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ధులియన్‌లో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఏడీజీ జావెద్ షమీమ్ చెప్పారు. శుక్రవారం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారని ఆయన తెలిపారు.

కేంద్రాన్నే అడగండి: మమత

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో, ముఖ్యంగా ముస్లిం మెజారిటీ ముర్షిదాబాద్ జిల్లాలో పెద్ద ఎత్తున అల్లర్లు చోటుచేసుకోవడంపై సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని ప్రకటించారు. 'అల్లర్లకు కారణమైన ఆ చట్టాన్ని మేం తీసుకురాలేదు. కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని చేసింది. మీ ప్రశ్నలకు సమాధానం కూడా కేంద్రాన్నే అడగండి'అని శనివారం ఆమె 'ఎక్స్'లో ఆందోళనకారులను కోరారు. 'ఆ చట్టంపై మా వైఖరిని స్పష్టం చేశాం. దాన్ని మేం బలపరచం. రాష్ట్రంలో అమలు చేయం. ఇంకా ఎందుకీ గొడవలు'అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండాలని, వదంతుల్ని నమ్మొద్దని ప్రజలను కోరారు. మతం పేరుతో మత వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడలేకుంటే కేంద్రం సాయం కోరాలని టీఎంసీ ప్రభుత్వాన్ని బీజేపీ కోరింది. అల్లర్లను ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా ప్రతిపక్ష నేత సువేందు అధికారి పేర్కొన్నారు. రాష్ట్రంలో జిహాదీ శక్తుల హవా నడుస్తోందన్నారు. ఈ హింసాత్మక ఘటనలపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, రైల్వే ఆస్తుల విధ్వంసంపై అప్రమత్తంగా ఉండాలని కోరుతూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు.

సూట్‌కేస్‌లో గర్ల్‌ఫ్రెండ్

హాస్టల్‌లోకి తీసుకెళ్తూ దొరికిపోయిన విద్యార్థి

సోనిపట్: గర్ల్ ఫ్రెండ్‌ను సూట్‌కేస్‌లో దాచి తనుండే బాయ్స్ హాస్టల్‌లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఓ విద్యార్థి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఈ ఘటన హరియాణా రాష్ట్రం సోనిపట్‌లోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఇటీవల చోటుచేసుకుంది. భారీ సూట్‌కేస్‌తో హాస్టల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ విద్యార్థిని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. సూట్‌కేస్ తెరిచేందుకు తీసేందుకు యత్నించారు. విద్యార్థులు చుట్టూ గుమికూడారు. సూట్‌కేస్ తెరిచి చూడగా ఓ యువతి బయటకు రావడంతో అంతా షాకయ్యారు. ఓ విద్యార్థి ఇదంతా వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వైరలయ్యింది. వర్సిటీ పీఆర్‌వో మాత్రం, 'మా విద్యార్థులు అల్లరి చేశారంతే, ఇదేమంత పెద్ద విషయం కాదు' అంటూ తేలిగ్గా కొట్టిపారేయడం విశేషం.

బీజేపీకి కట్టుబానిసల్లా లొంగిపోయారు!

అన్నాడీఎంకేపై స్టాలిన్ వ్యాఖ్యలు

చెన్నై: తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ శనివారం బీజేపీ, అన్నాడీఎంకేలపై విరుచుకుపడ్డారు. బీజేపీ, అన్నాడీఎంకేలు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించడంపై ఆయన..'అది ఓటమి పాలయ్యే అవినీతి కూటమి తప్ప, మరొకటి కాదు'అని వ్యాఖ్యానించారు. కేవలం రెండు ఈడీ దాడులకు భయపడి ఏకంగా తమిళనాడు మొత్తాన్ని తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారంటూ అన్నాడీఎంకే నాయకత్వంపై నిప్పులు చెరిగారు. తమిళ ప్రజల పురోగతిని అడ్డుకునేందుకు పన్నిన కుట్రల్లో భాగంగానే అన్నాడీఎంకేను బలవంతంగా బీజేపీ తమవైపు తిప్పుకుందని ఆరోపించారు. కట్టుబానిస మాదిరిగా బీజేపీ ఒత్తిళ్లకు ఆ పార్టీ లొంగిపోయిందని విమర్శించారు. సైద్ధాంతిక ప్రాతిపదిక లేని పొత్తును ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాజ్యాంగ పదవిలో కొనసాగే అర్హతే లేదని వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తు ద్వారా ఆ పార్టీ విధానాలను సమర్థిస్తున్నారా అని అన్నాడీఎంకేను ప్రశ్నించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్ట్ ప్రభావిత బీజాపూర్ జిల్లాలో మరోమారు తుపాకులు గర్జించాయి. శనివారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఇంద్రావతి నదీ తీరం వెంట ఉన్న నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో భద్రతా బలగాలు శుక్రవారం సాయంత్రం నుంచి కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. శనివారం ఉదయం బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాల్పులు కొనసాగాయి. మొత్తం నాలుగు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, మృతుల్లో ఒకరిని మట్వాడా లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు పూనెం అనిల్‌గా గుర్తించారు. 2025 జనవరి 6న బీజాపూర్ జిల్లా అంబేలి వద్ద మందుపాతర పేల్చి 8 మంది జవాన్లు, ఒక డ్రైవర్‌ను చంపిన ఘటనలో ఇతడే ప్రధాన సూత్రధారి అని నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని గుర్తించాల్సి ఉంది. ఘటనాస్థలి నుంచి తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

మందుపాతర వెలికితీత

బీజాపూర్ జిల్లాలో శక్తివంతమైన మందుపాతరను వెలికి తీసిన భద్రతా బలగాలు పెను ప్రమాదాన్ని నివారించాయి. కుట్రు పోలీస్ స్టేషన్ పరిధి రానిబొదిలి–కాటూర్ అటవీ మార్గంలో మావోయిస్టులు 20 కిలోల శక్తివంతమైన మందుపాతరను అమర్చారు. ఆ మార్గంలో శనివారం కూంబింగ్‌కు వెళ్లిన బలగాలు దీన్ని గుర్తించి నిర్వీర్యం చేశాయి.

న్యాయమూర్తులు అధికంగా ఉన్న హైకోర్టు ఏది?

రాష్ట్రంలో అత్యున్నతమైన కోర్టు హైకోర్టు. 1861 కౌన్సిల్ చట్టం ప్రకారం దేశంలో మొదటిసారిగా హైకోర్టును 1862లో కలకత్తాలో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మద్రాసు (1862), బొంబాయి (1862) లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 హైకోర్టులున్నాయి. 2013లో త్రిపుర, మేఘాలయ, మణిపూర్‌కు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేశారు. కేంద్రపాలిత ప్రాంతాలు సమీప రాష్ట్ర హైకోర్టు పరిధిలోకి వస్తాయి. సొంతంగా హైకోర్టు కలిగిన ఏకైక కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ.



భారత న్యాయ వ్యవస్థ - హైకోర్టు

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 214 నుంచి 231 వరకు రాష్ట్రస్థాయిలో హైకోర్టులు, వాటి నిర్మాణం, అధికారాలు, విధుల గురించి పేర్కొన్నారు. ప్రకరణ 214 ప్రకారం ప్రతి రాష్ట్రంలో ఒక హైకోర్టు ఉంటుంది.

ప్రకరణ 231 ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంట్ ఒక చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం కింది రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టులు ఉన్నాయి.

1. మహారాష్ట్ర, గోవా
2. హర్యానా, పంజాబ్
3. అసోం, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడిగా తాత్కాలికంగా హైదరాబాద్‌లోని హైకోర్టును కొనసాగిస్తున్నారు. త్వరలో రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు చేయనున్నారు.

కేంద్రపాలిత ప్రాంతాలు సమీప రాష్ట్ర హైకోర్టు పరిధిలోకి వస్తాయి.

- అండమాన్ నికోబార్ దీవులు - కలకత్తా హైకోర్టు పరిధిలోకి
- పాండిచ్చేరి- మద్రాసు హైకోర్టు పరిధిలోకి
- డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలి - బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి.
- చండీఘర్ అనేది హర్యానా, పంజాబ్ రాష్ట్రాల ఉమ్మడి రాజధాని. అందువల్ల హైకోర్టు చండీఘర్‌లోనే ఉంది.

హైకోర్టు నిర్మాణం

ప్రకరణ 216 ప్రకారం ప్రతి హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య రాష్ట్రాలను బట్టి మారుతుంది. అలహాబాద్ (ఉత్తరప్రదేశ్) హైకోర్టులో అత్యధికంగా న్యాయమూర్తులున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులు - అర్హతలు:

ప్రకరణ 217(1) ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. న్యాయమూర్తుల నియామక సమయంలో రాష్ట్రపతి కింద పేర్కొన్నవారిని సంప్రదించాలి.

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- సంబంధిత రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు
- సంబంధిత రాష్ట్రాల గవర్నర్లు
- ఆ రాష్ట్ర హైకోర్టు వ్యవహారాలు తెలిసిన సుప్రీంకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తులు.

గమనిక: జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను ఏర్పాటు చేసిన తర్వాత పైన పేర్కొన్న అంశాల్లో మార్పులు చేశారు.

అర్హతలు:

- భారత దేశ పౌరుడై ఉండాలి.
- 62 సంవత్సరాలు నిండి ఉండకూడదు.
- ఏదైనా హైకోర్టులో పదేళ్లకు తక్కువ కాకుండా న్యాయవాదిగా అనుభవం ఉండాలి. లేదా కేంద్ర, రాష్ట్ర న్యాయ సర్వీసుల్లో న్యాయాధికారిగా కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి.

ప్రత్యేక వివరణ: హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కనీస వయసును ప్రస్తావించలేదు. ప్రారంభంలో హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లుగా ఉండేది. 1963లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా వీరి పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచారు. దీన్ని 62 నుంచి 65 ఏళ్లకు పొడిగిస్తూ 114వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపాదించారు.

పదవీ ప్రమాణ స్వీకారం:

ప్రకరణ 219 ప్రకారం సంబంధిత రాష్ట్ర గవర్నర్ లేదా ఆయన నియమించిన వ్యక్తి సమక్షంలో హైకోర్టు న్యాయమూర్తులు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారు. దీని గురించి 3వ షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జీతభత్యాలు:

ప్రకరణ 221 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిని ఆ రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ఆర్థిక అత్యవసర పరిస్థితిలో తప్ప ఎప్పుడూ వీటిని తగ్గించడానికి వీలులేదు.

గమనిక: హైకోర్టు న్యాయమూర్తుల పెన్షన్లను కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. కారణం వారు బదిలీ అవుతుంటారు.

తొలగింపు పద్ధతి (అభిశంసన)

ప్రకరణ 217(బి) ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను తొలగించవచ్చు. సుప్రీంకోర్టు జడ్జిలు ఏవిధంగా తొలగింపునకు గురవుతారో అవే కారణాలు, అదే పద్ధతిలో హైకోర్టు న్యాయమూర్తులను కూడా తొలగిస్తారు.

ఇంతవరకూ ఏ హైకోర్టు న్యాయమూర్తిని కూడా తొలగించలేదు. 2011లో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి సౌమిత్ర సేన్‌పై రాజ్యసభలో తొలగించే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇక్కడ ఈ తీర్మానం నెగ్గింది. కానీ, లోక్‌సభ తీర్మానాన్ని చేపట్టడానికి ముందే ఆయన రాజీనామా చేశారు. అదేవిధంగా సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ పి.డి. దినకరన్‌పైనా 2011లో రాజ్యసభలో అభిశంసనా తీర్మానాలు విచారణలో ఉండగానే ఆయన రాజీనామా చేశారు. 2015లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తిపై రాజ్యసభలో అభిశంసనా తీర్మాన నోటీసు ఇచ్చారు. ఒక మహిళా న్యాయమూర్తిపై అనుచితంగా ప్రవర్తించినందుకుగాను ఈ నోటీసు ఇచ్చారు.

న్యాయమూర్తుల రాజీనామా ప్రకరణ 217(1ఎ):

న్యాయమూర్తులు (ప్రధాన న్యాయమూర్తి సహా) రాష్ట్రపతిని సంబోధిస్తూ వారి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు.

న్యాయమూర్తుల బదిలీ:

ప్రకరణ 222 ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సహా ఇతర న్యాయమూర్తులను దేశంలోని ఏ హైకోర్టుకైనా రాష్ట్రపతి బదిలీ చేస్తారు. కానీ, ప్రస్తుతం జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను సంప్రదించాలి.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి - నియామకం (ప్రకరణ 222):

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి ఖాళీ ఏర్పడినా లేదా ఇతర కారణాల వల్ల ప్రధాన న్యాయమూర్తి తన విధులను నిర్వర్తించలేని సందర్భాల్లో హైకోర్టుకు చెందిన ఒక న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా రాష్ట్రపతి నియమించవచ్చు.

అదనపు, తాతాల్కిక న్యాయమూర్తుల నియామకం (ప్రకరణ 224):

హైకోర్టులో పరిష్కరించాల్సిన వివాదాలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడు అదనపు న్యాయమూర్తులను సమయానుకూలంగా రాష్ట్రపతి నియమించవచ్చు. వీరి పదవీకాలం రెండేళ్లు మాత్రమే. ప్రకరణ 224(ఎ) ప్రకారం హైకోర్టులో కేసుల పరిష్కారానికి సేవలు అందించాల్సిందిగా పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులను కూడా రాష్ట్రపతి పూర్వానుమతితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోరవచ్చు.

అధికారాలు, విధులు

ప్రారంభ (ప్రాథమిక) అధికారం:

ప్రకరణ 225 ప్రకారం కొన్ని వివాదాలను నేరుగా హైకోర్టులోనే పరిష్కరించుకోవాలి. ఉదాహరణకు రాష్ట్ర శాసన సభ్యుల ఎన్నిక వివాదం, పార్లమెంటు సభ్యుల ఎన్నిక వివాదం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ, కంపెనీ చట్టాలు, కాపీరైట్ చట్టాలు, వీలునామా, కోర్టు ధిక్కారం లాంటి వివాదాలను నేరుగా హైకోర్టులోనే పరిష్కరించుకోవాలి.

అప్పీళ్లు - అధికార పరిధి:

అప్పీళ్లకు సంబంధించి రాష్ట్రంలో హైకోర్టు అత్యున్నతమైంది. సివిల్, క్రిమినల్ కేసుల్లో కింది కోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.

రిట్లు - అధికార పరిధి:

హైకోర్టు ప్రకరణ 226(1) ప్రకారం సంబంధిత రాష్ట్ర సరిహద్దు లోపల ఉన్న వ్యక్తులకు, సంస్థలకు ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం వివిధ రిట్లను జారీచేస్తుంది. రిట్లు జారీచేసే అధికారం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో అంతర్భాగమని 1997లో ఎల్. చంద్రకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు జారీ చేసే అధికారాల విషయంలో 32వ అధికరణం కింద సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాల కంటే 226వ అధికరణం కింద హైకోర్టుకు ఉన్న అధికారాలే ఎక్కువ. 32వ అధికరణ కింద సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాలు ప్రాథమిక హక్కుల పరిరక్షణకే పరిమితం. 226 అధికరణం కింద హైకోర్టులు ప్రాథమిక హక్కుల రక్షణకు మాత్రమే కాకుండా ఇతర అంశాలకు సంబంధించి కూడా రిట్లు జారీ చేయవచ్చు. అందువల్ల ప్రకరణ 226 క్లాజ్(1) లో పేర్కొన్న "for any other purpose" అనే పదాలకు ప్రాముఖ్యం ఉంది.

కోర్ట్ ఆఫ్ రికార్డ్:

ప్రకరణ 215 ప్రకారం రాష్ట్రంలో కోర్ట్ ఆఫ్ రికార్డ్‌గా హైకోర్టు వ్యవహరిస్తుంది. హైకోర్టు తీర్పులను రాష్ట్రంలోని అన్ని దిగువ న్యాయస్థానాలు, వ్యక్తులు, సంస్థలు గౌరవించాలి. హైకోర్టు తీర్పులను దిగువ న్యాయస్థానాలు ఆధారాలుగా తీసుకొని తదనుగుణంగా తీర్పులను వెలువరించాలి. తీర్పును ధిక్కరించిన వారిని కోర్టు ధిక్కార నేరం కింద శిక్షించవచ్చు.

న్యాయ సమీక్షాధికారం (ప్రకరణ-226):

కేంద్ర, రాష్ట్ర చట్టాల రాజ్యాంగబద్ధతను పరిశీలించి, అవి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమైతే న్యాయ సమీక్షాధికారం కింద హైకోర్టు వాటిని కొట్టేస్తుంది.


పర్యవేక్షణాధికారాలు (న్యాయపరమైనవి):

ప్రకరణ 227 ప్రకారం హైకోర్టుకు తన పరిధిలోని అన్ని ప్రాంతాల్లోని కింది కోర్టులు, ట్రిబ్యునళ్లపై పర్యవేక్షణాధికారం ఉంది. దిగువ న్యాయస్థానాల నుంచి తగిన సమాచారం తెప్పించుకోవచ్చు. దిగువ న్యాయస్థానాలు పాటించాల్సిన విధి, విధానాలను సూచిస్తుంది, వాటిని క్రమబద్ధీకరిస్తుంది.

పరిపాలన పరమైన అధికారాలు:

న్యాయాధికారుల నియామకం, పదోన్నతి, బదిలీ, క్రమశిక్షణ లాంటి సర్వీస్ విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించాలి.

నిర్వచనోత్తర రామాయణం ఎవరు రచించారు?



మాదిరి ప్రశ్నలు

1. విరాట పర్వం నుంచి స్వర్గారోహణ వరకు 15 పర్వాల మహాభారతాన్ని రాసినవారు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) పైవారందరూ
2. తిక్కన తాను రాసిన మహాభారతాన్ని ఎవరికి అంకితమిచ్చాడు?
   1) మనుమసిద్ధి
   2) రాజరాజ నరేంద్రుడు
   3) హరిహరనాథుడు
   4) అహోబిల నృసింహస్వామి
3. రసాభ్యుచిత బంధం అంటే ఏమిటి?
   1) రసపోషణ చేయగలగడం
   2) రసపోషణ అద్భుతంగా చేయగలగడం
   3) రసాస్వాధన కలిగి ఉండటం
   4) ఔచిత్యవంతంగా రసపోషణ చేయగలగడం
4. పానుగంటి లక్ష్మీ నరసింహం ఏ సంస్థానంలో ఆస్థాన కవిగా పనిచేశారు?
   1) పిఠాపురం 2) ఆనెగొంది
   3) గద్వాల 4) విజయనగరం
5. తెలుగులో పాఠక జనాధరణ పొందిన సాక్షి వ్యాసాల సృష్టికర్త ఎవరు?
   1) కందుకూరి వీరేశలింగం
   2) పానుగంటి లక్ష్మీ నరసింహం
   3) చిలకమర్తి లక్ష్మీ నరసింహం
   4) నార్ల వేంకటేశ్వరరావు
6. సరస్వతీపుత్ర బిరుదాంకితుడెవరు?
   1) పానుగంటి లక్ష్మీ నరసింహం
   2) వేదుల సత్యనారాయణ శాస్త్రి
   3) రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
   4) పుట్టపర్తి నారాయణ చార్యులు
7. పుట్టపర్తి నారాయణాచార్యుల రచన కానిది?
   1) శివ తాండవం 2) పండరీ భాగవతం
   3) మేఘ సందేశం
   4) జనప్రియ రామాయణం
8. 'ఆడెనమ్మా శివుడు - పాడెనమ్మా భవుడు' అంటూ తన్మయత్వంలో గొంతెత్తిపాడిన కవి ఎవరు?
   1) శ్రీనాథుడు
   2) పుట్టపర్తి నారాయణాచార్యులు
   3) ఎస్.టి. జ్ఞానానందకవి
   4) పాల్కూరికి సోమనాథుడు
9. ఒక విజేత ఆత్మకథ - ఎవరి రచన?
   1) ఏపీజే అబ్దుల్ కలాం
   2) జిడ్డు కృష్ణమూర్తి
   3) బి. పట్టాభిరామ్
   4) యండమూరి వీరేంద్రనాథ్
10. కిందివాటిలో భారత ప్రభుత్వం నుంచి అబ్దుల్ కలాం పొందని సత్కారం ఏది?
    1) భారతరత్న 2) పద్మవిభూషణ్
    3) పద్మభూషణ్ 4) పద్మశ్రీ
11. సత్యవోలు సుందర కవి రచించిన శతకం?
    1) శ్రీ భర్గ శతకం 2) కుమార శతకం
    3) రాజశేఖర శతకం
    4) నరసింహ శతకం
12. 'సీతాసుందరి పరిణయం' ప్రబంధాన్ని ఎవరు రాశారు?
    1) కూచిమంచి జగ్గకవి
    2) కూచిమంచి తిమ్మకవి
    3) కాకుత్సం శేషప్పకవి
    4) సత్యవోలు సుందరకవి
13. నరసింహ శతకం రాసిన కాకుత్సం శేషప్ప ఎన్నో శతాబ్దానికి చెందినవారు?
    1) 15 2) 16 3) 17 4) 18
14. శతక ప్రక్రియ ప్రధాన లక్షణం కానిది?
    1) సంఖ్యా నియమం
    2) మకుటం ప్రధానం
    3) రస ప్రధానం 4) ప్రత్యేక భావం
15. గృహలక్ష్మి పత్రికలో ప్రచురితమైన శారద లేఖలు ఎవరివి?
    1) కనుపర్తి వరలక్ష్మమ్మ
    2) సావిత్రి 3) పి. యశోదారెడ్డి
    4) ఉన్నవ లక్ష్మీబాయమ్మ
16. 'గాంధీ దండకం' ఎవరు రచించారు?
    1) పుట్టపర్తి నారాయణాచార్యులు
    2) కనుపర్తి వరలక్ష్మమ్మ
    3) దువ్వూరి రామిరెడ్డి
    4) తుమ్మల సీతారామమూర్తి చౌదరి
17. విక్రమార్కుని దివ్య సింహాసనానికి ఉన్న 32 సాలభజింకలు భోజరాజుకు చెప్పిన కథలతో కూడుకున్న కథాకావ్యం ఏది?
    1) విక్రమార్క చరిత్ర
    2) భోజరాజీయం
    3) విద్ధ సాలభంజిక
    4) సింహాసన ద్వాత్రింశిక
18. అధికార భాషా సంఘానికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
    1) యండమూరి యశోదాదేవి
    2) మాగంటి అన్నపూర్ణాదేవి
    3) పాకాల యశోదారెడ్డి
    4) అనసూయాదేవి
19. పి.యశోదారెడ్డి కలం నుంచి జాలువారిన కథా సంపుటాలు?
    1) మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు
    2) మహాలక్ష్మి ముచ్చట్లు, మావూరి ముచ్చట్లు
    3) మా చెట్టు నీడ ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు
    4) మా వూరి ముచ్చట్లు, మా చెట్టు నీడ ముచ్చట్లు
20. హిందూస్థానీ - కర్ణాటక సంగీతానికి సాంస్కృతిక వారధిగా విమర్శకులు ఎవరిని పిలుస్తారు?
    1) పుట్టపర్తి నారాయణాచార్యులు
    2) సామల సదాశివ
    3) తాళ్ళపాక అన్నమయ్య
    4) పిలకా గణపతిశాస్త్రి
21. సామల సదాశివ ఏ గ్రంథానికి 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది?
    1) ఉర్దూ సాహిత్య చరిత్ర
    2) సంగీత శిఖరాలు
    3) మలయమారుతాలు
    4) స్వరలయలు
22. జిడ్డు కృష్ణమూర్తి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన .....?
    1) పర్యావరణ వేత్త
    2) తత్త్వశాస్త్రవేత్త
    3) రాజనీతి శాస్త్రవేత్త
    4) సామాజిక ఉద్యమకారుడు
23. ఎవరి జన్మదినోత్సవాన్ని 'మాండలిక భాషా దినోత్సవం'గా నిర్వహిస్తారు?
    1) కందుకూరి వీరేశలింగం
    2) గురజాడ అప్పారావు
    3) కాళోజి నారాయణరావు
    4) గిడుగు రామ్మూర్తి
24. 'ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక' అని నమ్మి తన రచనల ద్వారా ప్రకంపనలు సృష్టించిన కవి?
    1) కాళోజి నారాయణరావు
    2) శ్రీరంగం శ్రీనివాసరావు
    3) శ్రీరంగం నారాయణబాబు
    4) ఏపీజే అబ్దుల్ కలాం
25. రుబాయీ ఏ భాషా పదం?
    1) పారశీ 2) ఉర్దూ
    3) లాటిన్ 4) అరబ్బీ
26. ప్రసిద్ధి పొందిన 'బందిపోట్లు' అనే స్త్రీవాద కవిత ఎవరిది?
    1) మహెజబీన్ 2) సావిత్రి
    3) కొండెపూడి నిర్మల
    4) ఘంటసాల నిర్మల
27. దువ్వూరి రామిరెడ్డి బిరుదు?
    1) మధురకవి
    2) సరస్వతీ పుత్రుడు
    3) కవి కోకిల 4) గౌతమీ కోకిల
28. కృషీవలుడు, పానశాల కావ్యాలను రచించిన వారెవరు?
    1) దువ్వూరి రామిరెడ్డి
    2) విద్వాన్ విశ్వం
    3) పిలకా గణపతి శాస్త్రి
    4) ఎస్.టి.జ్ఞానానందకవి
29. పిలకా గణపతిశాస్త్రి రాసిన 'ధర్మదీక్ష' పాఠ్య భాగం ఏ గ్రంథంలోనిది?
    1) పూర్వగాథాలహరి
    2) విశాలనేత్రాలు
    3) కాశ్మీర పట్టమహిషి
    4) ప్రాచీన గాథాలహరి
30. పిలకా గణపతిశాస్త్రి కలం నుంచి జాలువారిన విశాలనేత్రాలు, కాశ్మీర పట్టమహిషి ఏ ప్రక్రియకు చెందినవి?
    1) రాజకీయ నవలలు
    2) కవితా సంపుటాలు
    3) జానపద నవలలు
    4) కథా సంపుటాలు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 1	5) 2
6) 4	7) 3	8) 2	9) 1	10) 4
11) 3	12) 2	13) 4	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 2
21) 4	22) 2	23) 3	24) 1	25) 4
26) 2	27) 3	28) 1	29) 4	30) 3

కవులు - పరిచయం

1. **తిక్కన (13వ శతాబ్దం):**
   బిరుదు: కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు
   పాఠ్యభాగం: శాంతికాంక్ష
   ఇతివృత్తం: శాంతి స్థాపన
   రచనా విశేషాలు: నిర్వచనోత్తర రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణ శతకం, విజయసేనం, కవిసార్వభౌమ చంధస్సు
2. **పానుగంటి లక్ష్మీ నరసింహారావు (1865 - 1940):**
   పిఠాపురం ఆస్థానకవి
   పాఠ్యభాగం: స్వభాష
   ప్రక్రియ: అధిక్షేప వ్యాసం
   ఇతివృత్తం: భాషాభిరుచి
   రచనా విశేషాలు: సారంగధర, ప్రచండ చాణక్యం, మిత్రనారాయణ, కంఠాభరణం, పూర్ణిమ, సరస్వతి, సరోజిని, సాక్షి (ప్రసిద్ధ వ్యాసం)
3. **పుట్టపర్తి నారాయణాచార్యులు(1914-1990):**
   బిరుదు: సరస్వతీ పుత్రుడు
   పాఠ్యభాగం: శివతాండవం
   ప్రక్రియ: గేయ కవిత
   ఇతివృత్తం: ప్రకృతి వర్ణన
   రచనలు: శివతాండవం, మేఘదూతం, షాజీ, కావ్యమాల, జనప్రియ రామాయణం, పండరీ భాగవతం, సాక్షాత్కారం, పెనుగొండ లక్ష్మీ, లీవ్స్ ఇన్ ది విండ్
4. **ఎ.పి.జె. అబ్దుల్ కలాం (1937):**
   బిరుదు: పద్మభూషణ్, పద్మవిభూషణ్, భారతరత్న
   పాఠ్యభాగం: ప్రేరణ
   ప్రక్రియ: ఆత్మకథ
   ఇతివృత్తం: వ్యక్తిత్వ వికాసం
   రచనలు: ఒక విజేత ఆత్మకథ (ది వింగ్స్ ఆఫ్ ఫైర్ - యాన్ ఆటోబయోగ్రఫీ), ఇగ్నైటెడ్ మైండ్స్
5. **శతక కవులు**
   యథావాక్కుల అన్నమయ్య (12వ శతాబ్దం):
   రచన: సర్వేశ్వర శతకం
   బద్దెన (13వ శతాబ్దం):
   రచన: సుమతీ శతకం
   బమ్మెర పోతన (15వ శతాబ్దం):
   రచన: నారాయణ శతకం
   ధూర్జటి (16వ శతాబ్దం):
   రచన: శ్రీకాళహస్తీశ్వర శతకం
   పక్కి అప్పలనర్సయ్య (16వ శతాబ్దం):
   రచనలు: కుమార శతకం
   కంచర్ల గోపన్న (17వ శతాబ్దం):
   రచనలు: దాశరథీ శతకం
   కూచిమంచి తిమ్మకవి (17వ శతాబ్దం):
   రచనలు: శ్రీభర్గ శతకం, సీతాసుందరీ పరిణయం
   కాకుత్సం శేషప్పకవి (18వ శతాబ్దం):
   రచన: నరసింహ శతకం
   సత్యవోలు సుందరకవి (20వ శతాబ్దం):
   రచన: రాజశేఖర శతకం
6. **కనుపర్తి వరలక్ష్మమ్మ (1896 - 1978):**
   బిరుదు: కవితా ప్రవీణ
   పాఠ్యభాగం: ప్రబోధం
   ప్రక్రియ: లేఖ
   ఇతివృత్తం: స్త్రీ చైతన్యం
   రచనా విశేషాలు: శారదా లేఖలు, మావూరు, పెన్షన్ పుచ్చుకున్న నాటి రాత్రి, కథా ఎట్లా వుండాలి, మా చెట్టు నీడ ముచ్చట్లు, గాంధీ దండకం
7. **కొరవి గోపరాజు (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర్విధ కవితావిశారదుడు
   పాఠ్యభాగం: ససేమిరా
   ప్రక్రియ: కథాకావ్యం
   రచన: సింహాసన ద్వాత్రింశిక
8. **పి. యశోదారెడ్డి (1929):** అధికార భాషా సంఘం పీఠాన్ని అలంకరించిన తొలి మహిళ.
   పాఠ్యభాగం: సీతక్క పెండ్లి
   ప్రక్రియ: కథానిక
   రచనా విశేషాలు: మావూరి ముచ్చట్లు, తెలుగులో కరినాంశాలు, ఎచ్చమ్మ కథలు
9. **సామల సదాశివ (1928-2012):**
   బిరుదు: బహుభాషా పండితుడు
   పాఠ్యభాగం: రుబాయిలు
   ప్రక్రియ: అనువాదం
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ఉర్దూ సాహిత్య చరిత్ర, అమ్జద్ రుబాయిలు, మలయమారుతాలు, స్వరలయలు, సంగీత శిఖరాలు
10. **జిడ్డు కృష్ణమూర్తి (1895):**
    ప్రపంచ ప్రఖ్యాత తత్వశాస్త్రవేత్త
    పాఠ్యభాగం: చూడడమనే కళ
    ప్రక్రియ: వ్యాసం
    ఇతివృత్తం: ప్రకృతి పరిశీలన
    రచనా విశేషాలు: ధ్యానం, స్వేచ్ఛ, నీవే ప్రపంచం, గరుడ యానం (ఇవన్నీ ఆంగ్ల రచనలే)
11. **కాళోజి నారాయణరావు (1914):**
    బిరుదు: ప్రజాకవి, పద్మవిభూషణ్
    పాఠ్యభాగం: ఊప్స
    ప్రక్రియ: వచనా కవిత
    ఇతివృత్తం: సామాజిక చైతన్యం
    రచనా విశేషాలు: నా గొడవ, అణాకథలు, కాళోజి కథలు, తెలంగాణ ఉద్యమ కవితలు, జీవన గీతి
12. **సావిత్రి (1949 - 1991):**
    స్త్రీవాద కవయిత్రి
    పాఠ్యభాగం: బతుకు పుస్తకం
    ఇతివృత్తం: మానవతా విలువలు
    రచనా విశేషాలు: బందిపోట్లు, గృహిణి
13. **దువ్వూరి రామిరెడ్డి (1895 - 1947):**
    బిరుదు: కవికోకిల, కర్షక కవి
    పాఠ్యభాగం: భూమిపుత్రుడు
    ఇతివృత్తం: గ్రామీణ జీవనం
    రచనా విశేషాలు: నలజారమ్మ అగ్నిప్రవేశం, వనకుమారి, కృషీవలుడు, జలదాంగన, యువక స్వప్నము, కడపటి వీడ్కోలు, భగ్న హృదయము, పరిశిష్టము, నక్షత్రశాల - నైవేద్యము, కర్షక విలాసం, కాంగ్రెస్ వాలా, కుంభరాణా, మిత్రార్థ శతకం, మాతృశతకం, పానశాల
14. **పిల్లకా గణపతిశాస్త్రి (1911):**
    పాఠ్యభాగం: ధర్మదీక్ష
    ప్రక్రియ: కథ
    ఇతివృత్తం: జీవకారుణ్యం
    రచనా విశేషాలు: రత్నాపహారం, మణిదీపిక, ప్రాచీన గాథాలహరి, విశాల నేత్రాలు, కాశ్మీర పట్టమహిషి, నాగమల్లిక, అందని చందమామ

ముసునూరి ప్రోలయ నాయకుడి రాజధాని ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయుల అనంతర రాజ్యాలు

ముసునూరి వంశం:

కాకతీయుల పతనం తర్వాత అరాచక పరిస్థితుల నుంచి త్రిలింగ దేశాన్ని రక్షించడానికి ముసునూరి ప్రోలయ నాయకుడు, అతడి తమ్ముడి కుమారుడైన ముసునూరి కాపయ నాయకుడు నాయకత్వం వహించారు.

ముసునూరి ప్రోలయ నాయకుడు (క్రీ.శ. 1325–1332):

ముసునూరి వంశస్థుల తొలి చరిత్ర గురించి అంతగా ఆధారాలు లభించడం లేదు. వీరు కమ్మ వర్గానికి చెందినవారని అత్యధిక మంది చరిత్రకారుల అభిప్రాయం. వీరి వంశకర్త పోతన నాయకుడు. అతడికి పోచ, దేవ, కాయ అనే ముగ్గురు కుమారులు. వేంగి విషయానికి (మండలానికి) నాయకుడైన పోచ నాయకుని కుమారుడు ప్రోలయ నాయకుడు. ఇతడు అతి పరాక్రమశాలి. గోదావరి తీరంలో మన్యప్రాంతమైన 'రేకపల్లి దుర్గం' ఇతడి కార్యక్రమాలకు ముఖ్య కేంద్రం. విదేశీయుల దాడులను ఎదుర్కోవడానికి కాకతీయ ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకర్ల సంతతికి చెందిన వారు కృషి చేశారు. వీరిలో ప్రధానంగా అద్దంకి వేమారెడ్డి, రేచర్ల సింగమనాయుడు, కొప్పుల వెలమ ప్రోలయ నాయకుడు, ముసునూరి కాపయ నాయకుడు తదితరులు ఉన్నారు. వీరందరూ మహమ్మదీయులకు వ్యతిరేకంగా ప్రోలయ నాయకుడు చేసిన పోరాటానికి సహకారం అందించారు. ప్రోలయ నాయకుడు 'రేకపల్లి దుర్గాన్ని' రాజధానిగా చేసుకొని కోస్తాంధ్ర, త్రిలింగ మండలాల్లో మహమ్మదీయుల పాలన నుంచి తెలుగువారికి విముక్తి కల్పించాడు. అందువల్ల ప్రోలయనాయకుడికి 'అవక్రవిక్రమ యశస్యంభావ్య బాహార్గలుడు' అనే బిరుదు ఉన్నట్లు కాపయ నాయకుడు వేయించిన పోలవరం శాసనం వివరిస్తోంది. దుర్గాలన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. త్రిలింగ దేశాన్ని సముద్ధరించాడు.

ముసునూరి కాపయ నాయకుడు (క్రీ.శ.1332–1368):

ప్రోలయ నాయకుడి మరణానంతరం అతడి తమ్ముడి కుమారుడు కాపయ నాయ కుడు క్రీ.శ.1332లో యుద్ధానికి నాయకత్వం వహించాడు. కర్ణాటక హోయసాల పాలకుడైన మూడో వీరభల్లాలుడి సహాయంతో మహమ్మదీయుల ఆధీనంలో ఉన్న ఓరుగల్లు దుర్గాన్ని చేజిక్కించుకున్నాడు. దీని పాలకుడైన మాలిక్ మక్బల్ యుద్ధం నుంచి పారిపోయాడు. కాపయ నాయకుడు క్రీ.శ. 1337లో ఓరుగల్లును ఆక్రమించాడు. తెలంగాణలోని మెదక్ సీమ, ఇందూరు (నిజామాబాద్)లోని కౌలాస కోట, నల్గొండ, పానగల్లు, దేవరకొండ, భువనగిరి ప్రాంతాలతో పాటు కృష్ణా, గోదావరి ప్రదేశాలను కూడా ఇతడు తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఇతడిని 'అరుమనగంటి పురవరాధీశ్వరుడు' అని గణపేశ్వర శాసనంలో పేర్కొన్నారు. ఈ శాసనం ఇతడిని సమస్త రాజాశ్రయుడని, సమస్త జనపరివృతాలంకృతుడని కూడా వర్ణించింది. అరుమనగల్లే కాలక్రమంలో 'ఆమనగల్లు'గా వ్యవహారంలోకి వచ్చింది. కాపయ నాయకుడిని కలువచేరు శాసనంలో కాపావనీశ్వరుడిగా, పిల్లలమర్రి శాసనంలో ఆంధ్ర దేశాధీశ్వరుడిగా, ముమ్మిడినాయకుడి ఆర్యావటి శాసనంలో ప్రఖ్యాతాంధ్ర సురత్రాణుడిగా వర్ణించారు. ఆంధ్రదేశాన్ని రాజకీయంగా ఐక్యం చేసిన కాపయ నాయకుడి ఆశలు కొద్దికాలంలోనే భగ్నమయ్యాయి. ఇతడిని ధిక్కరించి అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి, రాచకొండలో రేచర్ల పద్మనాయకులు, కొండవీడులో రెడ్డి రాజులు, పిఠాపురంలో కొప్పుల వెలమలు చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆంధ్రదేశం మరోసారి ముక్కలైంది.

బహమనీ, విజయనగర రాజ్యాలతో సంబంధాలు:

క్రీ.శ. 1347లో అల్లా ఉద్దీన్ హసన్ గంగూ స్థాపించిన బహమనీ రాజ్యానికి కాపయ నాయకుడు సహాయం చేసినట్లు ఫెరిస్టా రచనల ద్వారా తెలుస్తోంది. ఢిల్లీ సుల్తానులు దండయాత్రలు చేస్తే బహమనీ రాజ్యం తమకు రక్షణగా ఉంటుందనే ఆలోచనతో కాపయ నాయకుడు వారికి సహాయం చేసి ఉండొచ్చని చరిత్రకారుల అభిప్రాయం. అల్లా ఉద్దీన్ హసన్ గంగూ రాజ్య విస్తరణలో భాగంగా ఓరుగల్లుపై దండెత్తి కాపయ నాయకుడిని ఓడించాడు. కాపయ నాయకుడు గత్యంతరం లేక నిజామాబాద్‌లో కౌలస దుర్గాన్ని హసన్ గంగూకు ఇచ్చి సంధి కుదుర్చుకున్నాడు. గంగూ మరణానంతరం



(1359) అతడి కుమారుడు మొదటి మహ్మద్‌షా రాజ్యానికి వచ్చాడు. హసన్ గంగూ ఆక్రమించిన తమ భూ భాగాలను తిరిగి అప్పగించాలని విజయనగర రాజులు, కాపయ నాయకుడు మహమ్మద్‌షా ఆస్థానానికి రాయబారం నడిపినట్లు ఫెరిస్టా రచనల ద్వారా తెలుస్తోంది. ఈ రాయబారం విఫలమైనందువల్ల విజయనగర మొదటి బుక్కరాయల సహాయంతో కాపయ నాయకుడి కుమారుడు వినాయకదేవుడు కౌలస కోట (నిజామాబాద్)ను ముట్టడించారు. ఈ యుద్ధంలో బహమనీలు వినాయకదేవుడిని క్రూరంగా వధించారు. దీంతో కాపయనాయకుడు విజయనగర రాజులతో కలిసి బహమనీ రాజ్యాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ సహాయాన్ని అర్థించారు. దీన్ని ఢిల్లీ సుల్తాన్ తిరస్కరించాడు. దీంతో బహమనీ మహమ్మద్ షా కోపోద్రిక్తుడై ఓరుగల్లుపై దండెత్తాడు. ఈ విధ్వంసకాండ నుంచి ప్రజలను రక్షించడానికి కాపయ నాయకుడు తన ఆధీనంలోని గోల్కొండ కోటను మహ్మద్‌షాకు ఇచ్చి సంధి చేసుకున్నాడు. ఇదే అదనుగా రేచర్ల అనపోతనాయకుడు కాపయ నాయకుడిపై దండెత్తాడు. వీరిద్దరికి భీమవరం వద్ద జరిగిన యుద్ధం(1367–68)లో కాపయ నాయకుడు మరణించాడు.

రాచకొండ–దేవరకొండ వెలమలు (పద్మ నాయకులు)

క్రీ.శ. 1368లో భీమవరం యుద్ధంలో రేచర్ల వెలమ నాయకుడైన అనపోత నాయకుడు ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రేచర్ల పద్మనాయకుల వంశ చరిత్రను తెలిపే 'వెలుగోటి వారి వంశావళి' గ్రంథం ప్రకారం అనపోత నాయకుడికి ఖడ్గనారాయణ, గాయ గోవాళ, హిందూ రాయసురత్రాణ లాంటి బిరుదులు ఉన్నట్లు తెలుస్తోంది. ముసునూరి వంశపాలన తెలంగాణాలో అంతమైన తర్వాత రేచర్ల పద్మనాయకులు, కొండవీటి రెడ్డి రాజుల మధ్య కృష్ణా–గోదావరి పరిసర ప్రాంతాలపై ఆధిపత్యం కోసం సుమారు 50 ఏళ్ల భీకర యుద్ధాలు జరిగాయి.

ముసునూరి నాయకుల పాలన తర్వాత రేచర్ల వెలమలు మహమ్మదీయులను ఎదుర్కొని తెలంగాణలో రాజకొండ (రాచకొండ) రాజ్యాన్ని స్థాపించారు. వీరు రాచకొండ, దేవరకొండ రాజధానులుగా త్రిలింగదేశాన్ని పాలించారు. వీరిది రేచర్ల గోత్రం. రాచకొండ నల్గొండ జిల్లాలో, దేవరకొండ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నాయి. రేచర్ల వంశ మూలపురుషుడు బేతాళరెడ్డి. వీరి జన్మస్థానం పిల్లలమర్రి (ఆమనగల్లు). ఈ వంశంలో సింగమనేడు ప్రసిద్ధుడు. రేచర్ల రుద్రుడు, రేచర్ల ప్రసాదిత్యుడు కాకతీయ గణపతిదేవుడి కాలంలో సైన్యాధిపతులుగా సేవలందించారు. రేచర్ల ప్రసాదిత్యునికి 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య' బిరుదు ఉంది.

సింగమనాయకుడు:

రేచర్ల ప్రసాదిత్యుడి మనవడు దాచానేడు ప్రతాపరుద్రునికి సేనానిగా పనిచేశాడు. దాచానేడు కుమారుడు సింగమనాయకుడు. ఇతడు ముసునూరి కాపయ నాయకత్వంలో విదేశీయులను ఎదుర్కొన్నాడు. సింగమనాయుడు అనపోతానాయుడితో కలిసి భీమవరం యుద్ధంలో కాపయనాయకుడిని ఓడించాడు. సింగమనాయకుడు జల్లిపల్లి కోటను ముట్టడించిన సందర్భంలో సోమ వంశ క్షత్రియుల చేతిలో హతమయ్యాడు.

అనపోతానాయకుడు:

సింగమనేని కుమారుడు అనపోతానాయకుడు. ఇతడు రాచకొండ రాజ్య నిర్మాత. తండ్రి మరణానికి కారణమైన జల్లిపల్లి సోమ క్షత్రియులను ఓడించాడు. రెడ్డి రాజులతో పోరాడి శ్రీశైలం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. బహ మనీ సుల్తాన్లతో స్నేహం చేశాడు. 1368లో భీమవరంలో యుద్ధంలో కాపయనాయకుడిని వధించి ఓరుగల్లును ఆక్రమించాడు. ఇతడు భువనగిరి, రాజకొండ, సింగపురాలను జయించాడు. సోదరుడైన మదానాయకుడిని దేవరకొండ పాలకుడిగా నియమించాడు.

కుమార సింగభూపాలుడు:

అనపోతానాయకుడి కుమారుడు సింగభూపాలుడు క్రీ.శ.1383–1399 మధ్య పాలించాడు. కల్యాణదుర్గాన్ని జయించి 'కల్యాణభూపతి' బిరుదు పొందాడు. ఇతని తర్వాత రెండో అనపోతానాయకుడు, మాదానేడు బహమనీ సుల్తాన్లకు సాయం చేశాడు.

ముమ్మడి సింగ భూపాలుడు (క్రీ.శ 1430–1475):

ఇతడు కళింగ గజపతుల సహాయంతో బహమనీ సుల్తాన్లను ఎదిరించాడు. కానీ విజయం సాధించలేకపోయాడు. చివరికి రేచర్ల వెలమలు రాజ్యాన్ని పోగొట్టుకొని విజయనగర రాజులను ఆశ్రయించి, వారి ఆస్థానంలో ఉద్యోగులుగా చేరారు.

రేచర్ల వెలమల సాహిత్య సేవ

సింగభూపాలుడు 'అక్కలపూడి' గ్రామానికి 'ముమ్మిడిసింగవరం'గా పేరు మార్చి ఆయుర్వేద వైద్యుడు పరహితాచార్యుడికి అగ్రహారంగా దానమిచ్చాడు.

కుమార సింగభూపాలునికి 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది. ఇతడు రచయిత, గొప్ప సాహిత్య పోషకుడు. ఇతడిని రెండో సింగభూపాలుడిగా పిలుస్తారు. రెడ్డి–వెలమ రాజుల మధ్య అనుసంధానకర్తగా మహాకవి శ్రీనాథుడు వ్యవహరించాడు. ఇతడు రేచర్ల సర్వజ్ఞ సింగభూపాలుడి ఆస్థానాన్ని సందర్శించాడు. ఆంధ్రమహాభాగవత రచయిత బమ్మెరపోతన. సింహాసన ద్వాత్రింశక రాసిన కొరవిగోపరాజు, నవనాథ చరిత్ర రాసిన గౌరన లాంటి పండితులు ఈ కాలంవారే. 'అమరకోశానికి' వ్యాఖ్యానం రాసిన బొమ్మకంటి అప్పయామాత్యుడు, 'చమత్కార చంద్రిక' రచయిత విశ్వేశ్వరుడు ఈ కాలం నాటి గొప్ప సంస్కృత కవులు. రేచర్ల పద్మనాయకులు నాయంకర్లుగా కాకతీయుల కాలంలో సేవలందించారు. వీరు గొప్ప వీరులే కాకుండా సాహిత్య పోషకులుగా ఆంధ్ర భాషా సాహిత్యానికి సేవలందించారు.

మాదిరి ప్రశ్నలు

1. ముసునూరి ప్రోలయ నాయకుడి రాజధాని ఏది?
   1) అద్దంకి 2) చందవోలు
   3) రేకపల్లి దుర్గం
   4) ఆమనగల్లు
2. తెలంగాణాలో మహమ్మదీయుల దురాగతాలను ఏ శాసనం తెలియజేస్తుంది?
   1) ఆర్యావట శాసనం
   2) అనమకొండ శాసనం
   3) గణపేశ్వర శాసనం
   4) విలస తామ్ర శాసనం
3. తెలుగు దేశాన్ని 'త్రిలింగ దేశమని' ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
   1) భీమసేన జాతకం
   2) శక్తి సంగమ తంత్రం
   3) శెరివణిజ జాతకం
   4) మెగస్తనీస్ ఇండికా
4. తెలంగాణలో 'కొలనుపాక' దేనికి ప్రసిద్ధి?
   1) బౌద్ధ చైత్యగృహం
   2) జైన దేవాలయం
   3) వైష్ణవ దేవాలయం
   4) శైవ దేవాలయం
5. కాకతీయుల'రాజభాష','లాంఛనం' ఏది?
   1) తెలుగు – సింహం
   2) సంస్కృతం – వరాహం
   3) ప్రాకృతం – వృషభం
   4) కన్నడం – చేప
6. 'తలారి' అనేది దేన్ని సూచిస్తుంది?
   1) గ్రామాధికారి
   2) కరణం 3) వ్యాపారి
   4) గ్రామ రక్షక భటుడు
7. కింది ప్రదేశాల్లో విభిన్నమైంది ఏది?
   1) అలంపురం 2) ఫణిగిరి
   3) గాజుల బండ
   4) కొండాపూర్
8. 'ఓరుగల్లు' పేరును 'సుల్తాన్‌పూర్'గా మార్చిన వారెవరు?
   1) ఘియాసుద్దీన్ తుగ్లక్
   2) అల్లావుద్దీన్ ఖిల్జీ
   3) మహ్మద్ బిన్ తుగ్లక్
   4) మాలిక్ కాఫూర్

సమాధానాలు

1) 3 2) 4 3) 2 4) 2 5) 2
6) 4 7) 1 8) 3

Mr. Rajan is working as a Programmer..


Bank Exams

REASONING

Model questions

Directions: Read the questions carefully and answer them.

1. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Sand B) Stone C) Cement
   D) Brick E) Wall
   Explanation: Sand, stone, Cement and Brick are the raw materials.
   Ans: E
2. If Yellow is called Green, Green is called Black, Black is called White, White is called Red, Red is called Blue, Blue is called Orange then what is the colour of milk?
   A) White B) Black
   C) Red D) Green
   E) None of these
   Explanation: The colour of milk is white, and white is called red.
   Ans: C
3. Pointing to a photograph Seema said "He is the only grandson of my mother's father-in-law, and my father has neither brother nor sister". How is the man in photograph related to Seema?
   A) Father B) Uncle
   C) Cousin D) Brother
   E) None of these
   Ans: D
4. If '+' means '×', '×' means '÷', '÷' means '–' and '–' means '+' what is the value of
   17 + 15 – 135 × 9 ÷ 70?
   A) 270 B) 240 C) 170
   D) 200 E) None of these
   Ans: D
5. If it is possible to make a meaningful word from the fourth, the sixth, the eighth and the eleventh letters of the word GOURMANDISE using each letter only once first letter of the word is your answer. If more than one such word can be formed your answer is X. If no such word can be formed your answer is Y.
   A) D B) R C) M D) X E) Y
   Explanation: READ, DEAR, DARE. **Ans:** D
6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Silver B) Gold C) Nickel
   D) Copper E) Brass
   Explanation: Brass is an alloy where as the remaining are elements. **Ans:** E
7. In a certain code EXTRA is written as % 5 # 73 and NOSE is written as 4@8%; how is STORE written in that code?
   A) 5#@7% B) 8#@7%
   C) 8#@%5 D) 8@75%
   E) None of these
   Ans: B
8. In a row of children facing North, Shamika is third to the right of Nikhil who is seventeenth from the right end of the row. Ravi is fifth to the left of Shamika and is twentieth from the left end. Total how many children are there in the row?
   A) 39 B) 38 C) 37
   D) Cannot be determined
   E) None of these
   Explanation: Shamika is 14th from the right end. Ravi is 19th from the right end.
   20 + 19 – 1 = 38 **Ans:** B
9. How many such pairs of letters are there in the word EXAMINATION each of which has as many letters between them in the word, as they have in the English alphabet?
   A) None B) One C) Two
   D) Three E) None of these
   Explanation: EI, NO **Ans:** C
10. In a certain code ACQUIRE is written as EIRUQAC, how is DENSITY written in that code?
    A) YTISNDE B) YITSNED
    C) YTISNED D) YITSNDE
    E) None of these
    Explanation: The letters in the word ACQUIRE



A=1, C=2, Q=3, U=4, I=5, R=6, E=7 are rearranged as 7564312
Ans: D

Directions (Q. No. 11-16): Study the following information carefully and answer the questions given below.

An organization wants to recruit System Analysts. The following conditions apply.

The candidate must:

i) be an engineering graduate in Computer/IT with at least 60% marks.

ii) have working experience in the field of Computer at least for 2 years after acquiring the requisite qualification.

iii) have completed minimum 25 years and maximum 30 years of age as on 1.12.2015.

iv) be willing to sign a bond for Rs. 50,000.

v) have secured minimum 55% marks in selection test.

However, if a candidate fulfills all other conditions except-

a) At i) above, but is an Electronics Engineer with 65% or more marks the case is to be referred to the General Manager (GM)-IT.

b) At iv) above, but has an experience of at least 5 years as a Software Manager, the case is to be referred to the VP.

In each question below, detailed information of candidate is given. You have to carefully study the information provided in each case and take one of the following courses of actions based on the information and the conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.12.2015. You have to indicate your decision by marking answers to each question as follows. Mark answer-

A) If the case is to be referred to VP.
B) If the case is to be referred to GM.
C) If the data provided is not sufficient to take a decision.
D) If the candidate is to be selected.
E) If the candidate is not to be selected.

11. Ms. Suneeta is an IT Engineer with 60% marks at graduation as well as in selection test. She is working as a Software Engineer for last 3 years after completing engineering degree and has completed 27 years of age. She is willing to sign the bond of Rs. 50,000.
12. Rakesh Rao is a Computer Engineer Graduate and thereafter is working as a Software Manager for past 6 years. He has secured 72% marks at graduation and 67% marks in selection test. His date of birth is 5th December 1986. He is not willing to sign the bond for Rs. 50,000.
13. Nishant is an Electronics Engineer passed out in June 2012 at the age of 22 years. Since then he is working as a Programmer in a software company. He has passed the selection test with 66% marks and is willing to sign the bond.
14. Abhijit is a Computer Engineer with 65% marks passed out in 2011 at the age of 22 years. Since then he is working as a Software Engineer, in a private firm. He is willing to sign the bond for the required amount. He has secured 63% marks in selection test.
15. Giridhar is working as a Software Engineer in a reputed company for past 4 years after completing Computer Engineering wi-th 68% marks. He has cleared the selection test with 75% marks & is willing to sign the bond. His DOB is December 17, 1988.
16. Mr. Rajan is working as a Programmer for the last 6 years in an engineering firm after passing engineering examination. He has passed Electronics Engineering with 76% marks. His date of birth is 16.05.88. He has cleared the selection test with 62% marks and is willing to sign the bond for Rs. 50,000.

Explanations:

11. Ms.Suneeta fulfils all the conditions. Hence she is to be selected. **Ans:** D
12. Rakesh Rao fulfils all the conditions except (iv) but he has been working as a software manager for the last 6 years so according to (b) his case is to be referred to V.P. **Ans:** A
13. Since the marks obtained by Nishant in graduation are not given. So the data provided is not sufficient to take a decision. **Ans:** C
14. Abhijit fulfils all the conditions. Hence he is to be selected. **Ans:** D
15. Giridhar fulfils all the conditions. Hence he is to be selected. **Ans:**D
16. Mr.Rajan does not fulfil the condition (i) But he passed the Electronics Engineering will more than 65%. Hence according to (a) his case is to be referred to G.M. **Ans:** B
17. **Directions:** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
    Mark (A) if only assumption I is implicit
    Mark (B) if only assumption II is implicit
    Mark (C) if either I or II is implicit
    Mark (D) if neither I or II is implicit

Statement: Even with the increase in the number of sugar factories in India, we still continue to import sugar.

Assumptions:

I) The consumption of sugar per capita has increased in India.
II) Many of the factories are not in a position to produce sugar to their fullest capacity.

Explanation: As the statement says that despite increase in the number of sugar factories in India we are still continuing to import sugar, it must be that either the consumption of sugar has increased or many of the factories are not producing sugar to the maximum capacity.
Ans: C